

ఈనాడు



విజయవాడ 17-10-2024 గురువారం సిటీ సంపుటి 51 . సంచిక 67


THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు



- ఒకే రోజు.. ఆరు పాలసీలు
- 'జాబ్ ఫస్ట్' నినాదంతో రూపకల్పన
- ఉపాధి కల్పనకు దోహదం
- పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ
- ఆమోదించిన మంత్రివర్గం
- రాష్ట్రాభివృద్ధి దిశగా కీలక అడుగులు
- రాష్ట్ర భవిష్యత్తులో పెనుమార్పులు తీసుకొస్తాయి
- సీఎం చంద్రబాబు

ఈనాడు – అమరావతి

రాష్ట్రాభివృద్ధి దిశగా ప్రభుత్వం అత్యంత కీలకమైన అడుగులు వేసింది. ఎన్నడూ లేనివిధంగా ఒకేరోజు పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఉద్యోగ, ఉపాధి కల్పనకు దోహదపడేలా ప్రధానమైన ఆరు పాలసీలను ప్రకటించింది. ఎంత పెట్టుబడి పెట్టారనేది ముఖ్యం కాదు.. ఎన్ని ఉద్యోగాలు, ఎంత ఉపాధి కల్పించారనేదే ప్రాధాన్యంగా 'జాబ్ ఫస్ట్' అనే నినాదంతో ఈ కీలక పాలసీలను రూపొందించింది. 2030 నాటికల్లా రాష్ట్రంలో ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయటమే లక్ష్యంగా 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్' (ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త) నినాదంతో ఎంఎస్‌ఎంఈలు, ఎంటర్‌ప్రెన్యూర్‌ల అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చింది. రాష్ట్ర సచివాలయంలో బుధవారం జరిగిన మంత్రిమండలి సమావేశం ఈ పాలసీలను ఆమోదించింది. కేబినెట్ భేటీ అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆయా పాలసీల ప్రత్యేకతలు, ఇతర కీలక నిర్ణయాల గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. 'ఈ ఆరు పాలసీలు రాష్ట్ర, యువత భవిష్యత్తులో పెనుమార్పులు తీసుకొస్తాయి. రాష్ట్ర ప్రగతిని మార్చేస్తాయి' అని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాబోయే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రధాన లక్ష్యంగా ఈ పాలసీలను తీసుకొచ్చినట్లు చెప్పారు. ఉద్యోగాల కల్పన కోసం ప్రత్యేకంగా ఒక మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.. సీఎం తెలిపిన వాటిలో ప్రధానాంశాలివీ..

రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌లు..

నీతి, నిజాయతీ, నైతికతతో వ్యాపారం చేసి.. పెద్ద పెద్ద సామ్రాజ్యాలే సృష్టించవచ్చని రతన్ టాటా నిరూపించారు. ఆయన జీవితకాలంలో 28 కంపెనీలు నెలకొల్పి

(మిగతా 13లో)

గేమ్ చేంజర్‌లు.. ఆరు విధానాలు

1. పారిశ్రామికాభివృద్ధి
2. ఎంఎస్‌ఎంఈ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ పాలసీ
3. ఆహారశుద్ధి
4. ఎలక్ట్రానిక్స్
5. ప్రైవేట్ పార్కుల విధానం
6. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ

ప్రతి కుటుంబంలోనూ పారిశ్రామికవేత్త!

ఇంధన రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు

లోపలి పేజీల్లో

సంక్రాంతికల్లా గుంతల్లేని రోడ్లు



ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు వద్ద నీట మునిగి చెరువును తలపిస్తున్న పొగాకు చేను



నెల్లూరు స్వతంత్ర పార్కు రోడ్డులో నాలుగు అడుగుల మేర చేరిన వర్షపు నీరు

పంటకు నష్టం.. ఇంటికి కష్టం



తిరుపతి నగరం లక్ష్మీపురంలో వరద నీటి ప్రవాహం

వణికించిన వాయుగుండం

- రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో భారీ వర్షాలు
- ఉత్తరాంధ్రనూ భయపెట్టిన వానలు
- పంటలు కొట్టుకుపోయి రైతన్న కన్నీరు
- నగరాల్లో రోడ్లు జలమయం.. ట్రాఫిక్ ఇబ్బందులు
- రేణిగుంటలో విమానాల రాకపోకలపై ప్రభావం

ఈనాడు, న్యూస్‌టుడే యంత్రాంగం: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడి రాష్ట్రాన్ని అతలాకుతలం చేసింది. బుధవారం పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసి జనజీవనం స్తంభించింది. రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలపై ఈ ప్రభావం ఎక్కువగా కనిపించింది. చేతికొచ్చిన వరి పైరు నేలవాలి రైతన్నకు కన్నీరే మిగిలింది. కోత దశలో ఉన్న టమాట దెబ్బతింది. పొగాకు తదితర పంటలకూ నష్టం వాటిల్లింది. వాగులు, వంకలు పొంగిపొర్లి పలు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. నగరాల్లోని లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధం కావడంతోపాటు ప్రధాన

(మిగతా 2లో)

రైతులు, ఉద్యోగులకు తీపి కబురు



వివరాలను వెల్లడిస్తున్న అశ్వినీ వైష్ణవ్

- ఆరు పంటల మద్దతు ధర పెంపు
- ఉద్యోగులకు డీఏ/డీఆర్ అదనంగా 3 శాతం
- కేంద్ర మంత్రి మండలి నిర్ణయాలు

ఈనాడు, దిల్లీ: దీపావళి పండగ ముంగిట ప్రధాని మోదీ సర్కారు కర్షకులకు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు తీపి కబురు అందించింది. ఆరు రబీ పంటల మద్దతు ధరను పెంచింది. దీనిలో భాగంగానే తెలుగు రాష్ట్రాల్లో పెద్ద మొత్తంలో పండించే శనగల ధర క్వింటాల్‌కు రూ.210 మేర పెరగనుంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు అదనంగా 3% డీఏ/డీఆర్ ఇవ్వాలని నిర్ణయించింది. వారణాసి వద్ద గంగా నదిపై రూ.2,642 కోట్లతో రైలు, రోడ్డు వంతెన నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో బుధవారం కేంద్ర క్యాబినెట్ సమావేశమైంది. ఈ భేటీలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

పంటల మద్దతు ధరలు ఉత్పాదక వ్యయం కన్నా 1.5 రెట్లు అధికంగా ఉండేలా చూస్తామన్న హామీకి అనుగుణంగా

(మిగతా 2లో)

లోపలి పేజీల్లో

జనవరిలో కొత్త పింఛన్లు!

ఆలోపే అనర్హుల ఏరివేత

విధివిధానాల రూపకల్పనకు 8 మంది మంత్రులతో ఉపసంఘం

పెట్రోల్ ట్యాంకర్ పేలి 140 మంది దుర్మరణం

నైజీరియాలో ఘటన

వైకాపా నేత సజ్జలకు నోటీసు

తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో..

నేడు విచారణకు రావాలని పోలీసుల పిలుపు

రాజధానిలో రూ.524 కోట్లతో ఎమ్మెల్యేలు, ఐఏఎస్‌ల నివాస భవనాలు

సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో నిర్ణయం

పంటకు నష్టం.. ఇంటికి కష్టం



విశాఖ నగరంలోని ఇసుకతోట ప్రాంతం జలమయం

(మొదటి పేజీ తరువాయి)

వీధుల్లో మోకాలి లోతు నీరు ప్రవహించింది. నెల్లూరు, కడప, తిరుపతి, నంద్యాల తదితర నగరాలు, పట్టణాలు జలమయమయ్యాయి. నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్, కనకమహల్ సెంటర్, ముత్తుకూరు కూడలి సమీపంలోని రైల్వే అండర్‌పాస్ వద్ద వర్షపు నీరు నిలిచింది. మాగుంట లేఅవుట్ అండర్ బ్రిడ్జి, రామలింగాపురం, లెక్చరర్స్ కాలనీ, హరినాథపురం నాగసాయి మందిరం తదితర ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. కడపలో రహదారులు చెరువులను తలపించాయి. మురుగు కాలువల్లో ప్రవాహం లేక రహదారులపై వరద ప్రవహించింది. తిరుపతి పరిధిలోని గొల్లవానిగుంట, పూలవానిగుంట, ఆటోనగర్, రేణిగుంట సమీపంలోని భగత్‌సింగ్ కాలనీ, జ్యోతిరావు పులే కాలనీల్లోకి వర్షపు నీరు చేరింది. ఒంగోలు నగరంలోని పలు లోతట్టు కాలనీల్లో వర్షపు నీరు చేరింది.

కొట్టుకుపోయిన రహదారులు

వైఎస్సార్ జిల్లా వీరపునాయునిపల్లె మండలం బుసిరెడ్డిపల్లె సమీపంలో వంకపై ఉన్న రహదారి కొట్టుకుపోయింది. తిరుపతి జిల్లాలోని పలు ప్రాంతాల్లో కాజ్‌వేలపై నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. వరదయ్యపాలెం పరిధి గోవర్ధనపురం వద్ద కాలువ వంతెనపై నీటి ప్రవాహం పెరగడంతో శ్రీకాళహస్తి-తడ మార్గంలో రాకపోకలకు అంతరాయమేర్పడింది. రేణిగుంట-మామండూరు రహదారిలో చెట్లు కూలి ట్రాఫిక్ స్తంభించింది. ఏర్పేడు-మోదుగులపాలెం స్వర్ణముఖి నది కాజ్‌వేపై నీరు ప్రవహించడంతో అధికారులు రాకపోకలు నిలిపేశారు. తొట్టంబేడు మండలంలోని చట్టత్తూరు వాగుతోపాటు కారాకొల్లు సమీపంలోని కాజ్‌వేపై రాకపోకలు నిలిచాయి. శ్రీకాళహస్తి మండలం నారాయణపురం పంచాయతీలోని ముల్లపూడి గిరిజన కాలనీలోని ఇళ్లలోకి నీరు చేరింది. ప్రకాశం జిల్లాలోని నాగులుప్పలపాడు మండలం చదలవాడలో రామన్న చెరువు కట్ట తెగడంతో 216వ జాతీయరహదారిపైకి నీరు చేరింది. దీంతో చీరాల వైపు వెళ్లే వాహనాలను పాత బైపాస్ మీదుగా మళ్లించారు. ఒంగోలు మండలం కరవది-గుత్తికొండవారిపాలెం గ్రామాల మధ్య ఉన్న ముదిగొండ వాగు రెండు రోజులుగా ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. విశాఖలోని ఇసుకతోట ప్రాంతం జలమయమైంది. ద్విచక్రవాహనాలు, కార్లు మునిగాయి. కాకినాడ జిల్లాలోని ఉప్పాడ తీరం కోతకు గురైంది.

విమానాలు ఆలస్యం

హైదరాబాద్ నుంచి రేణిగుంటకు ప్రతి రోజు ఉదయం రాకపోకలు సాగించే ఇండిగో విమానం నిర్ణీత సమయానికి ఇక్కడికి చేరుకున్నా జోరు వర్షం కారణంగా ఆపకుండా చెన్నైకి పంపించారు. ఇక్కడ వర్షం కాస్త తగ్గాక విమానం తిరిగి రేణిగుంటకు చేరుకుంది. అలాగే దిల్లీ నుంచి రేణిగుంటకు ఇటీవల ప్రారంభించిన ఇండిగో విమానం కూడా కాసేపు ఆకాశంలోనే చక్కర్లు కొట్టి దిగింది. మొత్తంమీద ఇతర ప్రాంతాలనుంచి ఇక్కడికి వచ్చిన ప్రతి విమానం కాస్త ఆలస్యంగానే చేరుకున్నాయి.



చెన్నై నుంచి రేణిగుంట విమానాశ్రయానికి వచ్చి అప్రాన్‌పై ఉన్న ఇండిగో విమానం



కడప నగరంలోని అప్సర కూడలిలో చెరువును తలపిస్తున్న రహదారి

పంటలు జలార్పణం



నంద్యాల జిల్లా బనగానపల్లిలో రహదారిపై మొక్కజొన్న గింజలు తడవకుండా కప్పిన పట్టలు

నెల్లూరు జిల్లాలోని చేజర్ల, అనంతసాగరం, విడవలూరు, ఎస్.ఆర్.పురం ప్రాంతాల్లో సుమారు 244 హెక్టార్లలో వేసిన వరి పంట నేలవాలింది. అన్నమయ్య జిల్లాలో టమాటకు ప్రస్తుతానికి నష్టం లేకపోయినప్పటికీ నీటి నిల్వ వల్ల వేరుకుళ్లు తెగులు వచ్చి దెబ్బతినే అవకాశముంది. ఇక్కడ నేల వాలిన వరిలో గింజలు మొలకెత్తాయి. వైఎస్సార్ జిల్లాలో 2,024 ఎకరాల్లో వరి, 254 ఎకరాల్లో మినుములు నష్టం వాటిల్లింది. ఉద్యాన పంటలపై తీవ్ర ప్రభావం కనిపిస్తోంది. తిరుపతి జిల్లా వ్యాప్తంగా 2,913 హెక్టార్లలో పంటలు నీట మునిగాయి. ప్రకాశం జిల్లాలో పొగాకు దెబ్బతింది.



నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలోని గువ్వలకుంట్ల సమీపంలో నేలకొరిగిన వరి



కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో బ్లోయర్‌తో ఉల్లి ఆరబెడుతున్న రైతులు

నేడు తీరం దాటనున్న వాయుగుండం

పోర్టులకు మూడో నంబరు హెచ్చరికలు

దక్షిణ కోస్తా, రాయలసీమలో భారీ వర్షాలు

ఈ నెలలో మరో రెండు అల్పపీడనాలు

ఈనాడు, విశాఖపట్నం: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం గురువారం తెల్లవారుజామున పుదుచ్చేరి, నెల్లూరు మధ్యలో చెన్నై సమీపంలో తీరం దాటొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. తీరాన్ని సమీపించేలోగా తీవ్ర అల్పపీడనంగా బలహీనపడొచ్చనే అంచనాలున్నాయి. వాయుగుండం బుధవారం సాయంత్రం ఐదున్నర సమయంలో చెన్నైకి 190 కి.మీ., పుదుచ్చేరికి 250 కి.మీ., నెల్లూరుకు 270 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 35 నుంచి 45 కి.మీ., గరిష్ఠంగా 55 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశముందని ఐఎండీ పేర్కొంది. ఈ నేపథ్యంలో కృష్ణపట్నం, వాడరేవు, నిజాంపట్నం, మచిలీపట్నం వరకు పోర్టులకు మూడో నంబరు, కాకినాడ, గంగవరం, విశాఖపట్నం, కళింగపట్నం పోర్టులకు ఒకటో నంబరు హెచ్చరికలు జారీ చేసింది. తీరం దాటాక దక్షిణ కోస్తా, పరిసర తమిళనాడు ప్రాంతాలవైపు కదులుతుందని తెలిపింది.

నాలుగు జిల్లాలకు వరద ముప్పు

వాయుగుండం ప్రభావంతో గురువారం వర్షాలు కొనసాగుతాయని అమరావతి వాతావరణ కేంద్రం సంచాలకులు స్టెల్లా తెలిపారు. దక్షిణ కోస్తా, రాయలసీమలోని కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు, మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశముందని అన్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి, వైఎస్సార్, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని భావిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు వచ్చే ప్రమాదముందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ తెలిపారు.

■ బుధవారం ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు అత్యధికంగా తిరుపతి జిల్లా ఏర్పేడులో 9.7 సెం.మీ.వర్షం కురిసింది. అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లెలో 8.2, రేణిగుంటలో 7, వెంకటగిరిలో 6.8 సెం.మీ.వర్షపాతం నమోదైంది.

రాష్ట్రంపై ప్రభావమెంత?

ఈ నెలలో మరో రెండు అల్పపీడనాలు ఏర్పడే అవకాశముందని వివిధ వాతావరణ నమూనాలు అంచనా వేస్తున్నాయి. ఈనెల 21న తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని, ఇది వాయవ్య దిశగా పయనించి 24నాటికి ఒడిశా తీరానికి చేరువవుతుందని వాతావరణ నిపుణులు భావిస్తున్నారు. ఇది బలపడి తీవ్ర తుపానుగా బంగ్లాదేశ్ సమీపంలో తీరం దాటొచ్చనే అంచనాలున్నాయి. నెలాఖరున పసిఫిక్ మహాసముద్రంలో మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశముంది. ఇది ఈనెల 24న ఉత్తర అండమాన్ సముద్రంలోకి ప్రవేశించి 25 నాటికి అల్పపీడనంగా మారే అవకాశముంది. 26 నాటికి తూర్పుమధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడొచ్చని అంచనా వేస్తున్నారు. వీటి ప్రభావం రాష్ట్రంపై పెద్దగా ఉండకపోవచ్చని, వర్షాలు విస్తారంగా కురుస్తాయని ఐఎండీ మాజీ శాస్త్రవేత్త డా.కేజే రమేష్ పేర్కొన్నారు. వెనువెంటనే అల్పపీడనాలు ఏర్పడితే తీవ్రత పెరిగే అవకాశం తక్కువగా ఉంటుందని అన్నారు.

మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు నమోదైన వర్షపాతం

ప్రాంతం	వర్షపాతం (సెం.మీ.లలో)
సూళ్లూరుపేట (తిరుపతి)	22
కావలి (నెల్లూరు)	18
నెల్లూరు	12
తడ (తిరుపతి)	12
కందుకూరు (నెల్లూరు)	10
సీతారామపురం (నెల్లూరు)	10
సత్యవేడు (తిరుపతి)	10
పోరుమామిళ్ల (వైఎస్సార్)	9

భారీ వర్షాలపై సీఎం సమీక్ష



ఆర్టీజీఎస్‌లో కెమెరా ఫుటేజీలు నిరంతరం చూస్తూ పరిస్థితిని అంచనా వేస్తున్న సిబ్బంది

నెల్లూరు సహా పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలపై సీఎం చంద్రబాబు బుధవారం సమీక్షించారు. వరదల హెచ్చరికల నేపథ్యంలో యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. వర్ష ప్రభావిత జిల్లాల్లో 4,845 సర్వైలెన్సు కెమెరాలతో రియల్‌టైం గవర్నెన్స్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి ఆర్టీజీఎస్ సీఈవో కె.దినేశ్‌కుమార్ పరిశీలించి యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.



నెల్లూరు జిల్లా కావలి పట్టణంలోని మర్రిచెట్టు గిరిజన కాలనీలో ఓ ఇంట్లోకి చేరిన వర్షపు నీరు



నెల్లూరు జిల్లా కావలి మండలం తుమ్మలపెంటకు వెళ్లే రహదారిపై వాగు పొంగడంతో రాకపోకలను నియంత్రిస్తున్న పోలీసు అధికారులు

వణుకుతున్న చెన్నై, బెంగళూరు

● చెన్నైలో ముందుజాగ్రత్తగా హోటళ్లకు వెళుతున్న ధనవంతులు

ఈనాడు, చెన్నై: చెన్నై నగరవ్యాప్తంగా అత్యంత భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రజల్లో భయం పెరిగింది. ప్రత్యేకించి ఐటీ నిపుణులు, ధనవంతుల్లో చాలామంది విలాసవంతమైన హోటళ్లలో గదులు బుక్ చేసుకుని కుటుంబాలతో కలిసి దిగిపోతున్నారు. గతేడాది డిసెంబరులో ఒక్కసారిగా భారీ వర్షాలు కురవడంతో ఇళ్లలోకి వరద నీరు చేరి, కార్లు కొట్టుకుపోయిన నేపథ్యంలో ఈసారి అలాంటి పరిస్థితులు తలెత్తకుండా వారు హోటళ్లలో దిగుతున్నారు. కార్ల పార్కింగ్‌కు ప్రత్యేక వసతి, తాగునీరు, విద్యుత్ సరఫరాతోపాటు వైఫై ఉండేలా చూడాలన్న షరతులతో గదుల్లో దిగినట్లు సమాచారం. గురువారం భారీ నుంచి అతిభారీ వర్షసూచన చేశారు. బుధవారం రెడ్ ఎలర్ట్ ఇచ్చినా, సాయంత్రం వరకు తేలికపాటి జల్లులే పడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



చెన్నైలో పడవల్లో ఇతర ప్రాంతాలకు తరలివెళ్తున్న ముంపు బాధితులు

బెంగళూరు(మల్లేశ్వరం), న్యూస్‌టుడే: భారీ వర్షాలకు బెంగళూరు నగరంలో జనజీవనం స్తంభించింది. చిక్కబళ్లాపుర, కోలారు, రామనగర, మైసూరు, చామరాజనగర, ఉడుపి, మంగళూరు, ఉత్తర కర్ణాటక, చిత్రదుర్గ తదితర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఐటీ, బీటీ కేంద్రాలకు నిలయమైన బెంగళూరులోని మాన్యత టెక్‌పార్కు ఆవరణలో నూతన నిర్మాణాల కోసం తీసిన పునాదుల్లో మట్టి పెళ్లలు విరిగిపడ్డాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షం నీరు ప్రవేశించింది. బెంగళూరు ఇందిరానగర్ సమీప మెట్రో మార్గంపై ఓ చెట్టు కూలడంతో కాసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొంటాం: హోం మంత్రి

ఈనాడు డిజిటల్, అమరావతి: వాయుగుండం తీరం దాటిన తర్వాత గురువారం ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి యంత్రాంగం సిద్ధంగా ఉందని హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయంలోని కంట్రోల్ రూం నుంచి వర్షాలపై మంత్రి బుధవారం పర్యవేక్షించారు. 'వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయి. బుధవారం రాత్రి వరకు 827 మందిని సురక్షిత ప్రాంతాలకు, 2,222 మందిని పునరావాస కేంద్రాలకు తరలించాం. సముద్రంలో వేటకు వెళ్లిన 61,756 మంది మత్స్యకారులను వెనక్కి రప్పించాం. ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల్లో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి' అని అనిత సూచించారు.

6 గేట్లు ఎత్తి సాగర్ నుంచి నీటి విడుదల

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జున సాగర్‌కు 93,439 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. బుధవారం రాత్రి 7 గంటలకు సాగర్ డ్యాం ఆరు క్రస్టుగేట్లు ఎత్తి 48,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి కాలువకు 6257, ఎడమ కాలువకు 6022, ప్రధాన జలవిద్యుత్తు కేంద్రానికి 29,760, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 2400, లోలెవల్ కెనాల్‌కు 400 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

రైతులు, ఉద్యోగులకు తీపి కబురు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం గోధుమ, శనగ, మసూర్ దాల్, ఆవాలు, బార్లీ, కుసుమ పంటల ధరలను నిర్ణయించింది. తాజా నిర్ణయంతో క్వింటా శనగల కనీస మద్దతు ధర రూ.5,440 నుంచి రూ.5,650కి, కుసుమల ధర రూ.5,800 నుంచి రూ.5,940కి చేరుతుంది. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి ప్రారంభమయ్యే 2025-26 మార్కెటింగ్ ఏడాది కోసం ఈ ధరలను నిర్ణయించింది.

■ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పింఛనుదారులకు పెంచిన 3% డీఏ/డీఆర్ ఈ ఏడాది జులై 1 నుంచే వర్తించనుంది. తాజా పెంపుతో ఇప్పటి వరకు 50 శాతంగా ఉన్న డీఏ 53 శాతానికి చేరనుంది. ఏడవ వేతన సవరణ కమిషన్ సిఫార్సుల ప్రకారం డీఏ/డీఆర్ పెంచినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. దీనివల్ల ప్రభుత్వానికి ఏడాదికి రూ.9,448.35 కోట్ల మేర అదనపు ఆర్థిక భారం పడనుంది. 49.18 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 64.89 లక్షల మంది పింఛనుదారులకు లబ్ధి కలగనుంది.

■ వారణాశి వద్ద గంగా నదిపై నిర్మించనున్న నాలుగు వరుసల రైలు, ఆరు వరుసల రోడ్డుతో కూడిన వంతెన ప్రాజెక్టు నిర్మాణ వ్యయ అంచనా రూ.2,642 కోట్లు. చందౌలి వరకు కొనసాగే ఈ నిర్మాణం పొడవు 30 కి.మీ. ప్రయాణికులతో పాటు బొగ్గు, సిమెంట్, ఆహార ధాన్యాల రవాణాతో బిజీగా ఉండే ఈ మార్గంలో రద్దీని తగ్గించేందుకు ఈ వంతెన ఉపయోగపడుతుందని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్ వెల్లడించారు.

మద్దతు ధర క్వింటాకు పెంపు ఇలా (రూపాయల్లో)

పంట	పెంపు	పెంపు అనంతరం
ఆవాలు	300	5,950
మసూర్‌దాల్	275	6,700
శనగ	210	5,650
గోధుమ	150	2,425
కుసుమ	140	5,940
బార్లీ	130	1,980

పోలీసులకు చిక్కిన బోరుగడ్డ అనిల్

జగన్ పేరుతో నాడు దందాలు, దౌర్జన్యాలు

ఎన్నికల ఫలితాల తర్వాత నుంచి అజ్ఞాతంలో



ఈనాడు - అమరావతి, పట్టాభిపురం, న్యూస్‌టుడే: పేరుమోసిన రౌడీషీటర్, నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు తొత్తుగా వ్యవహరించిన బోరుగడ్డ అనిల్‌కుమార్‌ను పోలీసులు బుధవారం గుంటూరులో అరెస్టు చేశారు. వైకాపా అధికారంలో ఉన్న గత ఐదేళ్లలో లెక్కలేనన్ని దందాలు, దౌర్జన్యాలకు పాల్పడడమేగాక నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, నారా లోకేశ్‌లను నోటికొచ్చినట్లు అసభ్య పదజాలంతో దూషించాడు. ఎన్నికల ఫలితాలు వెల్లడైన మర్నాటి నుంచి అజ్ఞాతంలోకి వెళ్లిపోయి ఇతర రాష్ట్రాల్లో తలదాచుకుంటున్నాడు. రెండు రోజుల కిందట గుంటూరుకు వచ్చినట్లు తెలియడంతో సీసీఎస్ పోలీసులు అతడిని అరెస్టు చేశారు. అతడిపై భూవివాదాలతో పాటు మహిళల వేధింపులపై పలు కేసులు ఉన్నాయి. జగన్‌కు తొత్తుగా వ్యవహరిస్తూ ప్రతిపక్షాలు, ప్రతిపక్షనేతలపై సభ్యసమాజం తలదించుకునేలా సామాజిక మాధ్యమాలు, టీవీ డిబేట్‌లలో ఇష్టానుసారం దూషణలు చేసేవాడు. జగన్ పేరు చెప్పి గుంటూరులో అనేక దందాలు, దౌర్జన్యాలు చేశాడు. జగన్‌కు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా అసభ్యకర పదజాలంతో బెదిరింపులకు దిగేవాడు. ప్రతిపక్ష పార్టీల మహిళల గురించి అసభ్యకరంగా మాట్లాడేవాడు. 2021లో కర్లపూడి బాబు ప్రకాష్‌ను రూ. 50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఇవ్వకపోతే చంపుతానని బెదిరించాడు. ఈ మేరకు ఆయన అదే ఏడాది జనవరి 25న అరండల్‌పేట ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినప్పటికీ వైకాపా అధికారంలో ఉండటంతో అనిల్ కుమార్‌ను అరెస్ట్ చేయడానికి సాహసించలేదు. ప్రస్తుతం అతడిని పోలీసులు నల్లపాడు ఠాణాకు తరలించి విచారిస్తున్నారు.

గ్రహం అనుగ్రహం

17-10-2024 గురువారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం; శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం

పూర్ణిమ: సా. 5-17 తదుపరి బహుళ పక్ష పాడ్యమి

రేవతి: సా. 5-34 తదుపరి అశ్విని

వర్జ్యం: ఉ. 6-26 నుంచి 7-55 వరకు

అమృత ఘడియలు: మ. 3-50 నుంచి 4-49 వరకు

దుర్ముహూర్తం: ఉ. 9-48 నుంచి 10-35 వరకు తిరిగి మ. 2-28 నుంచి 3-15 వరకు

రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు

సూర్యోదయం: ఉ. 5.56; సూర్యాస్తమయం: సా.5.35

తులా సంక్రమణం రా. 9-26

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	37.5	26.0
నిజామాబాద్	35.4	25.1
నరసాపురం	34.5	25.8
ఆదిలాబాద్	34.3	23.2
ఖమ్మం	34.0	25.0
తాడేపల్లిగూడెం	33.3	25.7
విజయనగరం	33.0	27.0
విజయవాడ	32.8	26.4
విశాఖపట్నం	32.4	26.0
శ్రీకాకుళం	32.0	27.0
గుంటూరు	31.0	25.0
హైదరాబాద్	30.8	23.3
అనంతపురం	27.4	23.0
కర్నూలు	27.2	24.7
ఒంగోలు	26.7	24.0
నెల్లూరు	26.5	24.5
తిరుపతి	25.2	23.4
కడప	25.0	24.0

తీసుకున్న డబ్బు తిరిగివ్వమంటే కులం పేరుతో దూషణలు

● జగన్, సజ్జల, సుచరిత తెలుసంటూ బెదిరింపులు

● ప్రజావేదికలో ప్రజల ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: 'తీసుకొన్న డబ్బులు తిరిగివ్వమంటే ఇవ్వకపోగా. తమకు మాజీముఖ్యమంత్రి జగన్, వైకాపా నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, సుచరిత, విడదల రజని, నందిగాం సురేశ్ తెలుసుంటూ వరలక్ష్మి, ఆమె భర్త శ్రీనివాసరావు బెదిరిస్తున్నారు. చంపేస్తామని భయభ్రాంతులకు గురిచేస్తూ, కులం పేరుతో దూషిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకొని మా డబ్బులు మాకు ఇప్పించండి' అని పల్నాడు జిల్లా రొంపిచర్లకు చెందిన పిల్లి విజయకుమారి, కొట్టె ఆదిలక్ష్మి వాపోయారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రజావేదికలో ఫిర్యాదు చేశారు. వారి నుంచి మాజీమంత్రి కేఎస్ జవహర్, నేతలు పీలా గోవింద సత్యనారాయణ, స్వామిదాసు వినతులు స్వీకరించారు. కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా. .భూమి రిజిస్ట్రేషన్ కాకుండా వైకాపా నేతలు నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి వేధిస్తున్నారని పుట్టపర్తి నియోజకవర్గానికి చెందిన వీరారెడ్డి ఫిర్యాదు చేశారు. నెల్లూరు జిల్లా, దస్తగిరి మండలంలో తన తండ్రి కొన్న భూమిని కొందరు, అధికారులు, కబ్జాదారులతో కుమ్మక్కై కాజేశారని పర్చూరు మండలం, ఉప్పుటూరుకు చెందిన హైమానందకుమార్ ఫిర్యాదు చేశారు. బాపట్ల జిల్లా, పూండ్ల గ్రామంలో గతంలో చేసిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్ ఉన్నాయని, వాటిని మంజూరు చేయించాలని గ్రామ సర్పంచి కోరారు. కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం ల్యాండ్ పూలింగ్‌లో భాగంగా ప్రభుత్వం తీసుకొన్న భూములను కొందరు ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని మంగళగిరి మండలం, తాడేపల్లికి చెందిన వ్యక్తి ఒకరు ఫిర్యాదు చేశారు.

6 విధానాలు
సమగ్రాభివృద్ధే లక్ష్యం

ఏపీ బ్రాండ్ నిలిచేలా.. గెలిచేలా

- రూ.30 లక్షల కోట్ల పెట్టుబడులు.. 5 లక్షల మందికి ఉపాధి
- నూతన పారిశ్రామిక విధానం లక్ష్యమిదే
- 2024-29 వరకూ పాలసీ నిబంధనల అమలు
- ఉపాధి ఆధారంగా ప్రోత్సాహకాలు
- ఫిక్స్‌డ్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్‌లో 72% వరకు ప్రోత్సాహకాలు!

ఈనాడు - అమరావతి

రాష్ట్రంలో రాబోయే ఐదేళ్లలో తయారీ రంగం ద్వారా రూ.30 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యమని ప్రభుత్వం వెల్లడించింది. వాటి ద్వారా 5 లక్షల ఉద్యోగాల కల్పన.. ఎగుమతులను రెట్టింపు చేయడం ప్రధాన లక్ష్యాలుగా నూతన పారిశ్రామిక విధానం 4.0ను బుధవారం ప్రకటించింది. ఐదేళ్ల కాలపరిమితితో విధానాన్ని ఖరారు చేసింది. పది కీలక రంగాలను గుర్తించింది. దీంతో పాటు మరో 10 రంగాలను చోదకంగా వినియోగించి నిర్దేశిత పెట్టుబడుల లక్ష్యాన్ని సాధించనున్నట్లు ప్రభుత్వం వివరించింది. కనీసం రూ.50 కోట్లు.. అంతకు మించి పెట్టే పెట్టుబడుల ఆధారంగా కంపెనీలకు ప్రోత్సాహకాలను ప్రకటించింది. ముందు వచ్చే కంపెనీలకు అదనపు ప్రోత్సాహకాలు ఇస్తామంది. పారిశ్రామిక రంగంలో ఏపీ బ్రాండ్‌ను తిరిగి సాధించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొంది.

పాలసీ ప్రధాన లక్ష్యాలు

- తయారీ రంగంలో రూ.30 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు ఆకర్షించటం. ఈ ఐదేళ్లలో రూ.5 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు ఆపరేషనలైజ్ అయ్యేలా చూడటం
- రూ.83 వేల కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించటం
- తయారీ రంగంలో 5 లక్షల ఉద్యోగాల కల్పన
- పి3/పి4 విధానంలో 175కు పైగా పారిశ్రామిక పార్కుల అభివృద్ధి
- రూ.33,200 కోట్ల విలువైన ఎగుమతుల్ని రెండింతలు చేయటం

తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు పకడ్బందీ విధానం

- ఉత్పాదక వ్యయాన్ని తగ్గించడం
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అనుసరించడం
- ఎంఎస్ఎంఈ రంగాన్ని బలోపేతం చేయడం
- ఆర్థిక ప్రోత్సాహకాలు అందించడం

ఉత్పత్తి వ్యయం తగ్గింపు

- ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటు ద్వారా భూములను అందుబాటులో ఉంచడం. ప్రస్తుతం ఉన్న 20 క్లస్టర్లతో పాటు కొత్తగా 29 క్లస్టర్లను అభివృద్ధి చేయడం ద్వారా పారిశ్రామిక అవసరాలకు 1.32 లక్షల ఎకరాలను అందుబాటులో ఉంచడం
- నాణ్యమైన విద్యుత్, నీరు, రోడ్ల వంటి మౌలిక సదుపాయాలను కల్పించడం
- పారిశ్రామిక, సామాజిక రవాణా మౌలిక వసతులు. ముడిసరకు హబ్‌లు, డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు, నదుల అనుసంధానం
- ధరల స్థిరత్వం కోసం పన్నులు, సుంకం రేషనలైజేషన్ చేయడం
- ఉత్పాదకత పెంచేందుకు నిపుణులైన కార్మికులను సమకూర్చడం
- సింగిల్ విండో మెకానిజం 2.0.. పెట్టుబడుల సమన్వయ సెల్ ఏర్పాటు (ఈడీబీ 2.0)
- విదేశీ పెట్టుబడిదారులకు సహకారం
- ప్రతి రూ.వెయ్యి కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ప్రాజెక్టుకు చేయూత అందించేందుకు సీనియర్ అధికారి నియామకం



తయారీ రంగ లక్ష్యాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్న సీఎం చంద్రబాబు

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు తోడ్పాటు

- **ఉపాధి కల్పన:** డెమోగ్రఫిక్ డివిడెండ్‌ను క్యాపిటలైజ్ చేయటం
- **ప్రపంచాన్ని ఆకర్షించే తయారీ హబ్:** సుస్థిర తయారీ రంగం కోసం పోటీ ఆధారిత వాతావరణం కల్పన
- **పోర్టు ఆధారిత విలువ జోడింపు:** పోర్టులకు అత్యంత సమీపంలో ఎగుమతికి వీలైన వివిధ ఉత్పత్తుల తయారీ క్లస్టర్లు నెలకొల్పటం
- **విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ఆకర్షణ:** ఫార్చ్యూన్ 500 కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా ఆకర్షించటం
- పెట్టుబడుదారుల స్పీడ్ ఆఫ్ బిజినెస్‌కు తోడ్పాటు అందించటం. వారి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించటం

భారీ, మెగా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు
(ఫిక్స్‌డ్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్‌పై)

అంశం	జనరల్ 12%-44%	ఎర్లీ బర్డ్ 30%- 62% (మొదటి 200 ప్రాజెక్టులు)	వాల్యూ ఎడిషన్ 40%-72% (కాంపోనెంట్ తయారీ కంపెనీలు)
ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ	12%	30%	40%
డీ-కార్బన్ సబ్సిడీ	6% వరకు	6% వరకు	6% వరకు
ఉపాధి కల్పన ఆధారంగా	8-10%	8-10%	8-10%
స్టాండర్డ్ ఇన్సెంటివ్స్	5-6%	5- 6%	5-6%
పీఎల్ఐ అప్రూవ్	10%	10%	10%



- రాష్ట్రంలో సృష్టించిన సంపద ఆధారంగా ఫిక్స్‌డ్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్‌లో 72% వరకు ప్రోత్సాహకాలు పొందే వెసులుబాటు
- అత్యధిక ఉపాధి కల్పించేందుకు ముందుకొచ్చే కంపెనీలకు 10% వరకూ అధిక ప్రోత్సాహకాలు
- మార్కెట్ రిస్క్‌లకు అనుసంధానం లేకుండానే ప్రోత్సాహకాల స్ట్రక్చర్
- పెట్టుబడి రాయితీ.. పీఎల్ఐ, కేంద్ర ప్రభుత్వ పథకాలపై టాప్ అప్
- నెట్ ఎస్‌జీఎస్‌టీ రీయింబర్స్‌మెంట్
- లోకల్ ప్రొక్యూర్‌మెంట్

పెట్టుబడుల ఆధారంగా ప్రోత్సాహకాలు ఇలా..

1.**సబ్‌లార్జ్:** రెండేళ్లలో రూ.50 కోట్ల నుంచి రూ.500 కోట్లు పెట్టుబడి పెట్టే సంస్థలు

2.**లార్జ్:** మూడేళ్లలో రూ.501 కోట్ల నుంచి రూ.1,000 కోట్లు పెట్టుబడి పెట్టేవి

3.**మెగా:** మూడేళ్లలో రూ.1,001 కోట్ల నుంచి రూ.5,000 కోట్లు పెట్టుబడి పెట్టేవి

4.**అల్ట్రా మెగా:** నాలుగేళ్లలో రూ.5,001 కోట్లు, అంత కంటే ఎక్కువ పెట్టుబడి పెట్టేవి

వ్యాపార అనుకూల వాతావరణ కల్పనకు చేపట్టే చర్యలు

- ప్రైవేటు భాగస్వామ్యంతో పారిశ్రామిక పార్కుల అభివృద్ధి, నిర్వహణ. వీటికి 5 కి.మీ. పరిధిలో ఇండస్ట్రియల్ హౌసింగ్ అభివృద్ధి
- ఐటీఐలను దత్తత తీసుకుని, శిక్షణ ఇప్పించటం ద్వారా నైపుణ్యం కలిగిన కార్మికులను అందించడం
- నీరు, విద్యుత్తు, లేఅవుట్ల అప్రూవల్‌కు టారిఫ్‌ల సరళీకరణ. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించటం
- ట్రాకింగ్, ట్రేసింగ్, మానిటరింగ్.. ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ప్లాట్‌ఫాం తయారీ

3 ప్రాంతాల్లోనూ పారిశ్రామికాభివృద్ధి

- ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో ప్రత్యేక జోన్ల ఏర్పాటుతో ఉపాధి అవకాశాల కల్పన
- సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) రంగానికి ప్రోత్సాహం
- పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణ

రాయలసీమ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- కియా, ఇసుజు కంపెనీలున్న రాయలసీమను ఆటోమొబైల్ హబ్‌గా తీర్చిదిద్దడం
- విత్తన రాజధాని, ఉద్యాన పంటల హబ్‌గా తీర్చిదిద్దడం
- చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌కు అనుసంధానంగా ఇండస్ట్రియల్ క్లస్టర్ అభివృద్ధి.. రాయలసీమలోని అన్ని ప్రధాన నగరాలను దీనికి అనుసంధానం చేయడం

ఇంధన రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో రాబోయే ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు.. 7.5 లక్షల మందికి ఉపాధి లక్ష్యంగా 'ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఇంధన పాలసీ'ని(ఐసీఈ) ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ విధాన కాల వ్యవధి ఐదేళ్లుగా నిర్దేశించింది. 2025-2030 మధ్య ఏర్పాటు చేసే ప్రాజెక్టులకు ఈ విధానం వర్తిస్తుంది. వాటి ద్వారా రానున్న ఐదేళ్లలో ప్రభుత్వానికి రూ.67 వేల కోట్ల ఆదాయం లభిస్తుందని అంచనా వేస్తోంది. ప్రాజెక్టు జీవిత కాలంలో ప్రభుత్వానికి వివిధ పన్నుల రూపేణా రూ.1.98 లక్షల కోట్లు వచ్చే అవకాశం ఉందని భావిస్తోంది.

విధాన లక్ష్యాలు

- **పాలసీ వర్తింపు:** అన్ని పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి, తయారీ ప్రాజెక్టులు
- **వనరుల కేటాయింపు:** మొదట వచ్చిన ప్రాజెక్టులకు తొలి ప్రాధాన్యం
- అన్ని ప్రాజెక్టులకు భూముల మార్పిడి ఛార్జీల మినహాయింపు
- గతంలో కేటాయించిన ప్రాజెక్టులను కూడా నూతన క్లీన్ ఎనర్జీ(ఇంధన) పాలసీలోకి మార్చుకునే వెసులుబాటు
- సింగిల్ విండో విధానంలో అనుమతులు
- ఈ రంగంలో వచ్చే సాంకేతిక మార్పులపై శిక్షణ కోసం క్లీన్ ఎనర్జీ నాలెడ్జ్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు

పవన, సౌర, హైబ్రిడ్ ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలు

- ఎకరాకు ఏడాదికి రూ.31 వేలు.. నాలా ఛార్జీల మినహాయింపు
- డిస్ట్రిబ్యూటెడ్ సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులకు నెట్ మీటరింగ్



- ఏపీఈఆర్‌సీ మార్గదర్శకాల మేరకు విద్యుత్ బ్యాంకింగ్‌కు అవకాశం
- ఎల్ వినియోగదారులకు బ్లాక్‌ల వారీగా పంపిణీ/వీలింగ్ ఛార్జీల మినహాయింపు. హైబ్రిడ్ ప్రాజెక్టులు ఉత్పత్తిలోకి వచ్చినప్పటి నుంచి ఐదేళ్ల పాటు 50 శాతం రాయితీ

పీఎస్‌పీ, మినీ, చిన్న హైడ్రో ప్రాజెక్టులకు రాయితీలు

- ఎకరానికి రూ.5 లక్షల చొప్పున ఔట్‌రైట్ సేల్స్ విధానంలో ప్రభుత్వ బూములను కేటాయించే అవకాశం
- పీఎస్‌పీ ప్రాజెక్టులకు కేటాయించే నీటికి సెస్సు మినహాయింపు
- పీఎస్‌పీ ప్రాజెక్టులకు కన్వర్షన్.. విద్యుత్ నష్టాలకు 25 ఏళ్ల పాటు విద్యుత్ సుంకం మినహాయింపు
- భూములకు స్టాంపు డ్యూటీ మినహాయింపు
- ఎల్‌టీ వినియోగదారులకు బ్లాకుల వారీగా పంపిణీ/వీలింగ్ ఛార్జీలు

బ్యాటరీ తయారీరంగంలో

- గ్రీన్ హైడ్రోజన్, వాటి అనుబంధ ఉత్పత్తుల తయారీ ప్రాజెక్టులకు సంబంధించి ప్లాంట్ అండ్ మెషినరీ ఖర్చులో 25 శాతం, డీ-శాలినేషన్ ప్లాంటు ఏర్పాటుకైన ఫిక్స్‌డ్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్‌లో 20 శాతం
- బ్రయోఫ్యూయల్ ప్రాజెక్టులకు, ఇథనాల్ ప్లాంట్లకు 20 శాతం ప్రోత్సాహకాలు
- బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టం ప్రాజెక్టులకు కాంపిటీటివ్ బిడ్డింగ్ విధానంలో కాస్ట్ ప్లస్ మోడల్‌లో లాభాల షేరింగ్
- ఐదేళ్ల పాటు నెట్ ఎస్‌జీఎస్‌టీ రీయింబర్స్‌మెంట్

పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలు

వివరాలు	విండ్.. సోలార్ ఇంధన తయారీ	ఎలక్ట్రోలైజర్	బ్యాటరీ మాన్యుఫ్యాక్చరింగ్
క్యాపిటల్ సబ్సిడీ(ఎఫ్‌సీఐలో)	25 శాతం	25 శాతం(ఐదేళ్లలో)	20 శాతం(ఐదేళ్లలో)
ఎస్‌జీఎస్టీ	100 శాతం	50 శాతం(ఐదేళ్లలో)	100 శాతం
ఇండస్ట్రియల్ వాటర్	25 శాతం (10 ఏళ్లు)	25 శాతం (10 ఏళ్లు)	25 శాతం (10 ఏళ్లు)
విద్యుత్ రాయితీ	యూనిట్‌కు రూపాయి(10 ఏళ్లు)	యూనిట్‌కు రూపాయి(5 ఏళ్లు)	యూనిట్‌కు రూపాయి(5 ఏళ్లు)
విద్యుత్ సుంకం	10 ఏళ్లు	5 ఏళ్లు	5 ఏళ్లు

175 నియోజకవర్గాల్లో ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కులు



ఈనాడు, అమరావతి: నవ్యాంధ్ర చరిత్రలో తొలిసారి ప్రైవేటు పరిశ్రమల పార్కుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వీటి అభివృద్ధికి ముందుకు వచ్చేవారికి తగిన ప్రోత్సాహకాలు అందించే పాలసీని బుధవారం మంత్రి మండలి ఆమోదించింది. ఈ విధానం ప్రకారం ఎవరైనా ఔత్సాహికులు ప్రైవేటు పరిశ్రమల పార్కులను అభివృద్ధి చేయొచ్చు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్నీ పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేసేందుకుగాను.. 175 నియోజకవర్గాల్లోనూ ఒక్కొక్కటి చొప్పున ప్రైవేటు పరిశ్రమల పార్కులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. భూమి కొని, పరిశ్రమలు ఏర్పాటు చేసి, నిర్వహించడం భారమయ్యే చిన్న పరిశ్రమలకు.. ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కులు దన్నుగా నిలుస్తాయి. పరిశ్రమలకు అవసరమయ్యే స్టోరేజి, ఉత్పత్తులకు అనువైన స్థలం, రవాణ సదుపాయం వంటి మౌలిక సదుపాయాలను ఈ పార్కుల్లో కల్పిస్తారు. 'ఇలాంటి ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కులను కేరళలాంటి రాష్ట్రాల్లో అభివృద్ధి చేశారు. మన రాష్ట్రంలో సరికొత్త ప్రయోగం. వీటి ఏర్పాటుతో పెట్టుబడులు రావడంతోపాటు ఉత్పత్తి రంగమూ అభివృద్ధి చెందుతుంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి. స్థలాన్ని సేకరించుకోలేని చిన్న పరిశ్రమలకు చేయూతగా నిలుస్తాయి' అని పరిశ్రమల వర్గాలు చెబుతున్నాయి.

పార్కుల రకాల రూపం

పార్కు రకం	భూమి పరిమాణం
నానో	10 ఎకరాల్లోపు
ఎంఎస్ఎంఈ	10-100 ఎకరాలు
లార్జ్ పార్కు	100-1,000 ఎకరాలు
మెగా పార్కులు	1,000 ఎకరాలకుపైగా


పాలసీలో కీలకాంశాలివీ..

- ఈ పార్కులను 100 శాతం ప్రైవేటు భూమిలో, రెండోది పాక్షిక ప్రభుత్వ భూమిలో, మూడోది పూర్తిగా ప్రభుత్వ భూమిలో.. ఇలా మూడు రకాలుగా చేపట్టాలనేది ప్రభుత్వ ఆలోచన.
- ఖాయిలాపడ్డ పరిశ్రమలకు ఊతమందించేందుకు నానో పార్కులు ప్రేరణగా నిలుస్తాయని ప్రభుత్వ అంచనా.
- పార్కు అభివృద్ధిదారే దానిలో సాధారణ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలి. ప్రమోషన్, నిర్వహణ చేపట్టాలి.
- రహదారులు, విద్యుత్, నీరు వంటి మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుంది. పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులిస్తుంది.
- మూలధర రాయితీ కింద ఎకరాలకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు రాయితీ ఇస్తుంది
- నాలా, లే అవుట్ అప్రూవల్, స్టాంప్, రిజిస్ట్రేషన్ ఛార్జీలు మినహాయిస్తుంది.

వినియోగం ఇలా..

ఆక్వా, వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తుల ప్రాసెసింగ్, బయోటెక్నాలజీ, డిఫెన్స్- ఏరోస్పేస్, డ్రోన్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, జెమ్స్-జువెలరీ, తోళ్లు- ఫుట్‌వేర్, ఫార్మాస్యూటికల్స్, సెమీకండక్టర్- ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్, బొమ్మల తయారీ పరిశ్రమల ఈ పార్కులను వినియోగించాలని ప్రాథమికంగా నిర్ణయించారు.

ప్రతి కుటుంబంలోనూ పారిశ్రామికవేత్త!



ఈనాడు, అమరావతి: 'ఒక కుటుంబం.. ఒక పారిశ్రామికవేత్త' నినాదంతో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగం (ఎంఎస్ఎంఈ) ద్వారా ఐదేళ్లలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులను రాబట్టాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. వాటి ఆధారంగా 2030 నాటికి ఐదు లక్షలమందికిపైగా ఉపాధి అవకాశాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ రంగంలో పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి వీలుగా ఎనిమిది ప్రాధాన్య అంశాలను ప్రభుత్వం ఎంచుకుంది. వీటి ద్వారా లక్ష్యాలను సాధించేలా నూతన ఎంఎస్ఎంఈ విధానాన్ని ప్రభుత్వం ఖరారు చేసింది. సమగ్ర పాలసీ ఫ్రేమ్ వర్క్ ద్వారా ఎంఎస్ఎంఈలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుంది. ఎంఎస్ఎంఈల వృద్ధిని వేగవంతం చేయడం ద్వారా వాటి ఉత్పత్తులను 'మేడ్ ఇన్ ఆంధ్రప్రదేశ్'గా బ్రాండింగ్ చేసి అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దేందుకు ఈ విధానం తోడ్పడుతుందని ప్రభుత్వం పేర్కొంది.

ఎంఎస్ఎంఈల పెట్టుబడుల ఆధారంగా ప్రోత్సాహకాలు

వివరాలు	మైక్రో గరిష్ఠం రూ.75 లక్షలు	చిన్న గరిష్ఠం రూ.7.5 కోట్లు	మధ్యతరహా గరిష్ఠం రూ.37.5 కోట్లు
స్టాండర్డ్ ప్రోత్సాహకం	రూ.50 లక్షల వరకు	రూ.5 కోట్ల వరకు	రూ.25 కోట్ల వరకు
ఎక్స్‌పోర్ట్ యూనిట్లు	రూ.15 లక్షల వరకు	రూ.1.5 కోట్ల వరకు	రూ.7 కోట్ల వరకు
మహిళలు/బీసీ/ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు	రూ.10 లక్షలకు పైగా	రూ.2 కోట్లకు పైగా	రూ.10.5 కోట్లకు పైగా
ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ	రూ.25 లక్షల వరకు	రూ.1.5 కోట్ల వరకు	రూ.7 కోట్ల వరకు

- మొదటిసారి పారిశ్రామిక రంగంలోకి వచ్చే వారికి ప్రోత్సాహకాలు
- రూ.500 కోట్లతో డెడికేటెడ్ కార్పస్ ఫండ్
- ఎంఎస్ఎంలఈ ఉత్పత్తుల ధరను పోటీగా మార్చడానికి 75 శాతం వరకు పెట్టుబడి ప్రోత్సాహకం

ఎనిమిది ప్రాధాన్య అంశాలు

- ఎంఎస్ఎంఈల ఏర్పాటు కోసం మౌలిక సదుపాయాల కల్పన
- కొత్తగా ఏర్పాటుచేసే వారికి మార్గదర్శకత్వం
- యూనిట్ స్థాయిలో ఉత్పత్తిలో పోటీతత్వం
- వాటి ఆర్థిక అవసరాలు తీర్చే మార్గాలు
- స్థిరత్వం కల్పించడంతోపాటు ఉత్పత్తుల విక్రయాలకు అవకాశాలు
- ఎగుమతులకు ప్రోత్సాహం
- క్లస్టర్ల ఆధారంగా మౌలిక సదుపాయాల కల్పన
- సంస్థలకు అవసరమైన ప్రత్యేక సహకారం

అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్

ఎంఎస్ఎంఈ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ ప్రొడక్ట్స్ పర్ఫెక్షన్ కోసం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. గ్లోబల్ వాల్యూ చైన్‌లో ఎంఎస్ఎంఈలను ముందుంచడానికి హబ్ దోహదపడుతుందని ప్రభుత్వం పేర్కొంది. దీంతో పాటు ఉత్తరాంధ్ర, సెంట్రల్ ఆంధ్ర, రాయలసీమ, దక్షిణాంధ్ర, గోదావరిలో జోనల్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇన్నోవేషన్ హబ్‌ల ద్వారా అందించే శిక్షణ వల్ల ఎంఎస్ఎంఈలు ఆర్థికంగా లబ్ధి పొందే అవకాశం ఉంది.

ఎంఎస్ఎంఈల అభివృద్ధి కోసం శిక్షణ

- ఎమర్జింగ్ రంగంలో సాంకేతిక, స్కిల్ అప్‌గ్రెడేషన్
- ప్రముఖ బిజినెస్ గ్రూప్‌ల ద్వారా మెంటార్‌షిప్, ఇంక్యుబేషన్
- స్టార్టప్‌లకు రీసెర్చ్ ట్రాన్స్‌లేషన్, ప్రొటోటైపింగ్
- గ్లోబల్ బ్రాండ్లతో పోటీ పడేలా డిజైన్లు, అకర్షణీయ ప్యాకింగ్ విధానాలు

ఎలక్ట్రానిక్స్ రంగంలో 5 లక్షల ఉద్యోగాలు



ఈనాడు, అమరావతి: పెద్ద ఎత్తున ఉపాధి, పెట్టుబడులే లక్ష్యంగా ఎలక్ట్రానిక్స్ సెక్టార్ పాలసీని ప్రభుత్వం ప్రకటించింది. ఈ రంగంలో రూ.84 వేల కోట్ల పెట్టుబడులు, 5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించనున్నట్లు వెల్లడించింది. దీనికి ఉప రంగాలైన ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ల్యాప్‌టాప్, టీవీ, మొబైల్స్, ఏసీ తయారీ, 5జీ కమ్యూనికేషన్ అభివృద్ధిపైనా దృష్టి పెట్టనుంది. పెట్టుబడి, ఉపాధి కల్పన, విలువ జోడింపు, విద్యుత్తు, నియామకాలకు సంబంధించి ప్రోత్సాహకాలు అందిస్తుంది. వ్యాపారంలో వేగం, 12 గంటల పని షిఫ్టులు, వాక్ టూ వర్క్, నైపుణ్య పర్యావరణ వ్యవస్థ, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలనూ ఇవ్వనుంది.

ప్రోత్సాహకాలు ఇలా..

- భారీ కంపెనీలకు ఫిక్స్‌డ్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (ఎఫ్‌సీఐ)లో 35%-40%
- మెగా కంపెనీలకు ఎఫ్‌సీఐలో 40%-45%
- ఉప-భారీ కంపెనీలకు ఎఫ్‌సీఐలో 30%-35%.

ఆహార శుద్ధి రంగానికి ఊతం



ఈనాడు, అమరావతి: ఆహార శుద్ధి రంగంలో రూ.30 వేల కోట్ల పెట్టుబడులు, కొత్తగా మూడు లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ సెక్టార్ పాలసీని ప్రకటించింది. స్థానిక ఆహార ఉత్పత్తులకు విలువ జోడింపు, ఉత్పత్తి-మార్కెట్ అనుసంధానంపై దృష్టి సారించే విధంగా సమగ్ర విధానాన్ని విడుదల చేసింది. పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం-ఆర్గానిక్ సర్టిఫికేషన్, వ్యర్థాల ప్రాసెసింగ్, ఉత్పత్తులకు విలువ జోడింపు, శీతల గడ్డింగులు, ల్యాబ్‌లకు ప్రోత్సాహకాలు అందించనున్నట్లు పేర్కొంది. ఈ దిశగా రూ.250 కోట్ల కార్పస్ నిధిని ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది.

ఇవీ లక్ష్యాలు

- రూ. 30 వేల కోట్ల పెట్టుబడులు
- కొత్తగా 3 లక్షల ఉద్యోగాలు
- 30 వేల మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం
- జీడిపప్పు, కొబ్బరి, మామిడిలకు వేర్వేరుగా బోర్డుల ఏర్పాటు
- నాలుగు ఎగుమతుల హబ్‌లు
- 10 ఆహార, మాంస శుద్ధి క్లస్టర్ల ఏర్పాటు

ప్రోత్సాహకాలు..

స్వయం సహాయ సంఘాలు, సమాఖ్యలు, సహకార సంఘాలు, సంస్థలు, సూక్ష్మ, స్థూల, చిన్న, భారీ, మెగా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందిస్తుంది.

- ఎంఎస్ఎంఈలకు ఫిక్స్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (ఎఫ్‌సీఐ)లో 75%, భారీ, మెగా పెట్టుబడులకు 35% వరకు ప్రోత్సాహకాలు
- ద్వితీయ, తృతీయ ప్రాసెసింగ్ యూనిట్లు ప్రాథమిక స్థాయి వాటి కంటే మూలధన రాయితీపై 10% అధిక ప్రోత్సాహకం పొందవచ్చు. మధ్యతరహా సంస్థలకు రూ. 8 కోట్ల వరకు ఇస్తారు.
- మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీలు మూలధన పెట్టుబడిపై ఎఫ్‌సీఐలో 35%-45% రాయితీ పొందవచ్చు.

ఈనాడు


ఈనాడు

రెండు చోట్లా హోరాహోరీ!

పదవుల యావలో ఏ తోవ తొక్కేందుకైనా వెనుదీయని నేతలు నేడు కోకొల్లలు. అధికారమే పరమావధిగా వర్ధిల్లుతున్న వర్తమాన రాజకీయాల్లో విలువలూ సిద్ధాంతాలూ వట్టి చెల్లని కాసులు. కొన్నేళ్లుగా మహారాష్ట్ర పరిణామాలను పరిశీలిస్తున్నవారికి ఆ సంగతి సులువుగానే బోధపడుతుంది. మహారాష్ట్ర అంటే, ఒకప్పుడు రెండు శిబిరాల రాజకీయ రణక్షేత్రం. భాజపా, శివసేన ఒకవైపు... కాంగ్రెస్, ఎన్సీపీ మరోవైపు మోహరించేవి. 2019 ఎలక్షన్ల తరవాత కమలదళంతో చిరకాల మైత్రికి నీళ్లొదిలిన శివసేన- సీఎం పదవికోసం వైరిపక్షాలతో చేతులు కలిపింది. అలా మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) పేరిట సైద్ధాంతిక శత్రువులు ఒకటై రాష్ట్రాన్ని ఏలారు. ఇంతలో ఏక్‌నాథ్ శిందే రూపంలో శివసేనలో పుట్టిన ముసలం- ఎంవీఏ పుట్టిముంచి, భాజపా నెత్తిన పాలుపోసింది. ఆపై ఎన్సీపీని చీల్చి అధికార కూటమిలోకి వచ్చిచేరిన అజిత్ పవార్ వర్గం- పదవీ బేరసారాల్లో బాగానే లాభపడింది. మళ్లీ ఎన్నికలొచ్చాయి. శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రేలతో కలిసి కాంగ్రెస్... ఏక్‌నాథ్ శిందే, అజిత్ పవార్ తోడుగా భాజపా బరిలోకి దిగుతున్నాయి. ఆరు స్తంభాలాటలో మోదమెవరికో ఖేదమెవరికో తేలాలంటే- నవంబరు 23వరకు ఆగాల్సిందే!

భారతావని జీడీపీలో 14శాతం వాటా కలిగిన మహారాష్ట్ర- అత్యధిక తలసరి ఆదాయం కలిగిన రాష్ట్రాల్లో ఒకటి. దేశీయ పారిశ్రామిక ఉత్పత్తిలో 13.8శాతం, ఎగుమతుల్లో 17.3శాతం మహారాష్ట్రవే. 2000-2023 మధ్యలో మన దేశంలోకి ప్రవహించిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో 30శాతం మహారాష్ట్రలోకే వెల్లువెత్తాయి. అయితే, కొన్నాళ్లుగా ఆ వైభవం మసకబారుతోంది. ఇతర రాష్ట్రాల నుంచి పోటీ పెరగడంతోపాటు వ్యవసాయ, సేవా రంగాల్లో ప్రగతి మందగించడంతో మహారాష్ట్ర వృద్ధి రేటు పతనమవుతోంది. ఏక్‌నాథ్ ప్రభుత్వం కొలువుతీరిన మొదటి నాలుగు నెలల్లోనే రూ.1.80 లక్షల విలువైన నాలుగు ప్రాజెక్టులు గుజరాత్‌కు వెళ్లిపోయాయి. ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం, మరాఠాల్లో ఆగ్రహం, గ్రామీణ రైతాంగంలో అసంతృప్తి, ఉద్ధవ్-శరద్ పవార్‌లపై సానుభూతి.. వెరసి, అధికార కూటమి ఆటుపోట్లను ఎదుర్కొంటోంది. సంక్షేమ పథకాల ద్వారా, ఓబీసీలకు దగ్గర కావడం ద్వారా విజయం సాధించాలని అది భావిస్తోంది. ఇటీవలి లోక్‌సభ ఎలక్షన్లలో మహారాష్ట్రలో అత్యధిక స్థానాలు ఎంవీఏ పరమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరుపక్షాల నడుమ అసెంబ్లీ ఎన్నికల పోరు హోరాహోరీగానే సాగనుంది!

దేశంలో తొలి ఆదివాసీ రాష్ట్రమైన ఝార్ఖండ్‌ది మరో కథ. అపార ఖనిజ వనరులకు నెలవైన ఆ రాష్ట్రం- రాజకీయ అస్థిరత, తీవ్రవాదాల కారణంగా వెనకబాటుతనం గుప్పిట్లో చిక్కుకుంది. ఆ దయనీయావస్థలోంచి ఝార్ఖండ్‌ను తప్పించేందుకంటూ 'విస్పష్ట మెజారిటీ - విస్పష్ట ప్రగతి' నినాదంతో భాజపా 2014 ఎన్నికల్లో పోటీ చేసింది. 81 స్థానాల్లో 72 చోట్ల బరిలోకి దిగి 37 సీట్లను కొల్లగొట్టింది. మిత్రపక్షం ఏజేఎస్‌యూపీ గెలుచుకున్న అయిదు స్థానాలతో కలిపి మెజారిటీ మార్కును దాటేసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. కానీ, స్వయంకృతాపరాధాలతో 2019లో భాజపా పరాజయాన్ని చవిచూసింది. అలా అధికారంలోకి వచ్చిన జేఎంఎం, కాంగ్రెస్ కూటమి- సంక్షేమ పథకాలనే ఇప్పుడు ప్రధాన ఆయుధాలుగా ప్రయోగిస్తోంది. అవినీతి కేసులో సీఎం హేమంత్ సోరెన్ కారాగారవాసం చేసి వచ్చినప్పటికీ గిరిజనుల్లో ఆయన పట్టు చెదరలేదన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. 'పంచ్ ప్రాణ్' పేరిట ఎన్నికల వాగ్దానాలు చేసిన భాజపా- సంక్షేమ పథకాల ప్రకటన ద్వారానే గెలుపు ఉట్టిని కొట్టాలని తలపోస్తోంది. వెరసి, ఝార్ఖండ్ ప్రజలు ఎవరి మెడలో ఓట్ల వరమాల వేస్తారన్నదే ఉత్కంఠభరితం!




నిజమైన ఉపవాసం అంటే- స్వార్థాన్ని త్యజించడం. దేన్నీ ఆశించకపోవడం. మనసును కోరికల నుంచి విముక్తం చేసుకుంటే సంతోషం మీ వెంటే ఉంటుంది.

– స్వామి రామతీర్థ

నిబద్ధత

మాటలో, ప్రవర్తనలో నిబద్ధత కలిగిన మనిషి వ్యక్తిత్వం ప్రకాశిస్తుంది. ప్రత్యేక గుర్తింపు పొందుతుంది. నిబద్ధత అంటే- ఒక ధర్మానికి, ఒక నియమానికి బద్ధుడై ఉండటం. వృత్తిలో ప్రవృత్తిలో నిబద్ధత గల వ్యక్తిని సమాజం గౌరవిస్తుంది. ఆరాధిస్తుంది... అనుసరిస్తుంది! నిబద్ధత రాముడి వ్యక్తిత్వానికి ఎంతో వన్నె తెచ్చి పెట్టింది. ఒకే మాట, ఒకే బాణం, ఒకే భార్య అన్న కీర్తితో అవతార పురుషుడిగా మార్చింది!

నిబద్ధత ఉన్నచోట నీతి ఉంటుంది, నిజాయితీ ఉంటుంది. నిబద్ధత ఉన్న మనిషి నిర్భయంగా ఉంటాడు. ఎవరికీ తలవంచడు. ఎన్ని కష్టాలు వచ్చినా భరిస్తాడు. ఏ పని చేయాలన్నా, ఏ లక్ష్యం సాధించాలన్నా నిబద్ధత అతణ్ని ముందుకు నడిపిస్తుంది. హరిశ్చంద్రుడు ఆడిన మాట తప్పలేదు. సత్యవ్రతాన్ని త్రికరణ శుద్ధిగా పాటించాడు. సత్యం కోసం తన సామ్రాజ్యాన్ని తృణప్రాయంగా వదిలేశాడు. భార్యాబిడ్డల్ని అమ్ముకున్నాడు. చివరకు కాటికాపరిగా దాస్యం చేసి సత్యసంధతకు నిబద్ధుడైన చక్రవర్తిగా చిరకీర్తి పొందాడు.



గాంధీజీ తన చిన్నప్పుడు 'సత్య హరిశ్చంద్ర' నాటకం చూసి ఎంతో ప్రభావితుడనయ్యానని చెప్పుకొన్నారు. ఆ ప్రభావం జీవితకాలం సత్యమార్గంలో నిబద్ధుడై నడవడానికి, ఆత్మనిగ్రహం పెంచుకోవడానికి ఎంతో ఉపయోగపడిందని ఆత్మకథలో రాసుకున్నారు!

అంతర్యామి

వ్యక్తే కాదు, ఒక సంస్థ అభివృద్ధి చెందాలన్నా కొన్ని ఉన్నత ప్రమాణాలను పాటించాలి. లక్ష్యసాధనలో అందరూ నిబద్ధత అనే గీత దాటకుండా ప్రయాణం చేయాలి. సంస్థలో ఒకరో ఇద్దరో ప్రలోభాలకు లోనై ఉత్పత్తిని కల్తీ చేశారనుకుందాం. అప్పుడు ఆ సంస్థ ప్రమాణాలు పడిపోతాయి. పేరు చెడిపోతుంది. లక్ష్యాలు దెబ్బతింటాయి. అందరూ నిబద్ధత పాటిస్తేనే విజయగమ్యం చేరుకోవడం సాధ్యమవుతుంది!

మనిషి మంచికే కాదు, చెడుకూ నిబద్ధుడై జీవించవచ్చు. కానీ అలాంటి వ్యక్తి వల్ల సమాజానికి కీడు జరుగుతుంది. అశాంతి... అల్లకల్లోలాలు ఏర్పడతాయి. మంచికి నిబద్ధుడైన మనిషి వల్ల సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుంది. ప్రశాంతత నెలకొంటుంది. వ్యక్తి శక్తిగా, సామాన్యుడు మాన్యుడిగా, మనిషి మహాత్ముడిగా, మానవుడు మహానుభావుడిగా పరివర్తన చెందడానికి నిబద్ధతే మూలకారణం అవుతుంది.

మన భక్తిలోనూ నిబద్ధత ఉండాలి. 'శరీరం, వాక్కు, మనసు ఏకం కావాలి... అంతర్ముఖులమై 'అన్యథా శరణం నాస్తి' అంటూ అంతర్యామిని ప్రార్థించాలి. కర్మలన్నింటినీ నిస్వార్థంగా భగవదర్పణం చేయాలి. అర్పణవల్ల బంధాలు దూరమవుతాయి. బంధాలు లేనప్పుడు వియోగబాధ ఉండదు. అప్పుడు ఈ సమస్త జగత్తును ఈశ్వర రూపంగా భావిస్తావు. ఒక అలౌకిక ఆనందానుభూతి ఎరుకలోకి వస్తుంది' అంటారు భగవాన్ రమణమహర్షి! ఇదంతా మనలోని నిబద్ధతవల్లే సాధ్యమవుతుందన్నది అక్షరసత్యం..!

– శ్రీకంఠస్ఫూర్తి

పరిశోధనలకు పట్టం

'అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్' చట్టం-2023 ద్వారా అదే పేరు (ఏఎన్ఆర్ఎఫ్)తో కేంద్రం ఒక ప్రత్యేక సంస్థను నెలకొల్పింది. దేశవ్యాప్తంగా జరుగుతున్న పరిశోధనలకు ఊతమివ్వడంతో పాటు స్థానిక అవసరాలకు అనుగుణంగా వాటికి దిశానిర్దేశం చేయడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యం. ఇందుకు వచ్చే అయిదేళ్లలో రూ.50వేల కోట్లు వెచ్చిస్తారు. ఇంత పెద్దయెత్తున ధన సహాయం లభించడంవల్ల మన పరిశోధనలు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను అందిపుచ్చుకునే అవకాశముంది.

భారతీయ ఉన్నత విద్యాలయాలు అంతర్జాతీయ సంస్థలకు దీటుగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. అందుకోసమని 2017లో పనితీరు, ప్రమాణాల ఆధారంగా దేశంలోని 20 ఉన్నత విద్యాలయాలను ఎంపికచేసి, వాటిని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలుగా ప్రకటించింది. పరిశోధన కార్యక్రమాల్లో నాణ్యతనూ పోటీతత్వాన్నీ పెంపొందించేందుకు 'పనిచేసిన వారికి ఎక్కువ- చెయ్యనివారికి తక్కువ' విధానంలో నిధుల పంపిణీ చేపట్టింది. దేశ రీసెర్చ్ ఫండింగ్ చరిత్రలోనే దీన్ని ఒక మేలిమి మలుపుగా పలువురు సీనియర్ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అలా ఎంపికైన సంస్థలకు వెయ్యి కోట్ల రూపాయల చొప్పున



నిధులిచ్చారు. వాటితో ఆయా సంస్థల్లో పోటీ పద్ధతిలో పరిశోధనా కేంద్రాలను నెలకొల్పారు. నిజానికి వాటి స్థాపన కోసం శాస్త్రవేత్తల బృందాలు అనేక ప్రతిపాదనలు సమర్పించాయి. అయితే ఆ బృందాల గత పనితీరు, పరిశోధనల్లో సాధించిన విజయాలను పరిగణనలోకి తీసుకుని ప్రతిపాదనలను ఆమోదించారు. ఈ విధానంలో దేశవ్యాప్తంగా పలు ఐఐటీల్లో పరిశోధనాలయాలు ఏర్పడ్డాయి. ఒక్క ఐఐటీ-మద్రాస్‌లోనే సుమారు 70 పరిశోధనా కేంద్రాలు కొలువుదీరాయి. వీటిలో చాలా కేంద్రాలు అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే కాకుండా, వాణిజ్య రంగంలోనూ కీలకమవుతున్నాయి.

విపరీతమైన ప్రత్యేకీకరణతో నష్టమే...

గడచిన దశాబ్దకాలంలో ఐఐటీల్లో ఒక మంచి పరిణామం చోటుచేసుకుంది. విద్య, వాణిజ్య సంస్థల మధ్య బలమైన అనుసంధానం ఉండాలన్న యోచనతో ఐఐటీలు రీసెర్చ్ పార్కులను స్థాపించాయి. అక్కడి ప్రొఫెసర్లు తమ పరిశోధనల ఆధారంగా ఈ పార్కుల్లోనే అంకుర సంస్థలను నెలకొల్పుతున్నారు. ఇటువంటి స్టార్టప్‌ల సంఖ్య ఏటికేడు పెరుగుతోంది. ఒక్క ఐఐటీ మద్రాస్ రీసెర్చ్ పార్కులోనే 200 వరకు అంకుర సంస్థలు వెలిశాయి. ఇప్పుడు కొత్తగా ఏర్పడిన 'అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏఎన్ఆర్ఎఫ్)' కూడా పనితీరు మదింపు, పోటీ పద్ధతిలోనే పరిశోధనా కార్యక్రమాలకు నిధులిచ్చే అవకాశముంది. దీనివల్ల దేశానికి మరింత మేలు ఒనగూడుతుంది. ఏఎన్ఆర్ఎఫ్‌కు ప్రత్యేకించే మొత్తం రూ.50వేల కోట్ల నిధుల్లో కేంద్రం తన వాటాగా రూ.10వేల కోట్లు ఇవ్వనుంది. మిగతా నిధులను కార్పొరేట్ సంస్థలు సమకూరుస్తాయంటున్నారు.

శాస్త్ర పరిశోధన అనేది ఎంతో స్వేచ్ఛతో కూడుకున్న ప్రయత్నం. శాస్త్రవేత్త తనకు అనుభవమున్న రంగంలో, నచ్చిన సమస్య మీద, అందుబాటులో ఉన్న వనరులను వెచ్చించి పరిశోధన సాగిస్తాడు. అయితే, ఇరవై ఒకటో శతాబ్దపు శాస్త్ర రంగాల్లో 'విపరీతమైన ప్రత్యేకీకరణ' (స్పెషలైజేషన్) ఒక జాడ్యంలా పరిణమిస్తోంది. ప్రతి శాస్త్రవేత్తకూ ఒక సూక్ష్మమైన రంగంలో లోతైన పరిజ్ఞానం ఉంటుంది. కానీ, ఆ రంగం వెలుపలి విషయాల గురించి మాత్రం వారికి అంతగా అవగాహన ఉండదు. గుండె వ్యాధుల నిపుణుడికి, మూత్రపిండాల గురించి లోతుగా తెలియకపోవచ్చు. ఊపిరితిత్తుల నిపుణుడికి మెదడు గురించి పూర్తిగా తెలిసే అవకాశం తక్కువ. వ్యాధి చుట్టుముట్టిందంటే, దాని వెనక శరీరంలోని ఎన్నో అవయవాల ప్రమేయం ఉంటుంది. అయితే, శాస్త్ర సౌలభ్యం పేరిట ఈ పరిజ్ఞానాన్ని అంగాలవారీగా విభజిస్తున్నాం. ప్రతి నిపుణుడూ తన ప్రత్యేక విభాగాన్ని దృష్టిలో పెట్టుకునే చికిత్స సూచిస్తాడు. నిజానికి రోగికి కావాల్సింది అన్ని అవయవాలనూ సమన్వయపరుస్తూ చేసే సమగ్ర చికిత్స. అందుకు అవసరమైన బహుముఖ ప్రజ్ఞ చాలా తక్కువ మందికే ఉంటుంది. ఇప్పుడు ఇదే ఉదాహరణను దేశానికి వర్తింపజేద్దాం. దేశాన్ని పట్టిపీడిస్తున్న ఎన్నో 'వ్యాధులు' ఏదో ఒక రంగానికి మాత్రమే పరిమితమైనవి కావు. భిన్న రంగాలవారు కలిసికట్టుగా కృషిచేస్తే తప్ప చాలా సమస్యలు పరిష్కారం కావు.

'మిషన్ మోడ్' పరిష్కారాలే కీలకం

భారత పాలనా యంత్రాంగం ఎలాంటి రంగాల్లో సఫలమవుతోంది, ఎక్కడ విఫలవుతోందనే విషయాలను బేరీజు వేస్తూ అమెరికాలో జాన్స్ హాప్కిన్స్ విశ్వవిద్యాలయానికి చెందిన దేవేష్ కపూర్ పరిశీలన సాగించారు. పలు కారణాలవల్ల ఇండియాలో సాధారణ పౌరసేవల్లో వైఫల్యం ఎక్కువగా కనిపిస్తోందని గుర్తించారు. అయితే, మన పాలనా యంత్రాంగం 'మిషన్ మోడ్'లో- అంటే కచ్చితమైన లక్ష్యం, అందుకు నిర్ణీత బడ్జెట్, గడువుతో పనిచేసినప్పుడు మాత్రం ప్రపంచంలోనే కనీవినీ ఎరుగనంత బృహత్తర విజయాలను సాధించగలుగుతున్నట్లు కపూర్ విశ్లేషించారు. అందుకు 'ఆధార్'ను ఉదాహరణగా చెప్పారు. కాబట్టి- వాతావరణ మార్పులు, నిరుద్యోగం, నిరక్షరాస్యత, నైపుణ్యాల కొరత వంటి సమస్యలకు 'మిషన్ మోడ్' పరిష్కార ప్రణాళికలు అవసరం. అటువంటి సవాళ్లపై ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు, పరిశోధనా కేంద్రాలకు చెందిన శాస్త్రవేత్తల బృందాలు దీర్ఘకాలిక ప్రణాళికలు అమలుచేస్తే అద్భుతమైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుంది. అయితే, ఆ ఫలితాలను మదింపువేసే పద్ధతిలోనూ జాగ్రత్త వహించాలి. నేటి కాలంలో ప్రతి పరిణామాన్నీ డబ్బుతో కొలవడం ఆనవాయితీ అయిపోయింది. దేశప్రగతికి కొలమానంగా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)ని పదేపదే చెబుతుంటారు. పాతిక లక్షల కోట్ల డాలర్లకు పైగా జీడీపీ కలిగిన అగ్రరాజ్యాల్లోనూ 60శాతం ప్రజలు 'ఏ నెలకు ఆ నెల' అన్నట్లే జీవితాలను నెట్టుకొస్తున్నారనేది వాస్తవం. దాన్ని గుర్తిస్తే- కేవలం జీడీపీ అనే సూచికతోనే ఒక సమాజ సౌభాగ్యాన్ని, సంపత్తిని కొలవడం సాధ్యంకాదని అర్థమవుతుంది. మనం వేసే ప్రతి అడుగు సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేయాలి. స్వల్పకాలిక ప్రయత్నాలతో పరిమిత లక్ష్యాలనే ఛేదించగలుగుతాం. కానీ, మన సమాజాన్ని పట్టిపీడిస్తున్న లోతైన సమస్యల పరిష్కారానికి భారతీయ శాస్త్ర సమాజం ప్రణాళికాబద్ధంగా కృషి చేయడం అత్యావశ్యకం!



ప్రొఫెసర్ వి.శ్రీనివాస చక్రవర్తి
ఐఐటీ-మద్రాస్‌లో ఆచార్యులు




అవకాశం ఒకరివ్వాలా?

'ఒక్క ఛాన్స్... ఒకే ఒక్క ఛాన్సివ్వండి... నేనేంటో రుజువు చేసుకుంటా'- రంగుల లోకంలో అడుగు పెట్టాలని, కళాకౌశలాన్ని చాటుకోవాలనుకునే ఎంతోమంది ఔత్సాహికులు ఇలాంటి అభ్యర్థనతో ఎక్కే గడప, దిగే మెట్లు లేవన్నట్లుగా ప్రయత్నాలు సాగిస్తారు. కానీ, రంగుపూతల మాయా ప్రపంచంలో అవకాశం ఊరికే రాదన్న సంగతి వారికి అర్థమయ్యేదెప్పుడో! కొంతమంది దృష్టిలో ఈ ప్రపంచంలో అన్నీ పరస్పరాశ్రయాలే. నీకిది...నాకది! ఆ ప్రబుద్ధులు ఆడే రంగుల చదరంగంలో తోలుతిత్తులే పెట్టుబడులు! ఇదంతా ఏళ్లుగా సాగుతున్నా అర్థమయ్యీకానట్లుగా అనిపించే రంగువెలిసిపోని కళామహత్తు! అవును, ఇదంతా నిజంగా నిజమేనంటూ అప్పడప్పుడూ క్యాస్టింగ్‌కౌచ్ స్వరాలూ, 'మీటూ' ఉద్యమాలూ, కేరళ హేమా కమిటీలు గొంతెత్తుతుంటాయి. కొద్దిరోజులపాటు హడావుడి... ఆ తర్వాత ఎవరిగోల వారిదే!

ఇప్పుడొక్కటే ప్రశ్న. ఇంతకీ ప్లాస్టిక్ తళుకుల తారాలోకంలో మెరవాలంటే వృత్తి పట్ల కమిట్‌మెంట్ ఉంటే చాలదా! ఆత్మాభిమానాన్ని అమ్ముకోవడానికి కమిట్‌మెంట్ ఇవ్వాలా? టాలెంట్ అనేది మ్యూజియంలో మూలనపడిన పాతవస్తువా? దాని అవసరమే లేదా, అసలు రాదా! సరే, ఎప్పుడో ముగిసిపోయిన కమిట్‌మెంట్ల కల్యాణానికి ఇప్పుడు కమిటీల నివేదికలంటూ శబ్ద కాలుష్యం ఎందుకనేది కొంతమంది కురచబుద్ధుల సందేహం! అప్పుడెప్పుడో జరిగిపోయిన పెళ్లికయినా, సైడ్‌ఎఫెక్టులన్నీ బయటపడేది కొన్నేళ్లయ్యాకే కదా! ఇప్పటికైనా చీకట్లో మగ్గిపోయిన నలుపులన్నీ తెల్లని వెలుతురు మేకప్ పూసుకొని బయటికొస్తే మంచిదేగా! ఇప్పటి తరానికైనా కమిట్‌మెంట్ల కాట్లకుక్కల బారినపడి పంటిగాట్లకు ఇంజక్షన్లు గుచ్చుకొనే బాధయినా తప్పుతుందేమో! నిజంగానే తప్పుతుందా! సమస్యే లేదు. ఇప్పుడేమైనా నయమా! ఇప్పటితరాన్ని కాల్చుకుతినడానికి కళాప్రపంచమే అక్కర్లేదు. బడిలో, బస్సుల్లో, చదువుల్లో, రోడ్డులో, ఆఫీసుల్లో, పనుల్లో, కంప్యూటర్లో, ఫోన్లో, క్యాబుల్లో, పాటల్లో, పోర్నుల్లో అడుగడుగునా వేధింపుల వేపుళ్లేగా! ఆఖరికి ఆన్‌లైన్ లోన్ల ఆకలి కుక్కలకీ లోకువైపోవడం లేదా!

అసలివన్నీ ఎందుకు! ఛాన్సుల కోసం దేబిరించడమెందుకు! అవకాశాల్ని సృష్టించుకుంటే పోలా? ఆశపడిన కెరీర్‌లో ఆకాశమంత ఎదగాలన్న కమిట్‌మెంట్, తారాతీరానికి చేరాలన్న కమిట్‌మెంట్, దిగంతాల హద్దుల్లో మబ్బుతునకలై ఈదులాడాలన్న కమిట్‌మెంట్ ఉంటే చాలు- అద్భుతాలు చేయవచ్చు. 'మనకేం తక్కువ. ఒక ఫ్యాషన్ సృష్టించలేమా! ఒక సినిమా తీయలేమా! ఒక పాట రాయలేమా, పాడలేమా! ఒక స్వరం కట్టలేమా! ఒక టెక్ సంస్థను సాఫ్ట్‌గా నడపలేమా? సరిహద్దుల్లో ఆయుధాల బరువుతో మాతృభూమిని కాస్తున్నాం. చందమామ రావే అని పిలవడాన్ని దాటేసి చంద్రయానమే చేశాం కదా! రోడ్డు నుంచి ఆకాశందాకా అన్నింటినీ నడిపేస్తూ, రాకెట్ సైన్స్‌నే ఔపోసన పట్టి అంతరిక్షంలో విహరిస్తున్నాం. ఏం చేయలేమని! ఏం తక్కువని! మనమే చేద్దాం, మనమే తీద్దాం! అవును మీటూ అంటే మనం కూడా! మనమూ ఎందులో తక్కువ కాదు. ఆకాశంలో... అవకాశాల్లో అన్నింట్లో సమానమే! అంతా సమానమే! అడిగితే ఇవ్వకపోతే, బరాబర్ తీసేసుకోవడమే!'... ఇలా గట్టిగా అనుకుంటే అయిపోదూ?

– డీఎస్



పేదరికం కోరల్లో...

నేడు అంతర్జాతీయ పేదరిక నిర్మూలనా దినోత్సవం. మన దేశంలో దుర్భర దారిద్ర్యంలో మగ్గుతున్న వారి సంఖ్య తగ్గుతోందని ప్రభుత్వ నివేదికలు చెబుతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం, 2022-23లో దేశ జనాభాలో 11.28 శాతం బహుముఖ పేదరికంలో అల్లాడుతున్నారు. ఇలాంటి వారి సంఖ్య ఏపీలో 4.19శాతం, తెలంగాణలో 3.76శాతం మేర ఉంది. జాతీయ సగటు కంటే ఎక్కువ సంఖ్యలో పేదలు ఉన్న రాష్ట్రాలు ఏంటంటే (పేదల జనాభా శాతాల్లో)...



(ఆధారం: నీతిఆయోగ్ నివేదిక)

కొండకోనల్లో పప్పుల కుప్పలు!

పప్పుధాన్యాల ఉత్పత్తిలో స్వయంసమృద్ధి సాధించడానికి కేంద్రం పలు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా దేశంలోని మావోయిస్టు ప్రభావిత, గిరిజన ప్రాంతాల్లో ఈ పంటల సాగును ప్రోత్సహించాలని నిర్ణయించింది. ముఖ్యంగా కంది, మినుము దిగుబడుల పెంపుపై దృష్టి సారించింది. ఈ కార్యక్రమం ద్వారా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో రైతుల ఆదాయం పెంచాలని భావిస్తోంది. ఇది విజయవంతమైతే దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుందని కేంద్రం అంచనా వేస్తోంది. ఈ ప్రాజెక్టును భారత జాతీయ వినియోగదారుల సహకార సమాఖ్య లిమిటెడ్(ఎన్‌సీసీఎఫ్) ప్రయోగాత్మకంగా అమలు చేస్తోంది. ఇందుకు ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్, జష్‌పుర్, బస్తర్, మోహ్లామాన్‌పుర్ జిల్లాలు, ఝార్ఖండ్‌లోని పాలము, దుమ్కా, గర్వా జిల్లాలను ఎంపిక చేసింది. ప్రస్తుత ఖరీఫ్‌కు సంబంధించి ఆయా జిల్లాల్లోని రైతులకు పప్పుధాన్యాలకు సంబంధించిన హైబ్రీడ్ విత్తనాలను పంపిణీ చేసింది. అన్నదాతలు తమ ఉత్పత్తులను సహకార సంస్థకు విక్రయించుకోవచ్చు. కర్షకులు పండించిన పంటలను ఎన్‌సీసీఎఫ్ కనీస మద్దతు ధరకు సేకరిస్తుంది. మద్దతుధర కంటే మార్కెట్ ధర అధికంగా ఉంటే రైతులు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవచ్చు. ప్రభుత్వ బఫర్‌స్టాక్ కోసం ఎన్‌సీసీఎఫ్ పప్పులను సేకరిస్తుంది. దాని వార్షిక సేకరణ లక్ష్యంలో సగభాగాన్ని ఈ కార్యక్రమం ద్వారా పొందాలని భావిస్తోంది.



పప్పుధాన్యాల ఉత్పత్తిని పెంచడానికి కేంద్రం వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. సాగు విస్తీర్ణం, దిగుబడుల వృద్ధికి ప్రయత్నిస్తోంది. అందుకోసం ఆధునిక వంగడాల రూపకల్పనతో పాటు మద్దతు ధరల పెంపు తదితర విధానాలను అమలు చేస్తోంది.

పోషకాహార భద్రతకు కీలకం

ప్రపంచవ్యాప్తంగా పప్పుధాన్యాల్లో కీలక ఉత్పత్తిదారు, వినియోగదారు మనదేశమే. ప్రజల పోషకాహార భద్రతకు ఈ పంటలు చాలా కీలకం. దేశంలో రబీ పంటకాలంలో పప్పుధాన్యాల సాగు ఎక్కువగా ఉంటుంది. మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఈ పంటల సాగులో ముందున్నాయి. తక్కువ దిగుబడి, వాతావరణ మార్పుల ప్రభావం, అధిక పెట్టుబడి, తెగుళ్లు, ధరల హెచ్చుతగ్గులు వంటి సవాళ్లను పప్పు ధాన్యాల సాగుదారులు ఎదుర్కొంటున్నారు. 2027 నాటికి పప్పుధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలంటే- వాతావరణ మార్పులను తట్టుకునే ఆధునిక వంగడాలపై దృష్టి సారించాలి. ప్రభుత్వ, ప్రైవేటు విత్తన సంస్థల కృషి మూలంగా గతం కంటే దిగుబడులు కొంతవరకు పెరిగాయి. కానీ అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే ఉత్పాదకతలో మన దేశం వెనకే ఉంది. దేశంలో పప్పుల ధరలను నియంత్రణలో ఉంచేందుకు, దేశీయ సరఫరాను పెంచేందుకు దిగుమతులపై ఆధారపడక తప్పడం లేదు.

పెరుగుతున్న డిమాండ్

ప్రస్తుత సంవత్సరంలో రుతుపవనాలు ఆశాజనకంగా ఉండటంతో దిగుబడులు పెరగవచ్చని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. సాగు విధానాలను మార్చకపోతే- పప్పు ధాన్యాల దిగుమతులు రానున్న అయిదేళ్లలో రెట్టింపు అవుతాయని హెచ్చరిస్తున్నారు. వరి సాగుకు బదులుగా పంజాబ్ వంటి రాష్ట్రాల్లో పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించాలని సూచిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో సైతం రైతులకు ప్రత్యేక తోడ్పాటు అందించడం ద్వారా సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. తద్వారా రైతుల ఆదాయమూ అధికమవుతుంది.

దేశంలో పప్పుల డిమాండ్‌ను అధిగమించాలంటే దిగుబడులను పెంచడమే పరిష్కారం. ఇందుకు ఆ పంటల సాగును లాభసాటిగా మార్చాలి. పెట్టుబడికి అనుగుణంగా కనీస మద్దతు ధరలను నిర్ణయించి రైతుల నుంచి ఉత్పత్తులను వంద శాతం కొనుగోలు చేయాలి. కొనుగోలు ప్రక్రియను సైతం సులభతరం చేయాలి. ప్రకృతి విపత్తుల కారణంగా పంట నష్టం జరిగినప్పుడు ప్రభుత్వాలు సరైన పరిహారం అందించాలి. పంటల బీమా నిబంధనలను సరళతరం చేయాలి. ఇలా బహుముఖ చర్యల ద్వారానే ఉత్పత్తిని పెంచే అవకాశం ఉంది. లేకుంటే పప్పుధాన్యాల్లో స్వయం సమృద్ధి అన్నది నినాదానికే పరిమితమవుతుంది.

– దేవవరపు సతీష్‌బాబు

నక్క మాట.. పులి వేట!

అడవిలో పులి, నక్కకు ఎంతకీ తిండి దొరకలేదు. దీంతో... 'మీరు, నేను చెరో మార్గంలో వెళ్దాం. ఎవరికి ఆహారం దొరికినా కొండ దగ్గరే కలుద్దాం' అని చెప్పింది నక్క. అలాగేనన్న పులి, నక్కకు వ్యతిరేక దిశలో వెళ్లింది. నక్క మాత్రం కొండ దగ్గరకు పోయి హాయిగా విశ్రాంతి తీసుకోవాలనుకుంది. అక్కడ దానికి మేక కనిపించింది. 'ఒంటరిగా ఉన్నావు. దారి తప్పావా?' అని దాంతో మాట కలిపింది. 'ఈ కొండ గుహలో నివసిస్తున్న నా మిత్రుణ్ని కలిసి వస్తున్నాను. ఇప్పుడిక మా మందను కలవడానికి వెళ్తున్నాను' అని చెప్పింది మేక.

'కోతలు ఆపు. పులి ఇప్పుడే వేటకని బయలుదేరింది. నిజం చెబితే నిన్ను రక్షిస్తాను' అని నక్క, మేకను భయపెట్టింది. 'నేను అబద్ధం చెప్పడం లేదు. కావాలంటే ఓ సారి నా మిత్రుణ్ని పిలుస్తాను. పలుకుతుందో, లేదో చూడు' అంటూ.. 'మేఁ..మేఁ..' అని గట్టిగా అరిచింది మేక. అటు నుంచి కూడా 'మే.. మే...' అంటూ సమాధానం వచ్చింది. 'నువ్వు నిజం చెప్పావు కాబట్టి, ఇచ్చిన మాట ప్రకారం నిన్ను విడిచిపెడుతున్నాను. ఈ దారిలో వెళితే నువ్వు క్షేమంగా చేరుకుంటావు' అంటూ తెలివిగా, పులి వెళ్లిన మార్గాన్నే చూపించింది. నక్క మీద నమ్మకం లేని మేక, కాస్త దూరం వెళ్లిన తర్వాత.. ఆ దారిలో కాకుండా దట్టమైన పొదలున్న వైపు నుంచి పారిపోయింది. పులికి ఆహారం దొరక్కపోవడంతో, కాసేపటికి తిరిగి వచ్చింది.


హాయ్! బుజ్జీ!!



'నీకు ఎదురుగా మేకను పంపించాను. కనిపించలేదా?' అని అడిగింది నక్క. 'లేదు' అంది పులి. 'అది పోయినా, మరోటి ఈ గుహలో ఉంది' అని చెప్పింది. దాన్ని బయటకు రప్పించేందుకు పులి గాండ్రించింది. కొద్దిసేపటికి తిరిగి వాటికి గాండ్రింపు వినిపించింది. 'మరో పులి గుహలో ఉందా?' అని ఆశ్చర్యపోతూ అడిగింది నక్క. 'అది మరో పులి అరుపు కాదు... ప్రతిధ్వని' అని చెప్పింది పులి. అయితే మేక, నన్ను మోసం చేసిందంటూ నక్క జరిగిన సంఘటన అంతా చెప్పింది. పులి కోపంతో నక్కను కసురుకుని, అక్కడి నుంచి ముందుకు కదిలింది.

– బి.వి.పట్నాయక్

బొమ్మల్లో ఏముందో? బొమ్మల ఆధారంగా వాటి పేర్లను ఇక్కడి ఖాళీ గడుల్లో నింపగలరా?



అయ్యో తెల్లపులి... అమ్మో మొసళ్లు!

- వన్యప్రాణులను తరలిస్తున్న వాహనం బోల్తా

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: వన్యప్రాణులను తరలిస్తున్న వాహనం ప్రమాదానికి గురవగా... అదృష్టవశాత్తు అందులోని జీవాలన్నీ సురక్షితంగా బయటపడ్డాయి. బిహార్ రాజధాని పట్నాలోని సంజయ్‌గాంధీ జాతీయ జూపార్కు నుంచి వివిధ రకాల వన్యప్రాణులను రెండు వాహనాల్లో బెంగళూరులోని బన్నేర్‌గట్ట జాతీయ జూపార్కుకు తరలిస్తున్నారు. వీటిలో ఘరియాల్ జాతి మొసళ్లు, అరుదైన తెల్లపులి ఉన్నాయి. బుధవారం సాయంత్రం తెలంగాణలోని నిర్మల్ జిల్లా మామడ మండలం మొండిగుట్ట గ్రామానికి చేరుకున్నాక రెండు వాహనాల్లో ఒకటి అనూహ్యంగా ప్రమాదానికి గురైంది. అదుపుతప్పి 44వ నంబరు జాతీయ రహదారి కిందికి దూసుకెళ్లి... బోల్తా పడింది. అదృష్టవశాత్తు తెల్లపుల్లి, మొసళ్ల సహా వేటికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. అయితే, ఎనిమిది మొసళ్లలో రెండు బయటకుపడిపోయాయి. సమాచారం అందుకున్న అటవీ అధికారులు, పోలీసులు పరుగున అక్కడికి చేరుకున్నారు. మొసళ్లు తప్పించుకొనిపోకుండా రక్షణ చర్యలు చేపట్టారు. ఈలోగా మరో వాహనాన్ని సిద్ధంచేసి అన్నింటినీ అందులోకి ఎక్కించి, గమ్యస్థానానికి తరలించారు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సోన్ సీఐ నవీన్‌కుమార్ తెలిపారు.





బోనులో సురక్షితంగా తెల్లపులి ◆ వాహనం నుంచి బయట పడిపోయిన మొసలిని తరలిస్తున్న సిబ్బంది

బుడమేరు వరదపై వివరాలు సమర్పించండి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు

ఈనాడు, అమరావతి: విజయవాడ వరద విషయంలో ప్రజలను అప్రమత్తం చేయడంలో అధికారులు విఫలమయ్యారని, బాధ్యులపై చర్యలు తీసుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంలో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హైకోర్టు ఆదేశించింది. కేంద్ర హోం, అటవీ పర్యావరణ శాఖల కార్యదర్శులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి, జలవనరులశాఖ ప్రత్యేక సీఎస్, ఇంజినీర్ ఇన్ చీఫ్‌లకు నోటీసులు జారీచేసింది. విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. వరదలు రావడానికి ముఖ్యమంత్రికి సంబంధం లేదని.. వ్యక్తిగత హోదాలో ముఖ్యమంత్రి చంద్రబాబును వ్యాజ్యంలో ప్రతివాదిగా పేర్కొనడం సరికాదని అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ అభ్యంతరం వ్యక్తం చేశారు.. దీంతో ఏకీభవించిన ధర్మాసనం.. సీఎంకు నోటీసిచ్చేందుకు నిరాకరించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్, జస్టిస్ చీలమపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. ఒంగోలుకు చెందిన విశ్రాంత పాత్రికేయుడు భూపతిరావు హైకోర్టులో పిల్ వేసిన సంగతి తెలిసిందే.

మల్లవల్లిలో గతంలో ఇచ్చిన ధరకే మళ్లీ భూ కేటాయింపులు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో ఉద్యోగ కల్పనలో భాగంగా మల్లవల్లి పార్కులో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎకరం రూ.16.50లక్షల చొప్పున గతంలో భూములు కేటాయించామని, వైకాపా ప్రభుత్వం వచ్చాక ఎకరా రూ.89.16 లక్షలకు పెంచేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 577 పరిశ్రమలకు ఇచ్చిన భూములు రద్దు చేశారని, 277 మందికి సొమ్ములు తిరిగిచ్చారని చెప్పారు. ఎకరం రూ.16.50 లక్షల ధరపై గతంలో కేటాయించిన 150 ఎకరాల్లో 405 ఎంఎస్ఎంఈలకు భూములు కేటాయించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించామన్నారు. వారంతా గతంలో భూములు పొందినవారేనని, 60 రోజుల్లో వారు ముందుకొచ్చి భూమి విలువ చెల్లించి, రెండేళ్లలో పరిశ్రమలు పూర్తి చేయాలన్నారు. వీటితో మొత్తం 33వేల మందికి ఉద్యోగాలొస్తాయన్నారు.

జగన్ మిగిల్చిన ఫీజు బకాయిలు

- గతేడాది 3 త్రైమాసికాల డబ్బులు ఎగ్గొట్టిన వైనం
- విద్యార్థులను ఒత్తిడి చేస్తున్న యాజమాన్యాలు
- రూ.3 వేల కోట్లకుపైగా బకాయిలు

ఈనాడు, అమరావతి: జగన్ ప్రభుత్వం బకాయి పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇప్పుడు విద్యార్థులకు భారంగా మారాయి. గత విద్యా సంవత్సర ఫీజులను వైకాపా ప్రభుత్వం పూర్తిగా చెల్లించకపోవడంతో వాటిని కట్టాలంటూ విద్యార్థులపై కళాశాలలు ఒత్తిడి చేస్తున్నాయి. దసరా సెలవుల అనంతరం కళాశాలలకు వెళ్లిన విద్యార్థులను ఫీజులు కట్టాలని యాజమాన్యాలు డిమాండు చేస్తున్నాయి. కొన్ని ఇప్పటికే విద్యార్థుల నుంచి వసూలు చేసుకున్నాయి. కళాశాలలకే ఫీజులను చెల్లించేలా ఉన్న విధానాన్ని జగన్ ప్రభుత్వం వచ్చాక మార్చి.. తల్లుల ఖాతాల్లో వేసే విధానం తెచ్చింది. దీంతో ప్రభుత్వం విడుదల చేసే ఫీజులతో తమకు సంబంధం లేదని కళాశాలల యాజమాన్యాలు తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నాయి. 2023-24 విద్యా సంవత్సరంలో నాలుగు త్రైమాసికాలుగా ఫీజులు విడుదల చేయాల్సి ఉండగా.. గత ప్రభుత్వం ఒక్క విడతే ఇచ్చింది. అదీనూ ఎన్నికల ముందు విడుదల చేయడంతో పూర్తిస్థాయిలో తల్లుల ఖాతాల్లో జమ కాలేదు. దీంతో డిగ్రీ, బీటెక్ కోర్సులు పూర్తి చేసి కళాశాలల నుంచి వెళ్లిపోతున్న విద్యార్థుల నుంచి యాజమాన్యాలు ఫీజులు వసూలు చేసుకున్నాయి. మిగతా వారిపై ఇప్పుడు ఒత్తిడి పెంచుతున్నాయి.

చెల్లిస్తేనే కళాశాలకు వచ్చేది..: ఫీజు బకాయిలు చెల్లిస్తేనే కళాశాలకు రావాలంటూ విద్యార్థులను యాజమాన్యాలు హెచ్చరిస్తున్నాయి. కొన్ని కళాశాలలు పరీక్షలకు అనుమతించబోమని పేర్కొంటున్నాయి. విద్యా సంవత్సరం ముగిసినా ఫీజులు చెల్లించకపోతే విద్యా సంస్థలను ఎలా నిర్వహించాలని ప్రశ్నిస్తున్నాయి. గత సంవత్సర 'వసతి దీవెన', ఫీజుల బకాయిలు కలిపి రూ.3,480 కోట్ల వరకు ఉన్నాయి. 'ప్రభుత్వం మీ ఖాతాల్లోనే డబ్బు వేస్తోంది కదా.. అవి మీరే తీసుకొని, ఇప్పుడు మాత్రం మాకు కట్టండి' అని కళాశాలలు తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నాయి. నేరుగా కళాశాలలకు చెల్లించే విధానం ఉంటే సమస్యను యాజమాన్యాలు, ప్రభుత్వం చూసుకునేవి. తల్లుల ఖాతాల్లో వేసే విధానం వల్ల పేద విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు విద్యార్థులు ఫీజులు సకాలంలో చెల్లించలేక కళాశాలలకు వెళ్లడం లేదు.



అలాంటి వైఫల్యం ఓటమి కాదు

వైఫల్యాలు రెండు రకాలు:
1.ఓటమి భయంతోనో లేదా సరైన సమయం కోసం ఎదురుచూస్తూనో అసలు ప్రయత్నమే చేయకపోవడం.
2.వినూత్నంగా ప్రయత్నించి ప్రతికూల ఫలితాన్ని పొందడం. మొదటి రకం వైఫల్యం నుంచి ఏమీ నేర్చుకోలేం. రెండో రకం వైఫల్యం వాస్తవానికి ఓటమి కాదు. లక్ష్య సాధనలో అదొక అంతర్భాగం. అలాంటి సరికొత్త ప్రయత్నాలు పదే పదే చేసేవారు తప్పకుండా విజయం సాధించి చరిత్ర సృష్టిస్తారు.

– రాబర్ట్ గ్రీన్, రచయిత

కుప్పకూలిన బాల సదనం ప్రహరీ

- 5 కార్లు ధ్వంసం

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : విజయవాడ న్యాయస్థానాల సముదాయం ఎదుట బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు కమలా నెహ్రూ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్, మహిళా శిశు సంక్షేమ బాల సదనం ప్రహరీ ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో గోడ పక్కన నిలిపిన 5 కార్లు ధ్వంసమయ్యాయి. తెల్లవారుజామున ప్రమాదం జరగడంతో ప్రాణనష్టం జరగలేదు. ఇటీవల వరుసగా వర్షాలకు వసతి గృహం పునాదుల్లో నీరు చేరి బాగా నానింది. చాలా కాలం కిందట కట్టిన గోడ కావడం, నేలంతా గుల్లగా మారడంతో కూలిపోయింది. శిథిలాలు రోడ్డుపై పడటంతో గోపాలరెడ్డి మార్గంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. నగరపాలక సంస్థ అధికారులు శిథిలాలు తొలగించి, ధ్వంసమైన కార్లను సూర్యారావుపేట పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



కార్లపై పడిపోయిన ప్రహరీ



ప్రహరీ పడిపోవడంతో ధ్వంసమైన కారు

భాజపా తొలి క్రియాశీల సభ్యుడిగా మోదీ



దిల్లీ: భాజపా తొలి క్రియాశీల సభ్యుడిగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిలిచారు. ఆ పార్టీ బుధవారం చేపట్టిన 'సక్రియ సదస్యతా అభియాన్(ఎస్ఎస్ఏ)' కార్యక్రమాన్ని ఆరంభించిన మోదీ మొదటి క్రియాశీల సభ్యత్వాన్ని తీసుకున్నారు. భాజపా అధ్యక్షుడు జె.పి.నడ్డా, ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీ సంస్థాగత ఎన్నికల్లో మండల కమిటీ, ఆపై స్థాయిల్లో పోటీ చేసేందుకు క్రియాశీల సభ్యులకే అవకాశం ఉంటుంది.



పెట్రోల్ ట్యాంకర్ పేలి 140 మంది దుర్మరణం

నైజీరియాలో ఘటన

అబుజా: నైజీరియాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. పెట్రోల్ ట్యాంకర్ పేలి 140 మందికి పైగా మృతిచెందారు. వీరిలో చిన్నారులు కూడా ఉన్నట్లు బుధవారం అధికారులు వెల్లడించారు. మరో డజను మందికి పైగా తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. కానో రాష్ట్రం నుంచి బయల్దేరిన ట్యాంకర్ జిగావా రాష్ట్రంలోని మజియా పట్టణంలో అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. హైవేపై ప్రయాణిస్తున్న సమయంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదం గురించి తెలుసుకున్న స్థానికులు భారీగా ఘటనాస్థలానికి చేరుకుని పెట్రోలును సంపుకునేందుకు యత్నించారు. ఈ సమయంలోనే మంటలు చెలరేగడంతో ట్యాంకర్ పేలింది.

తప్పుల నుంచి నేర్చుకోండి



తప్పులు చేయకుండా ఉండటానికి ఏకైక మార్గం కొత్త అలోచనలు చేయకపోవడమే. కొత్తగా ప్రయత్నించనివారు పొరపాట్లు చేయవపోవచ్చు. కానీ వారు ఎలాంటి ఎదుగుదల లేకుండా ఉన్నచోటనే ఉండిపోతారు. తప్పుల నుంచి నేర్చుకోనివారిదీ అదే పరిస్థితి. అందుకే తప్పులను గురువులుగా భావించండి. వాటి నుంచి కొత్త విషయాలను నేర్చుకోండి.

– నావల్ రవికాంత్, వ్యాపారవేత్త

సరిహద్దుల్లో ఉగ్రవాదం ఉంటే సత్సంబంధాలెలా?

- ఎస్‌సీవో సదస్సులో పాక్‌కు పరోక్షంగా భారత్ చురకలు



పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్‌తో జైశంకర్

ఇస్లామాబాద్: సరిహద్దుల్లో ఉగ్రవాదం, తీవ్రవాదం, వేర్పాటువాదం వంటి దుష్టశక్తులు ఉన్నప్పుడు ఇరుగు పొరుగు దేశాల మధ్య సత్సంబంధాలు నెలకొనవని భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ ఉద్ఘాటించారు. ప్రజా, వాణిజ్య సంబంధాలతోపాటు అనుసంధానతను అవి అడ్డంకులుగా మారుతాయని పేర్కొన్నారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో బుధవారం షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సభ్య దేశాల ప్రభుత్వాధినేతల సదస్సులో.. పరోక్షంగా పాక్‌కు చురకలంటిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పరస్పర గౌరవం, సార్వభౌమత్వ సమానత ఉన్నప్పుడే దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారం సాధ్యమవుతుందన్నారు. ఎస్‌సీవో సభ్య దేశాల మధ్య పరస్పర విశ్వాసం, స్నేహం బలపడాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. పాక్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో భారత బృందానికి జైశంకర్ నేతృత్వం వహించారు. చైనా ప్రధాని లీ కియాంగ్, రష్యా ప్రధానమంత్రి మిఖైల్ మిషుస్తిన్, బెలారస్ ప్రధాని రోమన్ గోలోవ్‌చెంకో తదితరులు పాల్గొన్నారు. షరీఫ్ ప్రారంభోపన్యాసం చేసిన వెంటనే జైశంకర్ ప్రసంగించారు.

ఆత్మావలోకనం చేసుకోండి

పాక్ పేరును నేరుగా ప్రస్తావించకుండా.. పరోక్షంగా ఆ దేశాన్ని ఉద్దేశించి సదస్సులో జైశంకర్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. "పొరుగు దేశంతో సత్సంబంధాలు లేకపోతే ఆత్మావలోకనం చేసుకోవాలి. వాటికి విశ్వాసం లోపించడానికి కారణాలను నిజాయతీగా విశ్లేషించుకోవాలి" అని పేర్కొన్నారు. అనుసంధాన ప్రాజెక్టులు ఇతర దేశాల సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతలను గౌరవించేలా ఉండాలని సూచించారు. ప్రాంతీయ సహకారానికి తీవ్ర అడ్డంకులుగా మారుతున్న ఉగ్రవాదం, తీవ్రవాదం వంటి దుష్టశక్తులను కలిసికట్టుగా అంతం చేయాలని భారత్ తరఫున పిలుపునిచ్చారు. ఐక్యరాజ్య సమితి భద్రతామండలి మరింత పారదర్శకంగా, సమ్మిళితంగా ఉండేలా సంస్కరణలు చేపట్టవలసిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. అందుకోసం ఎస్‌సీవో ముందుండి గళమెత్తాలన్నారు.

బీఆర్ఐని మళ్లీ వ్యతిరేకించిన భారత్

చైనా ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ (బీఆర్ఐ)ను ఎస్‌సీవో వేదికగా భారత్ మరోసారి వ్యతిరేకించింది. ఎస్‌సీవోలో ఆ ప్రాజెక్టుకు మద్దతివ్వని ఏకైక దేశం భారతే కావడం గమనార్హం. బీఆర్ఐకి రష్యా, బెలారస్, ఇరాన్, కజకిస్థాన్, కిర్గిజిస్థాన్, పాకిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్ తమ మద్దతును పునరుద్ఘాటించాయంటూ ఇస్లామాబాద్‌లో ఎస్‌సీవో సదస్సు ముగిసిన అనంతరం సంయుక్త ప్రకటన వెలువడింది. బీఆర్ఐలో భాగంగా తలపెట్టిన చైనా-పాకిస్థాన్ ఆర్థిక నడవా (సీపెక్) ప్రాజెక్టు పాక్ ఆక్రమిత కశ్మీర్ మీదుగా వెళ్తుండటంతో దాన్ని భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సంగతి గమనార్హం. బీఆర్ఐ వంటి అనుసంధాన ప్రాజెక్టులను రాజకీయ కోణంలో చూడొద్దని బీజింగ్ దృష్టిలో పెట్టుకుని ఎస్‌సీవో తాజా సదస్సులో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ వ్యాఖ్యానించారు. ఎస్‌సీవో సభ్యదేశాల ప్రభుత్వాధినేతల తదుపరి సదస్సు వచ్చే ఏడాది రష్యాలో జరగనుంది.

జమ్మూకశ్మీర్ సీఎంగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణం



ఒమర్ ప్రమాణ కార్యక్రమంలో పాల్గొన్న డి.రాజా, అఖిలేశ్, రాహుల్, ఫరూక్ అబ్దుల్లా, ప్రియాంకాగాంధీ

శ్రీనగర్: కేంద్రపాలిత ప్రాంతంగా మారిన జమ్మూకశ్మీర్ తొలి ముఖ్యమంత్రిగా నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) నాయకుడు ఒమర్ అబ్దుల్లా(54) ప్రమాణం చేశారు. బుధవారం శ్రీనగర్‌లోని 'షేర్-ఎ-కశ్మీర్ కన్వెన్షన్ సెంటర్‌'లో జరిగిన కార్యక్రమంలో ఆయనతో పాటు.. మరో ఐదుగురు మంత్రులతోనూ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ప్రమాణం చేయించారు. ఇందులో ఉపముఖ్యమంత్రి సురీందర్ చౌదరి కూడా ఉన్నారు. ఎన్నికల్లో ఎన్‌సీతో కలిసి పోటీచేసిన కాంగ్రెస్.. ప్రభుత్వంలో చేరలేదు. ప్రస్తుతానికి బయటి నుంచే మద్దతివ్వాలని నిర్ణయించింది. జమ్మూకశ్మీర్ సీఎంగా పగ్గాలు చేపట్టడం అబ్దుల్లాకు ఇది రెండో సారి. జమ్మూకశ్మీర్ పూర్తిస్థాయి రాష్ట్రంగా ఉన్నప్పుడు 2009 నుంచి 2014 వరకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2019లో అధికరణం 370తో పాటు.. జమ్మూకశ్మీర్ రాష్ట్రహోదాను కేంద్రం రద్దు చేసిన సంగతి తెలిసిందే. కేంద్రపాలిత ప్రాంతంగా మారిన తర్వాత తొలిసారి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్‌సీ-కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. 90 స్థానాల శాసనసభలో ఎన్‌సీ 42 సీట్లలో, కాంగ్రెస్ 6 స్థానాల్లో నెగ్గింది. అబ్దుల్లా కుటుంబం నుంచి సీఎంగా పగ్గాలు చేపట్టిన మూడో వ్యక్తి ఒమర్ అబ్దుల్లా. తాత షేక్ అబ్దుల్లా, తండ్రి ఫరూక్ అబ్దుల్లా కూడా గతంలో సీఎంగా విధులు నిర్వహించారు. ప్రమాణస్వీకార కార్యక్రమానికి లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ, పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, డీఎంకే ఎంపీ కనిమొళి కరుణానిధి, ఆప్ నేత సంజయ్ సింగ్, ఎన్‌సీపీ(ఎస్‌పీ) ఎంపీ సుప్రియా సూలే, సీపీఐ నేత డి.రాజా హాజరయ్యారు. అబ్దుల్లాను ప్రధాని మోదీ అభినందించారు. జమ్మూకశ్మీర్ ప్రగతి కోసం అబ్దుల్లాతోనూ.. ఆతని బృందంతోనూ కేంద్రం సన్నిహితంగా పనిచేస్తుందని పేర్కొన్నారు.

ఇరాన్‌పై దాడికి అంతా సిద్ధం

- నెతన్యాహుకు ఐడీఎఫ్ పూర్తిస్థాయి నివేదిక

టెల్ అవీవ్: ఇరాన్ తమపై చేసిన బాలిస్టిక్ క్షిపణుల దాడికి ప్రతీకారం తీర్చుకోవడానికి ఇజ్రాయెల్ సన్నద్ధమైంది. చివరి క్షణంలో ఏమైనా మార్పులు చేస్తేనే జరిగితే తప్ప.. ఇరాన్‌లో ఏయే లక్ష్యాలను ధ్వంసం చేయాలన్న అంశంపై ఇప్పటికే ఒక స్పష్టమైన నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు లక్ష్యాల జాబితాను ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్).. ప్రధాని నెతన్యాహు, రక్షణ మంత్రి యోవ్ గలాంట్‌కు సమర్పించినట్లు చానెల్ 12 న్యూస్ పేర్కొంది. "లక్ష్యాలు స్పష్టంగా ఉన్నాయి. ఎప్పుడు దాడి చేయాలన్నదే నిర్ణయం కావాలి" అని కాన్ పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్ కూడా ఓ కథనం ప్రచురించింది. లక్ష్యాల పూర్తి జాబితాను అమెరికాకు ఇవ్వలేదు. సమాచారాన్నైతే అగ్రరాజ్యంతో ఇజ్రాయెల్ పంచుకున్నట్లు పేర్కొంది. చివరి నిమిషంలో లక్ష్యాలు మారే అవకాశాలూ తోసిపుచ్చలేమని తెలిపింది. అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరిగే నవంబరు 5కు ముందు ఏ క్షణాన్నైనా ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేయొచ్చని అగ్రరాజ్య అధికారి వర్గాలు పేర్కొంటున్నాయి.

లెబనాన్‌పై భీకర దాడులు

మేయర్ సహా 25 మంది మృతి

బీరుట్: లెబనాన్‌పై దాడుల విషయంలో ఇజ్రాయెల్ వెనక్కి తగ్గడం లేదు. తమ రాజధానిపై టెల్ అవీవ్ దాడి చేయదని అమెరికా తమకు హామీ ఇచ్చిందని లెబనాన్ ప్రధాని నజీబ్ మికాటీ పేర్కొన్న 24 గంటల్లోనే.. బీరుట్‌పై బాంబుల వర్షం కురిసింది. దక్షిణ లెబనాన్‌లో 25 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇందులో నబాటియా నగర మేయర్ కూడా ఉన్నారు.

ఆ సాహసం చేయొద్దు: ఇరాన్

ఇజ్రాయెల్ తమపై దాడి చేస్తే.. తమ స్పందన తీవ్రంగా ఉంటుందని ఇరాన్ పేర్కొంది. ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్‌తో ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా లెబనాన్, గాజాలకు మానవతా సాయం వెళ్లకుండా ఇజ్రాయెల్ చేస్తున్న నేరాలకు ఐరాస అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేశారు.

హరియాణా భాజపా శాసనసభాపక్ష నేతగా సైనీ

చండీగఢ్: హరియాణా భాజపా శాసనసభాపక్ష నేతగా నాయబ్ సింగ్ సైనీ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవలి ఎన్నికల్లో పార్టీని ముందుండి నడిపించిన ఆయనకే మరోసారి పార్టీ బాధ్యతలను అప్పగించింది. దీంతో గురువారం ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. పంచకులలో బుధవారం సమావేశమైన ఎమ్మెల్యేలు సైనీని శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాతోపాటు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ పరిశీలకులుగా హాజరయ్యారు. సైనీ చండీగఢ్‌లోని రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ దత్తాత్రేయను కలిశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అనుమతివ్వాలని కోరారు. గురువారం జరిగే సైనీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీతోపాటు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ హాజరు కానున్నారు.



సైనీని అభినందిస్తున్న అమిత్ షా

కామన్ సివిల్‌కోడ్ అనడం మేలు

- విస్తృత చర్చలతో పౌర స్మృతి తయారుచేయాలి
- జమిలి ఎన్నికలను స్వాగతిస్తున్నా: వెంకయ్యనాయుడు




ఈనాడు, దిల్లీ: దేశంలో అన్ని మతాలకూ ఒకేలా వర్తించే పౌర స్మృతి ఉండటం మంచిదేనని, దానికి 'యూనిఫాం సివిల్ కోడ్' అని కాకుండా 'కామన్ సివిల్ కోడ్' గా నామకరణం చేస్తే బాగుంటుందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. యూనిఫాం సివిల్ కోడ్‌గా పిలిస్తే అన్ని మతాలు విధానాలు ఏకం చేస్తున్నారేమోనన్న అపోహ తలెత్తే అవకాశం ఉంటుందని, కామన్ సివిల్‌కోడ్‌గా పిలిస్తే ఒకే విధానాన్ని అందరికీ సమానంగా వర్తింపజేస్తున్నారన్న అర్థం వస్తుందని చెప్పారు. ఆయన బుధవారం దిల్లీలో విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. వివాహం, విడాకులు, వారసత్వ విషయాల్లో అన్ని మతాలకూ ఒకే విధానం ఉండటం మంచిదని అభిప్రాయపడ్డారు. వివిధ మతాల్లో మంచి పద్ధతులను ఎంచుకొని, వాటిపై విస్తృత సంప్రదింపులు జరిపి అందరికీ ఒకేలా వర్తింపజేయాలన్నారు. వివాహం, విడాకులు, వారసత్వ విషయాల్లో అందరికీ ఒకేరకమైన చట్టం వర్తింపజేయడంవల్ల మహిళలకు న్యాయం జరుగుతుందన్నారు. మతం పేరుతో వాటిపై వివక్ష చూపడం మంచిది కాదని అభిప్రాయపడ్డారు.

ఏకకాల ఎన్నికలతో అభివృద్ధికి ఊతం

దేశంలో ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న విధానాన్ని తాను సమర్థిస్తున్నట్లు వెంకయ్యనాయుడు చెప్పారు. దీనివల్ల ప్రజలకు మేలు జరుగుతుందని, ప్రభుత్వాలు ఆటంకం లేకుండా అభివృద్ధి కొనసాగించడానికి వీలవుతుందన్నారు. ఏ రాజకీయపార్టీ కూడా దీన్ని వ్యతిరేకించరాదని అభిప్రాయపడ్డారు. కేంద్రంలో, రాష్ట్రాల్లో ఇప్పటిలాగే ప్రభుత్వాలు ఏర్పడటం కాకుండా ప్రజలకు సమగ్ర, సుస్థిర సమ్మతి ఉండాలన్నారు. ప్రభుత్వాలు... లేవన్నారు. జమిలి ఎన్నికలతో అయిదేళ్లకోసారి పార్లమెంటు నుంచి పంచాయతీ వరకు తప్పనిసరిగా ఎన్నికలు జరుగుతాయని అభిప్రాయపడ్డారు.

నిందితులపై చర్యలకు అలసత్వం ఎందుకు?

- పంజాబ్, హరియాణా ప్రభుత్వాలకు సుప్రీం చీవాట్లు
- పంటల వ్యర్థాల దహనాన్ని అడ్డుకోకపోవడంపై ఆగ్రహం



దిల్లీ: దేశరాజధాని దిల్లీని ఉక్కిరిబిక్కిరి చేస్తోన్న వాయు కాలుష్యం కట్టడిలో పంజాబ్, హరియాణా ప్రభుత్వాల నిర్లక్ష్యం వహిస్తున్నాయంటూ సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పంటల వ్యర్థాల దహనానికి పాల్పడుతూ నిబంధనలను ఉల్లంఘిస్తున్న వారిని ఎందుకు ఉపేక్షిస్తున్నారని నిలదీసింది. ఆ రెండు రాష్ట్రాల అధికారులను మంద బుద్ధితో వ్యవహరిస్తున్నారంటూ చీవాట్లు పెట్టింది. నిందితులను చట్టం ముందుకు తీసుకురావడంలో విఫలమైన అధికారులను శిక్షించేలా చర్యలు తీసుకోవాలని వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం)ను జస్టిస్ అభయ్ ఎస్.ఓక్, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశించింది. ఈ నెల 23న జరిగే విచారణకు రెండు రాష్ట్రాల సీఎస్‌లు హాజరై వివరణ ఇవ్వాలని స్పష్టంచేసింది. పంటల వ్యర్థాల దహనాన్ని నిలిపివేయటానికి తీసుకోవాల్సిన చర్యలను సూచిస్తూ సీఏక్యూఎం 2021లో జారీ చేసిన మార్గదర్శకాలను పంజాబ్, హరియాణా రాష్ట్రాలు ఏమాత్రం పాటించకపోవడంపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. 'ఇదేమీ రాజకీయాలతో ముడిపడిన వ్యవహారం కాదు. నిందితులపై చర్యలు తీసుకోవడంలో జంకు ఎందుకు? ఎక్కడ వ్యర్థాల దహనం జరుగుతుందనే ఇస్రో మీకు సమాచారం అందిస్తోంది. అయినప్పటికీ ఆ ప్రాంతాల జాడ తెలియడంలేదని చెబుతున్నారు' అంటూ ధర్మాసనం ఆక్షేపించింది.

పింఛనుదారుల ఫిర్యాదులను 21 రోజుల్లో పరిష్కరించేందుకు కృషిచేయండి

అన్ని విభాగాలకు కేంద్రం ఆదేశం

దిల్లీ: పింఛనుదారుల నుంచి అందే ఫిర్యాదులను 21 రోజుల్లోగా పరిష్కరించేందుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వం తన పరిధిలోని అన్ని విభాగాలను ఆదేశించింది. ఏదైనా ఫిర్యాదు పరిష్కారానికి అంతకంటే ఎక్కువ సమయం పట్టేలా ఉంటే.. మధ్యంతర స్పందనను ఫిర్యాదుదారులకు తెలియజేయాలని సూచించింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 'కేంద్రీకృత పింఛను ఫిర్యాదుల పరిష్కార, పర్యవేక్షణ వ్యవస్థ' పోర్టల్ ప్రభావాన్ని సమీక్షించిన అనంతరం కేంద్రం బుధవారం ఈ మేరకు సమగ్ర మార్గదర్శకాలను విడుదల చేసింది.

మహారాష్ట్రలో 62 సీట్లకు కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక

20న కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ తర్వాత అధికారిక ప్రకటన

దిల్లీ: మహారాష్ట్రలో 62 సీట్లలో పోటీ చేయనున్న అభ్యర్థుల పేర్లను కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ ఎంపిక చేసింది. ఈ నెల 20న కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో ఈ జాబితాను పరిశీలించిన అనంతరం అధికారికంగా అభ్యర్థుల పేర్లను పార్టీ ప్రకటించనుంది. నాందేడ్ లోక్‌సభ స్థానానికి రవీంద్ర చవాన్ ఒక్కరి పేరునే స్క్రీనింగ్ కమిటీ సిఫార్సు చేసింది. ఇటీవల మరణించిన ఎంపీ వసంతరావ్ చవాన్ కుమారుడే రవీంద్ర. బుధవారం మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే ఈ వివరాలను వెల్లడించారు. మహా వికాస్ అఘాడీలో సీట్లసర్దుబాటుపై సమస్యలేవీ లేవన్నారు.

ఆ బెదిరింపులు కుర్ర చేష్ట

ముంబయి విమానాలకు బాంబు హెచ్చరికల ఘటనలో నిందితుడు మైనర్

ముంబయి, దిల్లీ: ముంబయి నుంచి బయలుదేరిన విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చిన ఘటనలో నిందితుడు ఓ బాలుడని తేలింది. ఆతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. విమానాలకు భద్రతా ముప్పు ఉందంటూ పోస్టులు పెట్టిన ఘటనలో కేసు నమోదు చేసిన పోలీసులు వాటి మూలాల ఛత్తీస్‌గఢ్ నుంచి ఉన్నట్లు గుర్తించారు. ఓ వ్యాపారవేత్త కుమారుడు (17) సోషల్ మీడియాలో ఈ పోస్టులు పెట్టినట్లు కనుగొన్నారు. ఈ కేసులో ఆ వ్యాపారవేత్తకు సమన్లు పంపించిన పోలీసులు.. మైనర్‌ను అదుపులోకి తీసుకుని ముంబయి తరలించారు. నగదు విషయంలో గొడవ పడిన ఓ స్నేహితుడిని ఇరికించేందుకు ఆ బాలుడు ఇలాంటి చేసినట్లు తెలుస్తోంది. గడిచిన మూడు రోజుల్లో మొత్తంగా 19 విమానాలకు భద్రతా ముప్పును ఎదుర్కొన్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. బెదిరింపుల నకిలీవేనని వెల్లడైనప్పటికీ.. వాటిని ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోందని రామ్మోహన్‌నాయుడు తెలిపారు. సంబంధిత సంస్థలు ఆయా కేసులపై ముమ్మర దర్యాప్తు చేస్తున్నాయని అన్నారు.

మరో 7 విమానాలకు..

బుధవారం మొత్తం 7 విమానాలకు బాంబు బెదిరింపులొచ్చాయి. దీంతో పలు విమానాలు ఆలస్యంగా నడిచాయి. మరికొన్ని దారి మళ్లాయి. ఇండిగోకు చెందిన రియాద్-ముంబయి విమానాన్ని బుధవారం ఉదయం వచ్చిన బెదిరింపుతో మస్కట్‌కు దారి మళ్లించారు. ఆక్కడ విమానాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన సురక్షితంగా ల్యాండయినట్లు ప్రయాణికులందరినీ క్షేమంగా దించినట్లు విమానయాన సంస్థ వెల్లడించింది. మరో ఘటనలో దిల్లీ నుంచి 180 మందితో బుధవారం మధ్యాహ్నం బెంగళూరు బయలుదేరిన ఆకాశ ఎయిర్‌కు చెందిన విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో ఆ విమానాన్ని వెనక్కి మళ్లించి దిల్లీ విమానాశ్రయంలో సురక్షితంగా దించారు. విమానంలో బాంబు బెదిరింపులు రావడంపై దిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇదిలా ఉంటే.. పౌర విమానాలకు ఈ తరహా బెదిరింపులు రావడం ఆమోదయోగ్యం కాదని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మ్యాథ్యూ మిల్లర్ అన్నారు.

మహారాష్ట్రలో జరాంగే ఫీవర్!

ఆయన మద్దతు కోసం పార్టీల క్యూ • మరాఠా కోటా ఉద్యమ నేతకు పలు

ముంబయి: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో ఒక్కసారిగా రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. స్థానిక అంశాలకు అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువగా ప్రాధాన్యం ఉండటంతో వాటిపై పార్టీలు దృష్టి సారించాయి. ఈసారి ఎన్నికల్లో అత్యంత ప్రభావం చూపించే అంశాల్లో మరాఠా కోటా ఒకటి. దీంతో ఆ కోటా ఉద్యమనేత మనోజ్ జరాంగేపై పార్టీలు కన్నేశాయి. ఆయన మద్దతు కోసం ప్రయత్నిస్తున్నాయి.



ఎవరీ జరాంగే..

గత ఏడాది వరకూ మనోజ్ జరాంగే గురించి పెద్దగా ఎవరికీ తెలియదు. గత ఏడాది సెప్టెంబరులో మరాఠా కోటా కోసం ఆందోళన ప్రారంభించడంతో ఆయన పేరు మార్మోగింది. ఓబీసీ కోటాలో మరాఠాలకు రిజర్వేషన్లను అమలు చేయాలంటే డిమాండుతో ఆయన చేపట్టిన ఉద్యమం తీవ్ర రూపు దాల్చింది. మరాఠ్వాడా ప్రాంతంలోని జాల్నా జిల్లా అంతర్‌వాలీ సరాటీలో ఆయన 6 సార్లు నిరాహార దీక్ష చేశారు. దీంతో మరాఠా రిజర్వేషన్ల ఉద్యమ నేతగా ఆయన ఎదిగారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపా నేతృత్వంలోని కూటమి వెనుకబడటానికి మరాఠా కోటా కూడా ఒక కారణం. అసెంబ్లీ ఎన్నికల్లోనూ కోటాను సమర్థించిన వారికే మద్దతివ్వనున్నట్లు జరాంగే స్పష్టం చేశారు.

నేతల భేటీలు

అసెంబ్లీ ఎన్నికలు రావడంతో జరాంగేను పలు పార్టీల నేతలు కలుస్తున్నారు. మరాఠ్వాడా ప్రాంతంలో ప్రభావం చూపే వారిని కలిసి సానుభూతి పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు జరాంగేతో భేటీ అయ్యారు. గత ఆగస్టులో జరాంగేతో భాజపా నేత కిరణ్ మోర్వా ఉపాధ్యక్షుడు రమేశ్ పోకలే సమావేశమయ్యారు. పరిశ్రమల శాఖ మంత్రి ఉదయ్ సామంత్, మరో మంత్రి అబ్దుల్ సత్తార్, ఎంఐఎం నేత ఇంతియాజ్ జలీల్ తదితరులు జరాంగేతో భేటీ అయి మద్దతు కోరారు. జరాంగేను కలిసిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నేత పృథ్వీరాజ్ చవాన్, ఎమ్మెల్యే ధీరజ్ దేశ్‌ముఖ్ ఉన్నారు.

వీవీపీల భద్రతా విధుల నుంచి

ఎన్ఎస్‌జీ కమాండోల ఉపసంహరణ

- ఇకపై ఆ బాధ్యతలు సీఆర్‌పీఎఫ్‌కు..
- కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు

దిల్లీ: వీవీఐపీల భద్రతా విధుల నుంచి నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జీ) కమాండోలను పూర్తిగా ఉపసంహరించుకుంటూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. భద్రతవరంగా అత్యధిక ముప్పు పొంచి ఉన్న 9 మంది వీవీపీల వద్ద ప్రస్తుతం వారు విధుల్లో ఉన్నారు. వచ్చే నెల రోజుల్లోగా కేంద్ర రిజర్వు పోలీసు దళానికి (సీఆర్‌పీఎఫ్) ఆయా ప్రముఖుల భద్రతా బాధ్యతను అప్పగించనున్నారు. వారు వెనుదిరగనున్నారు. అధికార వర్గాలు బుధవారం ఈ మేరకు కీలక విషయాలను వెల్లడించాయి. ఉగ్రవాదులపై పోరాడటంలో ఎన్ఎస్‌జీ కమాండోలు నిష్ణాతులు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం భాజపా అగ్రనేత ఎల్.కె.ఆద్వాణీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, బీఎస్పీ అధినాయకురాలు మాయావతి, కేంద్ర నౌకాయాన శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్, ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి రమణ్ సింగ్, జమ్మూకశ్మీర్ మాజీ సీఎం గులాంనబీ ఆజాద్, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లాలకు 'జడ్ ప్లస్' కేటగిరీ భద్రత కల్పిస్తున్నారు.



2012 నుంచే యోచన!

ఏకకాలంలో దేశవ్యాప్తంగా ఎక్కువ చోట్ల ఉగ్రదాడులు చోటుచేసుకుంటే.. ఉగ్రవాదులపై పోరుకు ఎన్ఎస్‌జీ కమాండోల కొరత ఎదురయ్యే అవకాశం ఉంది. అందుకే వారిని వీవీపీల భద్రతా విధుల నుంచి ఉపసంహరించుకోవాలన్న ప్రతిపాదన 2012 నుంచీ ఉన్నాయి. వాటిని ప్రస్తుతం మోదీ సర్కారు ఆచరణలోకి తెచ్చింది. తాజా నిర్ణయంతో దాదాపు 450 మంది బ్లాక్ క్యాట్ కమాండోలు వీవీపీ భద్రతా విధుల నుంచి వెనుదిరగనున్నారు.

సీఆర్‌పీఎఫ్‌కు మరో బెటాలియన్ మంజూరు

ప్రస్తుతం సీఆర్‌పీఎఫ్‌లో వీవీపీ భద్రత బెటాలియన్లు ఆరు ఉన్నాయి. ఎన్ఎస్‌జీ కమాండోల ఉపసంహరణతో అదనంగా మరో 9 మంది వీవీపీలకు భద్రత కల్పించాల్సి ఉంటుంది కాబట్టి.. దానికి ఏడో బెటాలియన్‌ను కేంద్రం మంజూరు చేసింది.



'జన్ సంపర్క్' కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆప్

మరోసారి ముఖ్యమంత్రిని చేయండని ప్రజలను కోరిన కేజ్రీవాల్

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ 'జన్ సంపర్క్' ప్రచారాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మరోసారి తనకే ముఖ్యమంత్రి పగ్గాలప్పగించాలని ఓటర్లను కోరారు. తన అరెస్టుపై దిల్లీ ప్రజలకు వాస్తవాలు తెలుపుతున్నాయని.. వాటికి సమాధానాలు నిజాలను ప్రస్తావిస్తూ తాను ఓ లేఖను రాసినట్లు వెల్లడించారు. అక్టోబరు 29 వరకూ కొనసాగనున్న 'జన్ సంపర్క్' ప్రచారంలో భాగంగా దిల్లీలో ఇంటింటికీ వెళ్లి ఆప్ కార్యకర్తలు ఆ లేఖను ప్రజలకు అందించనున్నట్లు తెలిపారు. పంజాబ్‌లో తాము అధికారం చేపట్టాక.. దిల్లీలో అభివృద్ధి పనులను ఆపుకుంటూ భాజపా దేశవ్యాప్తంగా ఆప్ అధికారంలోకి వస్తుందని భయపడి భాజపా తనను జైలుకు పంపిందని కేజ్రీవాల్ ఆరోపించారు. జైలులో ఇన్సులిన్ ఇవ్వకుండా తనను చంపేందుకు కుట్రపన్నిందని అన్నారు. దిల్లీలో భాజపా అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్, నీటి సరఫరా వంటి కార్యక్రమాలు ఆగిపోతాయని ప్రజలను హెచ్చరించారు.

అత్యవసరంగా ల్యాండైన సీఈసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్



పిథోరాగఢ్: కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) రాజీవ్ కుమార్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ బుధవారం ఉత్తరాఖండ్‌లో ఓ గ్రామంలో అత్యవసరంగా ల్యాండైంది. హిమాలయాల సమీపంలోని మిలామ్ గ్లేసియర్‌కు వెళుతున్న ఈ హెలికాప్టర్.. అననుకూల వాతావరణం కారణంగా మున్సియారీలోని రాలామ్ గ్రామంలో దిగాల్సివచ్చిందని అధికారులు తెలిపారు. హెలికాప్టర్‌లో సీఈసీ రాజీవ్‌కుమార్‌తో పాటు.. ఉత్తరాఖండ్ అదనపు ప్రధాన ఎన్నికల అధికారి విజయ్‌కుమార్ కూడా ఉన్నారు. అందరూ సురక్షితంగా ఉన్నారని అధికారులు తెలిపారు.

సిడ్నీ బీచ్‌లో నల్ల బంతులు

ఇంటర్నెట్ డెస్క్: ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ఓ వింత ఘటన వెలుగు చూసింది. సిడ్నీలోని కొన్ని ప్రసిద్ధి చెందిన బీచ్‌లలో నల్ల బంతులు కనిపించాయి. నిత్యం పర్యటకులతో రద్దీగా ఉండే కూగీ బీచ్‌లో అనుమానాస్పదంగా నల్ల బంతులు కనిపించాయని రాండ్‌విక్ సిటీ కౌన్సిల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇవి గోల్ఫ్ బంతి ఆడే సైజులో ఉన్నాయని తెలిపారు. ఈ బంతులు ఏంటి, ఎలా వచ్చాయి వంటి విషయాలు తెలియనప్పటికీ.. ఆస్ట్రేలియన్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు గోర్డాన్స్ బే వద్ద మరిన్ని బంతులు కనిపించాయి. ఇది పిషింగ్‌కు ప్రసిద్ధి చెందిన ఆక్వాటిక్ రిజర్వ్. వింతైన బంతులు కనిపించడంతో ఆ రెండు



బీచ్‌లను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు సీగల్స్ ఈ నల్ల బంతులను తింటూ ఉంటాయని, వాటిని పొరపాటున తినకుండా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారని వెల్లడించారు. అవి తారు బంతుల్లా ఉన్నాయని, కొవ్వు, నూనె వంటి పదార్థాలతో కూడినవని అనుమానిస్తున్నారు. సముద్రం నీటితో ఈ బంతులు ఏర్పడి ఉంటాయని భావిస్తున్నారు.

పవనన్నే రోడ్లు అభివృద్ధి చేస్తారు

స్థాయీ సంఘాల సమావేశంలో జడ్పీ ఛైర్‌పర్సన్ హారిక ఆసక్తికర వ్యాఖ్యలు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

★ ప్రజాప్రతినిధులుగా గెలిచామన్న మాటే కానీ మా పరిధిలో ఏమీ అభివృద్ధి చేయలేకపోతున్నాం.

-ఇదీ జడ్పీ ఛైర్‌పర్సన్ వద్ద కొందరు జడ్పీటీసీ సభ్యుల ఆవేదన.

★ 'డోలు వచ్చి మద్దెలకు మొరపెట్టుకున్నట్లుగా ఉంది పరిస్థితి. ఏం చేస్తాం. కానీ ఉప ముఖ్యమంత్రి పవనన్న మాత్రం గ్రామాల్లో రోడ్లు అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకున్నారు.



మాట్లాడుతున్న హారిక, వైస్‌ఛైర్‌పర్సన్ శ్రీదేవి

ఎవరైనా ఏంటి అభివృద్ధి జరుగుతుందనుకోవద్దు మేనంటూ జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక అనడంతో సభ్యులు ఆసక్తిగా ఆలకించారు. బుధవారం మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్థాయి సంఘాల సమావేశంలో వివిధ శాఖల అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష సందర్భంగా జరిగిన సంభాషణలివి.

★ ధాన్యం కొనుగోళ్లపై సమీక్షిస్తున్న సమయంలో 'ఈసారి రైతులే తమకు నచ్చినట్లు ధాన్యం విక్రయించుకునేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. దీనిపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామ'ని సివిల్ సప్లయిస్ అధికారులు చెప్పారు. ఆ సమయంలో హారిక మాట్లాడుతూ 'ఇంకా అవగాహన ఏముంది. రైతులు తమకు నచ్చినచోట ధాన్యాన్ని అమ్ముకుంటారు. ధాన్యం విక్రయాల్లో వివిధ రకాల నిబంధనల కారణంగానే కదా ఇలా కుర్చోవాల్సి వస్తోంది' అనడంపై పలువురు వివిధ రకాలుగా చర్చించుకున్నారు.

ప్రొటోకాల్ పాటించకుంటే ఎలా

ప్రభుత్వ పథకాల గురించి స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని, అర్హులైన ప్రజలందరికీ అవి చేరేలా కృషి చేయాలని జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ గరికపాటి శ్రీదేవి అధికారులకు సూచించారు. తమ ప్రాతినిధ్యం వహించే ప్రాంతాల్లో చేపట్టే కార్యక్రమాల సమాచారం కూడా అధికారులు తమకు ఇవ్వడం లేదని కొందరు ప్రజాప్రతినిధులు సమావేశంలో ఆమె దృష్టికి తీసుకొచ్చారు. జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ గరికపాటి శ్రీదేవి మాట్లాడుతూ తమ మండల పరిధిలో వరద కారణంగా అపారనష్టం జరిగిందని, ఎంత మందికి పరిహారం వచ్చిందో తెలియడంలేదన్నారు. దీనిపై ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయశాఖాధికారి మాట్లాడుతూ వెంటనే సమాచారం అందించేలా మండల స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు కోరుకునేది గౌరవమేనని.. ప్రొటోకాల్ పాటించకుంటే ఎలా అంటూ జడ్పీ ఛైర్‌పర్సన్ హారిక ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసారి పునరావృతమైతే షోకాజ్ నోటీసు జారీ చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ చొరవతో వరద నివారణ

బుడమేరు వరద కారణంగా విజయవాడలో వివిధ ప్రాంతాల్లో పీకల్లోతు నీళ్లు నిలబడిపోయాయని, అలాంటి సమయంలో కూడా ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం చొరవతో ప్రతి ఇంటికీ వివిధ రకాల మందులతో కిట్లు పంపించామని ఎన్టీఆర్ జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి సుహాసిని అన్నారు. మచిలీపట్నంలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి 30వేల కిట్లు అందించామని కృష్ణా జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి ఎం.గీతాబాయి తెలిపారు. దీనిపై జడ్పీఛైర్‌పర్సన్‌తో పాటు సభ్యులు చప్పట్లుచరుస్తూ అధికారులను అభినందించారు.



స్త్రీ, శిశుసంక్షేమం, రక్షణ అంశంపై నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న అధికారులు

వివిధ శాఖల వారీగా సమీక్ష

విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, సాంఘిక సంక్షేమం, రక్షణ, ప్లానింగ్, ఆర్థిక తదితర అంశాలపై శాఖలవారీగా సమీక్షించారు. పలువురు సభ్యులు ఆయా విభాగాల వారీగా సమస్యలను లేవనెత్తగా సంబంధిత అధికారులు వివరణ ఇచ్చారు. గ్రామాల్లో రక్షిత తాగునీటి పథకాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయని, సమస్యలు పరిష్కరించి ప్రజలకు శుద్ధినీటిని అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జలజీవన్‌మిషన్ పథకంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇస్తున్నందున అవసరాలకు అనుగుణంగా నీటి వనరులు ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి గృహాలు మంజూరైన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా కొత్తగా గోకులాలు నిర్మిస్తున్నందున దరఖాస్తు చేసుకున్నవారందరికీ మంజూరయ్యేలా అధికారులు ప్రత్యేకంగా ప్రతిపాదనలు పంపాలన్నారు. జడ్పీ ద్వారా ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా జిల్లా పరిషత్ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల డీఎస్‌వోలు హాజరు కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. సీఈవో కన్నమనాయుడు, డిప్యూటీ సీఈవో ఆనంద్‌కుమార్, జడ్పీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

కళ.. చెదిరినది



కృష్ణా నదీ తీరం వ్యర్థాలతో నిండిపోతోంది. ముఖ్యంగా పున్నమిఘాట్ వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు నదిలో వేయడంతో భారీగా చెత్త పేరుకుపోతోంది. దసరా ఉత్సవాల్లో అమ్మ వారి విగ్రహాలను సైతం ఇక్కడే నిమజ్జనం చేశారు. - **ఈనాడు, అమరావతి**

చూడ ముచ్చట.. మూడు ఇచ్చట!


- పొట్టిపాడు నుంచి చినకాకాని వయా గోసాల
- తూర్పు బైపాస్‌కు మూడు ప్రతిపాదనలు
- ఎట్టకేలకు సవివర నివేదిక పూర్తి
- సీఎం చంద్రబాబు నిర్ణయం కోసం నిరీక్షణ


ఈనాడు - అమరావతి

విజయవాడ నగర ట్రాఫిక్ రద్దీని నియంత్రించి రింగు రోడ్డుగా మారే తూర్పు బైపాస్ నిర్మాణం అరమరిక (అలైన్‌మెంట్)పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. సవివర నివేదిక పూర్తి చేశారు. భూసేకరణ ప్రారంభించడమే తరువాయి. వచ్చే మార్చి లోపల టెండర్లు పిలిచి అప్పగించేలా సన్నాహాలు చేస్తున్నారు. మూడు ప్రతిపాదనలను కన్సల్టెన్సీ సంస్థలు రూపొందించి ఎన్‌హెచ్‌ఏఐకు అందించాయి. వీటిని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదానికి పంపినట్లు తెలిసింది. ఆయన పరిశీలించాక కేంద్రానికి పంపి ఎన్‌హెచ్‌ఏఐ టెండర్లను ఆహ్వానించనుంది. డిసెంబరులోగా టెండర్లు పిలిచే వీలుంది. డీపీఆర్ రూపొందించిన సంస్థలు రెండో ప్రతిపాదన అనువు అని సిఫార్సు చేసినట్లు తెలిసింది. డీపీఆర్‌ను 'ఈనాడు' సంపాదించింది. వివరాలు ఇవీ..

ప్రతిపాదనలు ఇవీ...

జాతీయ రహదారి-16 (చెన్నై-కోల్‌కత్తా) విస్తరణలో భాగంగా విజయవాడకు బైపాస్ రహదారి నిర్మిస్తున్నారు. ఇది నగరానికి పశ్చిమవైపు కృష్ణా నది మీదుగా వెళుతుంది. ఎన్‌హెచ్-16 విజయవాడ నగరం బెంజిసర్కిల్, మహానాడు జంక్షన్, రామవరప్పాడు మీదుగా వెళుతుంది. ట్రాఫిక్ ఎక్కువ ఉండటం.. సర్వీసు దారులూ లేకపోవడంతో ప్రమాదాలు పెరిగాయి. దీంతో రహదారి విస్తరణ కాజా నుంచి కృష్ణా నది మీదుగా గొల్లపూడి, నున్న మీదుగా చిన్నఆవుటపల్లి వరకు బైపాస్ నిర్మిస్తున్నారు. దీనికి వ్యతిరేక దిశలో ఒక బైపాస్ నిర్మిస్తే.. అనువుగా ఉంటుందని గత తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించారు. దీనికి జాతీయ రహదారుల సంస్థ అంగీకరించి, భూసేకరణ రాష్ట్ర ప్రభుత్వం భరించాలని కోరింది. తర్వాత ప్రభుత్వం మారింది. తూర్పు బైపాస్‌కు కేడీఎం, చైతన్య కన్సల్టెన్సీ సంస్థలు సవివర నివేదిక (డీపీఆర్)ను రూపొందించే బాధ్యత అప్పగించారు.





రెండో ప్రతిపాదనకు సిఫార్సు..

★ కన్సల్టెన్సీ సంస్థలు రెండో ప్రతిపాదన సిఫార్సు చేశాయి. అన్ని ప్రతిపాదనలు పొట్టిపాడు వద్ద ప్రారంభమై చినకాకాని వద్ద ఎన్‌హెచ్-16లో కలుస్తాయి. రెండు ప్రాంతాల్లోనూ జంక్షన్ నిర్మాణం సులువుగా ఉంటుందని ప్రతిపాదించాయి. రెండో ప్రతిపాదన ప్రకారం పశ్చిమ బైపాస్‌లోకి సులభంగా ప్రవేశించే వీలుంది. ★ విజయవాడ నగరానికి కొంత దూరంగా ఉండటంతో భూసేకరణ వ్యయం తగ్గే వీలుంది. నగరానికి దగ్గరగా వచ్చిన కొద్దీ భూసేకరణ వ్యయం పెరుగుతుంది.

★ విమానాశ్రయానికి దూరంగా అలైన్‌మెంట్ ఉండటంతో ఎయిర్‌పోర్టు అథారిటీ నుంచి ఎలాంటి అభ్యంతరాలు ఉండవు. ★ కృష్ణా నదిపై నిర్మించే వంతెన మొదటి, మూడో ప్రతిపాదనల కన్నా రెండో ప్రతిపాదనలో నిర్మించే దూరం (3.355కిమీ) తక్కువ. ★ బందరు పోర్టు కనెక్టివిటీకి ఎన్‌హెచ్-65 నుంచి అనుసంధానం సులభంగా ఉంటుంది. మిగిలిన తొలి, మూడు ప్రతిపాదనల కంటే రెండో ప్రతిపాదనలో వంతెనల నిర్మాణం కేవలం 8 మాత్రమే ఉంటాయి. ★ ఆర్వోబీల నిర్మాణం కూడా సులభంగా పూర్తి చేయవచ్చు.

అరమరిక ఇలా..!

తూర్పు బైపాస్ రెండు జిల్లాల్లో ఉంటుంది. కృష్ణా జిల్లాలో ఉంగుటూరు, గన్నవరం, కంకిపాడు, పెనమలూరు మండలాల మీదుగా వెళుతుంది. గుంటూరు జిల్లాలో దుగ్గిరాల మంగళగిరి మండలాల మీదుగా చినకాకాని చేరుతుంది.

★ **కృష్ణా జిల్లాలో** పొట్టిపాడు, ఆత్కూరు, పెదఆవుటపల్లి, చిన్నఆవుటపల్లి, అల్లాపురం, బుద్ధవరం, అజ్జంపూడి, కేసరపల్లి, మంతెన-1, ఉప్పులూరు, జగన్నాథపురం, మంతెన-2, పునాదిపాడు, గొడవర్రు, మద్దూరు, గోసాల, వణుకూరు మీదుగా కృష్ణా నది దాటుతుంది.

★ **గుంటూరు జిల్లాలో** పెదకొండూరు, చినపాలెం, శృంగారపురం, తుమ్మపూడి, చిలువూరు, చినవడ్లపూడి, పెదవడ్లపూడి, చినకాకాని గ్రామాల్లో భూసేకరణ చేయాలి.

★ కృష్ణా జిల్లాలో 59.036 శాతం దూరం ఉంటే.. గుంటూరు జిల్లాలో 40.964 శాతం దూరం ఉంది. మూడు ప్రతిపాదల్లో రెండో ప్రతిపాదన ఖర్చు ఎక్కువ.. రూ. 4,596.29 కోట్లు.

మల్లవల్లికి మహర్దశ..

- పాత ధర.. రూ.16.50 లక్షలకే ఎకరం
- ధరలు పెంచి వేధించిన వైకాపా ప్రభుత్వం...

ఈనాడు, అమరావతి



"వైకాపా పాలనలో నిరాదరణకు, వేధింపులకు గురైన మల్లవల్లి పారిశ్రామికవాడకు మహర్దశ పట్టనుంది. పార్కుకు పునర్జీవం కల్పించే ఏపీఐఐసీ ప్రతిపాదనలను మంత్రివర్గం బుధవారం ఆమోదించింది. వెరసి పారిశ్రామిక వేత్తలకు భారీ ఊరట లభించింది. నాటి జగన్ నిర్ణయాలతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు.. తమకు కేటాయించిన ప్లాట్లను సైతం రద్దు చేసుకున్నారు. ప్రస్తుతం తిరిగి వారికి మరో అవకాశం ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధానంగా గత ప్రభుత్వంలో భారీగా పెంచిన ప్లాట్ల (స్థలాల) ధరలను తగ్గించింది. మొదట నిర్ణయించిన మేరకు ఎకరం రూ.16.50 లక్షలు వసూలు చేయాలని ఆమోదించింది."

"ప్రతిపక్ష హోదాలో జగన్ పాదయాత్ర నాటి హామీలకు భిన్నంగా మల్లవల్లిపై ఉక్కుపాదం మోపారు. పరిశ్రమల స్థాపనకు అనుకూల నిర్ణయాలు లేకపోగా.. ఎక్కువ ధరలు నిర్ణయించి సొమ్ములు చెల్లించాలని భీష్మించారు. దీంతో చాలామంది తమ ప్లాట్లను రద్దు చేసుకున్నారు. మరోవైపు భూములు ఇచ్చి పరిహారం రాని రైతులకు సొమ్ములు చెల్లిస్తానని హామీ ఇచ్చిన జగన్ సీఎం అయ్యాక వారిని పట్టించుకోలేదు. ప్రస్తుతం వారికి పరిహారం ఇచ్చే అంశమూ మంత్రివర్గంలో చర్చ జరిగింది. దీనిపై సీఎం చంద్రబాబు సానుకూల స్పందనతో మల్లవల్లి రూపురేఖలు మారనున్నాయి."

మల్లవల్లిలో సర్వే నెంబరు-11లో 1,460 ఎకరాలను 2016లో ఏపీఐఐసీ తీసుకుని పారిశ్రామిక వాడ ఏర్పాటు చేసింది. అప్పటి తెదేపా ప్రభుత్వం పారిశ్రామిక యూనిట్ల స్థాపనకు ఎకరం రూ.16.50 లక్షలకు కేటాయించింది. అశోక్ లేలాండ్, మోహన్ స్పిన్‌టెక్, ఫుడ్‌పార్కులో పలు యూనిట్లు ఏర్పాటయ్యాయి. మరోవైపు వైకాపా ప్రభుత్వం వచ్చాక ఎకరం రూ.89.50 లక్షలకు పెంచి.. అంతే చెల్లించాలని పారిశ్రామిక సంస్థలకు నోటీసులు ఇచ్చింది. కొందరు అప్పటికే యూనిట్లు నిర్మించడంతో చెల్లించారు. మిగిలిన వారు అంత ధర చెల్లించలేక రద్దుకు దరఖాస్తు చేశారు. వైకాపా జమానాలో మల్లవల్లిలో కొత్త యూనిట్లు లేవు. పురోభివృద్ధి లేదు. నిర్మాణమైన అశోక్ లేలాండ్ సైతం ప్రభుత్వ ప్రోత్సాహం లేదని ఉత్పత్తి ప్రారంభించలేదు.

కూటమి రాకతో వెలుగులు...



కూటమి ప్రభుత్వం కొలువుదీరాక అశోక్ లేలాండ్ ఉత్పత్తి కొనసాగించే ఏర్పాట్లు చేసింది. రైల్ నీరు యూనిట్ ఏర్పాటైంది. ఫుడ్ పార్క్ కేటాయించారు. నాడు తక్కువ ధరకే స్థలాలు తీసుకున్నారని ప్రభుత్వంలో ఓ ప్రజాప్రతినిధి పారిశ్రామికవేత్తలను వేధించారు. తెదేపా సానుభూతిపరులు ఉన్నారని మల్లవల్లి, వీరపనేనిగూడెం పారిశ్రామికవాడపై విజిలెన్సు విచారణకు ఆదేశించింది. పరిశ్రమల స్థాపనలో ప్రధాన పెట్టుబడి స్థలంపై ఉండదని వారు పదేపదే ఏపీఐఐసీకి విన్నవించినా.. ఫలితం లేదు. దాదాపు 277 మంది పరిశ్రమలు పెట్టలేమనీ, చెల్లించిన మొత్తం తీసేసుకున్నారు. తాజాగా ప్రభుత్వం ఎకరం రూ.16.50 లక్షలే నిర్ణయించడంతో మళ్లీ ముందుకు వచ్చే వీలుంది.

నిర్వాసితులకూ న్యాయం...

పరిహారం అందని నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారు. గత తెదేపా ప్రభుత్వం రైతులకు ఎకరాకు రూ.7.50 లక్షలు ఇవ్వాలని నిర్ణయించింది. 490 మంది, 716.44 ఎకరాలు సాగు చేస్తున్నట్లు తేల్చారు. ఎకరాకు రూ.7.50 లక్షల చొప్పున రూ.53.73 కోట్లు చెల్లించేలా నిర్ణయించింది. ఫిర్యాదులు రావడంతో 443 మందికి 615.6 ఎకరాలకు రూ.46.17 కోట్లు చెల్లించారు. 32 మందిని బినామీలుగా పేర్కొనగా, మరో 15 మంది వారి బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించలేదని పరిహారం చెల్లించలేదు. గ్రామంలో వ్యవసాయ కూలీలకు 1,228 మందికి రూ.50 వేల చొప్పున రూ.61.40 లక్షలు పరిహారం చెల్లించారు. తర్వాత ప్రభుత్వం మారింది. కమిటీలు వేశారు. మూడు పర్యాయాలు పరిశీలించారు. గుడివాడలో నిర్వాసితుల నుంచి అర్జీలు స్వీకరించారు. 257 మంది ఆధారాలతో దరఖాస్తు చేసినా.. వైకాపా ప్రభుత్వం పరిహారం ఇవ్వనేలేదు. ప్రస్తుతం వీరి సమస్య పరిష్కరించనున్నారు.

కొలువుల పండగే...



150 ఎకరాల్లో ఎంఎస్ఎంఈలను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. గతంలో రద్దు చేసుకున్న వారు, సొమ్ములు చెల్లించిన వారికి తిరిగి ఎకరం రూ.16.50 లక్షలకే కేటాయించనున్నారు. 60 రోజుల్లో పనులు ప్రారంభించాలని షరతు విధించారు. మొత్తం 33 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

నూతన కలెక్టర్ ఎవరో..?!

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ జిల్లాకు కొత్త కలెక్టర్ రానున్నారు. ప్రస్తుత కలెక్టర్ జి.సృజన బుధవారం తెలంగాణ సీఎస్‌కు రిపోర్టు చేశారు. క్యాట్‌లోనూ, తెలంగాణ హైకోర్టులోనూ అనుకూలంగా తీర్పు రాకపోవడంతో తప్పనిసరిగా బుధవారమే హైదరాబాద్‌లో తెలంగాణ సీఎస్‌కు రిపోర్టు చేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా జి.సృజన కేవలం నాలుగు నెలలే పనిచేశారు. అంతకు ముందే ఆమెకు విజయవాడతో అనుబంధం ఉంది. విజయవాడ సబ్ కలెక్టర్‌గా రెండేళ్లు పనిచేశారు. కలెక్టర్ సృజన స్థానికతపై వివాదం నెలకొంది. ఆమె శాశ్వత చిరునామా హైదరాబాద్‌గా ఉండటం, ఉన్నత విద్య హైదరాబాద్‌లోనే జరగడంతో ఆమెను తెలంగాణకు కేటాయించారు. ఈనెల 16లోగా తెలంగాణలో రిపోర్టు చేయాలని డీవోపీటీ (డిపార్టుమెంట్ అఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్) ప్రకటించింది. దీంతో తనను ఆంధ్ర క్యాడర్‌లోనే కొనసాగించాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్(క్యాట్)ను ఆశ్రయించారు. అక్కడ స్టే ఉత్తర్వులు రాలేదు. దీంతో బుధవారం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించినా అనుకూల ఆదేశాలు రాకపోవడంతో తెలంగాణలో రిపోర్టు చేశారు.

తెలంగాణకు వెళ్లిన సృజన



ఆంధ్రతోనే అనుబంధం...

2013-14 బ్యాచ్‌కు చెందిన సృజన విశ్రాంత ఐఏఎస్ బలరామయ్య కూతురు. ఆమె పాఠశాల విద్య కడపలో సాగింది. డిగ్రీ, ఉన్నత విద్య హైదరాబాద్‌లో చదివారు. పీహెచ్‌డీ ఎస్వీయూలో పూర్తి చేశారు. విజయవాడ సబ్ కలెక్టర్‌గా చేశారు. విశాఖ నగర పాలక కమిషనర్‌గా పనిచేసి 2023లో ఏప్రిల్‌లో కర్నూలు జిల్లా కలెక్టర్‌గా వెళ్లారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జూన్ 26న ఎన్టీఆర్ జిల్లాకు వచ్చారు. బుడమేరు వరదల్లో కీలకంగా పనిచేశారు. కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంగా మార్చి సీఎం చంద్రబాబు బుడమేరు వరదల్లో సహాయక కార్యక్రమాలు చేపట్టారు. దీనికి కలెక్టర్ కోఆర్డినేటర్‌గా పనిచేసి అన్ని విభాగాలను సమన్వయపరిచారు. సీఎం చంద్రబాబు ఆమెను అభినందించారు. ప్రస్తుతం కొత్త కలెక్టర్‌గా ఎవరనేది ఆసక్తిగా మారింది. ఈ విషయమై కలెక్టర్ సృజన మాట్లాడుతూ గురువారం జిల్లా నుంచి రిలీవ్ కానున్నట్లు 'ఈనాడు'తో తెలిపారు.

కొంతమేర తగ్గిన భవానీల రాక

27 లక్షల లడ్డూ ప్రసాదాల విక్రయం



ప్రసాద విక్రయాల కేంద్రం వద్ద సందడి

ఇంద్రకీలాద్రి: దసరా ఉత్సవాలు ముగిశాక కూడా మూడు రోజులుగా పోటెత్తిన భవానీ దీక్షాధారుల రాక క్రమేపీ తగ్గుతోంది. పాత బస్తీ వీధుల్లో ఎక్కడ చూసినా భవానీ దీక్షలు విరమించిన భక్తులే దర్శనమిచ్చారు. గత 13 రోజుల్లో 27 లక్షల లడ్డూ ప్రసాదాలను కౌంటర్లలో విక్రయించారు. మరో 2 లక్షల లడ్డూలు సిద్ధంగా ఉన్నాయి. విజయదశమి రోజు భవానీ దీక్షాధారులు పోటెత్తడంతో ప్రసాదాల కొరత ఏర్పడింది. మూలా నక్షత్రాన్ని మించి భవానీ దీక్షాధారులు జగన్మాత దర్శనానికి తరలి రావడంతో ముందు జాగ్రత్తగా పెనుగంచిప్రోలు, పెదకాకాని, మోపిదేవి నుంచి 37 వేల లడ్డూలను సిద్ధం చేయాల్సి వచ్చింది. మూలానక్షత్రం రోజు భక్తులకు ఉచిత లడ్డూప్రసాదాన్ని అందజేశారు. వీటితోపాటు ఆరు లడ్డూల ప్యాకెట్ల విక్రయాలు సైతం అనుకున్న దానికంటే ఎక్కువ జరిగాయి. దీంతో దసరా రోజున భక్తుడికి 5 లడ్డూలు మాత్రమే ఇవ్వాలని నిర్ణయించారు. అమ్మవారి దర్శనానికి ఇంకా భవానీలు వచ్చే అవకాశం ఉండటంతో పోలీసు భద్రతను కొంత మేర కొనసాగిస్తున్నారు. మరో రెండు రోజులు ప్రసాదాలకు లోటు లేకుండా ప్రస్తుతం ఉన్న విక్రయ కేంద్రాల వద్దే భక్తులకు అందజేస్తామని అధికారులు తెలిపారు.

కిక్కు.. అంతంతే..!

- తొలి రోజు ఏర్పాటైంది 25 మాత్రమే
- దుకాణాలకు ఆలస్యంగా సరకు రాక

ఈనాడు - అమరావతి: చాలా కాలం తర్వాత ప్రైవేటు మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. కొత్త విధానంలో భాగంగా ప్రభుత్వ షాపులను రద్దు చేసి.. వీటికి అనుమతిచ్చింది. బుధవారం నుంచి ఇవి తెరుచుకున్నాయి. లైసెన్సులు దక్కించుకున్న వారు తొలి రోజు అరకొరగానే ఏర్పాటు చేశారు. సరైన ప్రాంతం, షాపు దొరక్కపోవడమే ఇందుకు కారణం. ఒక వైపు మంగళవారం రాత్రితో ప్రభుత్వ దుకాణాలు మూతపడడం.. ఇటు బుధవారం చాలా ప్రైవేటు షాపులు తెరుచుకోలేదు. దీంతో తెరిచిన షాపుల వద్దకు మందుబాబులు క్యూ కట్టారు. తెరిచిన దుకాణాలకూ సకాలంలో సరకు రాలేదు. దీనికి తోడు పాతధరలే ఉండడంతో పలువురు పెదవి విరుస్తున్నారు. కొత్త సరకు ఇంకా రాలేదని దుకాణదారులు సర్ది చెబుతున్నారు. కాకపోతే గతం కంటే ఎక్కువ బ్రాండ్లు మాత్రం అందుబాటులోకి వచ్చాయని చెబుతున్నారు.

✪ ఎన్టీఆర్ జిల్లాలో 113 మద్యం దుకాణాలకు తొలి రోజు కేవలం 25 మాత్రమే తెరుచుకుని వ్యాపారాలు సాగాయి. ఈసారి ఎక్సైజ్ శాఖ గతం కంటే భిన్నంగా నగరపాలిక, పురపాలిక, మండలాల పరిధి యూనిట్‌గా కొత్త విధానాన్ని రూపొందించారు. దీని ప్రకారమే షాపులకు దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో ఏ ప్రాంతంలో దుకాణం ఏర్పాటు చేస్తే.. వ్యాపారం బాగా సాగుతుందో అని సర్వే నిర్వహించి షాపులు తెరుస్తున్నారు. సరైన ప్రాంగణం దొరక్కపోతే మరో రద్దీ ప్రాంతంలో వ్యాపారులు అన్వేషిస్తున్నారు.

✪ మూతపడిన ప్రభుత్వ దుకాణాల నుంచి మిగిలిన స్టాకు.. మద్యం డిపోలకు తరలింపును బుధవారం ఉదయం నుంచి ప్రారంభించారు. వచ్చిన సరకు వివరాలను డిపోల సిబ్బంది నమోదు చేసుకోవడంతో ఊపిరి సలపకుండా ఉండడంతో ప్రైవేటు దుకాణదారులకు సకాలంలో మద్యం ఇవ్వలేదు. దీంతో బుధవారం రాత్రికి 60 మంది వ్యాపారులు సరకును నుంచి తీసుకున్నారు. వీరిలో వ్యాపారాలు ప్రారంభించింది తక్కువ మందే. మొదటి రోజు గొల్లపూడి, నిడమానూరులో డిపోల నుంచి దాదాపు రూ.6.5 కోట్ల విలువైన మద్యాన్ని వ్యాపారులు తీసుకెళ్లారు. పలు చోట్ల ప్రభుత్వ దుకాణాలు నడిచిన ప్రాంగణాల్లోనే ఏర్పాటు చేశారు.



విజయవాడలో ఓ మద్యం దుకాణం వద్ద రద్దీ

జనసేన జిల్లా అధ్యక్షుడిగా ఉదయభాను


జనసేనలోకి ఆహ్వానిస్తున్న సామినేని

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: ఇటీవల జనసేనాని పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభానును ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు జనసేన కేంద్ర కార్యాలయం నుంచి రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ నియామకపత్రాన్ని విడుదల చేశారు. గతనెల 26న ఉదయభాను జనసేనలో చేరారు. 20 రోజుల వ్యవధిలోనే జిల్లా అధ్యక్షుడిగా నియమించడంతో ఆయన అభిమానులు, అనుచరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రాష్ట్రంలోని 13,326 గ్రామ పంచాయతీల్లో తమ పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి ఒక కొత్త పంథాలో సాగుతుందన్నారు. రూ.4,500 కోట్లతో 30వేల పనులు ఒకేసారి ప్రారంభించే బృహత్ సంకల్పం అభినందనీయమని పేర్కొన్నారు. తనపై ఉంచిన గురుతర బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించి పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని ఉదయభాను అన్నారు.

✦ **విస్తృతంగా చేరికలు**

జగ్గయ్యపేట పట్టణం సహా వివిధ మండలాల నుంచి వైకాపా నాయకులు, శ్రేణులు బుధవారం విస్తృతంగా జనసేన పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆధ్వర్యంలో వైకాపా సోషల్ మీడియా కన్వీనర్ యర్రమాసు రామకృష్ణ, వత్సవాయి మండలానికి చెందిన ఎస్సీ నాయకులు అన్నెపాగ నరసింహారావు, కందుల నరసింహారావు, పెనుగంచిప్రోలు మండలంలోని వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు కనగాల శ్రీనివాసరావు, చాట్ల సుశీల, మాతంగి శాంతకుమారి, బరిగెల వెంకట్రామయ్య, దోసపాటి స్వర్ణలత తదితరులు జనసేనలో చేరారు. నూజివీడు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు ముత్యాల కామేష్ ఆధ్వర్యంలో ఇంటూరి చంటి, కాశీకృష్ణ, వంగమూడి ఆనంద్, చిక్కాల నరేంద్రలు జగ్గయ్యపేటలో ఉదయభానును మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

ఎమ్మెల్యే గద్దెపై కేసు కొట్టివేత


న్యాయస్థానం వద్ద ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, న్యాయవాదులు, తెదేపా నాయకులు

పటమట, న్యూస్‌టుడే: 2019 ఎన్నికల నామినేషన్ సమయంలో రాణిగారితోట వద్ద బాణసంచా కాల్చారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో పాటు పలువురు తెదేపా నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పలుమార్లు కోర్టు వాయిదాలకు హాజరైన తర్వాత బుధవారం ప్రజాప్రతినిధుల న్యాయస్థానం న్యాయమూర్తి కేసు కొట్టివేశారు. ఎమ్మెల్యే గద్దె, తెదేపా నేతల తరఫున న్యాయవాదులు నిమ్మగడ్డ దుర్గాప్రసాద్, చంద్రగిరి శ్రీనివాస్, బాసంశెట్టి రవి వాదనలు వినిపించారు. ఈ కేసులో ఎమ్మెల్యేతో పాటు నాయకులు పోలిపల్లి ముని, షేక్ నాగూర్, ముని ఆదిబాబు, ముని అజయ్, ఎండీ అయాజ్ ఉన్నారు.

గాల్లో పక్షిలా.. సేవలు సులువుగా..




డ్రోన్లు తయారు చేస్తున్న విద్యార్థులు

ఈనాడు డిజిటల్, అమరావతి

అధునాతన సాంకేతికతతో డ్రోన్ల తయారీ
విద్యార్థుల సరికొత్త ఆవిష్కరణలు

డ్రోన్... గాల్లో పక్షిలా ఎగురుతూ మనుషులకు బదులుగా పంట పొలాల్లో మందులు చిమ్ముతుంటే అందరూ ఆసక్తిగా చూశారు. రైతులకు కొత్తగా, వింతగా అనిపించింది. ఇటీవల విజయవాడలో వరద బాధితులు నీటిలో చిక్కుకుపోతే.. వాటి ద్వారానే ఆహారం, తాగునీరు వంటివి అందించారు. అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి.. మరిన్ని రంగాలకు వాటి సేవలు విస్తృతం చేసేలా తీర్చిదిద్దుతున్నారు ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన విద్యార్థులు. ఆరోగ్యం, రక్షణ, నిఘా, ట్రాఫిక్, విపత్తు నిర్వహణ.. ఇలా విభిన్న రంగాల్లో క్లిష్టమైన పనులను తేలిగ్గా చేసేలా స్వదేశీ పరిజ్ఞానంతో డ్రోన్లు తయారు చేస్తున్నారు విజయవాడ సమీపంలోని ధనేకుల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు. సరికొత్త ప్రయోగాలు చేస్తూ.. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని అవార్డులు గెలుపొందారు.

ఇజ్రాయెల్ నిపుణుల పర్యవేక్షణలో.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కళాశాల యాజమాన్యం ఏడాది కిందట అధునాతన సాంకేతికతతో కూడిన డ్రోన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్‌ను నెలకొల్పింది. డ్రోన్లు, ఏఐ టెక్నాలజీలో పరిజ్ఞానం ఉన్న బెంగళూరులోని ద్రోణాచార్య టెక్ హబ్‌తో ఎంవోయూ కుదుర్చుకుంది. సరికొత్త, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చింది. ఆసక్తి ఉన్నవారికి శిక్షణ ఇస్తోంది. ఈ నెల 22, 23వ తేదీల్లో మంగళగిరిలో నిర్వహించే 'అమరావతి డ్రోన్ సమ్మిట్‌'లో రాణించాలనే ధ్యేయంతో విద్యార్థులు వినూత్న రీతిలో డ్రోన్లు తయారు చేస్తున్నారు.

విపత్తు సమయాల్లోనూ సేవలు



ఇటీవల విజయవాడకు వచ్చిన భారీ వరదల్లో.. మనుషులు వెళ్లేందుకు వీల్లేని కాలనీలకు డ్రోన్లు వెళ్లి వరద బాధితులకు ఆహార పదార్థాలు అందించి ఆకలి తీర్చాయి. కేవలం ఆహారం అందించడమే కాకుండా.. బాధితులకు మరిన్ని సేవలు అందించేలా యూఏఈ ఆపరేషన్స్ పేరిట డ్రోన్లు తయారు చేశాం. వీటిని వ్యవసాయంలో పురుగు మందులు పిచికారి చేయడానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దాం.

– జితిన్, మూడో సంవత్సరం

కళాశాల ల్యాబ్ వేదికగా...



డ్రోన్ల బాడీ, ఇతర విభాగాలను కళాశాల ల్యాబ్‌లోని త్రీడీ ప్రింటర్ ద్వారా కావాల్సిన రీతిలో తయారు చేస్తున్నాం. మేక్ ఇన్ ఇండియా కాన్సెప్ట్ అమలు కోసం దేశంలో తయారైన పరికరాలనే వినియోగిస్తున్నాం. విజయవాడలోని పలు దుకాణాల్లో తిరిగి అందుబాటులో ఉన్న అధునాతన పరికరాలను కొనుగోలు చేసి.. డ్రోన్లకు అమర్చుతున్నాం.

– జయశ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థిని


ట్రాఫిక్ నియంత్రణకు తోడ్పాటు..



ప్రకృతి విపత్తుల సమయాల్లో ప్రజలకు వేగంగా హెచ్చరికలు పంపేలా.. మోడ్రన్ అటానమస్ డ్రోన్ ఫర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్(మ్యాడ్) పేరిట మరో సరికొత్త డ్రోన్‌ను తయారు చేశాం. ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి.. సమీపంలోని వాహనదారుల మొబైల్ ఫోన్‌లకు సందేశాలు పంపుతుంది. చేపలు, రొయ్యల చెరువుల్లో బ్యాక్టీరియా తెగుళ్లను గుర్తించి.. వాటి నివారణ మార్గాలు రైతులకు తెలియజేసేలా రూపొందించాం.

– బెల్లంకొండ కమలాకరరావు, చివరి సంవత్సరం

సమ్మిట్‌లో సత్తా చాటేలా...



డ్రోన్ టెక్నాలజీని అభివృద్ధి చేసి, తద్వారా విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రత్యేక ల్యాబ్‌ను ప్రారంభించాం. విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకుంటున్నారు. వారికి శిక్షణ ఇస్తున్నాం. తీర్ఫీదు పొందిన వారు.. వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారు. సొంతంగా డ్రోన్ల తయారీ సంస్థలు కూడా ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే 'అమరావతి డ్రోన్ సమ్మిట్‌'లో పాల్గొని సత్తా చాటడమే లక్ష్యంగా విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం.

– కడియాల రవి, ప్రిన్సిపల్, ధనేకుల ఇంజినీరింగ్ కళాశాల

కాలువలో పడి ఒకరి మృతి

రాజమహేంద్రవరం నేరవార్తలు: హోటల్‌లో స్వీపర్‌గా పని చేసే ఓ వ్యక్తి ప్రధాన మురుగు కాలువలో పడి మృతి చెందిన ఘటన తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం మూడో పట్టణ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వి.అప్పారావు వివరాల మేరకు.. విజయవాడ గుణదల ప్రాంతంలోని ఉర్మిళనగర్‌కు చెందిన కాదులూరి శ్రీహరి ప్రసాద్(51) ఎనిమిది నెలలుగా గోకవరం బస్టాండు మున్సిపల్ కాంప్లెక్స్‌లోని ఓ హోటల్‌లో స్వీపర్‌గా పని చేస్తున్నాడు. సీతంపేటలో గది అద్దెకు తీసుకుని ఒంటరిగా నివసిస్తున్నాడు. విజయదశమి తర్వాత నుంచి శ్రీహరి పనిలోకి రాకపోవడంతో హోటల్ యజమాని దుర్గాప్రసాద్ బుధవారం మధ్యాహ్నం ఆయన గదికి వెళ్లి చూడగా కనిపించలేదు. స్థానిక ములగొయ్యి వద్ద ప్రధాన మురుగు కాలువ గట్టుపైన కూర్చుని మద్యం తాగుతుంటాడని తెలిసి అక్కడికి వెళ్లి పరిశీలించగా కాలువలో మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చి బయటకు తీయించారు. అది శ్రీహరిదిగా పోలీసులు గుర్తించారు. నిత్యం మద్యం తాగడంతోపాటు శ్రీహరికి పలు ఆరోగ్య సమస్యలున్నాయని, తరచూ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స తీసుకునేవాడని హోటల్ యజమాని దుర్గాప్రసాద్ పోలీసులకు వివరించాడు. శ్రీహరికి కూడి కాలుపై పుళ్లు ఎక్కువగా ఉండడంతో తొందరగా నడవలేడని ఆయన పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మృతదేహం పరిస్థితి చూస్తే మంగళవారం రాత్రి మద్యం మత్తులో కాలువలో పడి మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నట్లు సీఐ తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆలకిస్తే.. ఆదరిస్తే.. ఆహ్లాదమే!


కూర్చునేందుకు వీలు లేని సిమెంటు బల్లలు



వన్‌టౌన్ కనకదుర్గ పై వంతెన దిగువన కుమ్మరిపాలెం సెంటర్ వద్ద స్థానికులు సేద తీరేందుకు, చిన్నారులు ఆడుకునేందుకు ఏర్పాటుచేసిన పార్కు నిర్వహణ సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులు సరదాగా ఎక్కే టాయ్ విమానం పూర్తిగా విరిగింది. ఊయలలు ఊడిపోయాయి. చిన్నారులు ఆడుకునే ప్రాంతంలో విద్యుత్తు ఫ్యూజ్ బాక్సులు ప్రమాదకరంగా తెరిచి ఉన్నాయి. వెంటనే పార్కులో వసతులు మెరుగుపరిచి.. సమస్యలు చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

- ఈనాడు, అమరావతి


విరిగిపోయిన టాయ్ విమానం


ప్రమాదకరంగా ఫ్యూజ్ బాక్సు

అందుబాటులో 15 ఇసుక క్వారీలు

నాలుగింటిని ప్రారంభించిన జేసీ నిధి మీనా

పెనుగంచిప్రోలు, వత్సవాయి, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లాలో కొత్తగా 15 ఇసుక క్వారీలు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు జేసీ నిధి మీనా తెలిపారు. బుధవారం ఆమె పెనుగంచిప్రోలు మండలం శనగపాడు, వత్సవాయి మండలం ఇందుగపల్లి, కంచికచర్ల మండలం పెండ్యాల, నందిగామ మండలం కంచెల ఇసుక నిల్వ కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా ఇసుక సరఫరా చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లాలోని 15 క్వారీల్లో భాగంగా ప్రస్తుతం 4 క్వారీలు బుధవారం ప్రారంభించినట్లు చెప్పారు. ఈ క్వారీల్లో ప్రస్తుతం 3 లక్షల 69 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. మొగులూరు, కీసర, అనుమంచిపల్లి నిల్వ కేంద్రాలతో కలిపి 11 లక్షల 6వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. నదుల్లో నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టగానే మిగిలిన 11 క్వారీలను ప్రారంభిస్తామన్నారు. కొత్తగా ప్రారంభించిన క్వారీల్లో టన్ను ఇసుక రూ.232 ధరగా నిర్ణయించినట్లు చెప్పారు. ఇసుక విక్రయాలు పారదర్శకంగా జరగడం కోసం క్వారీలు, నిల్వ కేంద్రాల్లో ఎప్పటికప్పుడు నివేదికలు ప్రదర్శించాలని ఆమె అధికారులను ఆదేశించారు. గనులశాఖ సహాయ సంచాలకులు వీరాస్వామి, నందిగామ ఆర్డీవో బాలకృష్ణ, మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

22 నుంచి క్రీడాజట్ల ఎంపిక పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-19 విభాగంలో ఈ నెల 22వ తేదీ నుంచి పలు క్రీడాంశాల్లో వేర్వేరు ప్రదేశాల్లో జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి వేమూరి రవికాంత తెలిపారు. 22వ తేదీ ఉదయం 9 గంటల నుంచి ఉయ్యూరులోని ఏజీ, ఎస్‌జీ సిద్ధార్థ కళాశాలలో బాలబాలికల అథ్లెటిక్స్, బాలుర కబడ్డీ, 23వ తేదీ ఉదయం 10 గంటల నుంచి విజయవాడలోని ఐజీఎంసీ స్టేడియంలో బాలబాలికల వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, జూడో, ఉషు, మధ్యాహ్నం 2 గంటల నుంచి మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాలలో బాలబాలికల వాలీబాల్, ఖోఖో, 24వ తేదీ ఉదయం 9 గంటల నుంచి పీబీ సిద్ధార్థ కళాశాలలో బాలబాలికల బ్యాడ్మింటన్, క్రికెట్, ఉదయం 10 గంటలకు మొగల్రాజపురంలోని బీఎస్‌ఆర్‌కే మున్సిపల్ హైస్కూల్‌లో బాలబాలికల మాల్కంబ్, 29వ తేదీ ఉదయం 9 గంటల నుంచి నగరంలోని చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీలో బాలబాలికల ఆర్చరీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆయా క్రీడా ప్రదేశాల్లో సంబంధిత పత్రాలతో కేటాయించిన సమయాల్లో క్రీడాకారులు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 94401 12455 నంబరులో సంప్రదించాలని సూచించారు.

పేద గూటికి పండగ

మైలవరం, న్యూస్‌టుడే

● 5 ఏళ్ల నిరీక్షణకు తెర ● కూటమి ప్రభుత్వ సర్వేతో లబ్ధిదారుల్లో ఆనందం


బిల్లులు రాని ఇళ్లు

'కూలి పనులు చేసుకునే గోళ్ల కమల కుటుంబానికి గత తెదేపా ప్రభుత్వంలో మంజూరైన ఇంటి నిర్మాణం వైకాపా ప్రభుత్వం రాగానే ఆగిపోయింది. బిల్లులు రాక, సగం పూర్తయిన ఇంట్లో ఉండలేక ఇబ్బందులు పడుతున్నామని అప్పటి వైకాపా ప్రజాప్రతినిధులతో పలుమార్లు గోడు వెళ్లబోసుకున్నా వారి నుంచి స్పందన కరవైంది. రెక్కల కష్టం కొంత, రూ.4 లక్షల వరకు అప్పులు చేసి, ఎలాగోలా గతేడాది నిర్మాణం పూర్తి చేసుకుని తలదాచుకుంటున్నారు. అప్పులు తీర్చేందుకు రేయింబవళ్లు భార్యాభర్తలు శ్రమిస్తున్నారు..'

- ఇది ఆ ఒక్క కుటుంబం పరిస్థితే కాదు. జిల్లాలో వేలాది మంది పేదల పట్ల గత ప్రభుత్వం ప్రదర్శించిన వివక్ష వైఖరికి తార్కాణం.

బిల్లుల చెల్లింపుల్లో పేచీలు పెట్టడంతో కూలీ నాలీ చేసుకుని, కొద్ది పాటి సొమ్ముతో ఇళ్లు పూర్తి చేసుకుందామనుకున్న పేదలను వైకాపా ప్రభుత్వం నట్టేట ముంచింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే చెల్లింపులకు సర్వే ప్రారంభించడంతో పేదల గూటికి పండగ కళ వచ్చింది.

ఆశలపై నీళ్లు

2014-19 మధ్య అధికారంలో ఉన్న తెదేపా ప్రభుత్వం పేదల గృహ నిర్మాణానికి పెద్దపీట వేసి 2018లో పెద్ద ఎత్తున పక్కా గృహాలను మంజూరు చేసింది. చేతుల్లో ఉన్న కొద్దిపాటి సొమ్ములతో కొందరు పునాదులు వేసుకున్నారు. పూర్తిస్థాయిలో పథకం పట్టాలెక్కే క్రమంలో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వారి వారి ఆశలపై నీరు చల్లింది. అప్పటికే పలు దశల్లో బిల్లులు పొందిన వేలాది మంది పేదలకు తర్వాత ఐదేళ్ల పాటు వైకాపా ప్రభుత్వం నయాపైసా కూడా చెల్లించకుండా బజారున పడేసింది. గడప గడపకు మన ప్రభుత్వం పేరిట ఎమ్మెల్యేలు ఆయా ప్రాంతాల్లో తిరుగుతున్న సమయంలో 'అయ్యా మొండిగోడల మధ్య బతుకుతున్నాం..మా పరిస్థితేమిటంటూ..' నిలదీసినా తామేమీ చేయలేమంటూ చేతులెత్తేశారు.

చివరి దశలో..

గత రెండు వారాలుగా జిల్లా వ్యాప్తంగా గృహనిర్మాణశాఖ ద్వారా పెండింగ్ నిర్మాణాల దశలపై సర్వే ప్రారంభించారు. కూటమి నాయకుల సహకారంతో క్షేత్రస్థాయిలో సర్వే చేసి, యాప్‌లో వివరాలను నిక్షిప్తం చేస్తున్నారు. ఇప్పటికే సర్వే ప్రక్రియ చివరి దశకు చేరుకోగా, చెల్లింపులకు చర్యలు చేపట్టనుంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి

మొత్తం ఇళ్లు	– 13,163
సర్వే పూర్తి చేసినవి	– 11,339
పూర్తి చేయాల్సినవి	– 1,824

రూ.70 వేలు చెల్లించారు



రెండు దశల్లో గత తెదేపా ప్రభుత్వంలోనే రూ.70 వేల వరకు చెల్లించారు. తర్వాత వైకాపా ప్రభుత్వంలో ఇవ్వకపోవడంతో అప్పులు చేసి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. ఇంకా మరో రూ.1 లక్ష వరకు ఖర్చవుతుంది. ప్రభుత్వం బకాయిలు ఇస్తామనడం ఆనందంగా ఉంది.

– గోళ్ల కమల, మైలవరం

ముమ్మరంగా సర్వే

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో సర్వే ముమ్మరంగా సాగుతోంది. సుమారు మరో 2 వేల లోపు పరిశీలన చేయాల్సి ఉంది. గత ప్యాకేజీ ప్రకారం వివిధ దశల్లో చెల్లింపులు, నిర్మాణాల పరిశీలన మేరకు బకాయిల చెల్లింపులు చేస్తాం.

– కపూర్, గృహనిర్మాణశాఖ జిల్లా ఇన్‌ఛార్జి పీడీ

నాలుగేళ్లు పట్టింది



– జంగా కృష్ణారావు, లబ్ధిదారు, మైలవరం

మొదటి బిల్లుగా రూ.14,700లు గత తెదేపా ప్రభుత్వంలో చెల్లించాక, తర్వాత ప్రభుత్వం బిల్లులను నిలిపి వేసింది. కూలీ నాలీ చేసుకుంటూ ఇళ్లు పూర్తి చేసేసరికి నాలుగేళ్లు పట్టింది. ఇంకా తుది పనులు చేయాల్సి ఉంది. ఇటీవల అధికారులు సర్వే చేసుకుని వెళ్లారు. బిల్లులు చెల్లిస్తే మేలు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 270 చికెన్ స్కిన్‌లెస్ - 280.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డ ధర 100 గుడ్లకు రూ. 505 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

విజయవాడ పశ్చిమ బైపాస్ పనుల పరిశీలన


పరిశీలిస్తున్న పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు తదితరులు

గొల్లపూడి, న్యూస్‌టుడే: విజయవాడ పశ్చిమ బైపాస్ నిర్మాణ పనులను గొల్లపూడి వద్ద నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. విజయవాడలో ట్రాఫిక్ నిలిచిపోతున్న దృష్ట్యా బైపాస్ నిర్మాణ పనులు ఎంత మేర జరుగుతున్నాయి, వాహనాలను అనుమతించేందుకు అవకాశం ఉందా అనే విషయాలను తెలుసుకున్నారు. బైపాస్ మీదుగా వాహనాలను అనుమతిస్తే నగరంలో ట్రాఫిక్ సమస్య తీరేందుకు అవకాశం ఉంది. తపర్యటనలో డీసీపీలు ఉదయరాణి, కృష్ణమూర్తి నాయుడు, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

? రెడ్డిగూడెం నుంచి కుదప వెళ్లే రహదారిలో చెత్త, వ్యర్థాలు పడేస్తున్నారు. ఇబ్బందిగా ఉంది. **- నరేష్‌బాబు, స్థానికుడు**

సమాధానం: చెత్త, వ్యర్థాలను వెంటనే తొలగిస్తాం. **- ఎస్.రామారావు, పంచాయతీ కార్యదర్శి**

– న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

బాధిత కుటుంబానికి సాయం

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక దేవునిచెరువుకు చెందిన వై.చిన్న శేషగిరిరావు అనారోగ్యంతో మరణించగా, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు లంకా లితీష్ రూ.5 వేల ఆర్థిక సాయాన్ని బుధవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు బాలకృష్ణ, అంకరాజు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

100 మందికి ఉచిత నేత్ర పరీక్షలు

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని బాపూజీ పింఛన్‌దారుల భవనంలో గురువారం విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 100 మందికి ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించినట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.వి.ప్రసాద్, మార్కు తెలిపారు. ఉచిత కంటి శస్త్ర చికిత్సకు కొందరిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగులు ఎం.ప్రసాద్, శేషారావు, ఎ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామి గుడికి పాదయాత్ర

మేడూరు (గంపలగూడెం), న్యూస్‌టుడే: శ్రీరామ సేవకుల ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా గురువారం ఉదయం గంపలగూడెం సీతారామ చంద్రస్వామి ఆలయం నుంచి మేడూరు వీరాంజనేయస్వామి గుడికి పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు

సవాళ్లు స్వీకరించాలి

మైలవరం, న్యూస్‌టుడే: నేటి పోటీ ప్రపంచంలో ఎదురవుతున్న సవాళ్లను స్వీకరించి, సాధించేందుకు విద్యార్థులు సిద్ధపడితేనే విజయం లభిస్తుందని స్వార్క్ సైకాలజీ కౌన్సిలింగ్ కేంద్ర అధ్యాపకుడు ఎ.కోటిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఏఐడీఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

సర్కిల్‌లో 6 మద్యం దుకాణాలు ప్రారంభం

మైలవరం, న్యూస్‌టుడే: ఎక్సైజ్ మైలవరం సర్కిల్‌లో పరిధిలోని మూడు మండలాలకు కేటాయించిన 10 మద్యం దుకాణాలకు గాను బుధవారం 3 దుకాణాలు పూర్తిస్థాయిలో, మరో 3 దుకాణాలు సాయంత్రానికి ప్రారంభించారని ఎక్సైజ్ సీఐ జె.శ్రీనివాస్ తెలిపారు. మైలవరం పట్టణంలో 2, వెల్వడంలో 1 ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. మద్యం నిల్వల సరఫరా అనంతరం అన్ని దుకాణాలు మొదలవుతాయన్నారు. 20 వేల పైన జనాభా ఉన్న గ్రామాల్లో ఏర్పాటు చేస్తే, జాతీయ, రాష్ట్ర రహదారులకు 500 మీటర్ల దూరంలో, 20 వేల లోపు జనాభా ఉన్న గ్రామాల్లో ఏర్పాటు చేస్తే 220 మీటర్ల పైబడి దూరంలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉందన్నారు. మండలంలోని వెల్వడంలో చిననందిగామ రోడ్డులో ఏర్పాటు చేస్తున్న దుకాణంతో తాము ఇబ్బంది పడతామంటూ పలువురు మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని వ్యాపారులు వారికి హామీ ఇచ్చారు.

గ్రామాలు ప్రగతిపథంలో పయనిస్తాయ్



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

తిరువూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న 'పల్లె పండుగ' కార్యక్రమం ద్వారా పల్లెలు ప్రగతిపథంలో పయనిస్తాయని ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని కోకిలంపాడు, మల్లేల, లక్ష్మీపురం, కాకర్ల, ఆంజనేయపురం, చిట్టేల, చౌటపల్లి, జి.కొత్తూరు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో సిమెంట్ రహదారుల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మండల పరిధిలో సీసీ రోడ్లు నిర్మాణానికి ఉపాధి హామీ పథకంలో రూ.5 కోట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఎంపీడీవో పీవీఎస్.నాగేశ్వరరావు, ఆయా గ్రామాల్లో ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎ.కొండూరు మండలంలో పల్లెపండుగ నేడు

ఎ.కొండూరు: మండలంలోని ఎ.కొండూరు, ఎ.కొండూరు తండా, మత్రియా తండా, రేపూడి తండా, మాధవరం, కుమ్మరికుంట్ల, కృష్ణారావుపాలెం, కేశ్యాతండా, చీమలపాడు, పెదతండా, రామచంద్రాపురం గ్రామాల్లో గురువారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.హరిప్రియ తెలిపారు. ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు పాల్గొని ఉపాధి హామీ పథకంలో మంజూరైన నిధులతో నిర్మించే సిమెంట్ రహదారులకు శంకుస్థాపన చేస్తారన్నారు.

మధిర శాఖ కాల్వకు 915 క్యూసెక్కుల సాగర్‌జలాలు

గంపలగూడెం: కప్పలబంధం నియంత్రిక నుంచి బుధవారం ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు 915 క్యూసెక్కుల సాగర్‌జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్ తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 308 క్యూసెక్కులు చేరాయన్నారు. దిగువన మేజర్ల వారీగా గంపలగూడెం 25, ఊటుకూరు 50, పెదకొమిర 20, మధిర 20, నిదానపురం 30 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.

ప్రతి కోవెలకూ ధూప దీపాలు

చిన్న ఆలయాలకు పెద్ద ఊరట
రూ.5 వేల నుంచి రూ.10 వేలకు డీడీఎన్ఎస్ పెంపుదల

ఇబ్రహీంపట్నం(గ్రామీణం), న్యూస్‌టుడే

మరో ఎన్నికల హామీ అమలుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని అందుకు సంబంధించిన ఉత్తర్వులను మంజూరు చేసింది. ఆదాయం లేని చిన్న ఆలయాల్లో ధూప దీప నైవేద్యాలు(డీడీఎన్ఎస్) నిర్వహించేందుకు అందించే సాయాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు పెంచుతూ దేవాదాయ శాఖ ప్రత్యేక కమిషనర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు జిల్లాలో 117, ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలంలో ఏడు (గ్రూప్-సి) చిన్న ఆలయాలకు డీడీఎన్ఎస్‌కు రూ.10 వేల చొప్పున ఇవ్వనుంది. ప్రభుత్వ నిర్ణయంపై అర్చకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మొత్తంలో అర్చకులకు రూ.7 వేలు, ఇతర ఖర్చులకు రూ.3 వేలు చొప్పున కేటాయించారు. అర్చకులకు గతంలో కన్నా ప్రస్తుతం నెలకు రూ.4 వేలు అదనపు సాయం అందనుంది.



డీడీఎన్ఎస్ పథకంలోని ఇబ్రహీంపట్నం ఫెర్రీ గణపతి ఆలయం

గతంలో ఇలా

ఈ పథకం ద్వారా గతంలో రూ.2,500 ఇస్తుండగా గత తెదేపా ప్రభుత్వం రూ.5 వేలకు పెంచుతూ చేయూతనిచ్చింది. ప్రస్తుతం మళ్లీ రూ.10 వేలు పెంచారు. ఈ మొత్తాన్ని దేవాదాయ శాఖకు చెందిన సర్వశ్రేయోనిధి నుంచి వినియోగిస్తారు. అర్చకుల బ్యాంకు ఖాతాలలో నేరుగా జమ చేస్తారు. ఆదాయం లేని చిన్న ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు నిత్యం దీపం వెలిగించి నైవేద్యం పెట్టేందుకు డీడీఎన్ఎస్ అమలు చేస్తున్నారు.

హామీ నిలబెట్టుకున్నారు



ప్రభుత్వం డీడీఎన్ఎస్ పథకం కింద ఇస్తున్న రూ.5 వేలను రూ.10 వేలకు పెంచడం హర్షించదగ్గ విషయం. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని నిలబెట్టుకుంది. ఆదాయం లేని చిన్న దేవాలయాల్లో కూడా ఉదయం సాయంత్రం దీపారాధన స్వామివార్లకు నైవేద్యం పెట్టడంతోపాటు అర్చకులకు కూడా చేయూతనివ్వడం కూటమి ప్రభుత్వం నిబద్ధతకు నిదర్శనం.

- శివ సూర్య ప్రకాశరావు, అర్చకుడు

తెగుళ్ల నివారణపై అవగాహన



వ్యవసాయశాఖ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో బుధవారం మద్దుల పర్వ, ముచ్చనపల్లి గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఆర్.ఆర్.సురేష్ వివిధ పంటల్లో వచ్చే పురుగులు, తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు రైతు సేవా కేంద్రంలో ప్రదర్శించిన ఈ- పంట జాబితాలో సాగు చేసిన పంటలు, రకం పేర్లు పరిశీలించుకోవాలన్నారు. ముచ్చనపల్లి, శ్రీరాంపురం సర్పంచులు జమలయ్య, శ్రీనివాసరావు, ముచ్చనపల్లి ఎంపీటీసీ సభ్యుడు మారయ్య, వ్యవసాయ సహాయకులు పవన్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

'ప్రాంతీయ పార్టీలతో ప్రజలకు ప్రయోజనం లేదు'

కొండపల్లి, న్యూస్‌టుడే: ప్రాంతీయ పార్టీల పాలనతో ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేదని, దేశ సుస్థిరతను కాపాడగలిగేది కాంగ్రెస్ పార్టీ నేనని జిల్లా పార్టీ నాయకులు బొర్రా కిరణ్ అన్నారు. కొండపల్లి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఏపీలో గత వైకాపా, నేడు తెదేపాలు ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో దేశానికి కాంగ్రెస్ పార్టీ అవసరం ఎంతో ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే క్రమంలో ప్రాంతీయ కమిటీలను రద్దు చేశామన్నారు. వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు కొత్త కమిటీలను త్వరలో ఏర్పాటు చేయనున్నామన్నారు. కార్యక్రమంలో పురపాలిక, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులో 70 వేల టన్నుల ఇసుక

నందిగామ గ్రామీణం, కంచికచర్ల, న్యూస్‌టుడే: పాతకంచల స్టాకు పాయింట్ వద్ద 70 వేల టన్నుల ఇసుక అందుబాటులో ఉంచాలని జిల్లా సంయుక్త కలెక్టర్ నిధిమీనా ఆదేశించారు. బుధవారం పెండ్యాల, పాతకంచల ఇసుక నిల్వ పాయింట్లను ఆమె పరిశీలించారు. ఆర్డీవో బాలకృష్ణతో ఇసుక లభ్యత గురించి చర్చించారు. ఆమె మాట్లాడుతూ.. లబ్ధిదారులకు ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నందిగామ, కంచికచర్ల తహసీల్దార్లు సురేష్‌బాబు, జాహ్నవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపీడీవో రమణను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండలానికి ఇటీవల బదిలీపై వచ్చిన ఎంపీడీవో టీకేవీ రమణను ఎస్టీయూ నాయకులు బుధవారం ఆయన కార్యాలయంలో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో పి.రమేష్‌బాబు, ఎస్టీయూ జిల్లా కార్యదర్శి జి.అనుగ్రహప్రసాద్, మండల నాయకులు బి.అనిల్‌కుమార్, వై.మోహన కృష్ణ, వై.పిచ్చియ్య, ప్రేమ్ కుమార్, శేఖర్‌రెడ్డి, అబీబుల్లా, శ్రీనివాసరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దీక్షధారులకు అన్నప్రసాదం ప్రారంభం

తిరువూరు, న్యూస్‌టుడే: స్థానిక అయ్యప్పస్వామి దేవస్థానంలో బుధవారం తిరువూరు పరిసర గ్రామాలకు చెందిన 400 మంది స్వామి దీక్ష తీసుకున్నట్లు నిర్వాహకులు కె.సుబ్బారావు, ఎస్.రాజారావు తెలిపారు. ఈ సందర్భంగా అన్నప్రసాదం (సద్ది) కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు ప్రారంభించగా అయ్యప్ప దీక్షదారులు పాల్గొన్నట్లు చెప్పారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు ఆలయంలో అయ్యప్ప, భవాని దీక్ష తీసుకున్న భక్తులకు అన్నప్రసాదంలో పాల్గొనేందుకు టోకెన్లు జారీ చేస్తామన్నారు. గురుస్వామి ఘంటసాల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



ఆలయంలో మాలధారుల రద్దీ

సత్వరమే నష్టపరిహారం అందించండి



తహసీల్దారు వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందిస్తున్న బాధితులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: మూలపాడు గ్రామంలో వరద ముంపునకు గురై ప్రభుత్వ సాయం అందని వారికి వెంటనే నష్ట పరిహారం అందజేయాలని కోరుతూ తహసీల్దారు వెంకటేశ్వర్లుకు వరద బాధితులు బుధవారం వినతిపత్రం అందజేశారు. వరద ధాటికి పూర్తిగా నష్టపోయిన వారిలో ఇంకా 168 కుటుంబాలకు ప్రభుత్వ ఆర్థిక సాయం అందలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. పరిహారం అందని బాధితులను, గృహాలను తిరిగి పరిశీలించి అంచనాలు వేసి రూ.25 వేల పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలుగు యువత జిల్లా కార్యదర్శి గరికపాటి శివ, నాయకులు గంజి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ 'ప్రజా దర్బార్'కు వినతుల వెల్లువ

తాడేపల్లి, న్యూస్‌టుడే: వివిధ జిల్లాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను ఆయా ప్రాంతవాసులు మంత్రి లోకేశ్‌కు విన్నవించారు. గుంటూరు జిల్లా ఉండవల్లి నివాసంలో బుధవారం ఉదయం నిర్వహించిన 'ప్రజా దర్బార్'లో మంత్రి ప్రజల్ని నేరుగా కలుసుకుని వినతులు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి భరోసా ఇచ్చారు. ఎన్టీఆర్ జిల్లా కొత్తపేటలోని 1.10 ఎకరాల భూమిని నరసింహారావు అనే వ్యక్తి కబ్జాచేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని జి.వెంకటేశ్వరరావు మంత్రిని కలిసి ఫిర్యాదు చేశారు. * 45 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన 10.39 ఎకరాలు వ్యవసాయ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ప్రకాశం జిల్లా ఎర్రగుండపాలేనికి చెందిన వెన్నం బాలగంగాధర్‌తిలక్, తిరుపతి శ్రీవేంకటేశ్వర విద్యాలయంలో మూడేళ్లుగా పనిచేస్తున్న 30 మంది బోధనేతర సిబ్బందిని ఉద్యోగాల నుంచి తొలగించారని తిరిగి తమను విధుల్లోకి తీసుకోవాలని నాన్‌టీచింగ్ సిబ్బంది, ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరులోని పులివాగు ఆక్రమణలను తొలగించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన గుంటక సుబ్బారెడ్డి వినతులు ఇచ్చారు. తమకు వారసత్వంగా తమకు సంక్రమించిన 20 ఎకరాలు ఈనాం భూములను కొంతమంది ఆక్రమించారని కడప జిల్లా కసలపాడు మండలం ముద్దంవారిపల్లికి చెందిన గ్రామస్థులు ఫిర్యాదు చేశారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని ఊటుకూరు, కొణిజెర్ల, నెమలి, ఉమ్మడిదేవరపల్లి, గాదెవారిగూడెం, చింతల నర్వ గ్రామాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు డిస్కం ఏఈ వి.జగదీష్ తెలిపారు. కొత్త లైన్ల ఏర్పాటు నిమిత్తం సరఫరా బంద్ చేస్తున్నందున వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గొల్లపూడి, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా గొల్లపూడి సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం రెండు గంటల పాటు నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.రవీంద్రబాబు ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీనివాసనగర్, సిద్ధార్థనగర్, కోయపేట, తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

చివరి మజిలీకీ చిక్కులే..!

శ్మశానవాటికకు వెళ్లే మార్గం లేక ఇబ్బందులు

జి.కొండూరు, న్యూస్‌టుడే

మండల కేంద్రమైన జి.కొండూరులో హిందూ శ్మశానవాటికకు వెళ్లే కాలిబాట వంతెన నిర్మాణం చేపట్టేందుకు వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజులకే శంకుస్థాపన చేసి శిలాఫలకం వేశారు. కానీ ఐదేళ్లు అధికారంలో ఉన్నా పనులు ప్రారంభం కాక శిలాఫలకం వెక్కిరిస్తోంది. ఆ శ్మశానవాటికకు వెళ్లేందుకు పులివాగు దాటాల్సి రావడంతో వర్షాకాలంలో వాగు ప్రవాహం ఎక్కువ అవుతుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో మండల పరిషత్ నిధుల రూ.13 లక్షలతో 2019 జూన్ 30వ తేదీన కాలిబాట వంతెన నిర్మించేందుకు భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. మొదట్లో దీనిని కాలిబాట వంతెన నిర్మించేందుకు అంచనా వేయగా క్రమేపీ కొద్దిపాటి వాహనాలు నడిచేందుకు అనుకూలంగా విస్తరించాలనుకున్నారు. కానీ నేటికీ ఎటువంటి పనులు ప్రారంభం కాకపోవడంతో శ్మశానానికి వెళ్లేందుకు గ్రామస్థులు నరకయాతన పడుతున్నారు.



మోకాలి లోతు నీళ్లలో అంత్యక్రియలు చేసేందుకు వెళ్తున్న బంధువులు

కూటమి ప్రభుత్వంపై ఆశలు

ఇటీవల పులివాగు ప్రవహించే సమయంలో మోకాలి లోతు నీళ్లలో శ్మశానానికి వెళ్లి దహన సంస్కారాలు చేసేందుకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. మరికొందరు వరదల సమయంలో శ్మశానవాటికకు వెళ్లేందుకు వీలు కాక భౌతికకాయాలను చుట్టుపక్కల శ్మశాన వాటికలకు తరలించి కార్యక్రమాలు ముగించాల్సి వచ్చిందని గ్రామస్థులు వాపోతున్నారు. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం, అధికారులు తక్షణమే దీనిపై స్పందించి పనులు ప్రారంభించి వంతెన నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీవో బి.వి.రామకృష్ణనాయక్‌ను న్యూస్‌టుడే వివరణ కోరగా రూ.50 లక్షలు అంచనా వేసి ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు నివేదించామని.. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించి వంతెన నిర్మాణం చేపడతామని తెలిపారు.



గత ప్రభుత్వంలో వేసిన శిలాఫలకం

సత్వరమే వంతెన నిర్మించాలి



ఇటీవల వరదల సమయంలో పులివాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. అప్పుడే మా తండ్రి చనిపోతే శ్మశానవాటికకు వెళ్లేందుకు వీలుకాక మైలవరం శ్మశాన వాటికకు భౌతికకాయాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు చేశాం. అధికారులు తక్షణమే స్పందించి వంతెన నిర్మించాలి. **- పజ్జూరు శ్రీనివాసరావు**

వ్యయప్రయాసలు తప్పలేదు



గతంలో మా తండ్రి చనిపోయిన సమయంలో పులివాగు దాటికి వ్యవయప్రయాసలతో దశదిన కర్మకాండలు ఇబ్రహీంపట్నం ఫెర్రిలో జరిపించాను. గత ఐదేళ్లుగా ప్రభుత్వం వంతెన నిర్మాణం చేపట్టకుండా నిర్లక్ష్యం వహించింది. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం వంతెన నిర్మాణం చేపట్టాలి. **- ధార నరసింహారావు**



గుంటుపల్లి సమీపంలో జాతీయ రహదారిపై పడ్డ కంకర గుట్టలు

జారుతున్న కంకర.. నిబంధనలకు పాతర

ఇబ్రహీంపట్నం స్టోన్ క్రషర్ల నుంచి కంకరను రవాణా చేసే లారీల యజమానులు నిబంధనలు పాటించడంలేదు. కంకర రవాణా చేసే సమయాల్లో లారీల చోదకులు వేగాన్ని నియంత్రించేందుకు వేసే బ్రేకులకు పరిమితికి మించి లోడు చేస్తున్న కంకర రహదారిపై జారిపోతోంది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల గుంటుపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై పడిఉన్న కంకరపై ఓ ద్విచక్రవాహన చోదకుడు వెళ్లడంతో వాహనం అదుపుతప్పి కింద పడడంతో గాయాలపాలయ్యాడు. ఇబ్రహీంపట్నం రింగు సెంటరులో కూడా ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. రహదారి భద్రతా అధికారులతో పాటు పోలీసులు కూడా నిబంధనలకు విరుద్ధంగా కంకర రవాణా చేసే వాహనాలపై కేసులు నమోదు చేసి చోదకులకు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

పాస్ పుస్తకాలు మంజూరు చేయాలి




తహసీల్దారు ఆశయ్యకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, సీఐటీయూ నాయకులు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని పాత కొండూరు ఎస్సీ రైతులు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ సీఐటీయూ మండల కార్యదర్శి జె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు. ఆర్ఎస్ నంబరు 173లో సుమారు 50 ఎకరాల (పెదబీడు) భూమిలో 129 మంది వరకు సన్న, చిన్నకారు ఎస్సీ రైతులు ఎప్పటి నుంచో సాగు చేసుకుంటున్నట్లు వాపోయారు. ఆ భూముల సాగుదారుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసి పాసుపుస్తకాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దారు బి.ఆశయ్యకు వినతిపత్రం అందజేశారు. వి.వెంకటేశ్వరరావు, వి.సతీష్, సుజనరావు తదితరులు ధర్నాలో పాల్గొన్నారు.

బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ప్రతి పట్టభద్రుడు తమ ఓటును విధిగా నమోదు చేసుకోవాల్సిన బాధ్యత ఉందని సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్ అన్నారు. ఇబ్రహీంపట్నం జాకీర్‌హుస్సేన్ కళాశాలలో ఓటు నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సీపీఎం కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఓటు నమోదును చేయనున్నామన్నారు. ఫాం-18కి సంబంధించిన పత్రాలు అందజేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు సాధిక్, బేగ్, రవీంద్ర, నాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం అధ్యాపకులకు నమోదు పత్రాలు అందిస్తున్న సీఐటీయూ నాయకులు

నేటి నుంచి ఆఫ్‌లైన్ దరఖాస్తులు

తిరువూరు, న్యూస్‌టుడే: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదుకు స్థానిక ఏపీ ఎన్జీవో సంఘం కార్యాలయంలో గురువారం నుంచి ఆఫ్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తామని తిరువూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు ఎం.ప్రకాశ్‌బాబు తెలిపారు. అర్హత కలిగిన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఎన్జీవో కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు అందజేస్తే రెవెన్యూ కార్యాలయంలో ఓటు కోసం నమోదు చేయిస్తామన్నారు.

తిరువూరు, న్యూస్‌టుడే: ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు సంఘం ఆధ్వర్యంలో గురువారం తిరువూరులో ప్రైవేటు విద్యాలయాల్లో పనిచేస్తున్న పట్టభద్రులకు శాసన మండలి ఎన్నికల ఓటు నమోదుపై అవగాహన కల్పించినట్లు సంఘం ప్రతినిధులు ఇ.శ్రీనివాసరావు, బి.ఎస్.సత్యనారాయణ తెలిపారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగానికి అవసరమైన దరఖాస్తులను ఉచితంగా అర్హులకు అందజేసినట్లు తెలిపారు.



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి చెక్కు అందజేస్తున్న రామకృష్ణ, మురళీమోహనరావు తదితరులు

వరద బాధితులకు రూ.5 లక్షల విరాళం

విజయవాడ (సత్యనారాయణపురం), న్యూస్‌టుడే : ఇటీవల విజయవాడ బుడమేరు వరదల్లో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు వాకర్స్ ఇంటర్నేషనల్ తరపున ఉమ్మడి కృష్ణా జిల్లా వాకర్స్ గవర్నర్, న్యాయవాది చిన్నం రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం సచివాలయంలోని ముఖ్యమంత్రి చంద్రబాబుకు రూ.5 లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి.. వాకర్స్‌ను అభినందించారని రామకృష్ణ తెలిపారు. ప్రజల ఆరోగ్యం రీత్యా రాష్ట్రంలోని అన్ని కళాశాలలు, పాఠశాలల్లోని మైదానాల్లో వాకింగ్‌కు ఏర్పాట్లు చేసి, అనుమతులు మంజూరు చేయాలని సీఎంకు వినతి పత్రం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. చంద్రబాబు స్పందించి, దీనికి సంబంధించి త్వరలోనే తగు ఉత్తర్వులు జారీచేస్తామని హామీ ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఇంటర్నేషనల్ వాకర్స్ అధ్యక్షుడు మురళీమోహనరావు, రావి కృష్ణారావు, సూరిబాబు, మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

పట్టభద్రుల ఓటుందా..?

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి కదా.. మళ్లీ ఓట్లేంటీ అని అనుకుంటున్నారా... అవును. ఈ సారి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వంతు వచ్చింది. డిగ్రీ పూర్తిచేసిన వారే ఓటు వేయాలి. ఎలా నమోదు చేసుకోవాలి? దానికి ఏయే పత్రాలు అవసరమవుతాయి? ఆన్‌లైన్ ప్రక్రియ ఎలా ఉంటుంది... తదితర విషయాలు తెలుసుకుందాం.

ప్రస్తుతం ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా కె.ఎస్.లక్ష్మణరావు ఉన్నారు. ఆయన గడువు వచ్చే ఏడాది మార్చి 29తో ముగుస్తుంది. ఈలోపు కొత్తవారి ఎన్నికను పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటన విడుదల చేసింది. ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటికే తమ తమ అభ్యర్థులను ప్రకటించాయి. ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సైతం పోటీ పడుతున్నారు. ఈ ఎన్నికల్లో ఓటు వేయాలంటే.. పట్టభద్రులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలి.

అర్హతలు... ✪ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ లేదా డిప్లమో పూర్తిచేసి మూడు సంవత్సరాలు అయి ఉండాలి. ✪ 2021, నవంబరు ఒకటో తేదీ లోపు కోర్సు పూర్తవ్వాలి. ✪ ఆధార్ చిరునామా ఉన్న జిల్లాలో ఓటరుగా నమోదు చేసుకోవాలి.





నమోదు.. సులువే

ఆన్‌లైన్‌లో..

ముందుగా ఫొటో, డిగ్రీ/డిప్లమో పట్టాల సాఫ్ట్ కాపీని సిద్ధంగా ఉంచుకోండి. గూగుల్ బ్రౌజర్‌లో https:/// ceoandhra.nic.in లోకి వెళ్లాలి. 'ఎమ్మెల్సీ ఇ రిజిస్ట్రేషన్ 2024' అనే దానిపై క్లిక్ చేస్తే.. 'గ్రాడ్యుయేట్స్ (ఫారం 18)' వస్తుంది. దాన్ని క్లిక్ చేయగా, కొత్త పేజీ ఓపెన్ అవుతుంది. మీ పేరు, ఫోన్ నంబరు, పాస్‌వర్డ్, ఇతర వివరాలతో పాటు 'క్యాప్చ' నమోదు చేయాలి. 'కంటిన్యూ' క్లిక్ చేస్తే.. మీ చరవాణికి ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేస్తే మీరు రిజిస్టర్ అయినట్లే. ఆ తర్వాత మీ ఫోన్ నంబరు, మీరు క్రియేట్ చేసుకున్న పాస్‌వర్డ్‌తో లాగిన్ అవ్వాలి. ఫారం 18 ఆన్‌లైన్ దరఖాస్తు వస్తుంది.

ఇలా పూర్తి చేయాలి...

జిల్లా పేరు, ఫొటో, మీ పేరు, ఇంటి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, లింగం, విద్యార్హతలు, వృత్తి నమోదు చేయాలి. ఇంటి చిరునామా, ఓటరు కార్డు, ఆధార్, నియోజకవర్గం వివరాలు పూర్తి చేయాలి. డిగ్రీ/డిప్లమో ఏ యూనివర్సిటీలో చదివారో నమోదు చేసి, సదరు పట్టాను అప్‌లోడ్ చేయాలి. చరవాణి నంబరు, మెయిల్ ఐడీ నమోదు చేసి.. సబ్మిట్ చేయాలి. మీ దరఖాస్తు ఎన్నికల సంఘానికి వెళుతుంది. మీ దరఖాస్తుకు ఒక సీరియల్ నంబరు కేటాయిస్తారు. దాని ప్రకారం స్టేటస్ కూడా తెలుసుకోవచ్చు. అధికారుల పరిశీలన అనంతరం.. పట్టభద్రుల ఓటరుగా గుర్తిస్తారు.

గడువు వివరాలు..

- ఆఖరి తేదీ : నవంబరు 6
- ముసాయిదా జాబితా : నవంబరు 23
- అభ్యంతరాల స్వీకరణ : డిసెంబరు 9వరకు
- తుది ఓటర్ల జాబితా : డిసెంబరు 30

గతంలో దరఖాస్తు చేసుకున్నా...

గత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకున్న వారు సైతం మళ్లీ.. కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిందే. పాత ఓటర్ల జాబితా రద్దవుతుంది. ఎప్పటికప్పుడు కొత్త జాబితాతోనే ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహిస్తారు. పట్టభద్రులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి.



2019 ఎన్నికలకు..

పట్టభద్రుల ఎన్నికల్లో (2019) సుమారు రెండు లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,49,319 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2025 ఎన్నికలకు 4 లక్షల మందిని ఓటర్లుగా చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

రైల్వేస్టేషన్‌లో భద్రత డొల్ల!

- బ్లేడ్, గంజాయి బ్యాచ్ హవా
- భయాందోళనలో ఉద్యోగులు

విజయవాడ, న్యూస్‌టుడే

విజయవాడ రైల్వేస్టేషన్‌తో పాటు రైల్వే యార్డులు గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌కు అడ్డాగా మారాయి. నిత్యం జనసంచారం ఎక్కువగా ఉండే రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఇటీవల లోకోపైలెట్ హత్య ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గత రెండేళ్లలో రైల్వే ప్రాంగణంలో సుమారు 6 హత్యలు చోటు చేసుకోవడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. రైల్వే పోలీసుల పర్యవేక్షణ అంతంతగా మాత్రంగా ఉండడంతో సంఘ విద్రోహ శక్తులు పేట్రేగిపోతున్నాయి. ప్రయాణికులు, రైల్వే సిబ్బందిపై దాడులకు పాల్పడుతూ భయాందళన సృష్టిస్తున్నారు.

☛ రైల్వేస్టేషన్ సమీపంలోని నైజాంగేట్ లెవల్ క్రాసింగ్‌ను పూర్తిగా మూసివేయడంతో ఆ ప్రాంతం గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌కు ఆవాసంగా మారింది. రాత్రి వేళ మద్యం, గంజాయి మత్తులో దాడులకు పాల్పడుతూ హత్యలు సైతం చేస్తున్నారు. దీంతో రైల్వే సిబ్బంది విధులకు వెళ్లాలంటే ఆందోళనకు గురవుతున్నారు. రైల్వే లోకోపైలెట్లు, గార్డులు, టీటీఈలు ఇతర రన్నింగ్ సిబ్బంది రాత్రి సమయాల్లో ఎక్కువగా విధులకు వెళ్లాల్సి ఉంటుంది. దీన్ని ఆసరాగా తీసుకుంటూ దాడులకు పాల్పడుతున్నారు.

☛ రైల్వేస్టేషన్ సమీపంలోని బొగ్గులైను రైల్వే కాలనీ, ఆర్ఈ కాలనీ, అప్‌యార్డ్ కాలనీ, సత్యనారాయణపురం రైల్వే కాలనీల నుంచి నిత్యం ఉద్యోగుల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి.



వేధిస్తున్న పోలీసు సిబ్బంది కొరత..

రైల్వే పరిధిలోని ప్రాంతాల్లో నిఘా భద్రత తమది కాదని స్థానిక పోలీసులు వదిలివేస్తున్నారు. దీంతో ఉద్యోగుల భద్రత సవాలుగా మారుతోంది. విజయవాడ రైల్వే ప్రాంగణాలు సత్యనారాయణపురం, వన్‌టౌన్, కొత్తపేట, అజిత్‌సింగ్‌నగర్ పోలీస్టేషన్ల పరిధిలో ఉన్నాయి. రైల్వే పరిధిలో జరిగే నేరాలపై జీఆర్పీ పోలీసులు కేసులు నమోదు చేస్తారు. అయితే సిబ్బంది కొరత కేసుల దర్యాప్తుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రైళ్లు, స్టేషన్లలో దొంగతనాలు, రైల్వే పరిసరాల్లో అనుమానాస్పద మృతి కేసులు, రైళ్లలో ఎస్కాట్ డ్యూటీలు నిర్వహించేందుకే వారికి సిబ్బంది సరిపోవడం లేదు. జీఆర్పీ పోలీస్టేషన్‌లో ప్రస్తుతం సిబ్బంది కొరత అధికంగా ఉంది. సుమారు 100 మంది వరకు సిబ్బంది కావాల్సి ఉంటుంది. కనీసం మూడో వంతు సిబ్బంది కూడా లేకపోవడంతో భద్రతను పూర్తిగా వదిలివేశారు. దక్షిణ మధ్య రైల్వేలోనే అత్యధిక ఆదాయాన్ని తెచ్చిపెట్టే విజయవాడ రైల్వేస్టేషన్‌లో భద్రతా ఏర్పాట్లు ఎక్కడా సరిగా లేవు.

☛ విజయవాడ రైల్వేస్టేషన్‌లోని రిజర్వేషన్ కార్యాలయంలో రాత్రి సమయాల్లో బ్లేడ్ బ్యాచ్ సభ్యులు నేరుగా వచ్చి ప్రయాణికులను బెదిరించి డబ్బులు, సెల్‌ఫోన్లు లాక్కుంటున్నారు. రాత్రి 12గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి.

☛ రైల్వేస్టేషన్ నుంచి డీఆర్ఎం కార్యాలయం మీదగా ఖుద్దూస్‌నగర్ రహదారి రాత్రి సమయాల్లో నిర్మానుష్యంగా ఉంటుంది. ఇక్కడ నిత్యం ఉద్యోగులపై దాడులు జరుగుతుంటాయి. ఇటీవల విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్ద హత్య కూడా జరిగింది.

☛ నైజాం గేటు, కేదారేశ్వరపేట ఎర్రకట్ట రహదారి, ఫోర్‌మెన్ బంగ్లా, రైల్వే యార్డు, డీజిల్ లోకోషెడ్డు, ఎలక్ట్రిక్ లోకోషెడ్డు, పంజాసెంటర్ వైపు, తారాపేట రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఇక్కడ రాత్రి సమయాల్లో ప్రజలు తిరగలేని పరిస్థితి ఉంది. పోలీసు నిఘా అసలు ఉండదు.

☛ రైల్వేస్టేషన్ నుంచి రైల్వే ఆసుపత్రి, రైల్వే ఎస్పీ కార్యాలయం, రోడ్డు, నాపరాళ్ల డిపో, రైల్వే ఆర్ఈ కాలనీ రోడ్ ప్రాంతాల్లోనూ బ్లేడ్ బ్యాచ్ సభ్యులు సంచారం ఎక్కువ.

☛ రైల్వే యార్డుతో పాటు నిర్మానుష్య ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో భద్రత కట్టుదిట్టం చేయాలి. చీకటిగా ఉన్న ప్రాంతాల్లో ఎక్కువ సంఖ్యలో వీధి దీపాలు, ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలి. గస్తీ పెంచాలి.

దుర్గగుడి హుండీ ఆదాయం రూ.3.50 కోట్లు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల్లో శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో బుధవారం లెక్కించారు. 15 రోజుల్లో హుండీల్లో సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.3.50 కోట్ల ఆదాయం వచ్చింది. భక్తులు 272 గ్రాముల బంగారం, 9.325 గ్రాముల వెండి వస్తువులను మొక్కుల రూపంలో చెల్లించుకున్నారు. విదేశీ కరెన్సీ 285 యూఎస్ఏ డాలర్లు, 50 కెనడా డాలర్లు, 20 ఇంగ్లాండ్ పౌండ్లు, 5 కువైట్ దీనార్లు, 6 సింగపూర్ డాలర్లు, 15 సౌది రియాల్స్, 160 ఆస్ట్రేలియా డాలర్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కానుకల్లో అమ్మవారికి సమర్పించేందుకు నోట్ల దండను కూడా మొక్కు రూపంలో చెల్లించుకున్నారు. లెక్కింపును ఈవో రామారావు, డిప్యూటీ ఈవో రత్నంరాజు పర్యవేక్షించారు.



కానుకల లెక్కింపులో వచ్చిన నోట్ల దండను పరిశీలిస్తున్న ఈవో రామారావు



అలరించిన కూచిపూడి నృత్యం

ఇంద్రకీలాద్రిపై ధర్మపథం కార్యక్రమంలో భాగంగా కళావేదికపై బుధవారం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను అలరించింది. విజయవాడకు చెందిన కళాకారిణులు సుదేష్ణ, గ్రీష్మప్రియ, హరిణి ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. సిబ్బంది వారికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి ప్రసాదాలను అందజేశారు.

20న 'రైతు నేస్తం' పురస్కారాల ప్రదానోత్సవం

కొర్నెపాడు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలంలోని కొర్నెపాడు, హైదరాబాద్‌లలో ఉన్న 'రైతు నేస్తం' ఫౌండేషన్ 20వ వార్షికోత్సవం సందర్భంగా పద్మశ్రీ ఐవీ సుబ్బారావు స్మారక పురస్కారాల ప్రదానోత్సవాన్ని ఈ నెల 20న నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ఛైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. కృష్ణాజిల్లా గన్నవరంలోని స్వర్ణభారతి ట్రస్ట్ వేదికగా జరిగే ఈ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతుల మీదుగా పురస్కారాల ప్రదానం ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన కూడా ఉంటుందని, వ్యవసాయ రంగంలో కృషి చేసిన వారిని గౌరవించుకోవడం ఆనందదాయకమని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విశిష్ట అతిథిగా హాజరయ్యే ఈ కార్యక్రమంలో ముప్పవరపు ఫౌండేషన్ ఛైర్మన్ ముప్పవరపు హర్షవర్ధన్ పాల్గొంటారని వెంకటేశ్వరరావు వివరించారు.

పీఎం ఇంటర్న్‌షిప్‌కు వేళాయె...

- ఉమ్మడి కృష్ణా విద్యార్థులకు ప్రయోజనం
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

కానూరు, రామవరప్పాడు, న్యూస్‌టుడే

యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఇంటర్న్‌షిప్ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఏటా రూ.66 వేలు చొప్పున ఐదేళ్ల పాటు దేశవ్యాప్తంగా కోటి మంది విద్యార్థులకు ఆర్థిక లబ్ధి చేకూరే విధంగా రూపొందించిన ఈ పథకాన్ని 2024-25లో పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్నారు. నెలకు రూ.5వేలు చొప్పున ఏడాదికి 60 వేల ఆర్థిక సాయానికి అదనంగా మరో రూ.6వేలు గ్రాంటు ఇస్తారు. ఇందుకు సంబంధించిన ఈ వెబ్ పోర్టల్ అక్టోబరు 12 నుంచి ప్రారంభించారు. ఈ నెల 25 వరకు అభ్యర్థులు వెబ్‌పోర్టల్‌లో తమ సమాచారంతో దరఖాస్తు చేయవచ్చు. ఈ పథకం వల్ల ఉమ్మడి కృష్ణాలో ఎక్కువ మంది విద్యార్థులు ప్రయోజనం పొందే అవకాశం ఉంది.





ఉమ్మడి కృష్ణా జిల్లాలో విద్యార్థులు (21- 24 వరకు)

డిగ్రీ పూర్తి చేసినవారు	50,000
ఐటీఐ	15,000
డిప్లొమా	15,000

వికసిత్ భారత్ లక్ష్యం

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతలో సరైన నైపుణ్యాలు లేవని నిపుణులు, పారిశ్రామికవేత్తలు చెబుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని డిగ్రీ చేసిన వారికి తగిన నైపుణ్యాలు అందించడానికి ఈ పథకం రూపకల్పన చేశారు. వికసిత భారత్ లక్ష్యంగా నైపుణ్యాలు అందించే ప్రక్రియలో భాగంగా ఈ ఇంటర్న్‌షిప్ దోహదపడనుంది.

టాప్- 500 సంస్థల్లో ఎంపిక

ఇంటర్న్‌షిప్‌నకు ఎంపికైన అభ్యర్థులను దేశంలోని టాప్- 500 సంస్థల్లో ఎంపిక చేస్తారు. గత 3 ఏడేళ్లలో కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) నిధిలో భాగంగా తమ నికర లాభాల్లో కొంతమేర సమాజసేవ నిమిత్తం సవ్యంగా ఖర్చు చేసిన టాప్- 500 సంస్థలను ఈ పథకం నిమిత్తం కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది.

దరఖాస్తు చేసుకోండిలా..

పీఎంఇంటర్న్‌షిప్ డాట్ఎంసీఏడాట్‌జీవోవీడాట్ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అక్టోబరు 12 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఇది ఈ నెల 25 వరకు కొనసాగుతుంది. 26న షార్టు లిస్టుచేస్తారు. అనంతరం 27 నుంచి నవంబర్ 7 వరకు అభ్యర్థులకు ఇంటర్న్‌షిప్ చేయడానికి సంస్థను కేటాయించనున్నారు. అనంతరం నవంబరులో ఆఫర్ లెటర్లు అందిస్తారు. డిసెంబరులో సంబంధిత సంస్థల్లో కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఈ పథకంలో కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్ విధానం అమలు చేస్తుంది.

కావాల్సిన పత్రాలు

దరఖాస్తు చేయడానికి ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, విద్యార్హత పత్రాలు తప్పనిసరిగా ఉండాలి. అభ్యర్థికి గరిష్ఠంగా 3 ఎంపికలు అందిస్తారు. ఎంపికైన వారికి ప్రముఖసాఫ్టువేర్ సంస్థలు, బహుళ జాతి సంస్థలు, గ్యాస్, చమురు, ఇంధనరంగం, టూర్స్ అండ్ ట్రావెల్స్, ఆతిథ్య రంగాల్లో అవకాశాలు ఇస్తారు.

ఎవరు అర్హులంటే?

- 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, లేదా బీఏ, బీఎస్సీ, బీకాం, బీసీఏ, బీబీఏ, బీఫార్మా చదివిన అభ్యర్థులు ఈ పథకానికి అర్హులు. విద్యార్థుల వయసు 21- 24 ఏళ్ల మధ్య ఉండాలి. ఎంపికైన వారికి సంవత్సరం ఇంటర్న్‌షిప్ అందిస్తారు. సగం కాలం పరిశ్రమల్లో వాస్తవ పని అనుభవం లేదా ఉద్యోగ వాతావరణంలో గడపాల్సి ఉంటుంది.

వీరు అనర్హులు

- తల్లిదండ్రులు లేదా భార్యా భర్తలు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నవారు.
- కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షల కంటే ఎక్కువ ఉన్నవారు.
- పూర్తి సమయం కోర్సులు చదువుతున్న వారు.
- ఐఐటీ, ఐఐఎం, నేషనల్ లా విశ్వవిద్యాలయం, ఎన్ఐటీ, ఐఐఐటీలు, సీఏ, ఎంబీబీఎస్, బీడీఎస్, ఎంబీఏ, సీఎస్, డిగ్రీలు పొందినవారు.
- వృత్తిపరమైన డిగ్రీలు చేసిన వారు.
- ఏదైనా స్కిల్ అప్రెంటీస్‌షిప్ చేసిన వారు.

సివిల్స్ పరీక్షల్లో విద్యార్థులు రాణించాలి

కానూరు, న్యూస్‌టుడే : సివిల్స్ పోటీ పరీక్షల్లో ఈ ప్రాంత విద్యార్థులు ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం కానూరు బందరు రోడ్డులో టైమ్ ఆస్పత్రి సమీపంలో ప్రతిభ సివిల్స్ అకాడమీని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. నగరం ఎడ్యుకేషన్ హబ్‌గా మారుతుందన్నారు. ఇప్పుడు దూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా సివిల్స్, ఇతర పోటీ పరీక్షలకు ఇక్కడే నాణ్యమైన కోచింగ్ ఇచ్చే సంస్థ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆర్టీసీ ఛైర్మన్ నారాయణ మాట్లాడుతూ.. గత 20 ఏళ్లుగా ఎంతో మందిని ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దిన సుధాకర్ ఇప్పుడు ఈ సివిల్స్ కోచింగ్ సంస్థ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. అకాడమీ డైరెక్టర్ సుధాకర్ మాట్లాడుతూ.. ఇంటర్, డిగ్రీ స్థాయి నుంచే సివిల్స్ కోచింగ్ ద్వారా విద్యార్థులు సులువుగా సివిల్స్‌లో విజయం సాధించవచ్చన్నారు. ప్రొఫెసర్ డి.సూర్యచంద్రరావు వెబ్‌సైట్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అశోక్, డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ దేవానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ సివిల్స్ అకాడమీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి కొల్లు, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల, డైరెక్టర్ సుధాకర్ తదితరులు

ఇతర దేవాలయాల లడ్డూలు ఉచిత ప్రసాదానికి వినియోగం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇతర దేవాలయాల నుంచి తీసుకువచ్చిన లడ్డూ ప్రసాదాలను అమ్మవారికి నివేదించి భక్తులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు దుర్గగుడి ఈవో రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. దసరా ఉత్సవాల్లో ఉచిత లడ్డూ ప్రసాదాల వితరణను ప్రారంభం నుంచి కొనసాగించినందున విజయదశమి రోజు కొంత మేర ఉచిత లడ్డూ ప్రసాదాల పంపిణీకి ఆటంకం ఏర్పడింది. 13, 14 తేదీల్లో ఉచిత ప్రసాద పంపిణీకి కొరత ప్రభావాన్ని నివారించేందుకు మోపిదేవి, పెదకాకాని, పెనుగంచిప్రోలు దేవస్థానాల నుంచి 37 వేల లడ్డూలను దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్వీకరించామన్నారు. వాటిని ఉచిత ప్రసాదంగా పంపిణీ చేశామని ఈఓ పేర్కొన్నారు. 27,10,225 లడ్డు ప్రసాదాలను దేవస్థానం కౌంటర్లలో విక్రయించినట్లు తెలిపారు. దేవస్థానం పరిధిలోని రెండు పాయింట్ల వద్ద పరిమితికి మించి లడ్డూలను తయారు చేసి భక్తులకు అందించామని ఈవో పేర్కొన్నారు.

కోకో సాగులో సవాళ్లు అధిగమించేందుకు కృషి

పటమట, న్యూస్‌టుడే: సమష్టి కృషితోనే కోకో సాగులో సవాళ్లను అధిగమించి, అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయంతో రైతులకు మేలు చేయవచ్చని శాస్త్రవేత్తలు, అధికారులు అన్నారు. కోచి కేంద్రంగా పనిచేస్తున్న డైరెక్టరేట్ ఆఫ్ క్యాష్యూనట్ అండ్ కోకో డెవలప్‌మెంట్, ఆంధ్రప్రదేశ్ ఉద్యాన శాఖ సంయుక్తంగా బుధవారం విజయవాడలోని హోటల్ పార్క్ ఎన్‌లో కోకో పంటపై భాగస్వామ్య పక్షాల సదస్సు నిర్వహించారు. డీసీసీడీ డైరెక్టర్ డాక్టర్ ఫెమీనా, ఏపీ ఉద్యాన శాఖ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులుతో పాటు రైతులు, శాస్త్రవేత్తలు, మార్కెటింగ్ ఏజెన్సీలు, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొని కోకోకు సంబంధించి విత్తు నుంచి విక్రయం వరకు ఎదురవుతున్న సమస్యలు, అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. నాణ్యమైన మొక్కలు, బీన్స్ ఉత్పత్తి, విలువ జోడింపు, పంట కోత అనంతరం నిర్వహణ, కోకో అభివృద్ధికి సమగ్ర వ్యూహాలు తదితరాలపై మాట్లాడారు. శ్రీనివాసులు మాట్లాడుతూ.. అధిక నాణ్యత గల మొక్కల ఉత్పత్తికి కోకో క్లోనల్ ఆర్చర్డ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. కోకో సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ఉద్యాన శాఖ, డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీతో కలిసి ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. కోకో పంట విస్తరణ, బీన్స్ ఆరబోత, చాక్లెట్ల ఉత్పత్తికి కోకో పౌడర్ ఆధారిత పరిశ్రమల స్థాపనకు ఉద్యాన శాఖ రైతులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ఉద్యానశాఖ అదనపు డైరెక్టర్లు ఎం.వెంకటేశ్వర్లు, బాలాజీ నాయక్, హరినాథ్‌రెడ్డి, సహాయ సంచాలకులు సుధ, తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలు పరిశీలిస్తున్న డీసీసీడీ డైరెక్టర్ ఫెమీనా, ఏపీ ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు

నేటి నుంచి దక్షిణ మండల అథ్లెటిక్స్

ఎ.ఎన్.యు: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏఎన్‌యూలోని సింథటిక్ మైదానంలో నిర్వహించే ఈ పోటీల్లో ఆరు రాష్ట్రాలు, ఒక కేంద్ర ప్రాంతానికి చెందిన 848 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు.

ముంబయి పోలీసుల పేరుతో టోకరా

అరెస్టు చేస్తామని రూ.23.8 లక్షల వసూలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఓ నేరస్థుడు మీ బ్యాంకు ఖాతాలోకి రూ.30 లక్షలు పంపాడని, మిమ్మల్ని అరెస్టు చేస్తామని సైబర్ నేరగాళ్లు బెదిరించి ఓ వృద్ధుడి నుంచి రూ.23.80 లక్షలు వసూలు చేశారు. వివరాల్లోకి వెళితే.. విజయవాడ నగర శివారు రామవరప్పాడుకు చెందిన ఓ వృద్ధుడు (80) ప్రభుత్వ ఉద్యోగం చేసి, రిటైరయ్యారు. ఆయనకు గత నెల 9వ తేదీన గుర్తు తెలియని నంబరు నుంచి ఫోన్ వచ్చింది. తాను ముంబయి టెలికం డిపార్ట్‌మెంట్ నుంచి మాట్లాడుతున్నానని అవతలి వ్యక్తి చెప్పాడు. ముంబయి డౌన్‌గ్రివాలా పోలీస్‌స్టేషన్ ఎస్సైతో కాన్ఫరెన్స్ కలిపాడు. మరో వ్యక్తి తాను ఎస్సైగా పరిచయం చేసుకున్నాడు. రాజ్‌కుంద్రా అనే వ్యక్తి.. మీ పేరుతో కెనరా బ్యాంకులో ఖాతా తెరిచాడని చెప్పాడు. ఆ ఖాతాకు రూ.30 లక్షలు పంపినట్లు తమ దర్యాప్తులో చెప్పాడని, దీనిపై విచారించాలంటూ వృద్ధుడిని భయపెట్టాడు. అరెస్టు చేస్తామని.. దీన్ని తప్పించుకోవాలంటే రూ.30లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశాడు. భయపడిపోయిన వృద్ధుడు.. వారి మాటలు నమ్మి విడతల వారీగా నాలుగు బ్యాంకు ఖాతాలకు రూ.23.80 లక్షలు పంపించారు. ఆ తర్వాత మోసపోయినట్లు గుర్తించి మంగళవారం సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేశారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు జిల్లా జట్లు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక కేబీసీ జడ్పీహెచ్ స్కూల్ మైదానంలో బుధవారం ఎస్‌జీఎఫ్ జిల్లా అండర్-17 బాలబాలికల వాలీబాల్ జట్లను ఎంపిక చేశామని జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు (ఎన్టీఆర్), డి.శ్రీనివాసరావు (కృష్ణా) తెలిపారు. ఎంపిక పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లాలోని సుమారు వంద మంది క్రీడాకారులు తలపడ్డారని పేర్కొన్నారు. వారిలో ప్రతిభగల క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. వారంతా ఈ నెల 21 నుంచి శ్రీసత్యసాయి జిల్లా హిందూపూర్ మండలం ముదిరెడ్డిపాడు జడ్పీహెచ్ స్కూల్ మైదానంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడుతారని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులను ప్రధానోపాధ్యాయిని జి.ఎస్తేర్‌రాణి, స్కూల్ ఎస్ఏ పీఈ ఎల్.దుర్గారావు, పీఈటీ సింహాద్రి రమేష్, ఎస్‌జీఎఫ్ సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్ అభినందించారు.



బాలబాలికల జట్లతో ఎస్తేర్‌రాణి, దుర్గారావు, రమేష్, శ్రీనివాసరావు తదితరులు

బాలికల జట్టు: పి.అమృత, ఆర్.మేధాశ్రీ, ఎం.రిషిక, సీహెచ్ తన్విశ్రీ, డి.వెన్నెల, కె.మైనశ్రీ, ఎం.మధుర మీనాక్షి, పి.వాగ్దేవి, ఎం.తన్వీక లక్షనాగశ్రీ, సీహెచ్ స్వప్నకుమారి, ఎల్.కీర్తన, కె.స్నేహలత, స్టాండ్‌బైగా పి.మౌనిక, సీహెచ్ యశస్వి, ఎస్.చరిష్మా, ఎన్.హర్షవర్ధని, ఎం.భాగ్యలక్ష్మి, ఎం.అనన్య.

బాలుర జట్టు: పి.సాయి చరణ్, బి.బాల వెంకటేష్, ఎల్.సిద్ధూ, పి.చైతన్యకుమార్, కె.ఆకాష్, ఎన్.జయవర్ధన్, జె.భవానీప్రసాద్, ఎస్‌కే ఇర్ఫాన్, బి.నందకిషోర్, ఆర్.ప్రజ్వల్, వి.నివాస్, బి.సందీప్, స్టాండ్ బైగా ఎం.మనోజ్, కె.రవికుమార్, బి.సంతోష్, ఎం.అరవింద్, పి.ప్రదీప్, వి.యుగేంద్రవర్మ.

మీరైతే ఏం చేస్తారు?

కొందరు పిల్లలు తెగ గోళ్లు కొరుకుతుంటారు. వారించినా వినరు. బెదిరిస్తే చాటుమాటుగా అయినా కొరికేస్తుంటారు. ఈ అలవాటును మాన్పించిన వారిలో కొందరి అనుసరణీయ చిట్కాలివీ...


చేదు రాసి, తినేవి ఇచ్చి...

ఎలాగో తెలియదు కానీ మా పాపకి ఏడాదిన్నరకే గోళ్లు కొరకడం అలవాటైంది. గోరుచుట్టూ చర్మాన్నీ వదిలేది కాదు. ఎంత వారించినా వినదే! అందుకని కాకరకాయ, వేపాకు, కరక్కాయ రసాలు తీసి చేతులకు రాయడం మొదలుపెట్టా. ఆ చేదుకి వేళ్లు నోట్లో పెట్టుకోవడానికి వీలవ్వట్లేదని తెగ ఏడ్చేది. తరవాత్తరవాత మిల్లెట్స్, నువ్వులు, రాగులు, బెల్లం వంటివాటితో చేసిన చక్రాలు లాంటివి ఏదో ఒకటి చేతిలో ఉంచడం మొదలుపెట్టా. అప్రయత్నంగా అయితే వాటిని నోట్లో పెట్టుకునేది. చక్రాలు లాంటివైతే తినేది కానీ చేత్తో అన్నం తినడానికే భయపడేది... ఎక్కడ చేదు తగులుతుందోనని! దీంతో స్పూను ఇచ్చి తినేలా చేశాం. ఎలాగైతేనేం ఆ చేదు భయంతో వేళ్లు పెట్టుకోవడం, గోళ్లు కొరకడం మాత్రం తగ్గాయి.

– వై. రాజ్యలక్ష్మి, వైజాగ్

వీడియో చూపించా కానీ...

మావాడికి ఆరేళ్లు వచ్చేదాక అలా గోళ్లు కొరకకూడదురా అని చెప్పినా వినేవాడు కాదు. కోప్పడతానని దుప్పట్లో దూరో... మంచం వెనక దాక్కునో మరీ కొరికేవాడు. అందుకే ఓరోజు గోళ్లల్లోకి మట్టి, క్రిములు ఎలా చేరతాయో వీడియో చూపించా. దాంతో వాడికే చిరాకుగా అనిపించి నోట్లో పెట్టుకునేవాడు కాదు. కానీ లెక్కలు చేస్తున్నా... ఏదైనా ఆలోచిస్తున్నా... లీనమై టీవీ చూస్తున్నా తెలియకుండానే కొరికేవాడు. అందుకే ఎప్పుడూ వాడి చేతిలో చిన్న బొమ్మ కానీ రాయి కానీ ఉండేలా చూడటం మొదలుపెట్టా. చేతిలో ఒక వస్తువు ఉందన్న ఊహ నోట్లో వేళ్లు పెట్టకుండా చేసేది. పొరపాటున ఏదీ చేతిలో లేకపోతే భుజం తట్టడమో ఏదైనా శబ్దం చేయడమో చేస్తా. వెంటనే నోట్లో వేళ్లు పెట్టా అని గ్రహించి తీసేసేవాడు. చాలాసార్లు మనం వినట్లేదని కోప్పడతాం కానీ వాళ్లూ తెలియకే చేస్తారు. అరిచామన్న కోపంతోనూ కొనసాగించొచ్చు. అందుకే నెమ్మదిగా చెప్పడమే దీనికి మంచి పరిష్కారం.



– జి. రమ్య, హైదరాబాద్



బంగారం-వెండి

16న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ.లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	7,140	7,095
వెండి (గ్రా)	103.00	103.00

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం (24క్యా)	78,840	78,370	75,875	75,730	78,000	77,750	78,500	78,200	77,600	77,120
ఆర్నమెంట్	72,200	71,750	71,400	70,950	72,230	71,950	72,250	71,940	71,400	70,950
వెండి (కిలో)	94,531	93,375	93,600	92,500	93,000	92,200	93,000	92,500	94,000	94,000

వీడియో రెజ్యూమె... దశ మార్చింది!



జెన్-జీ... ఈతరం ఆలోచనలే వేరు! ప్రతి విషయాన్నీ కొత్తగా, సృజనాత్మకంగా ఆలోచిస్తుంది. అలాంటి అమ్మాయే లైబా ఫతే కూడా. సాధారణంగా కంపెనీలకు ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవడానికి అందరూ పాటించే పద్ధతి రెజ్యూమె, సీవీ (కరిక్యులమ్ విటే)లే. అయితే, ఆ పద్ధతులకు స్వస్తి చెబుతూ తనను తాను కొత్తగా ప్రజెంట్ చేసుకోవాలనుకుంది లైబా. తన నైపుణ్యాలను, ఉద్యోగ అర్హతలను అందరిలా కాకుండా, రెజ్యూమెను వీడియో రూపంలో పొందుపరిచింది. దానికి జతగా తను ఆ ఉద్యోగానికి ఎందుకు అర్హురాలో కూడా వివరంగా రాసి లింక్డిన్‌లో ఉంచింది. ఈ దరఖాస్తును పరిశీలించిన ఆ ఘోస్ట్ రైటింగ్ కంపెనీ సీఈఓ తస్లీమ్ అహ్మద్ ఫతే... ఈమె వినూత్న ఆలోచనకు, ఆత్మ విశ్వాసానికి ఫిదా అయ్యారు. దాంతో 800మంది అభ్యర్థుల్లో లైబాను ఎంపిక చేసుకున్నారు. ఆయన నమ్మకానికి తగినట్లే లైబా కూడా అద్భుత పనితీరును ప్రదర్శించింది. కేవలం ఆరు నెలల్లోనే కంపెనీలో ఈక్విటీ పార్టనర్‌గా పదోన్నతినీ సాధించింది. ప్రస్తుతం ఏజెన్సీ పనులన్నింటినీ లైబానే పర్యవేక్షిస్తోందట. ఈ ప్రయాణం మొత్తాన్నీ కంపెనీ సీఈవో తస్లీమ్ లింక్డిన్‌లో పోస్టు చేశారు. 'నా జీవితంలో నేను చేపట్టిన ఉత్తమ నియామకం ఇదే. అది కూడా ఎలాంటి అనుభవం లేనివారిని. అచ్చమైన జెన్-జీ స్టైల్‌లో ఆమె రెజ్యూమె కూడా ఇవ్వలేదు. అంతకంటే అద్భుతంగా వీడియోను రూపొందించింది. నేర్చుకుంటే నైపుణ్యాలు అందరికీ వస్తాయి. కానీ, నేర్చుకోవాలనే ఉత్సుకత, పట్టుదల ఉన్న అభ్యర్థులను ఎంచుకోవడం కీలకం. అలాంటి వారికి మేనేజర్లు అవకాశం ఇవ్వాలి' అంటూ పోస్టు చేశారు. దీన్ని చూసిన వాళ్లు 'మన యువతలో చాలా సామర్థ్యం ఉంటుంది. వాళ్లకు కావాల్సిందల్లా కొంత మార్గనిర్దేశం మాత్రమే' అని కామెంట్లు పెడుతున్నారు. ఏది ఏమైనా ఈతరం అమ్మాయిలు అవకాశాలను అందిపుచ్చుకోవడంలో, క్రియేటివ్‌గా ఆలోచించడంలో ముందు ఉంటున్నారనడానికి లైబా ఓ ఉదాహరణ.



సినిమాల్లో చూపించినట్లు రాయలసీమ అంటే ముఠా కక్షలు, బాంబుల మోతలు, గాల్లో ఎగిరే సుమోలు కాదు. రాయలసీమ అంటే రతనాల సీమ అని చెప్పాలనుకుంది గుండ్రాతి ఇందిరా ప్రియదర్శిని. తమ ప్రాంత చరిత్రను, ఆధ్యాత్మిక పరిమళాలను పర్యటక సాగసులను వివరించడానికి ఏమి చేయాలా అని ఆలోచించింది. 'ఇందూస్ మా ఊరి కథలు' పేరుతో యూట్యూబ్ ఛానెల్ ప్రారంభించింది. అచ్చ తెలుగు పదాలతో ఆకట్టుకునే వాక్చాతుర్యంతో అనతి కాలంలోనే లక్షలమంది ఫాలోవర్లను సంపాదించుకుంది. తాజాగా ఏపీ సీఎం చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ బ్లాగర్, బెస్ట్ సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా పురస్కారాన్నీ అందుకుంది. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

పర్యటక ప్రియ'దర్శిని'

మాది అనంతపురం జిల్లా మామిళ్లపల్లె. పుట్టింది అనంతపురం అయినా విద్యాభ్యాసం కడప జిల్లా కేంద్రంలోనే సాగింది. ప్రస్తుతం తిరుపతి పద్మావతి విశ్వవిద్యాలయంలో న్యాయ విద్య చదువుతున్నా. నాన్న రాజేష్ ఉద్యోగ రీత్యా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో పని చేయాల్సి రావడంతో.. నేను అక్కడే చదువుకోవాల్సి వచ్చింది. దాంతో పలు భాషలూ, యాసలపై అవగాహన ఏర్పడింది. మా అమ్మ సునీత నా చిన్నప్పటి నుంచి సంప్రదాయ దుస్తులను స్వయంగా తానే కుట్టి అందించడంతో పండగలపై ఆసక్తి పెరిగింది. దీనికి తోడు కథల పుస్తకాలంటే నాకెంతో ఇష్టం. రాయలసీమ చరిత్ర తెలుసుకోవాలనే కుతూహలం ఎక్కువగా ఉండేది. కొవిడ్ సమయంలో రాయలసీమను పాలించిన రాజవంశాలు ఎన్నో కనుమరుగయ్యాయని తెలుసుకుని. . వాటిని వెలుగులోకి తీసుకురావాలనుకున్నా. అలా కడప జిల్లాలోని గండికోట విశిష్టతపై ప్రత్యేక కథనాలు తయారుచేసి నా యూట్యూబ్ ఛానెల్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్ మాధ్యమాల్లో పోస్టు చేయడంతో మిలియన్ల కొద్దీ వీక్షణలు వచ్చాయి. అలా గుత్తికోట, సిద్ధవటం, మడకశిర, చంద్రగిరి, వేలూరు కోటల చరిత్రను అక్కడి రాజవంశాల ఆనవాళ్లను వివరిస్తూ ముందుకెళ్లా. మూస ధోరణిలో కాకుండా ప్రతి ఆలయానికి సంబంధించిన పురాణ గాథతో మొదలుపెట్టి చరిత్ర పరంగా ఆధారాలను జోడిస్తూ అక్కడి శాసనాలను ఉటంకిస్తూ శాస్త్రీయ ఆధారాలతో చెప్పడంతో ఫాలోవర్లు పెరిగారు. ఇటీవల రాష్ట్ర పర్యటక శాఖ నూతనంగా గుర్తించిన బిల్వస్వర్గం, వాల్మీకి గుహలను సందర్శించి వాటి పూర్తి వివరాలతో కథనాలు చేశా. అలా రాయలసీమ ప్రాంతంలోని ఆలయాలు, పర్యటక ప్రాంతాలు, చారిత్రక ప్రదేశాలను పరిచయం చేస్తూ వెళ్లా. తిరుపతిలో న్యాయ విద్య చదువుతూ ఉండటంతో తిరుమలలోని ఎన్నో విషయాలను నా ఛానెల్ ద్వారా తిరుమల కథలు పేరుతో పంచుకున్నా. టూరెళ్దాం రండి.. కడప కథలు, గోదావరి కథలు, రాయలసీమ చరిత్ర గురించి వివరించాను. అలా ఇప్పటివరకూ 751 వీడియోలు పోస్టు చేశా. మూడు కోట్లకు పైగా వీక్షణలు వచ్చాయి. దీంతో మంచి గుర్తింపు పొందా. మా స్నేహితులందరం కలిసి 'స్ప్రెడ్ స్మైల్' గ్రూపుగా ఏర్పడ్డాం. సెలవు రోజుల్లో అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలకు వెళ్లి వారితో గడపడం, అవసరమైన సామగ్రి అందించడం, అక్కడి వారి పుట్టిన రోజులు నిర్వహిస్తూ.. మేమంతా ఉన్నామని ధైర్యాన్ని వారిలో నింపుతున్నాం. తాజాగా రాష్ట్ర పర్యటక శాఖ అధికారులు బెస్ట్ బ్లాగర్‌గా ఎంపిక చేశారు. గత నెల విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ చేతుల మీదుగా పురస్కారాన్నీ అందుకున్నా. ఈ ఏడాదితో న్యాయ విద్య పూర్తవుతుంది. ఎల్ఎల్ఎం చేసి న్యాయమూర్తి కావాలన్నది నా లక్ష్యం. వృత్తి ఏదైనా ఇన్‌ఫ్లుయెన్సర్‌గానూ కొనసాగుతా. నేటి యువత చరిత్ర, సంప్రదాయాలను గౌరవించాలి. మన మాతృభాష తెలుగును విడవకుండా పట్టుకోవాలన్నదే నా ఆకాంక్ష.

– బోగెం శ్రీనివాసులు, కడప



వసుంధర

vasundhara@eenadu.in



ఆలస్యంగా నిద్రపోతే... తెలివైన వాళ్లట!

'తొందరగా నిద్రపోయి తొందరగా మేల్కోవాలి'... చాలామంది చెప్పే విజయ సూత్రాల్లో ఇదీ ఒకటి. ఇల్లు, ఆఫీసు పనులతో రకరకాల సమయాల్లో నిద్రించే అమ్మాయిల శాతమూ ఎక్కువే కదా! మరి అలాంటి వారికి విజయం దక్కనట్లేనా? అంటే కాదని అంటున్నాయి తాజా అధ్యయనాలు. లండన్‌లోని ఇంపీరియల్ కాలేజీలో నిద్రవేళలు, మెదడు పనితీరుపై వాటి ప్రభావాన్ని అధ్యయనం చేశారు. పరిశోధన కోసం 26వేలమందిని ఎంచుకున్నారట. అందులో వాళ్ల రీజనింగ్, ప్రతి స్పందించడం, జ్ఞాపకశక్తి, తెలివితేటలను పరీక్షించారట. తొందరగా నిద్రనుంచి మేల్కొనే అలవాటున్న వారికంటే ఆలస్యంగా నిద్రించే వారే చురుగ్గా ఉన్నారనీ, వాళ్ల ఐక్యూ కూడా ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. మామూలుగా వేకువ జామున లేచిన వారు పని సమర్థవంతంగా చేయగలుగుతారనీ అనుకుంటుంటాం. కానీ, ఈ పరిశోధనలను బట్టి చురుకుదనం అనేది మనం నిద్రలేచే సమయాన్ని బట్టి ఉండదనీ, ఆ నిద్ర ఎంత నాణ్యంగా ఉందనే దానిపైనే ఆధారపడి ఉంటుందన్నది నిపుణుల అభిప్రాయం. గాఢ నిద్ర వల్ల జ్ఞాపకశక్తి, సమస్య పరిష్కార నైపుణ్యాలు, సృజనాత్మకత, ఉత్పాదకతలు పెరుగుతాయట. తొందరగా నిద్రలేవాలనే ఉద్దేశంతో చాలామంది చాలీచాలని నిద్ర పోతున్నారట. దీనివల్ల... నిద్రలేమి సమస్యలు వచ్చి, అవి మెదడు పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపిస్తున్నాయట. ప్రతిఒక్కరికీ జీవగడియారాలు వేరుగా ఉంటాయి. వాటిని బట్టి, కొంతమంది తొందరగా నిద్రలేస్తే, మరికొందరు ఆలస్యంగా నిద్రలేవొచ్చు. కాబట్టి, ఫలానా వేళలే సరైనవి అన్న నియమం పెట్టుకునే కంటే నాణ్యమైన నిద్ర ఉందా లేదా అన్నదే కీలకమని నిపుణుల అభిప్రాయం. కాబట్టి, వీటిని దృష్టిలో ఉంచుకుని జీవన విధానాలను పాటిస్తే విజయం తథ్యం!

సాధారణంగా మంచి కొలెస్ట్రాల్ వల్ల ఆరోగ్యకరమైన ప్రయోజనాలు అందుతాయి. అయితే మెనోపాజ్ వచ్చే ముందు ఈ కొలెస్ట్రాల్ కణాల సంఖ్యతోపాటు వాటి పరిమాణం పెరగడంతో ప్రయోజనాలు తగ్గుతున్నాయని ఇటీవల ఓ అధ్యయనం తేల్చింది. దీంతో ఆల్జీమర్స్ ప్రమాదం ఎదురయ్యే అవకాశాలూ లేకపోలేదంటోంది. అయితే ఈ సమస్యను ఆరోగ్యకరమైన జీవనశైలితో అధిగమించొచ్చని చెబుతోంది. జర్నల్ ఆఫ్ క్లినికల్ ఎండోక్రినాలజీ అండ్ మెటబాలిజంలో ప్రచురించిన పిట్స్‌బర్గ్ విశ్వవిద్యాలయ పరిశోధక బృంద అధ్యయనం... ఇంకా ఏం చెబుతోందంటే...

కొలెస్ట్రాల్‌తో మతిమరుపు!



మహిళల్లో మంచి కొలెస్ట్రాల్ కణాలు జ్ఞాపకశక్తిని పెంచుతాయి. అయితే అవే కణాలు మెనోపాజ్‌కు దగ్గరవుతున్నప్పుడు ఆల్జీమర్స్‌కీ... కారణమవుతాయి. మెనోపాజ్‌కు ముందు ఈ కణాల సంఖ్య పెరుగుతుంటుంది. వీటి సంఖ్యతోపాటు పరిమాణం కూడా పెద్దదవుతుంది. అయితే మొదట్లో ఉండే చిన్నకణాలు అందించే ఆరోగ్యప్రయోజనాలను ఈ పెద్ద కణాలు పూర్తిగా ఇవ్వలేవని అధ్యయనం ద్వారా తెలిసింది. అలాగే ఇవి మెదడు ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంలో అంత ప్రభావంతంగా పనిచేయడంలేదని కూడా గుర్తించారు. దీంతో వయసు పెరుగుతున్నకొద్దీ అధికస్థాయి, పెద్ద పరిమాణంలో ఉండే కొలెస్ట్రాల్ కణాలు మెదడు ఆరోగ్యంగా ఉండేలా పనిచేయడం లేదనీ దీనికి బదులుగా చిన్నగా ఉండే మరింత చిన్న ఫాస్ఫోలిపిడ్-రిచ్ 'హెచ్‌డీఎల్' కణాల సంఖ్య పెరిగితే ఆల్జీమర్స్ ముప్పును తప్పించుకోవచ్చు. వృద్ధాప్యం వల్ల మెదడుపై పడే ప్రభావం నుంచి రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తేలింది. కాబట్టి వాటి సంఖ్య పెరిగేందుకు పోషకాహారం, శారీరకశ్రమ, ఆరోగ్యకరమైన జీవనశైలి తప్పనిసరి అంటున్నారు పరిశోధకులు.

కౌగిలింతతో ప్రయోజనాలెన్నో!

రోహిణి ఫ్రెండ్స్‌ను కలిసినప్పుడు స్నేహపూర్వకంగా హగ్ ఇచ్చి మరీ పలకరిస్తుంది. ఇంట్లో తన పిల్లలను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని ప్రశంసిస్తుంటుంది. ఉదయాన్నే భర్తకు ప్రేమగా హగ్ ఇచ్చి మరీ విష్ చేస్తుంది. ఇలా సందర్భాలు, వ్యక్తులకు తగినట్లు మనమిచ్చే కౌగిలింతవల్ల అవతలవారికే కాదు, మనకూ బోల్డెన్ని ప్రయోజనాలు అందుతాయట. అవేంటో తెలుసా..!

స్నేహితులు కష్టంలో ఉన్నప్పుడు నేనున్నానే భరోసా వాళ్లకు మనం చిన్న హగ్‌తో చెప్పొచ్చు. తీరని దుఃఖంలో మునిగినవారిని దగ్గరకు తీసుకుని సానుభూతి అందించొచ్చు. ఒత్తిడి నుంచి బయటకు తేగలిగే శక్తి మనమిచ్చే కౌగిలికెంతో ఉంది. అవతలివారిలో నమ్మకాన్ని, భరోసాను కలిగిస్తుంది. తమ కోసం ఒకరున్నారనే భావనను కలిగించి వాళ్లకు ఉపశమనాన్నిస్తుంది. స్నేహబంధాన్ని బలపడేలా చేస్తుంది.



సాన్నిహిత్యం పెరుగుతుంది...

ప్రేమబంధంలో తరచుగా కౌగిలించుకునే వ్యక్తుల్లో అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు తక్కువగా ఉంటాయట. ప్రియమైనవారు ఒకరినొకరు హగ్ చేసుకున్నప్పుడు ఇరువురిలోనూ ఎండార్ఫిన్ విడుదలవుతుంది. దీంతో ఒత్తిడి దూరమై ఆనందం కలుగుతుంది. మనసుకు నచ్చినవారితో అనుబంధాన్ని ఓ చిన్న కౌగిలింత బలోపేతం చేయగలదు. ఎదుటివారిలో సంఘర్షణ కలుగుతున్నప్పుడు హగ్ చేసుకుంటే చాలు, వాళ్లలో ఆక్సిటోసిన్ విడుదలై వారిపై వారికి నమ్మకాన్ని పెంచుతుంది. ఇది ఇరువురి మధ్య సాన్నిహిత్యాన్నీ పెంచుతుంది.

ఆత్మవిశ్వాసం పెంచేలా...

ఆటల్లో గాయాలు, స్నేహితులతో గొడవలు చిన్నారులను తీవ్ర వేదనకు గురిచేస్తుంటాయి. కష్టపడి చదివినా అనుకున్న ర్యాంకు సాధించలేకపోతున్నామనే బాధ విద్యార్థిదశలో కలుగుతుంటుంది. ఇలాంటి సందర్భాల్లో పిల్లలను తల్లిదండ్రులు ప్రేమగా దగ్గరకు తీసుకుంటే చాలు. వాళ్లలో భద్రతాభావాన్ని ప్రోత్సహించే ఆక్సిటోసిన్ హార్మోన్ విడుదలవుతుంది. హగ్‌తో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. లక్ష్యాన్ని ఛేదించగలమనే నమ్మకాన్నిస్తుంది. ఓ హగ్ కుటుంబ బంధాలను బలోపేతం చేస్తుంది. అంతేకాదు, హగ్ అనారోగ్యంగా ఉన్నవారికి బాధ నుంచి ఉపశమనాన్నిస్తుంది. ఆందోళనను ఎదుర్కొనే శక్తినిచ్చి రిలాక్స్‌గా ఉంచుతుంది. తెల్లరక్తకణాల ఉత్పత్తిని తద్వారా రోగనిరోధక వ్యవస్థను పెంచేలా దోహదపడుతుంది. రక్తపోటును తగ్గించి గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుందని పలు అధ్యయనాలూ చెబుతున్నాయి.

ఇంటి ముంగిట! రంగుల పాన్సీ...

పాన్సీ పువ్వును చూస్తే... రంగులద్దుకున్న చిన్న కాన్వాస్‌లానే కనిపిస్తుంది. రేకల్ని ముట్టుకుంటే వెల్వెట్‌లా మృదువుగా మురిపిస్తాయి. అందంగా గాలికి ఊగుతూ మనసుని పులకరింపజేస్తాయి. మరి వీటిని మన ఇంటి ముంగిట పెంచుకోవడమెలానో తెలుసా?

ఆకట్టుకునే వర్ణాల్లో కనువిందు చేసే పూల మొక్క పాన్సీ. . కాలిబాటల పక్కన, కుండీల్లోనూ పెంచుకునేందుకు అనువైనది. ఈ పూలు హృదయాకారంలోనూ, మానవ ముఖాన్నీ పోలి ఉంటాయి. వయొలెట్ కుటుంబానికి చెందిన ఈ మొక్క పుట్టింది యూరప్‌లోనైనా... ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందుతోంది. వీటిల్లో వందల రకాలున్నా... అడోనిస్, ఫ్రీఫాల్ లావెండర్, క్యాట్ విస్కర్స్, అల్లిమా మార్ఫో, టైగరల్ ఐస్ వంటి రకాలు పాపులర్. కుండీలు, పెట్టెలు, ఉరి బుట్టలు, పాత్రలు... ఇలా వేటిల్లోనైనా పెంచేయొచ్చు. పెరడు, కిటికీలు, బాల్కనీలు.. ఇలా ఎక్కడైనా వీటిని నాటుకోవచ్చు. వీటిల్లో తెలుపు, పసుపు, ఊదా, నీలం, ఎరుపు, గులాబీ, నారింజ వంటి ఎన్నో రంగుల్లో కనిపిస్తాయి. ఒకటికి మించి ఛాయలూ, గీతలు, ఆకారాల్లో ఆకట్టుకుంటాయి. ఈ పాన్సీలని నాటేటప్పుడు ఒక్కోదాని మధ్య 6 నుంచి 12 అంగుళాల ఎడం ఉంచాలి.



ఆకుల్ని తడపకూడదు...

పాన్సీ మొక్కలకు నీళ్లను తరచుగా అందించాలి. అయితే ఆకులపై నీళ్లు చల్లకూడదు. కేవలం మట్టిని తడిపితే చాలు. లేదంటే.. ఫంగస్ వ్యాధుల దాడితో మొక్క చనిపోవచ్చు. ఎండిపోయిన, వాడిపోయిన పూలను మాత్రం ఎప్పటికప్పుడు తొలగిస్తే... కొత్త మొగ్గలు తొడుగుతాయి. విత్తనాలు నాటుకోవడం ద్వారా మొలకల్ని ఉత్పత్తి చేయొచ్చు. పొటాషియం ఎక్కువగా ఉండే ఎన్‌పీకే సమగ్ర ఎరువుని ప్రతి పదిహేను రోజులకోసారి ఇవ్వడం వల్ల మొక్క నిండుగా పుష్పిస్తుంది. ఆకు ముడత, మచ్చలు...వంటివి ఇబ్బందిపెట్టకుండా ఉండాలంటే నెలకోసారి మొక్క చుట్టూ బేకింగ్ సోడా చల్లండి.







విదేశాలకు... మన మునగాకు!

మునగాకులోని పోషక విలువల వల్ల పొందే ఆరోగ్య ప్రయోజనాలను సరళ అందరికీ చేర్చాలనుకుంది. ఆ ఆలోచనే గృహిణిగా ఉన్న ఆమెను విదేశాలకు మునగాకు పొడి ఎగుమతి చేసే పారిశ్రామికవేత్తగా మార్చింది.

జితేందర్, సరళ దంపతులు దిల్లీ వాతావరణ కాలుష్యానికి దూరంగా ఉండాలని హరియాణా, సోనీపట్ జిల్లాలోని సొంత గ్రామానికి వెళ్లిపోయారు. సేంద్రియ వ్యవసాయం చేయాలనే ఆలోచన వచ్చినప్పుడు సరళకు దిల్లీలో ఇంటి డాబాపై పెంచిన మునగ మొక్క గుర్తొచ్చింది. 'ఈ మొక్క వేగంగా ఎదుగుతుంది. ఈ ఆకుల్లో యాంటీఆక్సిడెంట్స్ సహా పలు పోషకవిలువలు, ఔషధగుణాలు ఉండటంతో వీటి నుంచి ఆరోగ్య ప్రయోజనాలెన్నో పొందొచ్చు. దీంతో మునగ పంట వేయాలనుకున్నాం. నాణ్యమైన విత్తనాలు సేకరించి నాటి, జీవామృతం వంటి సేంద్రియ ఎరువులతో నేల సారాన్ని పెంచాం. మూడున్నర లక్షల లీటర్ల నీటి ట్యాంకు నిర్మించి దాని ద్వారా మొక్కలకు సోలరైజ్డ్ నీటిని అందించాం. మునగచెట్లు పెరిగిన తర్వాత మునగాకును వేరుచేసి పొడిగా మార్చాం. ఎగ్జిబిషన్స్‌లో విక్రయించడం ద్వారా దీనిపై అవగాహన పెంచాం. ఓసారి ఒకాయన మేం తయారుచేస్తున్న మునగాకు పొడిని వెతుక్కుంటూ మావూరికొచ్చారు. కనిపించిన వాళ్లందరినీ 'భార్యాభర్తలిద్దరు మునగాకు పండిస్తున్నారని అడిగి మరీ మా చిరునామాను తెలుసుకున్నారు. దాంతో మా సంస్థకు 'హస్బెండ్ వైఫ్ ఫామ్' పేరు పెట్టాం. ఇప్పుడు మునగాకు పొడిని ప్యాక్ రూపంలోనే కాకుండా క్యాప్సుల్స్ గానూ ఉత్పత్తి చేస్తున్నాం. దేశవ్యాప్తంగానే కాకుండా, ప్రస్తుతం లండన్, అమెరికా, యూరప్‌లకూ ఎగుమతి చేస్తున్నాం. మహిళలకు ఉపాధి కల్పిస్తూ, ఇతర రైతులతోనూ సేంద్రియవిధానంలో మునగాకును పండించేలా చేసి వారి నుంచీ కొనుగోలు చేస్తున్నాం. త్వరలో 100 ఎకరాలకు విస్తరించనున్నాం' అంటోంది సరళ.







చాంపియన్స్

భారత్-న్యూజిలాండ్ మొదటి టెస్టు

తొలి రోజు ఆట వర్షార్పణం



జైస్వాల్, కోహ్లి

బెంగళూరు

టీమ్‌ఇండియాను వర్షం వదలట్లేదు. ఇటీవల బంగ్లాదేశ్‌తో రెండో టెస్టుకు మూడు రోజుల పాటు తీవ్ర అంతరాయం కలిగించిన వరుణుడు.. ఇప్పుడు న్యూజిలాండ్‌తో తొలి టెస్టుకూ అడ్డు పడ్డాడు. బెంగళూరులో భారీ వర్షం కురుస్తుండడంతో తొలి రోజు ఆట సాధ్యపడలేదు. టాస్ వేయడానికి కూడా అవకాశం లేకపోయింది. వర్షం వల్ల చిన్నస్వామి స్టేడియంలో ముందు రోజు రెండు జట్లు ప్రాక్టీస్ చేయలేకపోయిన సంగతి తెలిసిందే. బుధవారం కూడా వర్షం పడొచ్చన్న అంచనాలకు తగ్గట్లే ఉదయం నుంచి వరుణుడి ప్రతాపం సాగింది. టాస్ వేయాల్సిన 9 గంటల సమయంలో భారీ వర్షం పడింది. తర్వాత నాలుగు గంటలకు పైగా వర్షం తెరపినివ్వలేదు. మధ్యాహ్నం ఒకటిన్నర ప్రాంతంలో వరుణుడు శాంతించాడు. 1.50కి మైదానంలో కొన్ని కవర్లను తొలగించారు. తర్వాత అంపైర్లు పరిశీలనకు వచ్చారు. స్టేడియంలో పలు చోట్ల వర్షం మడుగులు ఉండడంతో ఆట సాధ్యం కాదని అర్థమై మధ్యాహ్నం రెండున్నరకు తొలి రోజు ఆటను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. వర్షం పడుతున్నప్పటికీ ఉదయం నుంచి పెద్ద సంఖ్యలోనే అభిమానులు స్టేడియానికి చేరుకున్నారు. స్టేడియం లోపల సాధన చేసేందుకు వెళ్తూ విరాట్ కోహ్లి, యశస్వి జైస్వాల్ కనిపించడం వారికి ఉత్సాహాన్నిచ్చింది. జోరు వర్షం పడుతుండగా సహాయకులు భారీ గొడుగు పట్టి కోహ్లి, జైస్వాల్‌లను తీసుకెళ్లారు. ఆ సమయంలో అభిమానులు కోహ్లి కోహ్లి అంటూ గట్టిగా నినాదాలు చేశారు. గురువారం కూడా మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించవచ్చు. రెండో రోజు ఉదయం 8.45కే టాస్ వేసి 9.15కి ఆటను ఆరంభించాలని అంపైర్లు నిర్ణయించారు.

అఖిల్‌కు కాంస్యం

ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ ఫైనల్



అఖిల్

దిల్లీ: ప్రతిష్ఠాత్మక ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ ఫైనల్లో భారత షూటర్ అఖిల్ షెరాన్ సత్తాచాటాడు. పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో అతను కాంస్యం సొంతం చేసుకున్నాడు. బుధవారం ఫైనల్లో అతను 452.6 స్కోరుతో మూడో స్థానంలో నిలిచాడు. పారిస్ ఒలింపిక్స్ పసిడి విజేత లియు యుకున్ (442.4)ను నాలుగో స్థానానికి నెట్టి అఖిల్ పతకం సాధించాడు. ఇస్త్వాన్ (హంగేరీ- 465.3), జిరి (చెక్ రిపబ్లిక్- 464.2) వరుసగా స్వర్ణ, రజతాలు గెలిచారు. మరో భారత షూటర్ చైన్ సింగ్ (409.3) ఏడో స్థానంలో నిలిచాడు. అంతకుముందు క్వాలిఫయర్స్‌లో చైన్ సింగ్ (592) నాలుగు, అఖిల్ (589) ఆరో స్థానంతో ఫైనల్ చేరారు. మరోవైపు మహిళల 25మీ. స్పోర్ట్స్ పిస్టల్‌లో రిథమ్ సంగ్వాన్ త్రుటిలో పతకం చేజార్చుకుంది. కాంస్య పతక షూటాఫ్‌లో ఆమె ఫెంగ్ సిజుయాన్ (చైనా) చేతిలో ఓడింది. 8 సిరీస్‌లు ముగిసే సరికి ఇద్దరు షూటర్లు 27-27తో సమంగా నిలిచారు. దీంతో షూటాఫ్ నిర్వహించగా రిథమ్ పైచేయి సాధించడంలో విఫలమైంది.

ఎనిమిదో ఫైనల్‌పై ఆసీస్ గురి

రాత్రి 7.30 నుంచి

- నేడు సెమీస్‌లో దక్షిణాఫ్రికాతో ఢీ
- మహిళల టీ20 ప్రపంచకప్




లారా (దక్షిణాఫ్రికా)



అలీసా (ఆస్ట్రేలియా)

దుబాయ్: రికార్డు స్థాయిలో ఎనిమిదో ఫైనల్‌పై గురి పెట్టిన ఆస్ట్రేలియా.. మహిళల టీ20 ప్రపంచకప్‌లో కీలక సమరానికి సిద్ధమైంది. గురువారం సెమీస్‌లో దక్షిణాఫ్రికాను ఈ డిఫెండింగ్ ఛాంపియన్ ఢీ కొనబోతోంది. రికార్డులు, గణాంకాలు, ఫామ్.. ఇలా ఏ ప్రకారం చూసిన ఈ మ్యాచ్‌లో కంగారూ అమ్మాయిలే ఫేవరెట్‌గా కనిపిస్తున్నారు. వరుసగా 9వ టీ20 ప్రపంచకప్‌లోనూ సెమీస్ ఆడబోతున్న ఆసీస్ ఇప్పటికే ఆరుసార్లు కప్పును ముద్దాడింది. సఫారీ అమ్మాయిలపై ఆ జట్టుకు తిరుగులేని రికార్డుంది. ఆ జట్టుతో ఆడిన 10 టీ20ల్లో ఆసీస్ 9 గెలిచింది. ఒక్కదాంట్లోనే ఓడిపోయింది. ఇక పొట్టి ప్రపంచకప్‌లో 7-0తో ఆసీస్‌కు ఎదురేలేదు. ఈసారి కూడా ఆ జట్టు వరుస విజయాలతో సాగుతోంది. గ్రూప్-ఎలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలిచింది. గతేడాది టీ20 ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై ఆస్ట్రేలియాదే పైచేయి. మరోవైపు టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఆసీస్‌పై తొలి విజయాన్ని అందుకోవాలనే లక్ష్యంతో దక్షిణాఫ్రికా ఉంది. గ్రూప్-బిలో ఆ జట్టు నాలుగు మ్యాచ్‌ల్లో మూడు గెలిచి, ఒకటి ఓడింది. టోర్నీలో 10 వికెట్లు తీసిన స్పిన్నర్ ఎంలాబాతో పాటు కెప్టెన్ లారా వోల్వార్డ్, తజ్మిన్, మరిజేన్ కాప్ ఆ జట్టుకు కీలకం.

ఫైనల్లో అర్జున్ ఇరిగేశి



అర్జున్ ఇరిగేశి

లండన్: డబ్ల్యూఆర్ చెస్ మాస్టర్స్ కప్‌లో తెలుగుతేజం అర్జున్ ఇరిగేశి ఫైనల్లో అడుగు పెట్టాడు. బుధవారం సెమీస్‌లో అర్జున్ 1.5-0.5 తేడాతో ప్రజ్ఞానందను ఓడించాడు. ఈ ఇద్దరు యువ గ్రాండ్‌మాస్టర్లు హోరాహోరీగా తలపడ్డారు. తొలి గేమ్‌లో తెల్ల పావులతో ఆడిన అర్జున్ 70 ఎత్తుల్లో విజయం సాధించాడు. రెండో గేమ్‌ను డ్రాగా ముగించాడు. అంతకుముందు క్వార్టర్స్‌లో అర్జున్ 1.5-0.5తో విదిత్ గుజరాతిని ఓడించగా.. ప్రజ్ఞానంద 2-1తో విశ్వనాథన్ ఆనంద్‌పై పైచేయి సాధించాడు. విదిత్‌తో తొలి గేమ్ డ్రా చేసుకున్న అర్జున్.. రెండో గేమ్‌లో నెగ్గాడు. మరోవైపు తన మెంటార్ ఆనంద్‌తో రెండు గేమ్‌లను ప్రజ్ఞానంద డ్రా చేసుకున్నాడు. విజేతను నిర్ణయించే ఆర్మగెడాన్ పోరులో గెలిచి సెమీస్ చేరాడు.

హాల్ ఆఫ్ ఫేమ్‌లో నీతూ, డివిలియర్స్

దుబాయ్: భారత మాజీ స్పిన్నర్ నీతూ డేవిడ్‌కు ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు లభించింది. డయానా ఎడుల్జీ తర్వాత ఈ గౌరవం లభించిన భారత రెండో మహిళగా ఆమె నిలిచింది. 47 ఏళ్ల నీతూ ప్రస్తుతం భారత మహిళల సెలక్షన్ కమిటీ ఛైర్మన్. ఆమె 10 టెస్టులు, 97 వన్డేలు ఆడింది. ఓ టెస్టు ఇన్నింగ్స్‌లో అత్యుత్తమ గణాంకాల రికార్డు (8/53) ఇప్పటికీ ఆమె పేరిటే ఉంది. నీతూ వన్డేల్లో 147 వికెట్లు పడగొట్టింది. ఈ ఫార్మాట్లో వంద వికెట్లు సాధించిన భారత తొలి మహిళ ఆమెనే. మరోవైపు దక్షిణాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్, ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ అలిస్టర్ కుక్‌లకు కూడా హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు లభించింది.

ఏబీ.. నువ్వు నంబర్‌వన్

దుబాయ్: తన సమకాలీకులలో దక్షిణాఫ్రికా స్టార్ ఏబీ డివిలియర్స్ అత్యంత ప్రతిభావంతుడని విరాట్ కోహ్లి అన్నాడు. ఏబీకి ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కిన నేపథ్యంలో అతడికి కోహ్లి బహిరంగ లేఖ రాశాడు. అందులో డివిలియర్స్‌పై ప్రశంసల జల్లు కురిపించాడు. "హాల్ ఆఫ్ ఫేమ్‌లో స్థానానికి నువ్వు సంపూర్ణ అర్హుడివి. జనం ఎప్పుడూ నీ సత్తా గురించి మాట్లాడుకుంటారు. నేను కలిసి ఆడిన ఆటగాళ్లలో నువ్వు అత్యంత ప్రతిభావంతుడివి. తిరుగులేని నంబర్‌వన్ ఆటగాడివి" అని లేఖలో కోహ్లి అన్నాడు. "చాలా మంది ఆటగాళ్లకు మంచి గణాంకాలు ఉండొచ్చు. కానీ చూసే వాళ్లపై చాలా కొద్ది మంది మాత్రమే నీలా ప్రభావం చూపించారు. నా దృష్టిలో ఒక క్రికెటర్‌కు అత్యంత విలువైంది అదే. నిన్ను ప్రత్యేకంగా నిలబెడుతున్నది అదే" అని కోహ్లి పేర్కొన్నాడు. ఆట ఎలా ఆడాలనే విషయంలో డివిలియర్స్‌కు ఎంతో స్పష్టత ఉందని అతడు చెప్పాడు. డివిలియర్స్ తన జట్టును ఎన్నోసార్లు కష్టాల నుంచి బయట పడేశాడని అన్నాడు. "గత నాలుగు మ్యాచ్‌ల్లో ఎంత బాగా ఆడామన్నది కాకుండా ఈ రోజు మ్యాచ్ గురించి ఆలోచించడం ముఖ్యమని నీ నుంచి నేర్చుకున్నా. నువ్వెప్పుడూ జట్టు అవసరాలకు తగినట్లు ఉంటావు. అందువల్లే అంతర్జాతీయ క్రికెట్లో ప్రత్యర్థులకు నిన్ను కట్టడి చేయడానికి వ్యూహాలు రచించడం కష్టమవుతుంది" అని కోహ్లి చెప్పాడు.

హర్మన్‌పై వేటు?



హర్మన్‌ప్రీత్

ముంబయి: టీ20 ప్రపంచకప్‌లో మరోసారి భారత జట్టుకు నిరాశ తప్పలేదు. 2020లో రన్నరప్‌గా నిలిచిన టీమ్ ఇండియా ఈసారి కనీసం సెమీస్ కూడా చేరలేదు. యూఏఈలో జరుగుతున్న టోర్నీలో ఫేవరెట్లలో ఒకటనుకున్న హర్మన్‌ప్రీత్ సేన.. తొలి మ్యాచ్‌లోనే న్యూజిలాండ్ చేతిలో చిత్తుగా ఓడి సెమీస్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. తర్వాత బలహీన పాకిస్థాన్, శ్రీలంకలను ఓడించినప్పటికీ.. చివరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో ఓటమి తప్పలేదు. మొత్తంగా టోర్నీలో భారత్ ప్రదర్శన సాధారణం. ఈ నేపథ్యంలో జట్టును ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సారథ్యంలో జట్టు ఒక స్థాయికి మించి ఎదగలేకపోతోందనే విమర్శలు కొంచెం గట్టిగానే వినిపిస్తున్నాయి. మాజీ కెప్టెన్ మిథాలి రాజ్ కూడా ఇదే మాట అంది. బీసీసీఐ సైతం కెప్టెన్‌ను మార్చడంపై ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. నాయకత్వ మార్పు జరగని పక్షంలో జట్టు ఆటతీరులో కూడా మార్పు తీసుకురావడం కష్టమని.. ప్రపంచకప్ వైఫల్యం మీద సమీక్ష జరగడం, చర్యలు చేపట్టడం కూడా చాలా అవసరమని, లేదంటే జట్టులో ఉదాసీనత పెరిగిపోతుందని బోర్డులో చర్చ జరుగుతోందట. ప్రస్తుతం జట్టుకు వైస్‌కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న స్మృతి మంధానకు నాయకత్వ బాధ్యతలు అప్పగించవచ్చని.. జట్టు దృక్పథాన్నే మార్చే లక్ష్యంతో షెఫాలి వర్మ, జెమీమా రోడ్రిగ్స్ లాంటి యువ క్రికెటర్ల వైపు కూడా చూసే అవకాశాలు లేకపోలేదని అంటున్నారు. జట్టులో కూడా కొన్ని మార్పులు జరగొచ్చని సమాచారం.

గాయత్రి జోడీ పరాజయం



గాయత్రి, ట్రీసా

ఒడెన్స్ (డెన్మార్క్): డెన్మార్క్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 750 టోర్నీలో భారత అగ్రశ్రేణి జోడీ గాయత్రి గోపీచంద్, ట్రీసా జాలీలకు చుక్కెదురైంది. బుధవారం మహిళల డబుల్స్ తొలి రౌండ్లో ఈ జంట 21-19, 17-21, 15-21తో అయిదో సీడ్ పియర్లీ టాన్- తినా మురళీధరన్ (మలేసియా) జంట చేతిలో పరాజయంపాలైంది. 74 నిమిషాల పాటు పోరాడినా భారత జోడీకి ఫలితం దక్కలేదు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్లో సుమీత్‌రెడ్డి- సిక్కిరెడ్డి జంట 22-20, 19-21, 22-24తో కెవిన్ లీ- ఇలియానా జాంగ్ (కెనడా) జోడీ చేతిలో పోరాడి ఓడింది. సింగిల్స్‌లో కూడా భారత్‌కు ప్రతికూల ఫలితాలే వచ్చాయి. సతీశ్ కుమార్, ఉన్నతి తొలి రౌండ్ దాటలేకపోయారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో సతీశ్ 15-21, 21-17, 20-22తో లి యాంగ్ (చైనీస్ తైపీ) చేతిలో కంగుతిన్నాడు. మహిళల సింగిల్స్‌లో ఉన్నతి 15-21, 21-13, 18-21తో లారెన్ లామ్ (అమెరికా) చేతిలో ఓటమి చవిచూసింది.



షకిబ్

సొంతగడ్డపై షకిబ్‌కు వీడ్కోలు

ఢాకా: బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకిబ్ అల్ హసన్ సొంతగడ్డపై వీడ్కోలు టెస్టు ఆడనున్నాడు. సోమవారం దక్షిణాఫ్రికాతో ప్రారంభమయ్యే తొలి టెస్టుకు బంగ్లా జట్టులో షకిబ్‌కు చోటు దక్కింది. తనకు భద్రత కల్పిస్తే సొంత గడ్డపై దక్షిణాఫ్రికాతో చివరి మ్యాచ్ ఆడాలని ఉందంటూ భారత్‌తో రెండో టెస్టుకు ముందు షకిబ్ ప్రకటించాడు. ఓ విద్యార్థి హత్యలో షకిబ్ ప్రమేయముందన్న ఆరోపణల నేపథ్యంలో అతడి భద్రతకు హామీ ఇవ్వలేమని బీసీబీ అధ్యక్షుడు ఫరూక్ అహ్మద్ పేర్కొన్నాడు. అయితే షకిబ్ రాజకీయ వైఖరి స్పష్టం చేసిన తర్వాతే అతనికి భద్రత కల్పిస్తామని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ క్రీడల సలహాదారు ఆసిఫ్ మహమూద్ ప్రకటించాడు. దీంతో బంగ్లాదేశ్‌లో అనిశ్చితి నెలకొన్న సమయంలో మౌనంగా ఉన్నందుకు బేషరతుగా క్షమాపణలు చెబుతూ షకిబ్ ప్రకటన విడుదల చేశాడు. సొంత అభిమానుల సమక్షంలో వీడ్కోలు మ్యాచ్ ఆడనున్నట్లు పేర్కొన్నాడు. ఫలితంగా దక్షిణాఫ్రికాతో మొదటి టెస్టు కోసం ఎంపిక చేసిన బంగ్లా జట్టులో షకిబ్‌కు స్థానం లభించింది. దక్షిణాఫ్రికాతో 2 టెస్టుల తర్వాత అఫ్గానిస్థాన్‌తో 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం బంగ్లా.. యూఏఈ వెళ్లనుంది. బంగ్లా వన్డే జట్టులో కూడా షకిబ్ చోటు దక్కించుకున్నాడు.



పంత్

పంత్.. నువ్వేం చేశావో తెలుసా?

దిల్లీ: 2021 ఆస్ట్రేలియా పర్యటనలో టీమ్‌ఇండియా సాధించిన చారిత్రక టెస్టు సిరీస్ విజయాన్ని భారత అభిమానులు అంత సులువుగా మరిచిపోలేరు. నాటి కెప్టెన్ విరాట్ కోహ్లి సహా కొందరు కీలక ఆటగాళ్లు అందుబాటులో లేకపోయినా ఆ సిరీస్‌లో విజయం సాధించి సంచలనం సృష్టించింది. ఆ సిరీస్‌లో యువ వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ పాత్ర ఎంతో కీలకమైంది. గబ్బా, సిడ్నీ టెస్టుల్లో మెరుపు ఇన్నింగ్స్‌లతో అతను సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా గబ్బాలో 328 పరుగుల ఛేదనలో పంత్ చేసిన 89 పరుగులు టెస్టు క్రికెట్ చరిత్రలోనే మేటి ఇన్నింగ్స్‌ల్లో ఒకటిగా నిలిచిపోయింది. ఆస్ట్రేలియాకు తిరుగులేని రికార్డున్న, పేసర్ల స్వర్గధామం అయిన గబ్బాలో.. తీవ్ర ఒత్తిడి మధ్య, మేటి బౌలర్లను ఎదుర్కొంటూ పంత్ ఆడిన ఈ ఇన్నింగ్స్ దిగ్గజ ఆటగాళ్ల ప్రశంసలందుకుంది. అయితే పంత్ మాత్రం తాను ఎక్కడ, ఎలాంటి ఇన్నింగ్స్ ఆడుతున్నది పెద్దగా పట్టించుకోలేదట. ఆ ఇన్నింగ్స్ విలువను ప్రస్తుత కెప్టెన్ రోహిత్ శర్మ తెలియచెప్పే ప్రయత్నం చేశాడట. "కొన్ని ప్రదర్శనలను జీవితాంతం గుర్తుంచుకుంటాం. అందులో గబ్బా టెస్టు ఒకటి. కానీ ఆ సమయానికి దాని విలువ నాకు తెలియదు. రోహిత్ నా దగ్గరికి వచ్చి 'నువ్వేం చేశావో నీకు తెలియదు' అన్నాడు. 'నేనేం చేశాను. మ్యాచ్ గెలిపించడానికి ప్రయత్నించానంతే' అన్నాను. 'నీకు కొన్నేళ్ల తర్వాత తెలుస్తుంది నువ్వు సాధించిందేంటో' అన్నాడు. ఇప్పటికీ చాలామంది గబ్బా టెస్టు గురించి మాట్లాడుతుంటారు. ఆ మ్యాచ్ మాకెంత కీలకమైందో నాకిప్పుడు అర్థమవుతోంది" అని పంత్ చెప్పాడు.



డకెట్

ఇంగ్లాండ్ తడబాటు

- తొలి ఇన్నింగ్స్‌లో 239/6
- పాకిస్థాన్‌తో రెండో టెస్టు

ముల్తాన్: ఇంగ్లాండ్‌తో తొలి టెస్టులో ఓడి విమర్శలకు గురైన పాకిస్థాన్.. రెండో టెస్టులో ఆధిక్యం దిశగా సాగుతోంది. ఓవర్‌నైట్ స్కోరు 259/5తో రెండో రోజు, బుధవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన పాక్ 366 పరుగులకు ఆలౌటైంది. జమాల్ (37), నోమన్ అలీ (32), సల్మాన్ ఆఘా (31) విలువైన పరుగులు జోడించారు. అనంతరం ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో తడబడింది. ఓపెనర్ డకెట్ (114) సూపర్ శతకం సాధించినప్పటికీ.. ఆట ముగిసే సమయానికి 239/6తో ఇబ్బందుల్లో పడింది. డకెట్ జోరుతో ఓ దశలో 211/2తో పటిష్ఠ స్థితిలో నిలిచిన ఇంగ్లాండ్.. 14 పరుగుల వ్యవధిలో నాలుగు వికెట్లు కోల్పోయింది. స్పిన్నర్ సాజిద్ ఖాన్ (4/86) ఆ జట్టు పతనాన్ని శాసించాడు. మరో స్పిన్నర్ నోమన్ అలీ రెండు వికెట్లు పడగొట్టాడు. జేమీ స్మిత్ (12), బ్రైడన్ కార్స్ (2) క్రీజులో ఉన్నారు. ఇంగ్లాండ్ ఇంకా 127 పరుగులు వెనుకబడి ఉంది.

భారత్‌లో ఖోఖో ప్రపంచకప్



దిల్లీ: మన మట్టి క్రీడ ఖోఖో అంతర్జాతీయ స్థాయిలో మరో ప్రతిష్ఠాత్మక అడుగు వేయబోతోంది. ఈ క్రీడలో తొలిసారి ప్రపంచకప్ నిర్వహించబోతున్నారు. ఈ మెగా టోర్నీకి భారత్ ఆతిథ్యమివ్వనుంది. వచ్చే ఏడాది జనవరి 13 నుంచి 19 వరకు స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలో ఈ ప్రపంచకప్ జరుగుతుందని బుధవారం నిర్వాహకులు ప్రకటించారు. ఈ టోర్నీతో భారత క్రీడ అయిన ఖోఖోకు ప్రపంచ స్థాయిలో మరింత గుర్తింపు దక్కే అవకాశముంది. పురుషులు, మహిళల విభాగాల్లో కలిపి మొత్తం 24 దేశాలు ఇందులో పోటీపడనున్నాయి. ప్రతి విభాగంలోనూ 16 జట్లు టైటిల్ కోసం తలపడతాయి. ఈ ప్రపంచకప్ ప్రకటన సందర్భంగా నిర్వహించిన ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో మహారాష్ట్ర జట్టు 26-24 తేడాతో రెస్టాఫ్ ఇండియాపై గెలిచింది. ఈ కార్యక్రమంలో ప్రపంచకప్ లోగో, ట్యాగ్‌లైన్‌ను కూడా విడుదల చేశారు.

మెస్సి హ్యాట్రిక్

- రొనాల్డో రికార్డు సమం



మెస్సి

బ్యూనోస్ ఎయిర్స్: వయసు పెరుగుతున్నా కొద్దీ లియొనెల్ మెస్సి ఆట పదునెక్కుతోంది! 37 ఏళ్ల వయసులోనూ వన్నె తగ్గని ఆటతీరుతో అభిమానులను కట్టిపడేస్తున్నాడు. తాజాగా బొలీవియాతో మ్యాచ్‌లో అతను హ్యాట్రిక్ గోల్స్‌తో అదరగొట్టాడు. ఫిఫా ప్రపంచకప్ దక్షిణ అమెరికా క్వాలిఫయర్స్‌లో భాగంగా జరిగిన ఈ మ్యాచ్‌లో కెప్టెన్ మెస్సి మాయ చేయడంతో అర్జెంటీనా 6-0 తేడాతో బొలీవియాను చిత్తుచేసింది. సొంతగడ్డపై తనదైన శైలిలో బంతిని డ్రిబ్లింగ్ చేస్తూ, ప్రత్యర్థి డిఫెండర్లను బోల్తా కొట్టిస్తూ మెస్సి గోల్స్ సాధిస్తుంటే అర్జెంటీనా అభిమానుల ఆనందానికి అవధుల్లేకపోయాయి. మెస్సి మూడు గోల్స్ (19వ, 84వ, 86వ నిమిషాల్లో) కొట్టడమే కాకుండా మార్టినెజ్ (43వ), అల్వారెజ్ (45+3వ) బంతిని గోల్‌పోస్టులోకి పంపడంలోనూ సహాయం చేశాడు. మరో గోల్‌ను అల్మాడ (69వ) సాధించాడు. ఇది మెస్సీకి 10వ హ్యాట్రిక్. అత్యధిక హ్యాట్రిక్‌లు చేసిన ఆటగాడిగా రొనాల్డో రికార్డును సమం చేశాడు. ప్రస్తుతం మెస్సి ఖాతాలో 112 అంతర్జాతీయ గోల్స్ ఉన్నాయి. బొలీవియాతో మ్యాచ్‌లో ప్రపంచ ఛాంపియన్ అర్జెంటీనా ఫేవరెట్‌గా బరిలో దిగింది. అభిమానులకు అసలైన కిక్కును అందిస్తూ అత్యుత్తమ ఫిట్‌నెస్, అమోఘమైన నైపుణ్యాలతో మెస్సి అలరించాడు. డిఫెండర్లకు చిక్కకుండా పరుగెత్తిన మెస్సి.. గోల్‌కీపర్‌ను బోల్తా కొట్టించి జట్టుకు తొలి గోల్ అందించాడు. ఆ తర్వాత మార్టినెజ్, అల్వారెజ్‌కు మంచి పాస్‌లు అందించి గోల్స్ నమోదు కావడంలో కీలక పాత్ర పోషించాడు. ఇక చివర్లో మెస్సి తన సమ్మోహన శక్తితో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాడు. డిఫెండర్ల మధ్యలో నుంచి చొచ్చుకుని వెళ్లి ఆఖర్లో బంతిని రెండు సార్లు గోల్‌పోస్టులోకి పంపించాడు.

టెస్టులు ఆడాలని ఉంది



సంజు శాంసన్

దిల్లీ: పరిమిత ఓవర్ల క్రికెట్లో మెరుపులు మెరిపిస్తూ భారత జట్టులో కుదురుకునే ప్రయత్నం చేస్తున్నాడు సంజు శాంసన్. ఇటీవలే హైదరాబాద్‌లో జరిగిన టీ20 మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై అతను మెరుపు శతకం సాధించాడు. అయితే వన్డేలు, టీ20ల్లో అవకాశాలు దక్కించుకున్న సంజుకు ఇంకా టెస్టుల్లో ఆడే ఛాన్స్ రాలేదు. తాను ఆ ఫార్మాట్లో కూడా రాణించగలనని అంటున్నాడతను. జట్టు యాజమాన్యం కూడా తనను టెస్టులకు పరిగణనలోకి తీసుకుంటున్నట్లు చెప్పిందని అతను వెల్లడించాడు. "నేను వన్డేలు, టీ20లకే పరిమితం కావాలని అనుకోవట్లేదు. టెస్టుల్లో రాణించగల నైపుణ్యం నాకుందని నమ్ముతున్నా. భారత్ తరపున ఆ ఫార్మాట్లో ఆడాలని ఉంది. దులీప్ ట్రోఫీకి ముందు జట్టు యాజమాన్యం నాతో మాట్లాడింది. టెస్టులకు నన్ను పరిగణనలోకి తీసుకుంటున్నామని, ఎక్కువ రంజీ మ్యాచ్‌లు ఆడాలని సూచించింది" అని సంజు తెలిపాడు.

అప్పుడు ఉత్కంఠకు లోనయ్యా: హర్మన్‌ప్రీత్

దిల్లీ: హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్) క్రీడాకారుల వేలం సందర్భంగా తన పేరు వచ్చినప్పుడు ఉత్కంఠకు లోనయ్యానని భారత జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ తెలిపాడు. మూడు రోజుల పాటు జరిగిన వేలంలో హర్మన్‌ప్రీత్ అత్యధిక ధర పలికాడు. పంజాబ్- హరియాణా ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సూర్మ హాకీ క్లబ్ రూ.78 లక్షలకు అతడిని సొంతం చేసుకుంది. "హెచ్ఐఎల్ అద్భుత రీతిలో తిరిగొచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. వేలంలో నా పేరు వచ్చినప్పుడు కుర్చీ అంచున కూర్చున్నా. పంజాబ్- హరియాణ ప్రాంతం తరపున ఆడేందుకు నా కోసం సర్దార్‌సింగ్ బిడ్ చేయాలని మనసులో గట్టిగా కోరుకున్నా. చివరికి సూర్మ క్లబ్ నన్ను సొంతం చేసుకోవడంతో ఎంతో ఉపశమనం లభించింది. చాలా సంబరపడ్డా" అని హర్మన్‌ప్రీత్ పేర్కొన్నాడు.

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు

(మొదటి పేజీ తరువాయి)

వ్యాపారాన్ని 400 బిలియన్ డాలర్ల స్థాయికి చేర్చారు. 100 దేశాలకు వ్యాపారాన్ని విస్తరించారు. ఆయన పేరుతో అమరావతిలో ప్రధాన కేంద్రంగా రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ నెలకొల్పుతాం. దానికి అనుబంధంగా ఉత్తరాంధ్రకు విశాఖపట్నంలో, ఉభయగోదావరి జిల్లాలకు రాజమహేంద్రవరంలో, విజయవాడ-గుంటూరు జిల్లాలకు ఆ రెండింటిలో ఎక్కడోచోట, ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు జిల్లాలకు తిరుపతిలో, కడప-కర్నూలు-అనంతపురం జిల్లాలకు అనంతపురంలో రతన్‌టాటా పేరుతోనే ఐదు ఇన్నోవేషన్ హబ్‌లు నెలకొల్పుతాం. ప్రతి ఒక్కరూ ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ఎదిగేందుకు ఇవి దోహదపడతాయి.

✦ రాష్ట్రాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పారిశ్రామికాభివృద్ధి విధానం, ఎంఎస్ఎంఈ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్, ఆహారశుద్ధి, ఎలక్ట్రానిక్స్, ఏపీ ప్రైవేట్ పార్కులు, ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ విధానాలు తీసుకొచ్చాం. ఈ ఆరు పాలసీలు గేమ్ ఛేంజింగ్ అవుతాయి. వీటితో పాటు పర్యాటకం, ఐటీ, వర్చువల్ వర్కింగ్‌లకు సంబంధించిన విధానాలను త్వరలోనే తీసుకొస్తాం. 'థింక్ గ్లోబలీ- యాక్ట్ గ్లోబలీ' నినాదంతో ముందుకెళ్లేందుకు ఈ విధానాల ద్వారా యువతకు అవకాశం కల్పిస్తున్నాం. మారుమూల గ్రామంలో కూర్చొని ప్రపంచానికి సేవలు అందించొచ్చు. ఉపాధి కల్పించేలా కాకుండా డబ్బులు సంపాదించొచ్చు.

ఉద్యోగాలు కల్పించేవారిగా తయారవ్వాలి..

ఉద్యోగాల కోసం ఎదురుచూడటం కాదు.. ఉద్యోగాల్ని కల్పించేవారిగా యువతను తయారు చేయటమే ప్రధాన లక్ష్యంగా ఈ విధానాల్ని రూపొందించాం. ఉమ్మడి రాష్ట్రంలో నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఐటీ విధానం తీసుకొచ్చా. ఇంజినీరింగ్ కళాశాలలు పెట్టాం. హైటెక్ సిటీ కట్టాం. ఐటీ పరిశ్రమలు తెచ్చాం. అప్పటి నుంచి అది అన్‌స్టాపబుల్‌గా తయారైంది. ఆ తర్వాత సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులు సృష్టించే స్థాయికి మనవాళ్లు ఎదిగారు. తెలుగు వ్యక్తి మైక్రోసాఫ్ట్ అధినేత అయ్యారు. భారతీయులు పబ్లిక్, కార్పొరేట్ గవర్నెన్స్‌లో కీలకంగా ఉన్నారు.

బ్రాండ్ ఇమేజ్‌ను పునరుద్ధరిస్తాం..

రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు తీసుకొచ్చి అభివృద్ధి చేసి సంపద సృష్టిస్తాం. తద్వారా పెరిగే ఆదాయాన్ని పేదల కోసం ఖర్చు చేస్తాం. వైకాపా ప్రభుత్వ హయాంలో రాష్ట్రం ఇమేజ్ మొత్తం దారుణంగా దెబ్బతింది. దాన్ని పునరుద్ధరిస్తాం. పెద్ద ఎత్తున విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్ని రాష్ట్రానికి తీసుకొస్తాం. ఏపీ ప్రపంచానికే ఆక్వాకల్చర్ హబ్‌గా తయారవుతుంది. రాయలసీమ 'ఫ్రూట్ బాస్కెట్'గా మారుతుంది. పెట్టుబడి లేని సహజసిద్ధ వ్యవసాయాన్ని ప్రోత్సహించి ఆ ఉత్పత్తులకు బ్రాండింగ్ చేస్తాం. ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాలు, దక్షిణకోస్తా, రాయలసీమల్లో ప్రత్యేక ఎంప్లాయ్‌మెంట్ జోన్లు సృష్టిస్తాం.

విదేశీ పెట్టుబడిదారుల కోసం ఎస్కార్ట్ అధికారిగా ఐఏఎస్

✦ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఇప్పటికే సాధించాం. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చేస్తున్నాం. ఎంత వేగంగా పని పూర్తి చేయగలమనేది ప్రధాన లక్ష్యం. ఇందులో భాగంగా.. సింగిల్ డెస్క్‌లో అనుమతులిస్తాం. వారి సమస్యలు పరిష్కరిస్తాం. ఈడీబీ ఒక్క దరఖాస్తు చేసుకుంటే చాలు.. నిర్దిష్ట వ్యవధిలోగా సంబంధిత శాఖల అధికారులు అనుమతులివ్వకపోతే డీమ్డ్ అనుమతి ఇచ్చేస్తాం. ఆ తర్వాత జాప్యానికి కారణమైన సంబంధిత అధికారిని బాధ్యుణ్ని చేస్తాం.

✦ విదేశీ పెట్టుబడిదారులకు సహాయం చేయడం కోసం ఆయా కంపెనీలు పెట్టే పెట్టుబడి, స్థాయిని బట్టి ఐఏఎస్ అధికారిని ఎస్కార్ట్ అధికారిగా నియమిస్తాం. ఆ కంపెనీలకు అన్ని రకాలుగా ఆ అధికారులు సహాయపడతారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ఇంటిగ్రేటెడ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ తీసుకొస్తాం.

✦ అగ్నిమాపక శాఖ సంబంధించిన ఎన్ఓసీకి గతంలో ఐదేళ్ల కాలపరిమితి ఉంటే.. వైకాపా హయాంలో దాన్ని ఏడాదికి కుదించేశారు. పారిశ్రామికవేత్తల్ని వేధించడానికే అలా వ్యవహరించారు.

✦ రూ.1000 కోట్ల పైన పెట్టుబడి పెట్టేవారు అనుమతుల కోసం నా ఆఫీస్‌కు వచ్చి అడగాల్సిన అవసరం లేదు. నేనే వారిని అడిగి పనులు పురోగతి ఎంతవరకూ వచ్చిందో.. ఎందుకు జాప్యం జరుగుతుందో తెలుసుకుంటా. జాప్యానికి కారకులైన అధికారుల్ని బాధ్యుల్ని చేసి చర్యలు తీసుకుంటా.



ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో మంత్రులు, సీఎస్

యువత ఇక్కడికి రావాలనే..

నాలెడ్జ్ ఎకానమీకి ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ హబ్‌గా తయారవుతుంది. మన రాష్ట్ర యువత ఇతర ప్రాంతాలకు వెళ్లి అద్భుతాలు సృష్టిస్తున్నారు. వారు ఏపీలో మాత్రం ఉండట్లేదు. వారిని అక్కడికి వెళ్లొద్దని చెప్పట్లేదు. కానీ మన రాష్ట్రంలో కూడా పెట్టుబడులు పెట్టాలని, అద్భుతాలు సృష్టించాలని పిలుపునిస్తున్నాం. అందుకు అనువైన వాతావరణాన్ని సృష్టించేందుకే ఈ ఆరు విధానాలు తీసుకొచ్చాం. సిలికాన్ వ్యాలీ తరహాలో ఇన్నోవేషన్ హబ్‌లు తయారు చేస్తాం.

నాలెడ్జ్ ఎకానమీ చిరునామాగా విశాఖ

✦ రాబోయే రోజుల్లో రాయలసీమ రతనాల సీమగా మారుతుంది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో కంటే అక్కడే ఎక్కువ ఆదాయం లభిస్తుంది. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే సీమలోని ప్రతి ఎకరాకు నీరు ఇవ్వగలుగుతాం. ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక పార్కులు వస్తాయి. భూమి, నీరు, విద్యుత్తు సదుపాయాలతో పాటు ఇతర అనుకూలతలు అక్కడ ఉన్నాయి. సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ విద్యుత్తుకు రాయలసీమ కేంద్రంగా మారుతుంది. వీటన్నింటినీ సమీకృతం చేసి.. రాయలసీమ రూపురేఖలు మారుస్తాం.

✦ 2025 నాటికి భోగాపురం విమానాశ్రయం పూర్తవుతుంది. దాన్ని ఆధారంగా చేసుకుని విశాఖపట్నాన్ని నాలెడ్జ్ ఎకానమీకి చిరునామాగా మారుస్తాం. వచ్చే ఏడాదిలోగా భావనపాడు (మూలపేట) పోర్టు పూర్తి చేస్తాం. శ్రీకాకుళం జిల్లాలో 10 వేల ఎకరాల్లో పారిశ్రామిక హబ్ తయారు చేస్తాం. జాతీయ రహదారికి సమాంతరంగా విశాఖపట్నం నుంచి భావనపాడు వరకూ కోస్టల్ రోడ్డు తయారు చేస్తాం. దాన్ని పర్యాటక, పారిశ్రామిక హబ్‌గా తయారు చేస్తాం.

డీ-కార్బ్ రాయితీ ఇస్తున్న మొట్టమొదటి రాష్ట్రం

✦ ఉత్పత్తులకు విలువ జోడింపు, అత్యుత్తమ ఉత్పత్తుల తయారీ, కల్పించే ఉద్యోగాల సంఖ్య ఆధారంగా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందిస్తాం. వివిధ రంగాలకు సంబంధించి ఇక్కడ తయారయ్యే ఉత్పత్తులను ప్రపంచ స్థాయిలో ప్రమోట్ చేస్తాం. మరే రాష్ట్రంలోనూ లేనివిధంగా డీ-కార్బ్ రాయితీ ఇస్తున్నాం. కర్బన ఉద్గారాలు తగ్గించే కంపెనీలకు రాయితీలిస్తాం.

తయారీరంగంలో ప్రపంచాన్ని ఆకర్షిస్తాం..

✦ స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ డాక్యుమెంట్‌ను వచ్చే నెల మొదటి వారంలో విడుదల చేస్తాం. ఉత్పత్తి వ్యయం తగ్గిస్తాం. గ్రీన్ ఎనర్జీకి ఏపీని హబ్‌గా తీర్చిదిద్దుతాం. ఫార్చ్యూన్ 500 కంపెనీలను రాష్ట్రానికి తీసుకొస్తాం.

✦ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసం ఒక పారిశ్రామిక పార్కు ఉండేలా చర్యలు తీసుకుంటాం. అంతర్జాతీయ స్థాయిలో ఉత్పత్తితో పోలిస్తే మన దగ్గర ఉత్పత్తి తక్కువగా ఉంది. నైపుణ్యాలు తక్కువగా ఉండటమే దీనికి కారణం. అందుకే నైపుణ్య గణన చేపడుతున్నా. నైపుణ్య శిక్షణ అందిస్తాం.

✦ ఒకప్పుడు పాలసీలంటే అర్థం కాని సాంకేతిక భాషలో పేజీలకు పేజీలు పుస్తకాలు ఉండేవి. ఇప్పుడు అలా కాకుండా రెండు, మూడు పేజీల్లోనే ఇస్తున్నాం.

✦ కొంతమందికి తెలివితేటలున్నాయి. పెట్టుబడి పెట్టేందుకు డబ్బులు ఉండవు. అలాంటివారికి సీడ్ క్యాపిటల్ ఇస్తాం. యూనియన్ బ్యాంకు రూ.10 కోట్లు ఇవ్వటానికి ముందుకొచ్చింది.

రూ.524 కోట్లతో ఎమ్మెల్యేలు, ఐఏఎస్‌ల నివాస భవనాలు

- 20 రోజుల్లో పనులు ప్రారంభం
- సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో పలు నిర్ణయాలు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో సుమారు రూ.49 వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ముఖ్యమైన పనులన్నింటికీ వచ్చే జనవరి నెలాఖరులోగా టెండర్లు పిలుస్తామని పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. ప్రధాన మౌలిక వసతులు, హైకోర్టు, శాసనసభ భవనాలు, సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయ టవర్లు, కొండవీటివాగు, పాలవాగు ఆధునికీకరణ, గ్రావిటేషన్ కెనాల్ నిర్మాణం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అఖిల భారత సర్వీసుల అధికారులు, ప్రభుత్వ ఉద్యోగుల నివాస భవనాలు వంటి పనులకు వరుసగా టెండర్లు పిలవనున్నట్లు ఆయన వివరించారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల్ని నారాయణ విలేకర్లకు వెల్లడించారు.

✦ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్ అధికారులకు నిర్మిస్తున్న 18 టవర్లు తుది దశలో ఉన్నాయి. సీవరేజ్ ప్లాంట్, తాగునీటి వసతి, క్లబ్ హౌస్ వంటివి పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని రూ.524.7 కోట్లతో చేపట్టేందుకు అథారిటీ పాలనాపరమైన అనుమతులిచ్చింది. డిజైన్, బిల్డ్, ఐటమ్ రేట్ కాంట్రాక్ట్ విధానంలో టెండర్లు పిలుస్తారు. రెండు, మూడు రోజుల్లో టెండర్లు పిలిచి, 20 రోజుల్లో పనులు ప్రారంభిస్తారు. మొత్తం 18 టవర్లలో 432 ఫ్లాట్లు నిర్మిస్తున్నారు.

✦ రాజధానిలో చేపట్టే వివిధ ప్రాజెక్టులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పర్యావరణ అనుమతుల వ్యవహారాల్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా పర్యావరణ, సామాజిక నిర్వహణ యూనిట్ ఏర్పాటుకు ఆమోదం.

✦ 2017-18 నుంచి 2020-21 వరకు సీఆర్‌డీఏ ఎకౌంట్స్‌ను కాగ్‌కు సమర్పించేందుకు అథారిటీ ఆమోదముద్ర.

✦ రాజధానిలో జీ+7 విధానంలో చేపట్టిన సీఆర్‌డీఏ కార్యాలయ నిర్మాణాన్ని రూ.160 కోట్లతో చేపట్టేందుకు అనుమతి. తాజా టెండర్లలో హైదరాబాద్‌కు చెందిన కేపీసీ సంస్థ ఎల్1గా ఎంపికైంది. రెండు, మూడు రోజుల్లో పనులు ప్రారంభిస్తుంది. ఈ ప్రాజెక్టుపై ఇప్పటి వరకు రూ.61.48 కోట్లు ఖర్చయింది. మొత్తం 2,42,481 చ.అడుగులతో నిర్మిస్తున్నారు.

✦ ప్రపంచబ్యాంకు, ఏడీబీల నుంచి రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్ల రుణం స్వీకరణ ప్రతిపాదనకు అథారిటీ ఆమోదం. నవంబరు, డిసెంబరుల్లో రుణం విడుదలవుతుంది.

ప్రధాన రహదారులకు డిసెంబరు నెలాఖరులోగా టెండర్లు

✦ అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏడీసీ) ఆధ్వర్యంలో రాజధానిలో మొత్తం 360 కి.మీ. పొడవున నిర్మిస్తున్న వివిధ రహదారులకు డిసెంబరు 30లోగా మళ్లీ టెండర్లు. గతంలో పనులు చేసిన గుత్తేదార్లకు సంబంధించిన కాంట్రాక్టులు మూసేసి, మిగతా పనులకు ప్రస్తుత ధరల ప్రకారం మళ్లీ టెండర్లు పిలుస్తారు.

✦ ఎంత భారీ వర్షాలు కురిసినా రాజధానిలో చుక్క నీరు నిలవకుండా కొండవీటివాగు, పాలవాగుల ఆధునికీకరణ, గ్రావిటీ కెనాల్ నిర్మాణానికి నెదర్లాండ్స్‌కు చెందిన కన్సల్టెన్సీ సంస్థలు డిజైన్లు ఇచ్చాయి. దానిలో భాగంగా ఆరు రిజర్వాయర్లు నిర్మిస్తున్నారు.

✦ అసెంబ్లీ, హైకోర్టు భవనాలకు జనవరి నెలాఖరులోగా, మిగతా పనులకు డిసెంబరు నెలాఖరులోగా టెండర్లు పిలుస్తారు.

✦ రాజధానిలో చేపట్టే పనులన్నీ ఏడాది నుంచి రెండున్నరేళ్లలో పూర్తవుతాయి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్ అధికారుల నివాస భవనాలు 9 నెలల్లో సిద్ధమవుతాయి. మిగతా నివాస భవనాలు ఏడాదిలో పూర్తవుతాయి. రోడ్లన్నీ 18 నెలల్లో సిద్ధమవుతాయి.

జాతీయ రహదారితో ఐదు రోడ్ల అనుసంధానం

✦ రాజధానిలోని ఇ-5, ఇ-7, ఇ-9, ఇ-11, ఇ-13 రోడ్లను జాతీయ రహదారితో అనుసంధానిస్తారు. కన్సల్టెన్సీ సంస్థ లీ డీపీఆర్ సిద్ధం చేస్తోంది. ఇ-11, ఇ-13 రహదారులకు పెద్దగా భూసేకరణ అవసరం లేదు. వాటికి రెండు నెలల్లో టెండర్లు పిలుస్తారు.

✦ భవిష్యత్తులో అమరావతి ఇన్నర్, అవుటర్ రింగ్‌రోడ్లపై వచ్చే బ్రిడ్జిలను ఐకానిక్‌గా నిర్మించాలని సీఎం ఆదేశించారు.

✦ కరకట్ట రోడ్డును 2009లో వచ్చిన వరదల్ని దృష్టిలో ఉంచుకుని డిజైన్ చేశారు. కానీ ఇటీవల 11.43 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. ఆ నేపథ్యంలో కరకట్ట రోడ్డును రీడిజైన్ చేయాలా అనే అంశంపై అధ్యయనం చేసే బాధ్యతను కన్సల్టెన్సీ సంస్థకు అప్పగించారు' అని నారాయణ వెల్లడించారు.

✦ రాజధానిలో స్టార్టప్ ప్రాజెక్టు అభివృద్ధిపై సింగపూర్ కన్సార్షియంతో ఇంకా చర్చలు జరపలేదని నారాయణ తెలిపారు.

✦ రాజధానిలో ఇంకా 1400 మందికి రైతులకు కౌలు చెల్లించాల్సి ఉందన్నారు. వారం పది రోజుల్లో వారికీ కౌలు చెల్లిస్తామన్నారు.

✦ గతంలో భూములిచ్చిన రైతుల్లో సీఆర్‌డీఏ ఇంకా స్థలాలు కేటాయించని వారికి.. పది రోజుల్లోగా లాటరీ వేసి స్థలాల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు.

మద్యం, ఉచిత ఇసుకలో ఎవరు జోక్యం చేసుకున్నా ఉపేక్షించేది లేదు

- తన, మన అనే తేడా లేకుండా చర్యలు తీసుకుంటాం

'అడవిపందులు పొలంలోకి వస్తే పంట పోయినట్లే. వైకాపా ఐదేళ్లు ఇలాగే తయారై రాష్ట్రాన్ని పిప్పి పీల్చేసింది. తవ్విన కొద్దీ అవినీతి, అరాచకాలే.. వ్యవస్థలు ధ్వంసమయ్యాయి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు విరుచుకుపడ్డారు. 'ఇసుక, మద్యం విషయంలో అధికారులు, నేతలు జోక్యం చేసుకోవద్దని స్పష్టం చేస్తున్నా. అవినీతి జోలికి వెళ్లవద్దు. మంత్రులకూ ఇదే విషయాన్ని చెప్పాం' అని స్పష్టం చేశారు. 'జిల్లాకు ప్లానింగ్ బోర్డు ఛైర్మన్లుగా నియమించాం. ఉచిత ఇసుక విధానం పూర్తిస్థాయిలో అమలవుతుందో లేదో వారు చూడాలి. ఇందులో ఎవరు జోక్యం చేసుకున్నా తన, మన అనే తేడా లేకుండా చర్యలు తీసుకుంటాం' అని పేర్కొన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక రాజధాని అమరావతి అనేది ఎన్డీయే విధానం.. విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తాం. కర్నూలులో హైకోర్టుతోపాటు.. పారిశ్రామిక హబ్‌గా, సుందర నగరంగా తయారుచేస్తాం. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం' అని వివరించారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను చంద్రబాబు విలేకరులకు వివరించారు.

✦ 'ఎడ్లబండి, ట్రాక్టర్ తీసుకొచ్చి తమ అవసరాలకు ఇసుక తీసుకువెళ్తామంటే అనుమతించాల్సిందే. వారిపై కేసులు పెడితే సస్పెండ్ చేస్తాం. విచారణ చేస్తాం. ట్రాక్టర్, ఎడ్లబండితో ఇసుక తీసుకెళ్లి వ్యాపారం చేయాలన్నా కుదరదు..

✦ నవంబరు నుంచి ఇసుక తవ్వకం పెరుగుతుంది. నిల్వలు పెరుగుతాయి. ధర కూడా తగ్గుతుంది. ఇసుకను ఉచితంగా తీసుకెళ్లే విధానాన్ని ఉపయోగించుకుని డబ్బు సంపాదించుకునేందుకు ప్రయత్నిస్తే.. ఏం చేయాలో ఆలోచిస్తాం. సొంత భూముల్లో ఇసుక తవ్వకాలకు అనుమతి ఇస్తాం. ఎవరైనా తీయనీయడం లేదంటే మా దృష్టికి తెస్తే చర్యలు తీసుకుంటాం. అన్ని జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రుల ఫోన్ నంబర్లను ప్రజలకు ఇస్తాం, ఎవరైనా ఫిర్యాదులు చేస్తే వారే చర్యలు తీసుకుంటారు' అని తెలిపారు.

మూడు మంత్రివర్గ ఉపసంఘాల ఏర్పాటు

గంజాయికి అడ్డుకట్ట, నిత్యావసర ధరల నియంత్రణ, 20 లక్షల ఉద్యోగాల కల్పనకు 3 మంత్రివర్గ ఉపసంఘాలు ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

✦ రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణకు హోంమంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన నారా లోకేశ్, కొల్లు రవీంద్ర, సత్యకుమార్ యాదవ్, గుమ్మడి సంధ్యారాణి సభ్యులుగా మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తున్నాం.

✦ ఐజీ రవికృష్ణ సారథ్యంలో 559 మంది సిబ్బందితో యాంటీ నార్కోటిక్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నాం. అవసరమైతే సమాచారం సేకరించడానికి కూడా సిబ్బందిని ఇస్తాం. గంజాయి. మాదకద్రవ్యాల నియంత్రణను పూర్తిగా అమలు చేసేందుకు వీరు పని చేస్తారు.

మద్యం అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయంలో 2% డీఅడిక్షన్ సెంటర్లకు కేటాయిస్తున్నాం.

✦ గంజాయి వాడకంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అక్టోబరు, నవంబరు నెలల్లో కార్యక్రమం అమలు చేస్తాం.

నిత్యావసర ధరల పర్యవేక్షణకు..

రాష్ట్రంలో నిత్యావసరాల ధరల పర్యవేక్షణ, నియంత్రణకు పౌరసరఫరాలశాఖ మంత్రి మనోహర్ అధ్యక్షతన అచ్చెన్నాయుడు, సవిత, పయ్యావుల కేశవ్ సభ్యులుగా మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశాం.

✦ మూడు మంత్రివర్గ ఉపసంఘాలు ఎప్పటికప్పుడు సీఎం, మంత్రివర్గానికి నివేదికలు అందిస్తారు.

✦ స్వర్ణకారుల సాధికారతకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నాం. వారి భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

20లక్షల ఉద్యోగాల కల్పన కోసం..

20లక్షల ఉద్యోగాల కల్పన కోసం ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ అధ్యక్షతన మంత్రులు టీజీ భరత్, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేశ్, కొండపల్లి శ్రీనివాస్, పొంగూరు నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డి సభ్యులుగా మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తున్నాం. 20లక్షల ఉద్యోగాలు సాధించడానికి ఏం చేయాలో వారు సమగ్రమైన కార్యాచరణ తయారు చేస్తారు.

7 జాతీయ రహదారుల పనులకు కేంద్రం పచ్చజెండా

- విలువ రూ. 6,280 కోట్లు
- మొత్తం 384 కిలోమీటర్లు

ఈనాడు, దిల్లీ: భారతమాల పరియోజన మొదటి దశ కింద రాష్ట్రానికి మంజూరైన 7 జాతీయ రహదారుల నిర్మాణ పనులు మొదలుపెట్టడానికి కేంద్ర రహదారులు, రవాణాశాఖ పచ్చజెండా ఊపింది. ఈ ప్రాజెక్టులు గత ఏడాది మంజూరైనప్పటికీ వాటి టెండరింగ్ ప్రక్రియను ఇదివరకు స్తంభింపజేసిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఏకకాలంలో అన్నింటినీ ప్రారంభించడానికి ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు రాష్ట్ర రహదారులు, భవనాలశాఖ కార్యదర్శికి తాజాగా లేఖ రాసింది. మొత్తం 384 కిలోమీటర్ల పొడవైన ఈ రహదారుల నిర్మాణానికి తొలుత రూ. 6,646 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసినప్పటికీ ప్రస్తుతం ఆ వ్యయాన్ని రూ. 6,280 కోట్లకు తగ్గించింది. ఈ ప్రాజెక్టుల్లో కొండమోడు-పేరేచెర్ల సెక్షన్ విస్తరణ కూడా ఉంది.

✦ జాతీయ రహదారి నం. 167 ఏజీలో 49.917 కిలోమీటర్ల మార్గాన్ని రూ. 881.61 కోట్లతో నాలుగు వరుసలుగా విస్తరిస్తారు.

✦ ఎన్‌హెచ్ 167కెలో సంగమేశ్వరం-నల్లకాలువ, వెలిగొండ-నంద్యాల మధ్య 62.571 కోట్ల మార్గాన్ని రూ. 601 కోట్ల వ్యయంతో రెండు వరుసలుగా విస్తరిస్తారు.

✦ కొత్తగా జాతీయ రహదారిగా ప్రకటించిన ఎన్‌హెచ్ 167 కెలో నంద్యాల-కర్నూలు/కడప బోర్డర్ సెక్షన్‌ను 62 కిలోమీటర్ల మేర ఆధునికీకరిస్తారు. ఇందుకోసం రూ. 691 కోట్లు వెచ్చిస్తారు.

✦ ఎన్‌హెచ్-440లో వేంపల్లి నుంచి చాగలమర్రి వరకు (ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు మీదుగా) ఉన్న 78.95 కిలోమీటర్ల రహదారిని రూ. 1,321 కోట్లతో రెండు, నాలుగు వరుసలుగా విస్తరిస్తారు.

✦ ఎన్‌హెచ్ 716జిలోని ముద్దనూరు-హిందూపురం సెక్షన్‌లో 33.58 కిలోమీటర్ల మార్గాన్ని రూ. 808 కోట్లతో నాలుగు వరుసలుగా విస్తరిస్తారు.

✦ ఎన్‌హెచ్ 716జిలో ముద్దనూరు నుంచి బి.కొత్తపల్లి సెక్షన్ వరకు 56.5 కిలోమీటర్ల మార్గాన్ని రూ.1,019.97 కోట్లతో నాలుగు వరుసలుగా విస్తరిస్తారు.

✦ ఎన్‌హెచ్ 516బిలో పెందుర్తి నుంచి ఎస్.కోట మార్గంలో ఉన్న 40.5 కిలోమీటర్ల రోడ్డును రూ. 956.21 కోట్లతో 2, 4 వరుసలుగా విస్తరిస్తారు.

ఈ ఏడు ప్రాజెక్టుల్లో తొలి రెండు ప్రాజెక్టులకు ఇదివరకే టెండర్లు పిలవగా ఇద్దరు ఎల్-1గా నిలిచారు. దాంతో ఆ రెండు సంస్థలు కోట్ చేసిన మొత్తానికే తాజా ధరలను నిర్ణయించి అంచనాలను సవరించారు. కొండమోడు-పేరేచెర్ల రహదారి విస్తరణలో భాగంగా దానికి అనుబంధంగా సత్తెనపల్లి, మేడికొండూరుల వద్ద రెండు బైపాస్ రోడ్లు నిర్మించనున్నట్లు తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు హరియాణాకు చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం హరియాణాలో పర్యటించనున్నారు. పంచకులలో జరగనున్న నాయబ్‌సింగ్‌సైనీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం చండీగఢ్‌లో జరిగే ఎన్డీయే ముఖ్యమంత్రుల సమావేశానికి హాజరవుతారు. ఉదయం 9 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఆయన చండీగఢ్ చేరుకుంటారు. రాత్రి 11 గంటలకు ఉండవల్లి నివాసానికి తిరిగొస్తారు.

✦ ఇదే కార్యక్రమంలో పాల్గొనేందుకు... ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గురువారం హరియాణా వెళ్లనున్నారు.

విజేతల లక్షణం అదే



జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగిన ప్రతి ఒక్కరూ అద్భుతమైన తెలివితేటలు, ప్రతిభ ఉన్న వారు కాదు. వారి కన్నా మేధస్సు ఉన్నవారు కోకొల్లలుగా ఉంటారు. మరి వారు ఇతరుల కన్నా భిన్నంగా ఎలా నిలిచారంటే స్థిరమైన కృషితోనే. అత్యధికులు ఆరంభ శూరత్వంతో ప్రయత్నాలను మొదలుపెట్టి, కొన్నాళ్ల తర్వాత చేతులెత్తేస్తారు. తమ ప్రయత్నాలను స్థిరంగా కొనసాగించేవారే ప్రయాణాన్ని దిగ్విజయంగా ముగిస్తారు.

అద్వైత్ అరోడా, ఇన్వెస్ట్‌మెంట్ ట్రైనర్

ఎన్డీయే పాలనపై ప్రజల్లో పూర్తి సంతృప్తి

- ప్రధాని దృష్టికి తీసుకెళ్లిన ఎంపీ అప్పలనాయుడు
- చంద్రబాబు పరిపాలనపై నమ్మకం ఉందన్న మోదీ


ఈనాడు, దిల్లీ: రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వహించిన తితిదే బ్రహ్మోత్సవాలు, ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ దసరా మహోత్సవాలు, ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు ఘనంగా జరిగినట్లు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తెలిపారు. బుధవారం ఇక్కడ ప్రధాని మోదీని ఆయన అధికార నివాసంలో కలిసి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజుల్లో చేసిన పనుల గురించి వివరించారు. ''కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతి అంశంపైనా జాగ్రత్తగా చర్యలు తీసుకుంటోంది. దానివల్ల గతంలో ఎన్నడూలేనంత మంది భారీ సంఖ్యలో భక్తులు తమ ఇష్ట దైవాలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకోగలిగారు. అన్ని ఉత్సవాల్లో సీఎం చంద్రబాబు సామాన్య భక్తులకు పెద్దపీట వేశారు. ప్రసాదాల విక్రయం గతంలో కంటే 20% పెరగడం ఇందుకు నిదర్శనం. ముఖ్యంగా తిరుమల లడ్డూ నాణ్యత బాగా పెరిగిందని భక్తులందరూ చెబుతున్నారు. దేశంలో, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వ పాలనపై ప్రజలు పూర్తి సంతృప్తితో ఉన్నారు'' అని అప్పలనాయుడు ప్రధాన మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ స్పందిస్తూ చంద్రబాబు పరిపాలనపై పూర్తి నమ్మకం ఉందని, ఆయనకు రాష్ట్ర ప్రయోజనాలు అత్యంత ముఖ్యమని, ఆయన హయాంలో ఏ కార్యక్రమం చేపట్టినా విజయవంతం అవుతుందని వ్యాఖ్యానించినట్లు అప్పలనాయుడు పేర్కొన్నారు.

ఈశా 'గ్రామోత్సవం' పోస్టర్ ఆవిష్కరణ

ఈనాడు డిజిటల్, అమరావతి: ఈశా ఫౌండేషన్ నిర్వహించనున్న 16వ గ్రామోత్సవ పోస్టర్‌ను క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి బుధవారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఈశా ప్రతినిధులు మాట్లాడుతూ.. ఇందులో ప్రవేశం ఉచితమని, రిజిస్ట్రేషన్ కోసం isha.co/gramotsavam వెబ్‌సైట్‌ని సందర్శించాలని సూచించారు. గ్రామం మొత్తాన్ని ఒక్కచోటుకు చేర్చి వినోదాన్ని పంచడమే దీని ఉద్దేశమని పేర్కొన్నారు.







మాట్లాడుతున్న ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ గుళ్లపల్లి నాగేశ్వరరావు. చిత్రంలో ఆన్‌లైన్ ద్వారా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ★ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ ప్రశాంత్ గార్గ్, జయప్రకాశ్ నారాయణ, కె.పద్మనాభయ్య, గౌతమ్ సవాంగ్, డాక్టర్ గురు ఎన్.రెడ్డి, డాక్టర్ కె.రవీంద్రనాథ్, కేవీపీ రామచంద్రరావు తదితరులు

కార్నియా మార్పిడి శస్త్రచికిత్సల్లో ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి కృషి అమూల్యం

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

హైదరాబాద్, న్యూస్‌టుడే: కార్నియా మార్పిడి శస్త్రచికిత్సల్లో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యవిజ్ఞాన సంస్థ కృషి అమూల్యమని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. 37 సంవత్సరాల్లో 50 వేల కార్నియా మార్పిడి శస్త్రచికిత్సల మైలురాయిని సాధించిన సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఆన్‌లైన్ ద్వారా ప్రసంగించారు. సంస్థ ఈ స్థాయికి ఎదగడం వెనక వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ గుళ్లపల్లి నాగేశ్వరరావు అవిశ్రాంత కృషి ఉందన్నారు. కార్నియా డిమాండ్, సరఫరా మధ్య ఇప్పటికీ అంతరం ఉందని, దాన్ని గణనీయంగా తగ్గించడం వెనక ఆయన దార్శనికత, కృషి ఉన్నాయని అభినందించారు. ఒకప్పటితో పోలిస్తే కార్నియా కోసం వేచిఉండే సమయం తగ్గిందన్నారు. కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ వైస్‌ఛైర్మన్ డాక్టర్ ప్రశాంత్ గార్గ్, లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాశ్ నారాయణ, మాజీ ఐఏఎస్ పద్మనాభయ్య, ఏపీ మాజీ డీజీపీ గౌతమ్ సవాంగ్, కాంటినెంటల్ ఆసుపత్రి సీఎండీ గురు ఎన్ రెడ్డి, గ్లోబల్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కె.రవీంద్రనాథ్, కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

'కోకో' పంటకు ఏపీ అనువైన ప్రాంతం

- డీసీసీడీ డైరెక్టర్ డాక్టర్ ఫెమీనా
- విజయవాడలో సమావేశమైన కోకో రైతులు

ఈనాడు డిజిటల్, అమరావతి: చాక్లెట్లలో వినియోగించే 'కోకో' పంట సాగుకు ఏపీ అనువైన ప్రాంతమని డైరెక్టరేట్ ఆఫ్ కాష్యూనట్, కోకో డెవలప్‌మెంట్ (డీసీసీడీ) డైరెక్టర్ డాక్టర్ ఫెమీనా తెలిపారు. ఇది భవిష్యత్తులో లాభదాయక పంటగా మారనుందని పేర్కొన్నారు. విజయవాడలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యానశాఖ ఆధ్వర్యంలో 'కోకో స్టేక్ హోల్డర్స్ మీట్' బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు, వివిధ జిల్లాల రైతులు, శాస్త్రవేత్తలు, మార్కెటింగ్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ పంట సాగు, సవాళ్లను ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై రైతులకు శాస్త్రవేత్తలు వివరించారు. 'రాష్ట్రంలో కోకో సాగు చేస్తున్న ప్రాంతాల్లో పర్యటించా. రైతులంతా వినూత్న రీతిలో సాగు చేస్తున్నారు. లాభాలు ఆర్జిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా మన దేశ కోకో గింజలకు గిరాకీ ఉంది. దానికి తగినట్లు రాష్ట్రంలో సాగు లేదు. ప్రస్తుతం ఈ పంట మార్కెట్ విలువ అనూహ్యంగా పెరిగింది. రాష్ట్రంలో పంటను మరింత విస్తరించాలి' అని ఫెమీనా పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యానశాఖ సంచాలకుడు కె.శ్రీనివాసులు మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో సాగు చేస్తున్న కోకో గింజల నాణ్యత ప్రపంచంలోని అత్యుత్తమ గింజలతో సమానంగా ఉంది. కోకో విస్తీర్ణంలో ఏలూరు జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉంది' అని పేర్కొన్నారు. పంట సాగులో సందేహాలను రైతులు శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు.

సంక్రాంతి నాటికి గుంతల్లేని రోడ్లు

- యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు
- అందుకు అవసరమైతే మరో రూ.300 కోట్లు
- మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ
- దీపావళి నుంచి ఉచిత సిలిండర్లు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని రహదారులపై గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని నవంబరు 1 నుంచి యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. సంక్రాంతి నాటికి రాష్ట్రంలో ఏ రోడ్డుపైనా గుంతలనేవి ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఆర్అండ్‌బీ పరిధిలోని రహదారుల్లో గుంతలు పూడ్చడానికి రూ.600 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. అవసరమైతే మరో రూ.300 కోట్లు మంజూరు చేస్తామన్నారు. రహదారుల పరిస్థితిపై డ్రోన్లతో సర్వే చేయాలని సూచించారు. కేంద్ర సహకారంతో రూ.55 వేల కోట్లతో రహదారులు నిర్మిస్తున్నామని.. మరో రూ.30 వేల కోట్లతోనూ రోడ్ల నిర్మాణానికి అనుమతి వస్తుందని చంద్రబాబు వెల్లడించారు. బుధవారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో రాష్ట్రంలో రహదారుల పరిస్థితి, మరమ్మతులపై చర్చలో ఆయన ఈ మేరకు ప్రకటించారు.

వైకాపా హయాంలో మరమ్మతులపై విచారణ

వైకాపా ప్రభుత్వ హయాంలో గ్రామీణ రహదారుల మరమ్మతులకు గిడ్డంగుల సంస్థ ద్వారా రుణం సమీకరించారని, ఆర్థిక శాఖలో ప్రత్యేకంగా హెడ్ ఆఫ్ ఎకౌంట్ లేకుండా గుత్తేదారులకు బిల్లుల చెల్లింపునకు జీఓ విడుదల చేశారని అధికారులు కేబినెట్ దృష్టికి తెచ్చారు. గిడ్డంగుల సంస్థలో సగం వాటా కేంద్ర ప్రభుత్వానిదని, ఆ రుణంతో తమకు ఎలాంటి సంబంధం లేదని కేంద్రం స్పష్టం చేసిందని తెలిపారు. అప్పట్లో టెండర్లు పిలిచి అప్పగించిన పనుల్లో 20 శాతం వరకు పూర్తయ్యాయని.. హెడ్ ఆఫ్ ఎకౌంట్ లేకుండా బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, అది నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. దీనిపై విచారణకు కమిటీ వేయాలని కేబినెట్ నిర్ణయించింది. బాధ్యుల్లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి స్థాయి అధికారి కూడా ఒకరున్నారన్న సమాచారంతో ఒకరిద్దరు అధికారులపై చర్యలు తప్పవన్న అభిప్రాయం వ్యక్తమైంది. 'పంచాయతీరాజ్‌శాఖలో దారుణ నిర్ణయాలు చేశారు. టెండర్లపై రోడ్లు ఇస్తే.. అంతా ఆఫ్‌లైన్‌లో నడిపించేశారు. ఆర్థిక శాఖలో ఖాతా లేకుండానే ఇష్టానుసారం బిల్లులు ఇచ్చేశారు. దీనిపై విచారిస్తున్నాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం' అని చంద్రబాబు స్పష్టం చేశారు.

దేశమంతా అనుసరించేంత గొప్పగా 6 పాలసీలు

రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఆరు కొత్త విధానాలపై మంత్రులకు సంబంధిత అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఆ విధానాలన్నీ చాలా సమగ్రంగా ఉన్నాయని మంత్రిమండలి అభినందించింది. అవి దేశం మొత్తం అనుసరించేంత గొప్పగా ఉన్నాయని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. వాటిపై చాలా విస్తృత కసరత్తు చేశామని, ఒక్కో పాలసీపై 40-50 గంటలు వెచ్చించామని సీఎం తెలిపారు. గత ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో రాష్ట్రవ్యాప్తంగా నగరాలు, పట్టణాల్లో 85 లక్షల టన్నుల చెత్త పేరుకుపోయిందని, దాన్ని తొలగించేందుకు రెండేళ్లు పడుతుందని అధికారులు కేబినెట్ దృష్టికి తెచ్చారు. యుద్ధప్రాతిపదికన ఆ చెత్తను తొలగించాలని సీఎం ఆదేశించారు. సూపర్ సిక్స్‌లో భాగంగా ఇచ్చిన హామీల్లో భాగంగా ఉచిత సిలిండర్ల పథకాన్ని దీపావళి నుంచి అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

గంజాయి బ్యాచ్‌లపైనా ప్రత్యేక షీట్లు

అనంతపురం జిల్లాలో అత్తాకోడళ్లపై అత్యాచారానికి పాల్పడ్డవాళ్లు గంజాయి మత్తులో ఆ ఘాతుకానికి ఒడిగట్టారని అధికారులు వివరించారు. మరోసారి ఎవరూ అలాంటివి చేయకుండా భయపడేలా దోషుల్ని కఠినంగా శిక్షించాలని పలువురు మంత్రులు అభిప్రాయపడ్డారు. ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి, వారికి చట్టప్రకారం శిక్ష పడేలా చేద్దామని సీఎం చెప్పారు. గంజాయి సేవించి పట్టుబడ్డవారిలో మార్పు వచ్చేలా.. సామాజిక సేవా శిక్షలు విధించాలని, వారి పేర్లు పది మందిలో నానతాయి కాబట్టి ఆ తర్వాతైనా వారు మారే అవకాశం ఉందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల వంటి రద్దీ ప్రదేశాల్లో గంజాయి బ్యాచ్‌ల ఫొటోలు పెట్టాలని.. రౌడీలపై రౌడీ షీట్ల మాదిరిగా గంజాయి బ్యాచ్‌లపైనా ప్రత్యేక షీట్లు తెరవాలని, మాదకద్రవ్యాల నియంత్రణకు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించాలని కేబినెట్ నిర్ణయించింది. లాలాజలాన్ని పరీక్షించి కూడా ఒక వ్యక్తి మాదకద్రవ్యాలు తీసుకున్నాడో లేదో నిర్ధారించే విధానం అందుబాటులోకి వచ్చిందని, దాన్ని ఇక్కడ కూడా వినియోగించాలని కొందరు మంత్రులు సూచించారు.

ఇసుక ధరలు తగ్గకపోవడంపై సీఎం ఆగ్రహం

రాష్ట్రంలో ఏ వాగులు, వంకలు, నదుల్లో నుంచైనా.. ఎవరైనా సొంత అవసరాలకు ఇసుక ఉచితంగా తెచ్చుకోవచ్చని, దీనికి ఎవరు అడ్డుపడినా కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టి ఇన్నాళ్లయినా, ఇసుక లోడింగ్, రవాణా ఛార్జీలు మాత్రమే వసూలు చేసేందుకు అనుమతించినా.. ఇప్పటికీ ధరలు తగ్గకపోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే మంత్రివర్గ సమావేశం నాటికి దీనిపై ఎలాంటి ఫిర్యాదులు ఉండటానికి వీల్లేదన్నారు. ప్రజలు తమ ఊళ్లకు సమీపంలోని వాగులు, వంకల నుంచి బళ్లు, ట్రాక్టర్లు వంటి వాహనాల్లో ఇసుక తెచ్చుకునేందుకు అనుమతిస్తే చాలా వరకు సమస్య పరిష్కారమవుతుందని మంత్రులు అభిప్రాయపడ్డారు. ఉచిత ఇసుక విధానం ఉద్దేశం కూడా అదేనని, దాన్ని సమర్థంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత మీదేనని సీఎం వారితో అన్నారు. గనుల శాఖ ఎంపిక చేసిన రీచ్‌లలో లోడింగ్ కోసం టెండర్లు పిలవగా.. కొందరు కావాలనే తక్కువ ధర కోట్ చేస్తున్నారని, ఆ కాంట్రాక్ట్ దక్కించుకున్నాక అక్రమంగా ఇసుక రవాణా చేయాలన్న దురుద్దేశం దానిలో కనిపిస్తోందని కొందరు మంత్రులు చెప్పారు. అలాంటివి సమీక్షించి రద్దు చేయాలని సీఎం ఆదేశించారు. ఇసుక, మద్యం వ్యవహారాల్లో మంత్రులు, ఎమ్మెల్యేల జోక్యాన్ని సహించబోనని చంద్రబాబు మరోసారి గట్టిగా హెచ్చరించారు.

దయనీయ జీవితాలకు విరాళమే దారి దీపం

ఊహకందని విధంగా దూసుకొచ్చిన వరద వేల కుటుంబాలను కోలుకోలేని దెబ్బతీసింది. కూడబెట్టిన కష్టమంతా ఒక్క పూటలో తుడిచిపెట్టుకుపోయింది. ఏ కంట చూసినా కన్నీరు.. ఏ ఇంట చూసినా కష్టాలే. ఇప్పుడు వీరంతా మళ్లీ బతుకుబండిని లాగాలంటే ఎవరో ఒకరు ఆపన్నహస్తం అందించాల్సిందే.. అందుకు మేమున్నామంటూ మానవతావాదులు ముందుకొస్తున్నారు.



అవిర్నేని శ్రీనివాస్
వడోదర, గుజరాత్
విరాళం: రూ.1,00,116

తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు రామోజీ గ్రూపు తరఫున రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన 'ఈనాడు సహాయనిధి'కి ఉదారంగా విరాళాలు ఇస్తున్న దాతలకు కృతజ్ఞతలు. ఈనాడు పిలుపు అందుకొని స్పందిస్తున్న సహృదయుల వివరాలు..

ఈనాడు సహాయనిధికి విరాళాలిచ్చిన దాతలు

వ్యక్తులు / సంస్థలు	సాయం (రూ.లలో)
సత్యం వెంచర్ ఇంజినీరింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఉద్యోగులు, సికింద్రాబాద్	1,50,083
జాట్ల పుల్లయ్య, విజయలక్ష్మి, హైదరాబాద్	25,116
గోపాలపట్నం వాకర్స్ అసోసియేషన్, విశాఖపట్నం	21,000
కేశనకుర్తి తమ్మయ్యాచారి (కీ.శే.కేశనకుర్తి వీరభద్రరావు, కీ.శే.ఈశ్వరమ్మల జ్ఞాపకార్థం), విశాఖపట్నం	10,116
రావిపాటి కోటేశ్వరరావు, హైదరాబాద్	10,000
కోనేరు వాసుదేవరావు, విజయవాడ	10,000
శ్రీ కన్యకాపరమేశ్వరి వర్తక సంఘం, గణపవరం, పశ్చిమగోదావరి జిల్లా	10,000
ఎం.నరసింహమూర్తి, కె.ఎస్.రాజేశ్వరి, నెల్లూరు	10,000
శీలం లలిత, ఖానాపురం హవేలీ, ఖమ్మం జిల్లా	10,000
రావి శ్రీనివాస్, హైదరాబాద్	6,000
తొటం అశోక్‌కుమార్, వాసంతి, సికింద్రాబాద్	5,116
వై.కృష్ణకుమారి, హైదరాబాద్	5,116
నారుమంచి మోహన్‌శేష్, హైదరాబాద్	5,000
మొవ్వా వెంకట రామారావు (రామయ్య), తిప్పనగుంట, కృష్ణా జిల్లా	5,000
ఎర్రం రాజారెడ్డి (న్యాయవాది), కరీంనగర్	5,000
పువ్వాడి సుబ్బరాయుడు, పోరుమామిళ్ల, వైఎస్సార్ జిల్లా	5,000
సరిపల్లి రామమూర్తి, విశాఖపట్నం	5,000
కన్నెగంటి మల్లికార్జునరావు, హైదరాబాద్	5,000
డి.విజయకోటేశ్వరి, హైదరాబాద్	5,000

మీరు చేసే సాయం ఎందరికో ఆధారం

దాతలకు ముఖ్య సూచన: మీరిచ్చే విరాళాలకు రసీదులు పొందేందుకు ఈ వివరాలు పంపవలసిందిగా మనవి. 1. దాత పేరు 2. పూర్తి చిరునామా 3. పాన్‌కార్డు నంబరు.
- ఈ వివరాలను **9154990933** నంబరుకు లేదా relieffund@eenadu.in ఈ మెయిల్ ఐడీకి పంపగలరు.

విరాళాలు పంపవలసిన ఎకౌంట్ వివరాలు
ఈనాడు రిలీఫ్ ఫండ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సైఫాబాద్ బ్రాంచి,
SB A/C No: 370602010006658
IFSC: UBIN0537063

ఉపాధి కోసం వెళ్లారు.. ఉసురు కోల్పోయారు

- అమెరికాలో రోడ్డు ప్రమాదం..
- తిరుపతి జిల్లావాసులు ముగ్గురి మృతి



హరితారెడ్డి　తిరుమూరు గోపి　రాజినేని శివ

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఉపాధి కోసం అమెరికా వెళ్లిన ప్రవాసాంధ్రులు ముగ్గురు అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. వారాంతం కావడంతో అందరూ కలసి విహారయాత్రకు వెళ్లారు. తిరిగి వస్తుండగా సోమవారం సాయంత్రం (అమెరికా కాలమానం ప్రకారం) దక్షిణ బాన్‌హామ్‌కు సమీపంలోని రహదారిపై వీరి వాహనం ప్రమాదానికి గురైంది. తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం చిట్టత్తూరు గ్రామానికి చెందిన హరితారెడ్డి (26), చిన్నకనపర్తికి చెందిన రాజినేని శివ (29), ఓజిలి మండలం రాజులపాళెంకు చెందిన తిరుమూరు గోపి (32)లు ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. హరితారెడ్డి భర్త సాయితేజ చెన్ను (31) తీవ్ర గాయాలపాలయ్యారు. రాజినేని చిరంజీవి శివ కుటుంబీకులు ప్రస్తుతం విశాఖపట్నంలో ఉంటున్నారు. హరితారెడ్డి కుటుంబీకులు శ్రీకాళహస్తిలోని బంగారమ్మ కాలనీలో నివాసముంటున్నారు. కుమార్తె మృతదేహాన్ని గురువారం అమెరికా నుంచి శ్రీకాళహస్తికి తీసుకువస్తున్నట్లు ఆమె తండ్రి భాస్కర్‌రెడ్డి తెలిపారు.

బీసీ ఎట్రాసిటీ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు

- హైకోర్టును సంప్రదించి ఏర్పాటు
- రెండు నెలల్లో విచారణ పూర్తి చేసేలా నిబంధనలు
- ఆర్నెల్ల నుంచి గరిష్ఠంగా ఐదేళ్లు శిక్ష
- బీసీ రక్షణ చట్టం రూపకల్పన

ఈనాడు, అమరావతి: ఎన్నికలకు ముందు బీసీ డిక్లరేషన్‌లో భాగంగా వెనుకబడిన తరగతుల వారికి భరోసా కల్పిస్తూ ఇచ్చిన బీసీ రక్షణ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. అధికారం చేపట్టిన మూడు నెలల్లోనే రక్షణ చట్టం ముసాయిదాను రూపొందించింది. బీసీలపై దూషణలు, దాడులు, వేధింపులు, ఇతర అఘాయిత్యాలకు పాల్పడితే 6 నెలల నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష జరిమానా విధించనున్నారు. రెండోసారి/తదుపరిసారి నేరానికి పాల్పడితే కనీసం రెండేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తారు. ఈ శిక్షను పదేళ్ల వరకు పొడిగించొచ్చు. ఈ కేసుల విచారణకు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో సంప్రదింపులు జరిపి ప్రతి జిల్లాలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయనుంది. ఈ న్యాయస్థానాలు బీసీలపై ఎట్రాసిటీ కేసుల విచారణకు ప్రాధాన్యమిస్తాయి. ఛార్జిషీటు దాఖలు చేసినప్పటి నుంచి 2 నెలల్లోపు విచారణ పూర్తిచేసేలా నిబంధనలు పొందుపరిచారు. ఈ చట్టం కింద కేసుల నిర్వహణకు ఏడేళ్ల అనుభవమున్న స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించాలి.

బీసీలపై నేరాలకు విధించే శిక్షలివీ.. (చట్టంలో పొందుపరిచినవి)

బీసీలపై దౌర్జన్యానికి పాల్పడితే: కనీసం 6 నెలల జైలుశిక్ష, జరిమానా (శిక్షను ఐదేళ్ల వరకు పొడిగించొచ్చు)

అవమానకరమైన భాషతో కించపరిస్తే: ఆరు నెలలకు తక్కువ కాకుండా జైలు శిక్ష, జరిమానా (శిక్షను రెండేళ్ల వరకు పొడిగించవచ్చు)

సంప్రదాయ, వృత్తి ఆధారంగా వివక్ష చూపినా/ నిందించినా: కనీసం ఏడాది జైలు శిక్ష, జరిమానా (శిక్షను ఐదేళ్ల వరకు పొడిగించవచ్చు)

కులం ఆధారంగా దూషిస్తే: ఆరు నెలలకు తక్కువ కాకుండా జైలుశిక్ష, జరిమానా (ఐదేళ్ల వరకు శిక్షను పొడిగించవచ్చు)

బాధితులు, సాక్షులకు ప్రభుత్వం నుంచి రక్షణ

బీసీలపై దాడులు, ఇతర ఘటనలకు సంబంధించిన కేసుల విచారణ సందర్భంగా బాధితులకు, సాక్షులకు ప్రభుత్వమే రక్షణ కల్పిస్తుంది. బాధితులకు ఆర్థిక సహాయం, ఆరోగ్య సంరక్షణ, పునరావాస చర్యలను చేపడుతుంది. పరిహారం మొత్తాన్నీ నిర్ణయిస్తుంది.

ఫిర్యాదులు స్వీకరించకుంటే జైలే

బీసీలపై నేరాలకు సంబంధించి ఫిర్యాదుల నమోదు, విచారణ ప్రక్రియలో ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేసిన ఏ ప్రభుత్వ ఉద్యోగికైనా ఏడాది జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించేలా చట్టంలో నిబంధనలు పొందుపరిచారు. ఈ కేసులో ప్రత్యేక న్యాయస్థానంలో న్యాయం జరగలేదని భావిస్తే తీర్పు వెలువడినప్పటి నుంచి 90 రోజుల్లో హైకోర్టును ఆశ్రయించొచ్చు. ఈ చట్టం అమలును సమీక్షించడానికి, మరింత సమర్థంగా అమలుకు సిఫార్సులు చేయడానికి రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేయనున్నారు.

బీసీ రక్షణ చట్టంపై న్యాయసలహా



ఐక్యత చాటుతున్న మంత్రులు వాసంశెట్టి సుభాష్, కొలుసు పార్థసారథి, సవిత, అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, అనిత, సత్యకుమార్, కొండపల్లి శ్రీనివాస్

- మంత్రుల సమావేశంలో నిర్ణయం

ఈనాడు, అమరావతి: వెనుకబడిన తరగతుల రక్షణ చట్టం రూపకల్పనపై వెలగపూడి సచివాలయంలో ఎనిమిది మంది బీసీ మంత్రులు, హోంమంత్రి అనిత బుధవారం సమావేశమై చర్చించారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, సత్యకుమార్, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. బీసీ సంక్షేమశాఖ అధికారులు రూపొందించిన ముసాయిదా చట్టాన్ని నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే చట్టంగా రూపొందించొచ్చా? బీసీ కమిషన్‌కు నివేదించాలా? అనే దానిపై న్యాయసలహా తీసుకోవాలని నిర్ణయించారు. ముసాయిదా చట్టంలో పేర్కొన్న సెక్షన్లు, ఇతర అంశాలను క్షుణ్నంగా పరిశీలించాలని అధికారులకు మంత్రులు సూచించారు. ఇదే సమయంలో స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టుల్లో 34 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పించాలనే హామీలపై పలు అంశాలను అధికారులు మంత్రుల ఎదుట ఉంచారు. ఈ సందర్భంగా బీసీ కులగణన విషయం చర్చకు వచ్చింది. కులగణన చేస్తే అన్నింటికీ పరిష్కారం లభిస్తుందని అధికారులు మంత్రులకు తెలిపారు. తెలంగాణలో ఇప్పటికే ఆ దిశగా అడుగులు పడుతున్నందున.. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. చట్టం రూపకల్పనపై మరిన్ని పర్యాయాలు సమావేశం కావాలని మంత్రులు నిర్ణయించారు. బీసీ రక్షణ చట్టంతో బీసీల్లో అత్యంత వెనుకబడిన కులాలకు మేలు జరుగుతుందని మంత్రి సవిత పేర్కొన్నారు.

వైకాపా నేత సజ్జలకు నోటీసు

- తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో..
- నేడు విచారణకు రావాలని పోలీసుల పిలుపు



ఈనాడు, అమరావతి: తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డికి పోలీసులు మంగళవారం సీఆర్‌పీసీ 160 నోటీసు జారీ చేశారు. మంగళగిరి రూరల్ పోలీసు స్టేషన్‌లో గురువారం ఉదయం 10.30 గంటలకు విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొన్నారు. వైకాపా అధికారంలో ఉండగా 2021 అక్టోబరు 19న ఆ పార్టీకి చెందిన వారు తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడికి పాల్పడ్డారు. ఈ కేసు విచారణలో భాగంగా ఇప్పటికే పలువురు వైకాపా నేతలను విచారించారు. మాజీ ఎంపీ నందిగం సురేష్‌తోపాటు మరికొందరు వైకాపా నేతలు ఇచ్చిన సమాచారం ఆధారంగా ఈ ఘటన వెనుక సజ్జల రామకృష్ణారెడ్డి పాత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆయనపై ఇప్పటికే లుక్అవుట్ నోటీసులు జారీ చేశారు. ఇదే కేసులో వైకాపా నేతలు లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాష్, తలశిల రఘురామ్‌లను పలుమార్లు విచారించారు. దాడి ఘటనతో ప్రమేయం ఉన్న ముఖ్య నాయకులను విచారించే క్రమంలో తాజాగా సజ్జలకు పోలీసులు నోటీసు జారీ చేశారు. ఈ కేసును ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. విచారణ ఇప్పటికే సగానికిపైగా పూర్తయినందున తదుపరి దర్యాప్తును పోలీసులు, సీఐడీ సంయుక్తంగా చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది.

ఎవరికి కావాల్సిన బ్రాండ్ వారికి!



రాష్ట్రంలో కొత్త మద్యం దుకాణాలు బుధవారం నుంచి మొదలయ్యాయి. వాటిలో డిజిటల్ పేమెంట్స్ సౌకర్యం కూడా అందుబాటులోకి వచ్చింది. వైకాపా హయాంలో ఊరుపేరు లేని మద్యం ముంచెత్తగా ఇప్పుడు బ్రాండెడ్ సరకు వచ్చింది. బుధవారం విజయవాడలోని బీఆర్‌టీఎస్ రోడ్డులో కొత్తగా దుకాణం ప్రారంభం కాగానే అధిక సంఖ్యలో వచ్చిన కొనుగోలుదారులు సెల్‌ఫోన్‌తో డబ్బులు చెల్లించి నచ్చిన బ్రాండెడ్ సీసా తీసుకెళ్తూ కనిపించారు.

– ఈనాడు, అమరావతి

మంత్రి లోకేశ్ చొరవతో పసికందుకు పునర్జన్మ

- కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు

తాడేపల్లి, జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: మంత్రి నారా లోకేశ్ చొరవతో పసికందు ప్రాణాలు నిలిచాయి. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన చదల వెంకటమహేశ్వరరావు దంపతులకు జన్మించిన మగ శిశువుకు.. పుట్టిన 14 రోజులకే జ్వరం వచ్చి ప్రాణాపాయ స్థితి ఏర్పడింది. గత నెల 27వ తేదీన శిశువుకు ప్లేట్‌లెట్స్ పడిపోయి పరిస్థితి విషమించడంతో స్థానిక వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సకు విజయవాడలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకొచ్చారు. చికిత్సకు రూ.లక్షల్లో ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న గిరిజన కుటుంబానికి చెందిన మహేశ్వరరావుకు ఏం చేయాలో పాలుపోక..గత నెల 28వ తేదీన 'ప్రజా దర్బార్'లో మంత్రి లోకేశ్‌ను కలిసి ఆదుకోవాలని అభ్యర్థించారు. దీంతో స్పందించిన మంత్రి వైద్యానికి అవసరమైన సాయాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందించి పసికందు ప్రాణాలు నిలిపారు. 14 రోజులపాటు విజయవాడ వైద్యశాలలో చికిత్స పొందిన ఆ బిడ్డ పూర్తి ఆరోగ్యంగా ఇంటికి చేరాడు.



కోలుకున్న బిడ్డను మంత్రి లోకేశ్‌కు చూపుతున్న వెంకట మహేశ్వరరావు దంపతులు

ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తమ బిడ్డను తీసుకుని బుధవారం ఉండవల్లి నివాసంలో జరిగిన 'ప్రజా దర్బార్'కు వచ్చి మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 'మీ చొరవతో మా కుమారుడి ప్రాణాలు నిలిచాయి.. జన్మజన్మలకూ రుణపడి ఉంటాం' అంటూ కన్నీళ్ల పర్యంతమయ్యారు. ఏ సమస్య వచ్చినా తాను ఉన్నానని లోకేశ్ వారికి భరోసా ఇచ్చారు.

మద్యంపై రిటైల్ ఎక్సైజ్ పన్ను, మార్జిన్ తొలగింపు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో మద్యంపై విధించిన వివిధ రకాల పన్నులు, మార్జిన్‌లను ప్రభుత్వం తొలగించింది. గత అయిదేళ్లలో మద్యంపై 4 శాతం మేర రిటైల్ ఎక్సైజ్ పన్ను, 6 శాతం మేర ఏపీఎస్‌బీసీఎల్ రిటైల్ మార్జిన్ వసూలు చేసేవారు. ల్యాండెడ్ కాస్ట్‌పై 10 శాతం మేర అదనపు ఎక్సైజ్ సుంకం విధించేవారు. నూతన విధానంలో భాగంగా కూటమి ప్రభుత్వం మద్యంపై వివిధ పన్నులను ఇటీవల సరళీకరించింది. వైకాపా హయాంలో 10 రకాల పన్నులు ఉండగా వాటిని 6కు తగ్గించింది. అందులో భాగంగా.. రిటైల్ ఎక్సైజ్ పన్ను, ఏపీఎస్‌బీసీఎల్ రిటైల్ మార్జిన్, అదనపు ఎక్సైజ్ సుంకాలను తొలగించింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా బుధవారం రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు.

18న 'ప్రజావేదిక' రద్దు

ఈనాడు, అమరావతి: మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం తెదేపా శాసనసభాపక్ష సమావేశం జరగనున్న నేపథ్యంలో ఆ రోజు నిర్వహించాల్సిన 'ప్రజావేదిక'ను రద్దు చేస్తున్నట్టు పార్టీ ఓ ప్రకటనలో తెలిపింది.

ఏపీకి రొనాల్డ్‌రాస్, ఆమ్రపాలి, వాణీప్రసాద్, వాకాటి కరుణ

- తెలంగాణకు సృజన, హరికిరణ్, శివశంకర్
- హైకోర్టు తీర్పుతో మారనున్న ఐఏఎస్‌లు

ఈనాడు, హైదరాబాద్: కేంద్రం ఈ నెల 9న ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఆలిండియా సర్వీసు అధికారులు(ఏఐఎస్‌లు) తమకు కేటాయించిన రాష్ట్రాల్లో చేరాల్సిందేనంటూ కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్(క్యాట్) ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవడానికి తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. ఆలిండియా సర్వీసు ఉద్యోగుల కేటాయింపు అన్నది పరిపాలనాపరమైన నిర్ణయమని, అందులో తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. దీంతో ఐఏఎస్ అధికారులు రొనాల్డ్‌రాస్, కాట ఆమ్రపాలి, వాణీప్రసాద్, వాకాటి కరుణలు బుధవారం తెలంగాణ నుంచి రిలీవ్ అయ్యారు. ఆ వెంటనే వారు ఏపీలో చేరుతున్నట్లు ఆ రాష్ట్ర సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్‌కు మెయిల్ పంపారు. మరోవైపు ఏపీ నుంచి రిలీవ్ అయిన ఐఏఎస్ అధికారులు సృజన, హరికిరణ్, శివశంకర్‌లు బుధవారం హైదరాబాద్‌కు వచ్చి సీఎస్ శాంతికుమారికి రిపోర్ట్ చేశారు. ఒకటి, రెండు రోజుల్లో వారికి ప్రభుత్వం శాఖలను కేటాయించనుంది.

రాజకీయ కారణాలతో పిల్ వేసినట్లుంది

- ఫొటోలను పరిశీలిస్తే పసుపుతోపాటు ఇతర రంగులున్నాయి కదా?
- పిటిషనర్‌ను ప్రశ్నించిన హైకోర్టు
- అన్న క్యాంటీన్లకు తెదేపా జెండా రంగులేశారంటూ దాఖలైన పిల్‌పై విచారణ
- కౌంటర్ వేయాలని ప్రభుత్వానికి ఆదేశం

ఈనాడు, అమరావతి: అన్న క్యాంటీన్లకు తెలుగుదేశం పార్టీ జెండా రంగులను వేయకుండా అడ్డుకోవాలంటూ వేసిన ప్రజాహిత వ్యాజ్యం రాజకీయ కారణాలతో దాఖలు చేసినట్లుందని హైకోర్టు వ్యాఖ్యానించింది. కోర్టు ముందు ఉంచిన ఫొటోలను పరిశీలిస్తే క్యాంటీన్ భవనాలను పసుపు, ఎరుపు, ఇతర రంగులు ఉన్నాయని వెల్లడించింది. రంగును ఆధారం చేసుకొని ఫలానా రాజకీయ పార్టీ అని ఎలా చెప్పగలమని పేర్కొంది. గత ప్రభుత్వ హయాంలో అన్న క్యాంటీన్లకు ఏ రంగులు ఉన్నాయని పిటిషనర్‌ను ప్రశ్నించింది. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శికి నోటీసులిస్తూ విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. రాష్ట్రంలోని అన్న క్యాంటీన్లకు, ప్రభుత్వ భవనాలకు తెదేపా పార్టీ జెండా రంగు వేయకుండా నిలువరించాలని కోరుతూ ఏపీ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ (ఏపీఎన్‌జీఓ) అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్‌రెడ్డి హైకోర్టులో పిల్ వేశారు. బుధవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ప్రభుత్వ భవనాలకు రాజకీయ పార్టీ రంగులు వేయడానికి వీల్లేదన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఫొటోలను పరిశీలిస్తే అన్న క్యాంటీన్‌కు పసుపు, ఎరుపుతో పాటు నీలం రంగు వేసినట్లుంది కదా అని ప్రశ్నించింది. గత ప్రభుత్వ హయాంలో క్యాంటీన్లకు ఏ రంగు వేశారని ఆరా తీసింది. పొన్నవోలు బదులిస్తూ.. గత ప్రభుత్వం అన్న క్యాంటీన్లను మూసేసిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి తెరిచారన్నారు. 2019కి పూర్వం వేసిన రంగులే అన్న క్యాంటీన్లకు ఉన్నాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రంగులు ఏమీ మార్చడం లేదు కదా.. అభ్యంతరం ఎందుకని కోర్టు ప్రశ్నించింది. రాజకీయ కారణాలతో పిల్ వేసినట్లు ఉందని వ్యాఖ్యానించింది.

మూర్ఖపు భావజాలాన్ని విడనాడండి



ప్రపంచంలో మతం పేరుతో ఉన్మాదం, హింస, రాజకీయ ఘర్షణ పెరుగుతుండటానికి కారణం మతమంటే ఏంటో నిజంగా తెలిసినవాళ్లు, దాన్ని విశ్వసించి ఆచరించేవాళ్లు తగ్గిపోతుండటమే. మతమనే కాదు, ఏ విషయంలో అయినా సరే మాదే గొప్ప అన్న మూర్ఖపు భావజాలంతో వాదనకు దిగితే మనశ్శాంతి కరవవడంతో పాటు సమాజంలో అశాంతి నెలకొంటుంది. యువత ఇలాంటి ధోరణులకు దూరంగా ఉండాలి.

– కైలాశ్ సత్యార్థి, సామాజిక ఉద్యమకారుడు

ఆన్‌లైన్‌లో వ్యాపార కేంద్రీకృత సేవల వివరాలు

ఈనాడు, అమరావతి: పరిశ్రమల శాఖలో వ్యాపార కేంద్రీకృత సేవల కోసం అందిన దరఖాస్తులు, వాటి పరిష్కారానికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ విధానంలో డ్యాష్ బోర్డులో ఉంచాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సులభతర వాణిజ్యం (ఈవోడీబీ) అమలులో భాగంగా బిజినెస్ రిఫార్మ్ యాక్షన్ ప్లాన్ (బీఆర్‌ఏపీ)లో సూచించిన మేరకు వ్యవహరించాలని పేర్కొంది.


SATHYA
SPREADING HAPPINESS
FULL MOON SALE
9 AM - 12 MIDNIGHT
17 OCT 2024
upto 70% OFF
SATHYA
SPREADING HAPPINESS
అర్ధరాత్రి 12 గంటల వరకు!
ఈరోజు మాత్రమే!
Bank Offers
upto ₹5000* Instant Cash Back
BAJAJ FINSERV
Scan this QR CODE to check Pre-approved offer
₹10000 Cash Back
15000 Reward Points
SBI Rewards 5X Points
24" LED TV ₹4590 onwards
32" Smart TV ₹7990 onwards
43" Android TV ₹14990 onwards
55" Google UHD TV ₹32990 onwards
65" Google UHD Smart TV ₹44990 onwards
SONY SAMSUNG LG Haier Panasonic LLOYD BPL TCL Happy ONIDA Impex CROAM
1.5 TON 3 STAR AC ₹24990 onwards
1.5 TON 5 STAR AC ₹35990 onwards
VOLTAS LG BLUE STAR DAIKIN Haier Carrier GENERAL SAMSUNG Godrej Panasonic HITACHI LLOYD IFB ONIDA VESTAR
iPhone 13 ₹47999 only
When you buy
iPhone16 / iPhone16 Plus
MagSafe Power Bank 10000 mAh
₹7490 ₹499 only
SAMSUNG Galaxy S24
₹79,999 ₹64,999
When you buy Smart Phone
Calling Smartwatch
₹7990 ₹299 only
Authorised Reseller SAMSUNG vivo
ONEPLUS oppo xiaomi realme
Side by Side Dios Fridge ₹35990 onwards
Double Door Frost Free Fridge ₹18990 onwards
Single Door Direct Cool Fridge ₹12990 onwards
Fully Automatic Top Load Washing Machine ₹11990 onwards
Semi Automatic Washing Machine ₹8990 onwards
LG SAMSUNG Haier Whirlpool Godrej IFB BOSCH VOLTAS beko BPL
అన్ని వస్తువులు మీద బ్రహ్మాండమైన తగ్గింపు
hp boAt ZEBRONICS Preethi Prestige Vidiem SOWBAGHYA ULTRA atomberg Butterfly USHA Crompton VENUS FABER PHILIPS POSMAN AKSHAYA Premier HAVELLS Anantha BAJAJ EUREKA FORBES Sunflame HANBAO AMRITHAA V-GUARD
Scan to find our Showroom Locations
Scan to know Prices, Offer details & to Shop Online
www.sathya.store
Whatsapp: 99166 98985 or Call: 88805 98985
For corporate bookings or bulk orders mail us: corporatesales@sathya.email
Naidupeta 8754469985 | Sulurpeta 91501 75985 | Chittoor 9003179985 | Tirupathi 7845229985 | Tirupathi Air Byepass Road 78453 63985 | Venkatagiri 7338740985 | Pileru 78453 45985 |
Tadipatri 95001 21985 | Chilkulurpeta 73583 80985 | Palamnar 73387 96985 | Bapatla 9043916985 | Koduru 9789778985 | Tenali 9866865813 | Nellore 9043976985 | Rajampeta 98402 66985 |
Vijayawada 73860 34465 | 81060 84659 | Guntur 9092038985 | 92878 79985 | Ongole 97439 00659 | Nandyala 98408 57985 | Kurnool 99403 54985 | 9092608985 | Machilipatnam 90259 15985
| Badvel 9087774985 | Narasaraopet 90879 65985 | Srikalahasti 9952352985 | Ananthapur 9789959985 | Puttur 89255 93985 | Punganur 98403 78985 | Kadapa 97897 78985 | Rayachoti
9092444985 | Tadepalli 90921 44985 | Kakkinada 78455 93985 | Adoni 63038 15540 | Eluru 89255 70985 | Bhimavaram 78455 71985
Now 37 Showrooms

జనవరిలో కొత్త పింఛన్లు!

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ భరోసా పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం జనవరిలో కొత్త పింఛన్లు మంజూరు చేయనుంది. దీనికి సంబంధించిన కసరత్తును ఇప్పటికే ప్రారంభించింది. జనవరిలో జన్మభూమి-2 కార్యక్రమాన్ని ప్రారంభించే అవకాశాలున్న నేపథ్యంలో ఆ సభల్లో కొత్త లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించేలా అధికారులు మార్గసూచి సిద్ధం చేసినట్లు తెలిసింది. వైకాపా హయాంలో అనర్హులకు ఇబ్బడిముబ్బడిగా పింఛన్లు మంజూరు చేశారనే ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. ప్రధానంగా దివ్యాంగుల కేటగిరీలో కొన్ని వేల మంది అనర్హులు తప్పుడు సదరం ధ్రువీకరణ పత్రాలతో పింఛన్లు పొందుతున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం గుర్తించింది. అనంతపురం, వైఎస్సార్ జిల్లాలతోపాటు మరికొన్నిచోట్ల ఇది బట్టబయలైంది. చేనేత పింఛన్లలోనూ అనర్హులు ఉన్నట్లు తేలింది. దీంతో అన్ని రకాల పింఛన్లను తనిఖీ చేయాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు అందాయి. పింఛన్ల తనిఖీ, కొత్త పింఛన్ల మంజూరుకు విధివిధానాల రూపకల్పన కోసం 8 మంది మంత్రులతో కమిటీ ఏర్పాటు చేయనున్నారు. మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, అచ్చెన్నాయుడు, నారాయణ, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, డోలా బాల వీరాంజనేయస్వామి, గుమ్మిడి సంధ్యారాణి, సవితలతో ఉపసంఘం ఏర్పాటుకు రెండు, మూడు రోజుల్లో ఉత్తర్వులు వెలువడనున్నాయి. కమిటీ ఏర్పాటైన 10-15 రోజుల్లోగా మంత్రివర్గ ఉపసంఘం నివేదికను ప్రభుత్వానికి అందించనున్నట్లు సమాచారం.

50 రోజుల ప్రణాళిక


కొత్త పింఛన్ల ఎంపికకు నవంబర్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. అదే నెలలో పింఛన్ల తనిఖీ చేపడతారు. అనర్హులకు నోటీసులిచ్చి, పింఛన్లు తొలగించేందుకు 45 రోజుల సమయం తీసుకుంటారు. అర్హులెవరికీ అన్యాయం జరగకుండా అర్హులు, అనర్హుల జాబితాలను గ్రామసభల్లో ప్రజల ముందు పెడతారు. అక్కడ ఏవైనా ఫిర్యాదులు వస్తే సరిచేస్తారు. మొత్తంగా డిసెంబర్ నెలాఖరు నాటికి కొత్త పింఛన్ల లబ్ధిదారుల ఎంపిక, ప్రస్తుత పింఛన్లలో అనర్హుల ఏరివేత పూర్తి చేయనున్నట్లు తెలిసింది.

2.32 లక్షల మందికి పింఛను ఇవ్వకుండా జగన్ మోసం

వైకాపా ప్రభుత్వ హయాంలో అర్హులందరికీ పింఛను అందిస్తామని ప్రగల్భాలు పలికిన జగన్. . ఎన్నికల నాటికి 2.32 లక్షల మందికి పింఛను ఇవ్వకుండా నిలిపేశారు. 2023 సెప్టెంబర్ నాటికే వీరందరూ పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నారు. కొంతమందికి మాత్రమే మంజూరు చేసి మిగతా వారికి ఇవ్వకుండా నిలిపేశారు. కొత్త ప్రభుత్వం ఈ దరఖాస్తులను పరిశీలిస్తుందా లేదా మళ్లీ దరఖాస్తులు స్వీకరిస్తారా అనేది మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించనుంది.

వరద బాధితులకు విరాళాలతో భరోసా

ఈనాడు డిజిటల్, అమరావతి: వరద బాధితుల సహాయార్థం పలువురు వ్యక్తులు, సంస్థలకు చెందిన ప్రతినిధులు ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్)కి విరాళాలు ప్రకటిస్తున్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ను కలిసి చెక్కులు అందిస్తున్నారు. గుంటూరు జిల్లాకు చెందిన క్వారీ, క్రషర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.16 లక్షల విరాళం చెక్కును బుధవారం చంద్రబాబుకు ఇచ్చారు.


సీఎం చంద్రబాబుకు రూ.16 లక్షల చెక్కు అందజేస్తున్న గుంటూరు జిల్లా క్వారీ, క్రషర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

వ్యక్తి/సంస్థ	సాయం(రూ.లలో)
◆ మోహన్ వర్ధినేని, ఎండీ, కేజే సిస్టమ్స్ ఇండియా ప్రై.లి	10 లక్షలు
◆ మట్టుపల్లి మోహన్‌కృష్ణ, డైరెక్టర్, మాస్టర్ మైండ్స్ అకాడమీ	7 లక్షలు
◆ బడేటి రాధాకృష్ణయ్య(చంటి), ఎమ్మెల్యే, ఏలూరు	2.6 లక్షలు
◆ శివశేఖర్ నాయుడు, ఎన్నారై	2 లక్షలు

వర్ల రామయ్యతో మంద కృష్ణమాదిగ భేటీ

ఈనాడు, అమరావతి : తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్యతో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ భేటీ అయ్యారు. విజయవాడలోని వర్ల రామయ్య నివాసంలో జరిగిన ఈ భేటీలో ఎస్సీ వర్గీకరణ, కులగణన, భవిష్యత్తు కార్యాచరణ, మాదిగల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. వర్గీకరణ పూర్తయ్యే వరకు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌లు రాకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేయాలని నిర్ణయించారు.



ప్రతి ఒక్కరికీ జీవితంలో తప్పనిసరిగా ఓ ప్రశ్న ఎదురవుతుంది. తమ కలలను వదిలేసి కంఫర్ట్‌జోన్‌లోనే బతికేయడమా? లేక సౌకర్యవంతమైన వాతావరణాన్ని విడిచి కలల సాకారం కోసం ప్రయత్నించడమా? కంఫర్ట్‌జోన్‌ను త్యాగం చేసినవారు విజేతలుగా నిలుస్తారు. కలలను త్యాగం చేసినవారు జీవితాంతం ఆ అసంతృప్తితోనే బతుకుతారు.
– డేనియల్ జహీద్,
ఈ–మెయిల్ కాపీ రైటర్

టోకున ఇసుక కొనుగోలు ఇక సులువు!

- నిర్దుష్ట మార్గదర్శకాలను ప్రకటించిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: పెద్ద మొత్తంలో ఇసుక వాడేవారి కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్దుష్ట మార్గదర్శకాలను ప్రకటించింది. అనుమతుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే సమస్య లేకుండా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. టోకున ఇసుక బుక్ చేసుకోవాల్సిన వారు ముందుగా ఏపీ శాండ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. దానికంటే ముందు వారు జీఎస్టీ నంబరు తీసుకోవాలి. భవన నిర్మాణానికి సీడీఎంఏ (కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) అనుమతి పొందాలి. వ్యాపారులైతే లైసెన్సు కలిగి ఉండాలి. పోర్టల్‌లో బల్క్ కన్స్యూమర్ బుకింగ్‌లో కంపెనీ పేరు, కాంటాక్టు సమాచారం, జీఎస్టీ నంబరు, చిరునామావంటి వివరాలను నమోదు చేసి మొదట రిజిస్టర్ కావాలి. అది పూర్తయితే సంబంధిత వినియోగదారుకు లాగిన్ ఐడీ సమాచారం ఎస్ఎంఎస్/మెయిల్ ద్వారా వస్తుంది.

◆ ఇసుక ఆర్డర్ పెట్టేటప్పుడు ఈ లాగిన్‌తోనే ప్రక్రియ కొనసాగించాలి. నిర్మిస్తున్న సైట్ చిరునామా, ఎంత ఇసుక కావాలి? వంటి వివరాలను నమోదు చేయడంతోపాటు భవన నిర్మాణానికి సంబంధిత అధికారులు జారీ చేసిన అనుమతి పత్రాన్ని అప్‌లోడ్ చేయాలి. దీన్ని జేసీ ఆమోదిస్తే వినియోగదారుడికి ఆ సమాచారంతోపాటు షెడ్యూల్ వస్తుంది.

◆ వినియోగదారుల దరఖాస్తులన్నింటినీ జేసీ పరిశీలిస్తారు. స్టాక్‌యార్డులో అందుబాటులో ఉన్న ఇసుక వివరాలను తీసుకుంటారు. సరిపడా ఇసుక అందుబాటులో ఉంటే ఆమోదిస్తారు. ఆ వెంటనే సంబంధిత వినియోగదారుకు ఇసుక ఎప్పుడు వస్తుందనే కచ్చితమైన సమాచారం వెళుతుంది. అప్పుడు వినియోగదారు మళ్లీ పోర్టల్‌లో లాగిన్ అయి చెల్లింపులు చేయాలి.

◆ టోకు బుకింగ్‌లు ఎన్ని అయ్యాయి? ఆమోదించిన కాలవ్యవధి, చెల్లింపుల మొత్తం, రవాణా షెడ్యూల్‌వంటి వివరాలతో సంబంధిత పర్యవేక్షణ అధికారులు రోజు, వారం, నెలవారీ నివేదికలను ప్రభుత్వానికి సమర్పించాలి.


ఘాట్ రోడ్డులో పడిన బండరాళ్లను యంత్రంతో తొలగిస్తున్న సిబ్బంది

తిరుమలలో విరిగిపడిన కొండచరియలు

శ్రీవారి మెట్టు మార్గం మూసివేత

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో బుధవారం రెండో ఘాట్ రోడ్డులోని 15వ మైలు వద్ద, భాష్యకార్ల సన్నిధికి సమీపంలో, హరిణి వద్ద కొండ చరియలు విరిగిపడ్డాయి. వాటిని తితిదే ఘాట్ రోడ్డు భద్రత, ఇంజినీరింగ్ సిబ్బంది తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. తిరు మాడ వీధులు, శ్రీవారి ఆలయం ఎదుట పెద్దఎత్తున నీరు ప్రవహిస్తుండటంతో మ్యాన్‌హోళ్లు తెరిచి మళ్లించారు. భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో తితిదే ఉన్నతాధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. భక్తుల భద్రతా దృష్ట్యా తిరుమలకు వెళ్లే శ్రీవారి మెట్టు మార్గాన్ని గురువారం వరకు మూసివేయాలని నిర్ణయించినట్లు తితిదే ఈఓ శ్యామలరావు తెలిపారు. పాప వినాశనం, శిలా తోరణం మార్గాలు ఇప్పటికే మూసివేసినట్లు చెప్పారు. మరిన్ని కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున ఇంజినీరింగ్ అధికారులు, పోలీసులు, అగ్నిమాపక శాఖ సమన్వయంతో సహాయ చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాలతో తిరుమలలోని 5 జలాశయాలకు 250 లక్షల గ్యాలన్ల నీరు వచ్చి చేరినట్లు అధికారులు తెలిపారు.

డ్రోన్ సాంకేతికతలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలుపుతాం

- ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: డ్రోన్ సాంకేతికత, ఆవిష్కరణల్లో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. అందులో భాగంగానే దేశంలోనే అతిపెద్ద డ్రోన్ సమిట్, ఎక్స్‌పోను రాష్ట్రంలో 22, 23 తేదీల్లో నిర్వహిస్తున్నామని ఎక్స్‌లో బుధవారం వెల్లడించారు. “5,500 డ్రోన్లతో అద్భుతమైన ప్రదర్శన జరగనుంది. ఈ కార్యక్రమం కోసం ఎదురుచూస్తున్నా” అని సీఎం తెలిపారు. డ్రోన్ సమిట్‌కు సంబంధించిన ప్రోమోను మంత్రి లోకేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ● అమరావతి డ్రోన్ సమిట్ 2024లో భాగంగా నిర్వహించే హ్యాకథాన్ పోటీల్లో పేర్ల నమోదుకు మరో రెండు రోజులు గడువు పెంచుతున్నట్లు డ్రోన్ కార్పొరేషన్ ఎండీ దినేష్‌కుమార్ వెల్లడించారు. “ఈ నెల 22, 23 తేదీల్లో అంతర్జాతీయ డ్రోన్ సమిట్ నిర్వహిస్తున్నాం. 9 థీమ్స్‌లో పోటీలు ఉంటాయి. విజేతలను నాలుగు కేటగిరీలుగా విభజిస్తాం. ప్రతి కేటగిరీ నుంచి ముగ్గురు విజేతలను ఎంపిక చేస్తాం. సీఎం చంద్రబాబు వారికి నగదు బహుమతిని అందిస్తారు” అని తెలిపారు.


అమరావతి డ్రోన్ సమ్మిట్–2024 ఆహ్వాన పత్రాన్ని సీఎం చంద్రబాబుకు అందజేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి. చిత్రంలో సీఎస్ నీరబ్ కుమార్‌ప్రసాద్, ఇతర అధికారులు

19న శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల కోటా విడుదల

- రూ.300 టికెట్ల కోటా 24న

తిరుమల, న్యూస్‌టుడే: భక్తుల సౌకర్యార్థం తితిదే 2025 జనవరికి సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్ల కోటాను ఈనెలలో అందుబాటులోకి తేనుంది. 19న ఆర్జిత సేవల కోటాను విడుదల చేయనుంది. వీటిలో కొన్నింటిని ఎలక్ట్రానిక్ లక్కీడిప్ కోటా కింద ఈనెల 21న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు.

● 22న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకార సేవా, ఇదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవా టికెట్లను అందుబాటులో తేనున్నారు.

● ఈనెల 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణం, 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శనం, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటాను విడుదల చేయనున్నారు.

● ఈనెల 24న ఉదయం 10 గంటలకు జనవరికి సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.300 టికెట్ల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు అద్దె గదుల బుకింగ్ కోటాను అందుబాటులో తెస్తారు. భక్తులు https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్‌లో ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని కోరారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు

సైకిల్‌పై వెళ్తున్న రైతు మృతి ● గుండెపోటుతో డ్రైవరు కన్నుమూత

కర్లపాలెం, న్యూస్‌టుడే: అదుపు తప్పిన ఓ ఆర్టీసీ బస్సు సృష్టించిన బీభత్సం కారణంగా బాపట్ల జిల్లాలో ఒక సైక్లిస్టుతో పాటు బస్సు డ్రైవరు మృతిచెందారు. పోలీసుల కథనం ప్రకారం.. మంగళగిరి మండలం పెదవడ్లపూడికి చెందిన దాసరి సాంబశివరావు (54) బాపట్ల డిపోలో డ్రైవర్. ఆయన బుధవారం ఉదయాన్నే 5.15 గంటల సమయంలో బస్సు తీసుకుని చీరాలకు బయల్దేరారు. 61 మంది ప్రయాణికులు ఎక్కారు. బస్సు కర్లపాలెం దాటాక, సైకిల్‌పై పొలానికి వెళ్తున్న కొత్తనందాయపాలేనికి చెందిన పిట్టు వెంకటేశ్వరరెడ్డి అనే రైతును (59)ను వెనుక నుంచి ఢీకొంది. వెంటనే డ్రైవర్ బస్సును పక్కకు మరల్చగా, అది అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఒక్కసారిగా వచ్చిన కుదుపునకు డ్రైవర్‌తో పాటు ఓ విద్యార్థి బస్సులోంచి ఎగిరి బయటపడ్డారు. డ్రైవర్ తీవ్ర ఆందోళనకు గురవడంతో గుండెపోటు వచ్చింది. ప్రయాణికులు సీపీఆర్ చేసినా ప్రయోజనం లేకుండాపోయింది. అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్ర గాయాలైన సైకిలిస్టు వెంకటేశ్వరరెడ్డిని వైద్యం కోసం గుంటూరు తరలిస్తుండగా దారిలో చనిపోయారు. బస్సులోంచి ఎగిరిపడిన విద్యార్థికి స్వల్ప గాయాలు కాగా, మిగతా ప్రయాణికులంతా క్షేమంగా బయటపడ్డారు.



పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు


డ్రైవరు దాసరి సాంబశివరావు

మరియమ్మ హత్య కేసులో బెయిలివ్వండి

హైకోర్టును ఆశ్రయించిన నందిగం సురేష్

ఈనాడు, అమరావతి: తుళ్లూరు మండలం వెలగపూడి గ్రామానికి చెందిన మరియమ్మ హత్య కేసులో తనకు రెగ్యులర్ బెయిలు మంజూరు చేయాలని కోరుతూ వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేష్ బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గురువారం ఈ వ్యాజ్యం హైకోర్టులో విచారణకు రానుంది. 2020 డిసెంబర్‌లో రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణలు జరిగి, రాళ్లు రువ్వుకున్న ఘటనలో మరియమ్మ మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అప్పట్లో తుళ్లూరు ఠాణాలో కేసు నమోదు చేశారు. ఈ కేసులో నందిగం సురేష్‌ను పోలీసులు 78వ నిందితుడిగా చేర్చారు. తనకు బెయిలు మంజూరు చేయాలని చేసిన అభ్యర్థనను గుంటూరు కోర్టు తోసిపుచ్చడంతో సురేష్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో దర్యాప్తు పూర్తి అయ్యిందని, సాక్షులను బెదిరించే అవకాశం లేదని పిటిషన్లో పేర్కొన్నారు.

EENADU Vol: 51, Iss: 67 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

మీకే ఓటేశాను.. నా పెళ్లి చేయండి

- యూపీ ఎమ్మెల్యేను అభ్యర్థించిన చిరుద్యోగి
- తనకు 13 బిగాల భూమి ఉందని వెల్లడి

ఇంటర్నెట్‌డెస్క్‌: ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఓ ఎమ్మెల్యేకు ఊహించని అనుభవం ఎదురైంది. ఒక వ్యక్తి ఆయన వద్దకు పరిగెత్తుకొచ్చి, తనకు పెళ్లి చేయాలని కోరడమే అందుకు కారణం. చర్ఖారీ నియోజకవర్గానికి బ్రిజ్‌భూషణ్‌ రాజ్‌పుత్‌ ఎమ్మెల్యేగా ఉన్నారు. తన వాహనంలో వెళ్తూ మహోబా ప్రాంతంలో పెట్రోల్‌ కోసం ఒక బంక్‌ వద్ద బండిని ఆపారు. అక్కడే పనిచేస్తున్న స్థానిక వ్యక్తి అఖిలేంద్ర ఖరే..ఎమ్మెల్యేను చూసి ఆయన వద్దకు పరిగెత్తారు. తాను పెళ్లి చేసుకునేందుకు ఒక అమ్మాయిని చూడాలని అడగడంతో ఎమ్మెల్యే ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. అప్పుడు వారిద్దరి మధ్య సాగిన సంభాషణ ఇలా ఉంది.

ఎమ్మెల్యే: నీ వయసెంత..?
అఖిలేంద్ర: త్వరలో 44 వస్తాయి
ఎమ్మెల్యే: ఓ అమ్మాయిని చూడాలని నన్నే ఎందుకు అడుగుతున్నావు..?
అఖిలేంద్ర: నా ఓటు మీకే వేశా (అంటూ తడుముకోకుండా సమాధానం ఇచ్చాడు)
ఎమ్మెల్యే: ఇంతకీ నీ జీతం ఎంత..?
అఖిలేంద్ర: రూ.6వేల జీతం వస్తుంది. 13 బిగాల భూమి ఉంది.
ఎమ్మెల్యే: మరి ఎలాంటి అమ్మాయి కావాలేంటి..?

కొన్ని వర్గాలకు చెందిన వారు వద్దని అఖిలేంద్ర సమాధానం ఇవ్వగా.. అలా ఎప్పుడూ వివక్ష చూపకూడదని, ఎవరితో రాసిపెడితే వారితోనే వివాహం జరుగుతుందని ఎమ్మెల్యే సమాధానం ఇచ్చారు. "నీకు త్వరగా పెళ్లి కావాలని కోరుకుంటున్నా. నాకు ఓటేశావు కదా.. నా వంతు ప్రయత్నం చేస్తా" అని హామీ ఇచ్చారు. ఇలా వారిద్దరి మధ్య జరిగిన సంభాషణ నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది.

'బ్లాక్‌' మ్యాటర్స్‌!

- అమెరికా ఎన్నికల్లో ఆఫ్రో అమెరికన్‌ పురుషుల ఓట్లపై దృష్టి
- పలు వరాలను ప్రకటించిన కమల
- మహిళల ఓట్ల కోసం ట్రంప్‌ ప్రయత్నం
- క్రీడల్లో ట్రాన్స్‌జెండర్లను నిషేధిస్తానని హామీ
- ఊపందుకున్న అధ్యక్ష ఎన్నికల ప్రచారం

అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. కీలక నియోజకవర్గాల్లో డెమోక్రటిక్‌, రిపబ్లికన్‌ అధ్యక్ష అభ్యర్థులు కమలా హారిస్‌, డొనాల్డ్‌ ట్రంప్‌ ప్రచారంలో పాల్గొంటూనే మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. అందులో పలు వర్గాలను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. 'బ్లాక్‌ మ్యాటర్స్‌' అంటూ గతంలో ఆందోళనలు జరిగిన నేపథ్యంలో ఆఫ్రో అమెరికన్‌ పురుషుల ఓట్లను ఆకర్షించేందుకు కమలా హారిస్‌ ప్రయత్నిస్తుండగా.. మహిళల ఓట్లపై ట్రంప్‌ దృష్టి సారించారు. ఆఫ్రో అమెరికన్లపై వివక్ష చూపే చట్టాలను మారుస్తానని హారిస్‌ హామీ ఇవ్వగా.. మహిళల క్రీడల్లో జన్మతః పురుషులైన ట్రాన్స్‌జెండర్లను నిషేధిస్తానని ట్రంప్‌ పేర్కొన్నారు.

ఇదీ హారిస్‌ వ్యూహం..

ఆఫ్రో అమెరికన్‌ పురుష ఓటర్లపై దృష్టి సారించిన కమలా హారిస్‌.. ట్రంప్‌ అధికారంలోకి వస్తే వారికి కలిగే కష్టాలను వివరిస్తున్నారు. దేశవ్యాప్తంగా వారిపై ఉన్న వివక్షను ఆయన సంస్థాగతం చేస్తారని హెచ్చరిస్తున్నారు. ఆఫ్రో అమెరికన్ల పట్ల వివక్ష చూపే ప్రస్తుత చట్టాలకు పరిష్కారం చూపుతానని తెల్పి చెబుతున్నారు. మారిజువానా కలిగి ఉండటాన్ని నేర రహితం చేస్తానని అంటున్నారు. ప్రస్తుతం మారిజువానా కలిగి ఉంటే అరెస్టు చేస్తున్నారు. ఇది ఆఫ్రో అమెరికన్లపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆమె అంటున్నారు.

✦ ఇళ్ల కొనుగోలు, ఆరోగ్య సేవలు, ఆర్థిక సుస్థిరత, ఓటింగ్‌లో ఆఫ్రో అమెరికన్లపై కొనసాగుతున్న వివక్షకు చరమ గీతం పాడతానని హారిస్‌ హామీ ఇస్తున్నారు.



✦ 'ఏ ఒక్కరూ సేదతీరుతూ కూర్చుని నేను ఓటు వేయడానికి వెళ్లట్లేదు అని చెప్పడానికి వీల్లేదు. ప్రతి ఒక్క సమస్యా పరిష్కారమవుతుంది. ఇది మార్జిన్‌ ఆఫ్‌ ఎర్రర్‌ పోరు. నేను గెలవబోతున్నా. అయినా పోటీ తీవ్రంగా ఉంది' అని హారిస్‌ వ్యాఖ్యానించారు.

✦ బానిసల వారసులకు పరిహారం చెల్లింపుపై అధ్యయనం చేయాల్సి ఉందని, దానిపై మరో ప్రశ్నకు తావు లేదని హారిస్‌ స్పష్టం చేశారు.

✦ అసలు ఆఫ్రో అమెరికన్లపై ట్రంప్‌నకున్న విధానమేంటని ఆమె ప్రశ్నించారు.

✦ ఆఫ్రో అమెరికన్లకు వ్యాపారం చేసుకోవడానికి 20,000 డాలర్ల సహాయం చేస్తామని, అప్రెంటిషిప్‌ సౌకర్యాలను కల్పిస్తామని కమలా హారిస్‌ హామీ ఇచ్చారు.

స్వల్ప తేడాతో తారుమారు

అమెరికా అధ్యక్ష ఎన్నికల పోలింగ్‌కు ఇంకా 20 రోజుల సమయమే ఉంది. దీంతో ఇద్దరు అభ్యర్థులు చెమటోడుస్తున్నారు. పోటీ హోరాహోరీగా ఉండటంతో స్వల్ప తేడాతో ఫలితం తారుమారయ్యే అవకాశముంది. అందుకే ఏ చిన్న అవకాశాన్నీ అభ్యర్థులు వదులుకోవడం లేదు. వర్గాల వారీగా ఓట్లను రాబట్టేందుకు ప్రచారం చేస్తున్నారు. హామీలు ఇస్తున్నారు.

ట్రంప్‌ సాగుతున్నారిలా..



హారిస్‌ ఆఫ్రో అమెరికన్లపై దృష్టి సారించగా.. ట్రంప్‌.. మహిళల ఓట్ల కోసం ప్రయత్నిస్తున్నారు. అబార్షన్‌ హక్కుపై ఆయన పెద్దగా మాట్లాడకపోయినా మిగిలిన విషయాలపై దృష్టి సారిస్తున్నారు. తాను అధికారంలోని వస్తే మహిళల క్రీడల్లో జన్మత పురుషులైన ట్రాన్స్‌జెండర్లను నిషేధిస్తానని స్పష్టం చేస్తున్నారు. జార్జియాలో అంతా మహిళలే పాల్గొన్న సభలో ఆయన మాట్లాడారు.

✦ గత ఎన్నికల్లో బైడెన్‌కు మద్దతుగా నిలిచిన ఆఫ్రో అమెరికన్‌ ఓటర్లను ఆకట్టుకునేందుకు ట్రంప్‌ వారికి వరాలిస్తున్నారు. వారి అభివృద్ధికి కృషి చేస్తానని చెబుతున్నారు.

✦ బానిసల వారసులకు పరిహారం చెల్లిస్తే కోట్ల డాలర్ల ప్రభుత్వ ధనం కావాల్సి ఉంటుందని ట్రంప్‌ అంటున్నారు.

\- ఈనాడు ప్రత్యేక విభాగం



అల్జీరియాలో సముద్రపు నీటిని తాగునీరుగా మార్చే ప్రాజెక్టు గురించి బుధవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు వివరిస్తున్న అక్కడి అధికారులు

భారత్‌, పాక్‌ విదేశీ వ్యవహారాల మంత్రుల పిచ్చాపాటీ

- రెండుసార్లు మాట్లాడుకున్న జైశంకర్‌, ఇషాక్‌ దర్‌
- క్రికెట్‌ సంబంధాలను మెరుగుపరుచుకోవడంపై చర్చ!

ఇస్లామాబాద్‌: షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో పాల్గొనేందుకు ఇస్లామాబాద్‌ వెళ్లిన భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్‌.జైశంకర్‌ పాకిస్థాన్‌ విదేశాంగ మంత్రి ఇషాక్‌ దర్‌తో ద్వైపాక్షికంగా భేటీ కాలేదు. అయితే ఆ ఇద్దరు నేతలు రెండు రోజుల్లో రెండుసార్లు కొద్దిసేపు పిచ్చాపాటీగా మాట్లాడుకున్నారు. మొదట- ఎస్‌సీవో ప్రతినిధుల కోసం పాక్‌ ప్రధానమంత్రి షెహబాజ్‌ షరీఫ్‌ మంగళవారం రాత్రి ఏర్పాటుచేసిన విందులో వారు మాట్లాడుకుంటూ కనిపించారు. అదే సమయంలో పాక్‌ అంతర్గత వ్యవహారాల మంత్రి మొహసిన్‌ నక్వీ వారితో కలిశారు. ఇరు దేశాల మధ్య క్రికెట్‌ సంబంధాలను మెరుగుపరచడంపై వారు చర్చించినట్లు దౌత్యవర్గాల సమాచారం. నక్వీ పాకిస్థాన్‌ క్రికెట్‌ బోర్డు (పీసీబీ) ఛైర్మన్‌గా కూడా ఉన్న సంగతి గమనార్హం. రెండోసారి- బుధవారం ఎస్‌సీవో సదస్సు ముగిసిన అనంతరం ఏర్పాటుచేసిన అధికారిక విందులో పక్కపక్కనే కూర్చున్న జైశంకర్‌, ఇషాక్‌ దర్‌ కొద్దిసేపు మాట్లాడుకున్నారు. వారి సంభాషణ ఏ అంశాల చుట్టూ తిరిగిందన్నది స్పష్టంగా తెలియరాలేదు. జైశంకర్‌, ఇషాక్‌ దర్‌ల ద్వైపాక్షిక భేటీ కోసం భారత్‌వైపు నుంచిగానీ, పాక్‌వైపు నుంచిగానీ వినతులు రాలేదని.. అయితే వారిరువురూ పిచ్చాపాటీగానైనా మాట్లాడుకోవడం సానుకూల సంకేతమని దౌత్యవర్గాలు పేర్కొన్నాయి.

ప్రత్యేక విమానంలో అమెరికాకు చైనా పాండాలు

వాషింగ్టన్‌: జాతీయ సంపదగా భావించే పాండాలను అమెరికాకు చైనా బహుమతిగా పంపింది. రెండు పాండాలు ప్రత్యేక విమానంలో అమెరికాకు చేరుకున్నాయి. అమెరికాతో చైనా 1972లో చేసుకున్న 'పాండా దౌత్యం' ఒప్పందంలో భాగంగా తమ దేశంలోని బావో లీ, క్వింగ్‌ బావో పాండాలను చైనా ప్రభుత్వం అమెరికాకు పంపినట్లుగా అధికారులు పేర్కొన్నారు. పాండాలను వాషింగ్టన్‌లోని జంతు ప్రదర్శనశాలకు తరలించారు. 2025 జనవరి 24 నుంచి వాటిని చూడటానికి సందర్శకులను అనుమతిస్తామని అధికారులు ప్రకటించారు. అరుదైన జీవజాతులైన పాండాలు చైనాలో అధికంగా ఉంటాయి. దీంతో డ్రాగన్‌ వీటిని జాతీయ సంపదగా భావిస్తుంది.

భారత్‌ అత్యంత సంక్లిష్ట దేశం

- చైనా అంతకన్నా ఎక్కువ
- ఈ రెండింటి కంటే ఐరోపా దేశాల తీరు దారుణం
- ట్రంప్‌ వ్యాఖ్యలు

వాషింగ్టన్‌: మన శత్రువుల కంటే మిత్రులే ఎక్కువ అవకాశవాదంతో వ్యవహరిస్తున్నారని అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్‌ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్‌ ట్రంప్‌ వ్యాఖ్యానించారు. ఐరోపా దేశాలు మన మిత్రులని, కానీ వాటి విషయంలో అమెరికా వాణిజ్య లోటు 300 బిలియన్‌ డాలర్లుందని, ఇది అత్యంత దారుణమని పేర్కొన్నారు. సుంకాల విషయంలో భారత్‌ అత్యంత సంక్లిష్ట దేశమని, చైనా అంతకన్నా ఎక్కువని, ఈ రెండింటిని మించి ఐరోపా దేశాలు ఉన్నాయని విమర్శించారు. షికాగో ఎకనమిక్‌ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐరోపా, అమెరికా వాణిజ్య లావాదేవీలు అత్యంత దారుణంగా ఉన్నాయని పేర్కొన్నారు. దీనికి కారణమైనవారు మూఢులైనా అయి ఉండాలని, లేదంటే దాని నుంచి లంచాలను తీసుకుంటూ అయినా ఉండి ఉండాలని అభిప్రాయపడ్డారు. 'నేను చైనాపై 27.5శాతం సుంకాలను విధించా. లేదంటే అక్కడి కార్లు వరదలా వచ్చి పడేవి. మన ఫ్యాక్టరీలన్నీ మూతపడేవి. మన ఆటోమొబైల్‌ పరిశ్రమల్లో ఉద్యోగాలు ఉండేవి కావు. మనకు ట్రక్కులు పంపే దక్షిణ కొరియాపైనా సుంకాలు విధించా. ఒకవేళ నేను సుంకాలను ఎత్తివేస్తే మీరంతా నిండా మునిగిపోయేవారు. అమెరికాలోని కార్ల కంపెనీలన్నీ వ్యాపారం నుంచి బయటకు రావాల్సి వచ్చేది' అని ట్రంప్‌ పేర్కొన్నారు. ఐరోపా దేశాలు మొత్తం కలిసి అమెరికా అంత సైజులో ఉంటాయని, మనకు మంచి మిత్రులైన ఆ దేశాలు.. మనల్ని తక్కువ చేసి చూస్తున్నాయని వ్యాఖ్యానించారు. స్థానిక కంపెనీలను వెనక్కి తీసుకురావాల్సి ఉందని, వాటికి పన్నులను తగ్గించి.. విదేశీ కంపెనీలపై సుంకాలను మరింతగా విధించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ✦ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో తనకున్న సంబంధాలను ట్రంప్‌ సమర్థించుకున్నారు.

చాట్‌జీపీటీ సాయంతో సీవీ.. చూశాక షాకైన సీఈఓ

ఇంటర్నెట్‌ డెస్క్‌: తమ సంస్థలో ఉద్యోగ అవకాశాన్ని కోరుతూ వచ్చిన అభ్యర్థి సీవీని చూసి ఓ సీఈఓ కంగుతున్నారు. ఫలానా ఉద్యోగం కోసం దరఖాస్తు రూపొందించు అని చాట్‌జీపీటీకి చెబితే ఆ ఏఐ ప్లాట్‌ఫాం- చిటికెలో ఇస్తుంది. అయితే అందులోని కొన్ని విషయాలను మనమే పూరించాల్సి ఉంటుంది. కానీ ఈ అభ్యర్థి మాత్రం చాట్‌జీపీటీ రూపొందించిన దరఖాస్తును అలాగే కంపెనీకి పంపించేశాడు. నైపుణ్యాలు, అనుభవం అనేచోట్ల 'ఉదాహరణ..' అని ఉండటాన్ని చూసిన ఎంట్రేజ్‌ సంస్థ సీఈఓ అనన్య నారంగ్‌ ఆశ్చర్యపోయారు. 'దరఖాస్తు కోసం అభ్యర్థి చాట్‌జీపీటీని ఉపయోగించాడనే విషయం స్పష్టంగా తెలుస్తోంది. దేశంలో నిరుద్యోగులు ఎక్కువగా ఉండటంలో ఆశ్చర్యం లేదు' అంటూ సీవీకి సంబంధించిన స్క్రీన్‌షాట్‌ను 'ఎక్స్‌' వేదికగా పంచుకున్నారు.

భారత ప్రయాణికులతో షికాగోకు కెనడా ఎయిర్‌ ఫోర్స్‌ విమానం

దిల్లీ: కెనడాలోని ఇకాలుట్‌ విమానాశ్రయంలో అత్యవసరంగా దిగిన ఎయిరిండియా విమానానికి చెందిన 191 మంది ప్రయాణికులను కెనడా ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన విమానం షికాగోకు చేర్చింది. దిల్లీ నుంచి షికాగో బయలుదేరిన ఎయిరిండియా విమానం బాంబు బెదిరింపుతో దారి మళ్లి మంగళవారం ఇకాలుట్‌లో దిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రయాణికులకు తగిన వసతి ఏర్పాట్లు లేకపోవడంతో వారందరిని గమ్యస్థానాలకు చేర్చేందుకు అత్యవసర ఏర్పాట్లు చేసినట్లు కెనడా మంత్రి హర్జిత్‌ సజ్జన్‌ వెల్లడించారు.

✦ సింగపూర్‌లోని ఛాంగి విమానాశ్రయానికి చేరుకున్న ఎయిర్‌ ఇండియా ఎక్స్‌ప్రెస్‌ విమానంలో ఎటువంటి బాంబు లేదని సింగపూర్‌ పోలీసులు బుధవారం వెల్లడించారు. మదురై నుంచి బయలుదేరిన ఆ విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో మంగళవారం రాత్రి 8.50కి దిగాల్సిన విమానం రాత్రి 10.04 గంటలకు ల్యాండయింది. వెంటనే పోలీసులు తనిఖీలు చేపట్టి దాంట్లో ఎటువంటి పేలుడు పదార్థాలు లేవని తేల్చారు.

✦ ముంబయి నుంచి దిల్లీకి బయలుదేరి బాంబు బెదిరింపుతో మంగళవారం అహ్మదాబాద్‌లో దిగిన ఇండిగో విమానంలో ఎటువంటి బాంబులేదని తనిఖీల్లో తేలినట్లు బుధవారం అధికారులు వెల్లడించారు. దీంతో బుధవారం ఉదయం విమానం దిల్లీకి సురక్షితంగా చేరినట్లు తెలిపారు.

అన్ని కేసులను కలపాలని... పరారీలో ఉన్న వ్యక్తి ఎలా కోరుతారు?

- జకీర్‌ నాయక్‌ కేసులో ప్రశ్నించిన కేంద్రం

దిల్లీ: దేశంలోని వివిధ వర్గాల ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొడుతున్నారే ఆరోపణలను ఎదుర్కొంటున్న వివాదాస్పద మత గురువు జకీర్‌ నాయక్‌ తరఫున సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌ విచారణార్హతను కేంద్ర ప్రభుత్వం ప్రశ్నించింది. పరారీలో ఉన్న నిందితుడు తనపై వివిధ ప్రాంతాల్లో నమోదైన కేసులన్నింటినీ కలపాలని ఎలా కోరుతారని నిలదీసింది. జకీర్‌ నాయక్‌ దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం జస్టిస్‌ అభయ్‌ ఎస్‌.ఓక్‌, జస్టిస్‌ అహ్‌సానుద్దీన్‌ అమానుల్లా, జస్టిస్‌ ఆగస్టిన్‌ జార్జ్‌ మసీహ్‌ ధర్మాసనం ముందు సొలిసిటర్‌ జనరల్‌ తుషార్‌ మెహతా వాదనలు వినిపించారు. తనపై నమోదైన కేసులన్నింటినీ కలపాలన్న పిటిషన్‌ను జకీర్‌ నాయక్‌ వెనక్కి తీసుకోనున్నారని తెలిసిందని మెహతా అన్నారు. అయితే, జకీర్‌ నాయక్‌ తరఫున హాజరైన న్యాయవాది... అలాంటి సమాచారం ఏదీ తనకు అందలేదని వెల్లడించారు. తన క్లయింట్‌పై దాఖలైన ఆరు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కొట్టివేయాలని హైకోర్టును ఆశ్రయిస్తామన్నారు. దీనిపై సుప్రీంకోర్టు ధర్మాసనం స్పందిస్తూ...ప్రస్తుత పిటిషన్‌ను కొనసాగిస్తారా లేదా అనే విషయాన్ని స్పష్టం చేస్తూ అఫిడవిట్‌ దాఖలు చేయాలని జకీర్‌ నాయక్‌ తరఫు న్యాయవాదిని ఆదేశించింది. ఈ అఫిడవిట్‌కు సమాధానం ఇవ్వాలని సొలిసిటర్‌ జనరల్‌కు ధర్మాసనం సూచించింది. అనంతరం విచారణను ఈ నెల 23వ తేదీకి వాయిదా వేసింది.

జయప్రద నిర్దోషి

- ఎన్నికల కోడ్‌ ఉల్లంఘన కేసులో కోర్టు తీర్పు

రాంపుర్‌: లోక్‌సభ ఎన్నికల్లో (2019) కోడ్‌ ఉల్లంఘన కేసులో మాజీ ఎంపీ, సినీనటి జయప్రదను బుధవారం రాంపుర్‌లోని ఎంపీ-ఎమ్మెల్యే ప్రత్యేక కోర్టు నిర్దోషిగా తేల్చింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాంపుర్‌ స్థానం నుంచి భాజపా అభ్యర్థిగా జయప్రద పోటీ చేసిన విషయం తెలిసిందే. అయితే, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నప్పటికీ.. అనుమతి లేకుండా నూర్‌పుర్‌లో బహిరంగ సభ నిర్వహించి రోడ్డును ప్రారంభించారన్న ఆరోపణలు ఆమె ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆమెపై స్వార్‌ పోలీస్‌ స్టేషన్‌లో నమోదైన కేసును విచారించిన న్యాయస్థానం.. సరైన సాక్ష్యాధారాలు లేని కారణంగా ఆమెను నిర్దోషిగా తేల్చింది. ఈ విషయాన్ని జయప్రద తరఫు న్యాయవాది అరుణ్‌ ప్రకాశ్‌ సక్సేనా మీడియాకు వెల్లడించారు. తనను నిర్దోషిగా ప్రకటిస్తూ న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై జయప్రద హర్షం వ్యక్తం చేశారు. "నన్ను రాంపుర్‌ రాకుండా అడ్డుకోవాలని కొందరు కుట్రలు పన్నుతున్నారు. కానీ ఇది నా రెండో ఇల్లు. మళ్లీ మళ్లీ ఇక్కడికి వస్తూనే ఉంటా" అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచే పోటీ చేస్తానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

కెనడా ఆరోపణలు తీవ్రమైనవి: అమెరికా

- దర్యాప్తునకు భారత్‌ సహకరించాలని సూచన
- బ్రిటన్‌దీ అదే మాట

వాషింగ్టన్‌: భారత్‌-కెనడా దౌత్య వివాదంపై తామేమీ మాట్లాడబోమని, అయితే భారత్‌పై వచ్చిన ఆరోపణలు చాలా తీవ్రమైనవని అమెరికా వ్యాఖ్యానించింది. వాటిని భారత్‌ తీవ్రంగానే పరిగణించి కెనడాతో దర్యాప్తునకు సహకరించాలని కోరుకుంటున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్‌ పేర్కొన్నారు. భారత్‌ దీనికి భిన్నమైన మార్గాన్ని ఎంచుకుందని అన్నారు. సిక్కుల అతివాద నేత హర్దీప్‌ సింగ్‌ నిజ్జర్‌ హత్య కేసుకు సంబంధించి భారత్‌పై కెనడా చేసిన ఆరోపణల నేపథ్యంలో మిల్లర్‌ విలేకరుల సమావేశంలో ఈ మేరకు స్పందించారు. అమెరికా పౌరుడొకరిని హత్య చేసేందుకు జరిగిన కుట్రలో భారత అధికారి పాత్ర ఉందన్న ఆరోపణల్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు భారత్‌ తెలిపిందని, దానిపై అక్కడి నుంచి అధికారుల బృందమొకటి వచ్చి అధికారులతో ఇప్పటికే సమావేశమైందని చెప్పారు. అమెరికాకు బలమైన భాగస్వామిగా భారత్‌ కొనసాగుతుందని ఒక ప్రశ్నకు సమాధానంగా మిల్లర్‌ తెలిపారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా దాపరికం లేకుండా వాటిపై సమగ్రంగా చర్చించుకునే పరిస్థితులు ఇరు దేశాల మధ్య ఉన్నాయన్నారు. తీవ్రమైన అభియోగాలపై దర్యాప్తునకు భారత్‌ సహకరించాలని బ్రిటన్‌ ప్రభుత్వం పేర్కొంది. కెనడా న్యాయవ్యవస్థపై తమకు నమ్మకం ఉందంది.

ఖలిస్థాన్‌ వాదులకు పాక్‌ మద్దతు

టొరంటో: తమ దేశంలో ఉన్న ఖలిస్థానీయులకు పాకిస్థాన్‌ మద్దతు ఉందని కెనడియన్‌ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్‌ సర్వీస్‌ (సీఎస్‌ఐఎస్‌) డైరెక్టర్‌ వనెస్సా లాయిడ్‌ చెప్పిన విషయం తాజాగా బయటకు వచ్చింది. ఖలిస్థాన్‌ అనుకూల వ్యక్తుల్ని ఆధారంగా చేసుకుని కెనడా రాజకీయాల్లో పాకిస్థాన్‌ కీలకపాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు. గత నెల ఒక కమిషన్‌ ఎదుట లాయిడ్‌ ఇచ్చిన వాంగ్మూలం ఇప్పుడు తెరపైకి వచ్చింది. దీనిపై ట్రూడో సర్కారు నోరు మెదపడం లేదు. మొత్తంగా ప్రభుత్వ తీరుపై కెనడా పత్రికలు తీవ్రస్థాయి విమర్శలతో కథనాలు ప్రచురిస్తున్నాయి. సిక్కు వేర్పాటువాదానికి కెనడానే ఆశ్రయం ఇచ్చిందని 'నేషనల్‌ పోస్టు' పత్రిక పేర్కొంది. ట్రూడో సర్కారు ప్రవాసీయులను ఆధారంగా చేసుకొని రాజకీయాలు చేస్తోందని విమర్శించింది. ఆధారాలు చూపకుండా రాయల్‌ కెనడియన్‌ మౌంటెడ్‌ పోలీసులు భారత్‌పై ఆరోపణలు చేయడాన్ని తప్పుబట్టింది. దౌత్య సంబంధాలు దిగజారడానికి ట్రూడో వైఖరి కారణమైందని, వేర్పాటువాదులపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని తెలిపింది. 'ది నేషనల్‌ టెలిగ్రాఫ్‌' పత్రిక మరో కథనంలో ట్రూడో వైఖరిని నిలదీసింది. భారత్‌తో ఉద్రిక్తతలు పెరిగినా.. ఆధారాలను బహిర్గతం చేయడంలో ట్రూడో మరోసారి విఫలమయ్యారని తప్పుబట్టింది. "తన మాటనే నమ్మాలనే స్థితిలో ట్రూడో ఉన్నారు. ఈ వివాదం కారణంగా కెనడా చివరికి బిలియన్ల డాలర్ల మేర నష్టం చవిచూస్తుంది. కేవలం జగ్మీత్‌సింగ్‌ను, అతడి ఖలిస్థానీ గ్యాంగ్‌ను బుజ్జగించేందుకే ఇదంతా జరుగుతోంది" అని దుయ్యబట్టింది.

అప్పుడు బలమైన ఆధారాల్లేవు: ట్రూడో

ఒట్టావా: నిజ్జర్‌ను గత ఏడాది హతమార్చడంలో భారత ప్రభుత్వ ఏజెంట్ల పాత్ర ఉందని ఆరోపణలు చేసినప్పుడు తనవద్ద నిఘా సమాచారమే తప్పిస్తే పక్కా ఆధారాలేవీ లేవని కెనడా ప్రధాని జస్టిన్‌ ట్రూడో వెల్లడించారు. కెనడా ఎన్నికల ప్రక్రియ, ప్రజాస్వామ్య వ్యవస్థల్లో విదేశాల జోక్యంపై విచారణ నిర్వహిస్తున్న కమిటీకి ఆయన ఈ విషయాన్ని ధ్రువపరిచారు. భారత ప్రధాని మోదీ నేతృత్వంలోని సర్కారుతో విభేదించే కెనడావారి వివరాలను ఇక్కడి భారత దౌత్యవేత్తలు సేకరించి, ఉన్నతస్థాయిలోని వారికి.. లారెన్స్‌ బిష్ణోయ్‌ వంటి నేరగాళ్ల ముఠాలకు చేరవేస్తున్నారని ఆరోపించారు. "నిజ్జర్‌ను కెనడాలో హతమార్చడం వెనక భారత ప్రభుత్వ ఏజెంట్ల ప్రమేయం ఉందని నిఘా వర్గాలకు కచ్చితమైన సమాచారం అందింది. భారత్‌ ప్రమేయంతోనే హత్య జరిగిందనడానికి మేం నమ్మదగ్గ కారణాలు ఉన్నాయి. జవాబుదారీతనం ఉండాలని భారత ప్రభుత్వాన్ని వెంటనే సంప్రదించాం. తెరవెనుక ప్రయత్నాలు కొనసాగిస్తూ భారత్‌ మాతో సహకరించేలా పనిచేశాం. భారత వర్గాలు మా నుంచి ఆధారాలు కోరాయి. అవి భారత భద్రతా బలగాల వద్దే ఉన్నాయనేది మా స్పందన. భారత్‌ మాత్రం ఆధారాలు చూపాలని పట్టుబట్టింది. రెండు దేశాలు కలిసి పనిచేసి వాటిని సాధించవచ్చని చెప్పాం. జి-20 సదస్సు ముగిశాక మోదీని కలిశాను. ఆయన నుంచి స్పందన యథాలాపంగా వచ్చింది" అని చెప్పారు.

ఇంజక్షన్లతో ఊబకాయులకు మళ్లీ ఉద్యోగాలు

ఇంటర్నెట్‌ డెస్క్‌: స్థూలకాయంతో బాధపడుతున్న వారి బరువు తగ్గించే దిశగా బ్రిటన్‌ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వారికి ఇంజక్షన్లు అందించి తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకువచ్చేందుకు సాయపడతామని ఆరోగ్య శాఖ మంత్రి వీస్‌ స్ట్రీటింగ్‌ వెల్లడించారు. ఊబకాయుల ఆరోగ్య సంరక్షణ భారం.. జాతీయ ఆరోగ్య సేవల (ఎన్‌హెచ్‌ఎస్‌)పై పడుతోందని చెప్పారు. ఏడాదికి 11 బిలియన్‌ పౌండ్లు దీనిపై ఖర్చవుతోందని, ఇది ధూమపాన సంబంధిత సమస్యల కంటే అధికమని తెలిపారు. దీనివల్ల బరువు తగ్గించే చికిత్సలను ఊబకాయులకు అందించనున్నట్లు తెలిపారు. చికిత్స వల్ల ఊబకాయులు తమ ఆరోగ్యంపై నియంత్రణ పొంది, తిరిగి ఉద్యోగాల్లో చేరేందుకు వీలుంటుందన్నారు.



జమ్మూ-కశ్మీర్‌ సీఎంగా ప్రమాణం చేసిన ఒమర్‌ అబ్దుల్లాను అభినందిస్తున్న లెఫ్టినెంట్‌ గవర్నర్‌ మనోజ్‌ సిన్హా

కిక్కిరిసిపోనున్న నగరాలు

- వాతావరణ మార్పులూ వలసలకు కీలక కారణమే: అధ్యయనం

దిల్లీ: ఆర్థిక లేదా ఘర్షణ సంబంధిత పర్యవసానాలే కాదు... వాతావరణ మార్పులూ నగరాలకు ప్రజలు వలస వెళ్లడానికి కారణమవుతున్నాయని తాజా అధ్యయనం వెల్లడించింది. దీన్ని అరికట్టాల్సిన అవసరం ఉందని, లేకపోతే నగరాలు కిక్కిరిసిపోతాయని హెచ్చరించింది. "తీవ్రమైన కరవు పరిస్థితులు, నీటి వనరులు లేకపోవడం అంతర్గత వలసలపై ప్రభావం చూపిస్తోంది. ముఖ్యంగా దక్షిణ ఐరోపా, దక్షిణాసియా, ఆఫ్రికా, పశ్చిమాసియా, దక్షిణ అమెరికాలోని నీటివనరులు లేని ప్రాంతాల్లో ఈ ధోరణి చూడొచ్చు" అని ఈ అధ్యయనం చేసిన ఇటలీలోని బొకోని యూనివర్సిటీ గ్రీన్‌ రీసెర్చ్‌ సెంటర్‌ పరిశోధకులు తెలిపారు. 1960 నుంచి 2016 మధ్య 72 దేశాలకు సంబంధించిన వలసల డేటాను విశ్లేషించిన వీరు.. వ్యవసాయాధారిత ప్రాంతాల నుంచే వలసలు అధికంగా ఉంటున్నాయని తేల్చారు. వాతావరణ ప్రేరిత వలసలకు మూలకారణాలు పరిష్కరించడానికి ఓ సమగ్రవిధానం రూపొందించాల్సిన అవసరాన్ని వీరు తమ అధ్యయనంలో ప్రధానంగా పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో సహాయక వ్యవస్థలు మెరుగుపరచడానికి చురుకైన వ్యూహాలు రూపొందించాలని సూచించారు. నీటివనరుల మెరుగైన నిర్వహణ, వ్యవసాయ ఆవిష్కరణలు, సామాజిక భద్రతా కార్యక్రమాలు.. ..జనాభా స్థిరీకరణకు సాయపడతాయని, అప్పుడు ప్రజలు తామున్న ప్రాంతాలను వీడకుండా జీవనం కొనసాగించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ అధ్యయనాన్ని 'నేచర్‌ క్లైమేట్‌ ఛేంజ్‌ జర్నల్‌' ప్రచురించింది.

ఆ సొరంగాలు.. హెజ్‌బొల్లా భూగర్భ గృహాలు

ఇంటర్నెట్‌డెస్క్‌: ఇజ్రాయెల్‌ దళాలు ఇప్పటివరకు గాజా భూగర్భంలోని హమాస్‌ సొరంగాలనే ధ్వంసం చేశాయి. కానీ, ఇప్పుడు వాటికంటే కొన్ని రెట్లు పెద్దవైన హెజ్‌బొల్లా సొరంగాలు ఐడీఎఫ్‌ దళాలను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. తాజాగా లెబనాన్‌లో హెజ్‌బొల్లా వాడే సొరంగం ఒకదానిని ఇజ్రాయెల్‌ దళాలు గుర్తించాయి. దీనికి సంబంధించిన ఒక నిమిషం వీడియోను విడుదల చేశాయి. ఇవి గాజాలోని హమాస్‌ సొరంగాల్లా చిన్నవిగా లేవు. భారీ ఇనుప తలుపులు, ప్రత్యేక గదులు, ఏకే47 రైఫిల్స్‌, బెడ్‌రూమ్‌లు, బాత్‌రూమ్‌లు, స్టోరేజ్‌ గదులు, జనరేటర్లు, వాటర్‌ ట్యాంక్‌లు, ద్విచక్ర వాహనాలు కూడా ఈ సొరంగాల్లో తిరిగేలా ఉన్నాయి. హెజ్‌బొల్లా రద్వాన్‌ ఫోర్స్‌ కమాండోలు అక్కడ ఉండేవారని ఇజ్రాయెల్‌ ఈ వీడియోలో వెల్లడించింది. వీటి ప్రవేశ మార్గాలు లేదా బయటకు వెళ్లేవి పౌరుల నివాసాల్లో ఉంటున్నాయని పేర్కొన్నారు. మంగళవారం తమ దళాలు ఓ ఇంటిని చుట్టుముట్టి సొరంగాన్ని గుర్తించినట్లు ఇజ్రాయెల్‌ సైన్యం ప్రకటించింది. దానిలో రద్వాన్‌ ఫోర్స్‌ కమాండోలు ఉన్నట్లు పేర్కొంది. వారి వద్ద భారీగా ఆయుధాలు కూడా ఉన్నట్లు వెల్లడించింది. కొన్ని నెలల క్రితం హెజ్‌బొల్లా తమ సొరంగ మార్గాలను ఓ వీడియోలో ప్రదర్శించింది. వీటిని విశ్లేషించిన ఐడీఎఫ్‌ దళాలు దాదాపు 160 గ్రామాల్లో ఈ రకం సొరంగాల నెట్‌వర్క్‌లు విస్తరించి ఉండొచ్చని అంచనా వేశాయి. దీంతోపాటు ఆ సొరంగాల్లో మొబైల్‌ లాంచర్లపై క్షిపణులు కూడా ఉండటం విశేషం. అంటే.. భూగర్భంలో ఏకంగా రోడ్లు వేసినట్లు అర్థమవుతోంది.

ఉత్తర గాజాకు ఎట్టకేలకు సహాయం

అమెరికా హెచ్చరికతో ఎట్టకేలకు 50 ట్రక్కుల సహాయక సామగ్రిని ఉత్తర గాజాలోకి ఇజ్రాయెల్‌ బుధవారం అనుమతించింది. జోర్డాన్‌ నుంచి ఈ సాయం ప్రవేశించింది. రెండు వారాలుగా ఒక్క ట్రక్కు కూడా ఉత్తరగాజాలో అడుగుపెట్టలేదు.

అన్యాయమైన దాడులు ఆపాలి: ఫ్రాన్స్‌

ఎలాంటి ఆలస్యం చేయకుండా లెబనాన్‌లో తక్షణం కాల్పుల విరమణ పాటించాల్సిన అవసరం ఉందని ఫ్రాన్స్‌ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్‌ మెక్రాన్‌ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఇజ్రాయెల్‌ ప్రధాని నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా అన్యాయంగా లెబనాన్‌ను లక్ష్యం చేసుకోవడం ఆపాలని మెక్రాన్‌ తెలిపినట్లు ఆయన కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. అనంతరం బెంజమిన్‌ నెతన్యాహు ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ఏకపక్ష కాల్పుల విరమణకు తాను వ్యతిరేకమని తెలిపారు. ఉత్తర ఇజ్రాయెల్‌ ప్రజలకు భద్రత కల్పించని ఎలాంటి ఒప్పందాన్ని తాను అంగీకరించనని పేర్కొన్నారు.



ఇజ్రాయెల్‌ వైమానిక దాడి అనంతరం గాజాలో ధ్వంసమైన ఓ భవనం నుంచి పాలస్తీనా పౌరుడి మృతదేహాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

తుర్కియేలో భూకంపం

అంకారా: తుర్కియే తూర్పు ప్రాంతంలో బుధవారం భూకంపం సంభవించింది. రిక్టర్‌ స్కేల్‌పై అది 5.9గా నమోదైంది. ప్రజలంతా భయాందోళనలకు గురై బయటకు పరుగులు తీశారు. ఈ సందర్భంగా భయకంపితులైన 40 మందిని ఆసుపత్రులకు తరలించారు. భూకంపంవల్ల ప్రాణ, ఆస్తి నష్టాలేవీ చోటుచేసుకోలేదని అధికారులు తెలిపారు. మలాత్యా ప్రావిన్సులోని కాలే నగరంలో ఈ భూకంపం సంభవించింది.

బిహార్‌లో కల్తీ మద్యం తాగి ఆరుగురి మృతి

- ఆసుపత్రి పాలైన మరో 14 మంది

సివాన్‌; సారణ్‌: కల్తీ మద్యం తాగి ఆరుగురు పౌరులు మృతి చెందగా, 14 మంది ఆసుపత్రి పాలైన ఘటన బిహార్‌లో చోటు చేసుకుంది. సివాన్‌ జిల్లాలో నలుగురు, సారణ్‌ జిల్లాలో ఇద్దరు చనిపోయినట్లు బుధవారం అధికారులు వెల్లడించారు. అయితే మరణాలకు కారణం పోస్టుమార్టం నివేదిక వచ్చాక తెలుస్తుందన్నారు. మంగళవారం రాత్రి కల్తీ మద్యం తాగిన తరువాతే వారంతా అనారోగ్యం పాలయ్యారని సంబంధిత గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అనారోగ్యం పాలైనవారి వివరాలను అధికారులు బయటపెట్టలేదు.

20 సార్లు హత్యాయత్నాలను ఎదుర్కొని.. మహిళా మంత్రిగా బాధ్యతలు చేపట్టి..



సకీనా ఈటూ

శ్రీనగర్‌: జమ్మూకశ్మీర్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. నేషనల్‌ కాన్ఫరెన్స్‌ నేత ఒమర్‌ అబ్దుల్లా ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం చేయగా.. ఆయనతో పాటు ప్రమాణం చేసిన మంత్రుల్లో ఒకే ఒక్క మహిళ ఉన్నారు. ఆమే సకీనా ఈటూ. దక్షిణ కశ్మీర్‌కు చెందిన కుల్గామ్‌ జిల్లాలోని డీహెజ్‌పోరా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సకీనా విజయం సాధించారు. ఆమె పీపుల్స్‌ డెమోక్రాటిక్‌ పార్టీ అభ్యర్థి గుల్జార్‌ అహ్మద్‌ దర్‌పై 17,449 ఓట్ల మెజార్టీతో గెలుపు దక్కించుకున్నారు. ప్రముఖ రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన ఆమె నేషనల్‌ కాన్ఫరెన్స్‌లో వివిధ హోదాల్లో పనిచేశారు. ఆమె తండ్రి వలీ మొహమ్మద్‌ ఈటూ.. పార్టీలో కీలకంగా వ్యవహరించారు. జమ్మూకశ్మీర్‌ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. ఆయన 1994లో హత్యకు గురయ్యారు. ఆ తర్వాత తండ్రి వారసత్వాన్ని అందుకొని ముందుకు సాగుతోన్న ఆమె సోదరుడిని 2001లో ఉగ్రవాదులు బలిగొన్నారు. అప్పుడు ఆమె వైద్యవిద్యను అభ్యసిస్తున్నారు. తండ్రి, సోదరుడి మరణాలతో వెనకడుగు వేయని ఆమె రాజకీయ ప్రయాణాన్ని మొదలుపెట్టారు. ఆమెపై కూడా 20 సార్లకు పైగా హత్యాయత్నాలు జరిగాయి. వాటన్నింటిని దాటుకొని.. జమ్మూకశ్మీర్‌ ప్రభుత్వంలో వివిధ హోదాల్లో పనిచేశారు. లెజిస్లేటివ్‌ కౌన్సిల్‌లో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు నిర్వర్తించారు. పర్యాటక శాఖ, విద్యాశాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2008 నుంచి 2014 వరకు సామాజిక సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నారు. 53 ఏళ్ల వయసులో తాజాగా క్యాబినెట్‌ మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. జమ్మూకశ్మీర్‌లో ప్రజాదరణ ఉన్న అతి కొద్దిమంది మహిళా నేతల్లో ఈమె ఒకరు. సామాజిక సంక్షేమం, మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించి ప్రజల మన్ననలు పొందారు.



శాటిలైట్ స్పెక్ట్రమ్‌పై మీ నిర్ణయం భేష్

శాటిలైట్ ఆధారిత కమ్యూనికేషన్ సేవలకు ఉపయోగించే రేడియో తరంగాల (స్పెక్ట్రమ్)నూ వేలం వేయాలన్న రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్ అధినేతల సూచనలను ఒప్పుకోని టెలికాం మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు ధన్యవాదాలు. శాటిలైట్ స్పెక్ట్రమ్‌ను వేలం వేసేది లేదన్న మీ నిర్ణయాన్ని అభినందిస్తున్నాం. అంతర్జాతీయంగా అమలవుతున్న విధానం ప్రకారం, పాలనాపరంగానే ఈ స్పెక్ట్రమ్‌ను కేటాయిస్తే, మా స్టార్‌లింక్ ద్వారా భారత ప్రజలకు సాధ్యమైనంత మేర అత్యుత్తమ సేవలను అందిస్తాం.

- టెస్లా అధినేత ఎలాన్ మస్క్

రూ.79,000కు చేరిన బంగారం




ఈనాడు వాణిజ్య విభాగం: బంగారం, వెండి ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. అంతర్జాతీయ అనిశ్చితుల నేపథ్యంలో, సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించే పసిడిపైకి పెట్టుబడులు మళ్లడం, దేశీయంగా శుభకార్యాలు ప్రారంభమైనందున ఆభరణాలకు గిరాకీ ఏర్పడటం ఇందుకు కారణం. అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాముల) మేలిమి బంగారం ధర బుధవారంనాడే 24 డాలర్లు పెరిగి 2683 డాలర్లను మించింది. హైదరాబాద్ బులియన్ విపణిలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.79,000కు చేరింది. కిలో వెండి ధర రూ.94,200 వద్ద ట్రేడ్ అవుతోంది.

రోజుకు 12000 కొత్త కార్లు రోడ్లపైకి వస్తాయి

- మెక్సికో దేశ విద్యుత్ వినియోగం కంటే మన దేశంలో ఏసీల కోసం వాడే విద్యుత్తే ఎక్కువ
- 2035 నాటికి భారత్‌పై ఐఈఏ అంచనా

భారత ఆర్థిక వ్యవస్థ రాణిస్తోంది. ఇందువల్ల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి. ఫలితంగా 2035 కల్లా రోజుకు 12,000కు పైగా కొత్త కార్లు భారత రోడ్ల పైకి వస్తాయని ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఈఏ) అంచనా వేస్తోంది. పెరిగే ఈ కార్ల సంఖ్యకు అనుగుణంగా ఏటా 100 కోట్ల చదరపు మీటర్ల మేర రోడ్ల విస్తీర్ణం పెరుగుతుందని తెలిపింది. ప్రస్తుతం దక్షిణాఫ్రికాలోని మొత్తం రహదారుల విస్తీర్ణం కంటే అది అధికం అవుతుందని విశ్లేషించింది.

2035లో భారత్‌లోని ఎయిర్‌కండీషనర్లు మాత్రమే వినియోగించుకునే విద్యుత్.. ఆ ఏడాది మెక్సికో దేశం మొత్తం వాడే విద్యుత్ కంటే ఎక్కువగా ఉంటుందని ఐఈఏ పేర్కొంది. చమురు, సహజవాయువు, బొగ్గు, విద్యుత్, పునరుత్పాదక విద్యుత్.. ఇలా అన్ని రూపాల్లోని ఇంధనానికి గిరాకీ పెరిగే అవకాశం ఉందని వరల్డ్ ఎనర్జీ అవుట్‌లుక్- 2024 నివేదికలో పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం..



ఇంధన గిరాకీకి ప్రధాన కేంద్రం..

అధిక జనాభా, రంగాలన్నింటి నుంచి గిరాకీ పెరగనున్న దృష్ట్యా రాబోయే దశాబ్ద కాలంలో మిగతా దేశాలతో పోలిస్తే భారత్‌లోనే ఇంధన గిరాకీ వృద్ధి నమోదుకావొచ్చు.

- **చమురు గిరాకీ:** ప్రస్తుతం రోజుకు 5.2 మిలియన్ బ్యారెళ్లు.. 2035 కల్లా 7.1 మిలియన్ బ్యారెళ్లకు
- **రిఫైనరీల సామర్థ్యం:** ప్రస్తుతం రోజుకు 5.8 మిలియన్ బ్యారెళ్లు. 2045 నాటికి 7.1 మిలియన్ బ్యారెళ్లకు
- **సహజవాయువుకు గిరాకీ:** ప్రస్తుతం 64 బిలియన్ క్యూబిక్ మీటర్లు (బీసీఎం). 2050 నాటికి 172 బీసీఎంకు
- **బొగ్గు ఉత్పత్తి:** ప్రస్తుతం 721 మిలియన్ టన్నులు. 2050 నాటికి 645 మిలియన్ టన్నులకు తగ్గొచ్చు.
- **విద్యుత్‌కు గిరాకీ:** 2035 కల్లా సుమారు 35 శాతం పెరగొచ్చు. విద్యుదుత్పత్తి సామర్థ్యం మూడింతలు పెరిగి 1,400 గిగావాట్లకు పెరగొచ్చు.

బొగ్గుదే ఆధిపత్యం..

- రాబోయే దశాబ్దాల్లోనూ విద్యుదుత్పత్తిలో బొగ్గు విభాగానిదే ప్రధాన వాటా. 2030 నాటికి బొగ్గు ద్వారా విద్యుదుత్పత్తి 15% పెరిగే అవకాశం ఉంది.
- సౌర విద్యుదుత్పత్తితో పోలిస్తే బొగ్గు ద్వారా విద్యుదుత్పత్తే 30% అధికంగా ఉండే అవకాశం.

3 ప్రపంచంలో ఇంధనాన్ని అధికంగా వినియోగిస్తున్న, దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో భారత్ స్థానం

3 2028 కల్లా ఆర్థిక వ్యవస్థ పరిమాణంలో భారత్ చేరనున్న స్థానం

5 ప్రపంచంలో కార్ల విపణి పరంగా భారత్ స్థానం

2023లో

- ప్రపంచంలో ఐదో దిగ్గజ ఆర్థిక వ్యవస్థగా భారత్
- అత్యంత వేగవంత వృద్ధిని నమోదు చేసిన దేశమూ ఇదే.
- జనాభా సంఖ్యలోనూ చైనాను భారత్ అధిగమించింది.

విద్యుత్ వాహనాల సంఖ్య పెరిగినా..

విద్యుత్ వాహనాల సంఖ్య పెరుగుతున్నప్పటికీ.. అదే స్థాయిలో సంప్రదాయ ఇంధన ఇంజిన్ వాహనాల వృద్ధి ఉంటుండటంతో, 2035 కల్లా రోడ్డు రవాణాకు సంబంధించి చమురు గిరాకీ 40% మేర పెరగొచ్చు. చమురు దిగుమతులపై ఆధారపడటం పెరిగేందుకూ ఇది దారితీయొచ్చు.

- దిల్లీ



6 నెలల్లో అందరికీ కనెక్టివిటీ

టెలికాం సంస్థలకు మంత్రి సింధియా పిలుపు



దిల్లీ: వచ్చే 6 నెలల్లో అందరికీ కనెక్టివిటీ కల్పించడం, ఇంటి కనెక్షన్లకు ఫైబర్‌ను విస్తరించడం, టెలికాం నెట్‌వర్క్‌లను సురక్షితంగా మార్చి, మోసాలను నివారించడం, టెలికాం తయారీ జోన్ల ఏర్పాటు, డేటా సెంటర్లు, హరిత ఇంధన వినియోగం వంటి లక్ష్యాలను సాధించాలని టెలికాం సంస్థలను మంత్రి జ్యోతిరాదిత్య సింధియా కోరారు. భారతీ ఎయిర్‌టెల్, జియో, వొడాఫోన్ ఐడియా మేనేజింగ్ డైరెక్టర్లతో పాటు క్వాల్‌కామ్ ఇండియా ప్రెసిడెంట్, మీడియాటెక్ కంట్రీ హెడ్, సెల్యులార్ ఆపరేటర్ల సంఘం డైరెక్టర్ జనరల్ ఎస్‌పీ కొచ్చర్ తదితరులతో మంత్రి బుధవారం సమావేశమయ్యారు.

నేరుగా పరికరాలకే శాటిలైట్ నుంచి సేవలు.. బీఎస్ఎన్ఎల్: శాటిలైట్ నుంచి నేరుగా పరికరాలకు కమ్యూనికేషన్ సేవలను దేశంలో తొలిసారిగా పరీక్షించినట్లు శాటిలైట్ కమ్యూనికేషన్స్ కంపెనీ వియాశాట్ ప్రకటించింది. ప్రభుత్వరంగ బీఎస్ఎన్ఎల్‌తో కలిసి ఈ ప్రయోగం నిర్వహించామంది. రెండువైపులా మెసేజింగ్, ఎస్ఓఎస్ మెసేజింగ్ పరీక్షలను ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్‌తో చేసినట్లు వివరించింది. వియాశాట్ జియో స్టేషనరీ ఎల్ బ్యాండ్ శాటిలైట్లలో 36,000 కిలోమీటర్ల దూరంలో ఉన్నదానితో ఫోన్‌ను అనుసంధానించినట్లు పేర్కొంది.

5 నెలల కనిష్ఠానికి వాణిజ్య లోటు



దిల్లీ: రెండు నెలల పాటు తగ్గిన దేశ వాణిజ్య ఎగుమతులు సెప్టెంబరులో 0.5% పెరిగి 34.58 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. దిగుమతులు 2023 సెప్టెంబరు నాటి 54.49 బి. డాలర్ల నుంచి 1.6% పెరిగి 55.36 బి. డాలర్లకు చేరుకున్నాయి. ఫలితంగా వాణిజ్య లోటు 5 నెలల కనిష్ఠమైన 20.78 బి. డాలర్లకు పరిమితమైంది. బుధవారం విడుదల చేసిన అధికారిక గణాంకాల ప్రకారం.. వాణిజ్య లోటు (దిగుమతులు, ఎగుమతుల మధ్య వ్యత్యాసం) గతేడాది సెప్టెంబరులో 20.8 బి. డాలర్లుగా ఉంది. ఈ ఏడాది ఆగస్టులో ఇది 10 నెలల గరిష్ఠ స్థాయి అయిన 29.65 బి. డాలర్లుగా నమోదైంది.

✦ పసిడి దిగుమతులు గతేడాది సెప్టెంబరులో 4.11 బి. డాలర్లు కాగా, గత నెలలో 4.39 బి. డాలర్లకు పెరిగాయి. 2024-25 ప్రథమార్ధంలో ఇవి 6.9% పెరిగి 27 బి. డాలర్లకు చేరాయి.

✦ చమురు దిగుమతులు సెప్టెంబరులో 10.44% తగ్గినా.. ఏప్రిల్-సెప్టెంబరులో 5.91% పెరిగి 88.91 బి. డాలర్లకు చేరాయి.

✦ వెండి దిగుమతులు 2023 ఏప్రిల్-సెప్టెంబరులో 480.65 మి. డాలర్లు కాగా, ఈసారి నాలుగింతలు పెరిగి 2.29 బి. డాలర్లకు చేరాయి.

✦ ఏప్రిల్-సెప్టెంబరులో ఎగుమతులు 1% వృద్ధితో 213.22 బి. డాలర్లకు, దిగుమతులు 6.16% పెరిగి 350.66 బి. డాలర్లకు చేరడంతో వాణిజ్యలోటు 137.44 బి. డాలర్లుగా నమోదైంది.

కోడి గుడ్డు

17న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	480
వరంగల్	482
విజయవాడ	505
గోదావరి	505
విశాఖపట్నం	505
చిత్తూరు	538

రూ.10,000లోపు 5జీ స్మార్ట్‌ఫోన్‌లో క్వాల్‌కామ్ చిప్‌సెట్



దిల్లీ: దేశీయంగా 5జీ స్మార్ట్‌ఫోన్లను రూ.10,000 లోపు శ్రేణిలో ఆవిష్కరించేందుకు చిప్‌సెట్ సంస్థ క్వాల్‌కామ్, చైనా మొబైల్ కంపెనీ షియామీ చేతులు కలిపాయి. భారీ విపణి అయిన భారత్‌లో ఈ తరహా స్మార్ట్‌ఫోన్లను ఆవిష్కరించి, విజయవంతం అయ్యాక.. అంతర్జాతీయంగా విక్రయిస్తామని ప్రకటించాయి. క్వాల్‌కామ్ చిప్‌సెట్లు కలిగిన కొన్ని స్మార్ట్‌ఫోన్ల ధరలు రూ.10,000 లోపే ఉండటాన్ని ప్రస్తావిస్తూ, అవి పాత మోడళ్లని.. ఆఫర్ల వల్ల తగ్గాయని క్వాల్‌కామ్ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శావి సోయిన్ తెలిపారు. కొత్తగా రెడ్‌మీ ఏ4 స్మార్ట్‌ఫోన్‌ను 5జీ సాంకేతికతతో, తమ చిప్‌సెట్ స్నాప్‌డ్రాగన్ 4ఎస్ జెన్2తో విడుదల చేసినట్లు ఇండియన్ మొబైల్ కాంగ్రెస్‌లో చెప్పారు.

ఎల్‌టీటీఎస్‌లో 2,000 ఉద్యోగాలు

మధ్యంతర డివిడెండు రూ.17

ముంబయి: ఇంజినీరింగ్ సేవల సంస్థ ఎల్ అండ్ టీ టెక్నాలజీ సర్వీసెస్ (ఎల్‌టీటీఎస్) 2024-25 సెప్టెంబరు త్రైమాసికంలో రూ.319.6 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2023-24 ఇదే త్రైమాసికంలో సంస్థ లాభం రూ.315.4 కోట్ల కంటే, ఇది 1.3% ఎక్కువ. ఆదాయాలు 7.8% వృద్ధితో రూ.2,572.9 కోట్లకు పెరిగాయి. 2024-25లో 8-10% ఆదాయ వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కంపెనీ ఎండీ, సీఈఓ అమిత్ చాధా పేర్కొన్నారు. కార్యకలాపాల మార్జిన్ 17.1% నుంచి 15.1 శాతానికి తగ్గింది. ఆర్థిక సంవత్సరం మొత్తంమీద దీనిని 16% చేస్తామనే ధీమాను వ్యక్తం చేశారు.

ఈ నెల నుంచే వేతన పెంపులు: ఏడాది వారీ వేతన పెంపు ప్రక్రియను అక్టోబరులో మొదలుపెట్టనున్నట్లు ఆయన తెలిపారు. 2024-25లో 2,000 మంది తాజా ఉత్తీర్ణులను (ఫ్రెషర్స్) నియమించుకోనున్నట్లు చెప్పారు. ఇప్పటికే నియామక ఆఫర్లు ఇస్తున్నట్లు వెల్లడించారు. సమీక్షా త్రైమాసికంలో నికరంగా ఉద్యోగుల సంఖ్య 121 పెరిగి 23,698కి చేరింది. వలసల రేటు 14.3 శాతానికి పరిమితమైంది. మధ్యంతర డివిడెండుగా ఒక్కో షేరుకు రూ.17ను కంపెనీ ప్రకటించింది. రికార్డు తేదీ అక్టోబరు 25.

31% తగ్గిన బజాజ్ ఆటో లాభం

దిల్లీ: జులై-సెప్టెంబరులో బజాజ్ ఆటో రూ.1,385 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2023-24 ఇదే కాల లాభం రూ.2,020 కోట్లతో పోలిస్తే ఇది 31% తక్కువ. మొత్తం ఆదాయం రూ.10,838 కోట్ల నుంచి రూ.13,247 కోట్లకు చేరింది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ 12,21,504 వాహనాలను విక్రయించింది. 2023-24 జులై-సెప్టెంబరులో అమ్మిన 10,53,953 వాహనాలతో పోలిస్తే ఇవి 16% అధికం. బజాజ్ ఆటో పూర్తి స్థాయి అనుబంధ సంస్థ బజాజ్ బ్రెజిల్ ఈక్విటీ మూలధనంలో అదనపు పెట్టుబడులు పెట్టేందుకు బోర్డు ఆమోదం తెలిపింది.

అంచనాల కంటే తక్కువగా పండగ విక్రయాలు: ఈ పండగ సీజన్‌లో మోటార్‌సైకిళ్ల విక్రయాలు అంచనాల కంటే తక్కువగా ఉన్నాయని బజాజ్ ఆటో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాకేశ్ శర్మ తెలిపారు. అమ్మకాలలో గతేడాదితో పోలిస్తే 3-5% వృద్ధి లభిస్తే పరిశ్రమ అదృష్టం చేసుకున్నట్లేనని చెప్పారు. దీపావళి వరకు మరో 15 రోజులు అవకాశం ఉందన్నారు. పూర్తి ఆర్థిక సంవత్సరానికి మొత్తం ద్విచక్ర వాహన పరిశ్రమపై ఈ అమ్మకాలు ప్రభావం చూపుతాయన్నారు.

జీఎస్‌టీలో పరిహారం సుంకం విలీనానికి రాష్ట్రాల మొగ్గు

మంత్రుల బృందం మొదటి సమావేశంలో చర్చ

దిల్లీ: పరిహారం సుంకాన్ని వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ)లో విలీనం చేసే అంశంపై కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధ్రి నేతృత్వంలో ఏర్పాటైన మంత్రుల బృందం బుధవారం చర్చించింది. జీఎస్‌టీలో పరిహారం సుంకాన్ని విలీనం చేయాలని నిర్ణయం తీసుకుంటే, ఆ ప్రక్రియ జరిగే సమయంలో విలాసవంత, హానికారక వస్తువుల జాబితాలో కొత్త వస్తువులను చేర్చకూడదని సమావేశంలో రాష్ట్రాలు సూచించాయి. పరిహారం సుంకం గడువు 2026 మార్చితో ముగియనుంది. అందువల్ల జీఎస్‌టీలో ఈ సుంకాన్ని విలీనం చేయడమే మార్గమని రాష్ట్రాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రస్తుతం సుంకం విధిస్తున్న వస్తువులకు ప్రత్యేక పన్ను రేట్లు నిర్ణయించాలని సూచిస్తున్నాయి. ‘పరిహార సుంకంగానే దీనిని కొనసాగించాలా? పన్నుగా మార్చాలా? విలాసవంత, హానికారక వస్తువుల జాబితాలో ఏమైనా మార్పులు చేయాలా? అనే అంశాలపై చర్చ జరుగుతోందని మంత్రి పంకజ్ చెప్పారు. పరిహారం సుంకంపై మంత్రుల బృందం తదుపరి సమావేశం నవంబరు రెండో వారంలో జరగనుంది. అయితే రాష్ట్రాలన్నీ పరిహారం సుంకాన్ని జీఎస్‌టీలో విలీనం చేయాలనే సూచించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. మంత్రుల బృందం తన నివేదికను డిసెంబరు 31 కల్లా జీఎస్‌టీ మండలికి సమర్పించాల్సి ఉంది.

సగానికి తగ్గిన భారత్‌పే నష్టాలు

దిల్లీ: 2023-24లో భారత్‌పే గ్రూప్ ఏకీకృత నష్టాలు 50% తగ్గి రూ.474 కోట్లకు పరిమితమయ్యాయి. 2022-23లో ఇవి రూ.941 కోట్లుగా ఉన్నాయి. ఇదే సమయంలో కార్యకలాపాల ద్వారా వచ్చిన ఏకీకృత ఆదాయాలు రూ.1029 కోట్ల నుంచి 39% వృద్ధి చెంది రూ.1426 కోట్లకు చేరుకున్నాయి. రుణ విభాగాన్ని విస్తరించడంపై దృష్టి పెట్టనున్నట్లు కంపెనీ సీఈఓ నలిన్ నేగి తెలిపారు.

క్రిసిల్ మూడో మధ్యంతర డివిడెండు రూ.15

దిల్లీ: రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్, సెప్టెంబరు త్రైమాసికంలో రూ.171.55 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2023-24 ఇదే మూడు నెలల లాభం రూ.152 కోట్లతో పోలిస్తే ఇది 13 శాతం అధికం. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.771.84 కోట్ల నుంచి రూ.833 కోట్లకు పెరిగింది. 2024 ఇక డిసెంబరు 31తో ముగిసే ఆర్థిక సంవత్సరానికి, రూ.1 ముఖ విలువ గల ఒక్కో షేరుకు రూ.15 చొప్పున మూడో మధ్యంతర డివిడెండు ఇవ్వడానికి బోర్డు డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. జెన్ ఏఐ వంటి కొత్త తరం సాంకేతికతలపై పెట్టుబడులు పెడుతున్నట్లు కంపెనీ ఎండీ, సీఈఓ అమిశ్ మెహతా పేర్కొన్నారు.

సౌత్ ఇండియన్ బ్యాంక్ లాభంలో 18% వృద్ధి

ముంబయి: సౌత్ ఇండియన్ బ్యాంక్ నికర లాభం సెప్టెంబరు త్రైమాసికంలో రూ.325 కోట్లుగా నమోదైంది. 2023-24 ఇదే త్రైమాసిక లాభం రూ.275 కోట్లతో పోలిస్తే ఇది 18% అధికం. ట్రెజరీ, ఫారెక్స్ లాభాలు రూ.106 కోట్లకు చేరడం ఇందుకు ఉపకరించింది. బ్యాంకు నికర వడ్డీ ఆదాయం 6% పెరిగి రూ.882 కోట్లకు చేరుకుంది. రుణాలు 13% పెరగడం కలిసొచ్చింది. నికర వడ్డీ మార్జిన్ 0.07% తగ్గి 3.24 శాతంగా నమోదైంది. స్థూల నికర నిరర్థక ఆస్తులు 4.96% నుంచి 4.4 శాతానికి తగ్గాయి. తాజాగా ఒత్తిడికి గురైన ఆస్తులు మార్పు లేకుండా రూ.3,731 కోట్లుగా ఉన్నాయి. ప్రొవిజన్ కవరేజీ నిష్పత్తిని 80% పైగా చేర్చుకునే దృష్టితో బ్యాంక్ ఉండడంతో, మొత్తం కేటాయింపులు రెట్టింపై రూ.116 కోట్లకు చేరాయి. ఆటోమేషన్ ప్రభావంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 9,962 నుంచి 9,667కు తగ్గిందని బ్యాంకు సీఈఓ పీఆర్ శేషాద్రి పేర్కొన్నారు.

✦ క్రెడిట్‌కార్డులు, వ్యక్తిగత రుణాలు సహా పూచీకత్తు లేని రుణాల మొత్తం 5% లోపే ఉన్నాయని తెలిపారు.

భారీ మిథనాల్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలి

- అపుడే ముడిచమురు దిగుమతులు తగ్గుతాయ్
- 50 లక్షల ఉద్యోగాలొస్తాయ్
- నీతి ఆయోగ్ సభ్యులు వీకే సరస్వత్




దిల్లీ: మన దేశం ముడిచమురు దిగుమతులు తగ్గించుకునేందుకు, భారీ స్థాయిలో మిథనాల్ ప్లాంట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని నీతి ఆయోగ్ సభ్యులు వీకే సరస్వత్ బుధవారం వెల్లడించారు. భవిష్యత్తులో భారత్.. బొగ్గు ఆధారిత విద్యుత్తు ప్లాంట్లపై ఆధారపడటం తగ్గుతుందని తెలిపారు. మిథనాల్ తయారీకి పరిశ్రమ ముందుకు రావాలని కోరారు. మిథనాల్ అనేది స్వచ్ఛ ఇంధనం. భారీ వాణిజ్య వాహనాల్లోనూ ఇంధనంగా మిథనాల్‌ను వినియోగించొచ్చని సరస్వత్ పేర్కొన్నారు. కొచిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (సీఎస్ఎల్) మిథనాల్‌తో నడిచే నౌకను తయారు చేయాలని ఒక విదేశీ కంపెనీకి ఆర్డర్ ఇచ్చినట్లు తెలిపారు. రెండో అంతర్జాతీయ మిథనాల్ సెమినార్, ఎక్స్‌పో 2024కు నీతి ఆయోగ్ ఆతిథ్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. న్యూ దిల్లీలోని మానెక్షా సెంటర్‌లో ఈ నెల 17-18 తేదీల్లో ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. మిథనాల్ ఆర్థిక వ్యవస్థ దేశీయంగా 50 లక్షల ఉద్యోగాలను సృష్టించగలదని నీతి ఆయోగ్ అంచనా వేసింది.

మన దేశంలో మిథనాల్ వినియోగానికి కార్యాచరణ 2016 సెప్టెంబరులో మొదలైంది. అప్పట్లో యూఎస్ఏలోని మిథనాల్ ఇన్‌స్టిట్యూట్‌తో కలిసి నీతి ఆయోగ్ తొలి సెమినార్ నిర్వహించింది. 8 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు సెమినార్, ఎక్స్‌పోకు ఆతిథ్యం ఇస్తోంది. అంతర్జాతీయంగా మిథనాల్ ఉత్పత్తికి సంబంధించిన ప్రాజెక్టుల పురోగతి, ఉత్పత్తులు, ఆర్ అండ్ డీ కార్యక్రమాలు, అనుబంధ సాంకేతిక అభివృద్ధి వంటి వాటిని ఇక్కడ ప్రధానంగా ప్రస్తావించనున్నారు. రవాణా, షిప్పింగ్, విద్యుత్ ఉత్పత్తికి ప్రత్యామ్నాయ స్వచ్ఛ ఇంధనంగా మిథనాల్‌ను వినియోగించాలనే దానిపై ఈ సెమినార్‌లో దృష్టి సారించనున్నారు. కిర్లోస్కర్, అశోక్ లేలాండ్, వోల్వో పెంటా, ఎఫ్‌సీటెక్‌ఎనర్జీ, వెస్‌మ్యాన్ థర్మల్ ప్రాసెస్, మెట్‌ఫ్యూయెల్, థెర్మాక్స్, బీహెచ్ఈఎల్, ఎన్‌టీపీసీ, ఎన్ఎంఆర్ఎల్ వంటి డిఫెన్స్ ల్యాబ్‌లు 100% మిథనాల్‌తో నడిచే బస్సులు, ట్రక్కులు, తేలికపాటి వాణిజ్య వాహనాలు, జెన్‌సెట్లు, ఫ్యూయెల్ సెల్ అండ్ ఎనర్జీ అప్లికేషన్లు, బాయిలర్లు, గ్యాస్ టర్బైన్లు, ఇతర కట్టింగ్-ఎడ్జ్ అప్లికేషన్లను అభివృద్ధి చేశాయి. ఆయా ఉత్పత్తులు, సాంకేతికతలను ఈ ఎక్స్‌పోలో ప్రదర్శించనున్నారు. అంతర్జాతీయ ప్రమాణాల ఆధారంగా మిథనాల్ ఉత్పత్తి, వినియోగంపై ప్రభుత్వం నియంత్రణపరమైన పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేస్తోందని సరస్వత్ వెల్లడించారు. ప్రస్తుతం దేశీయ మిథనాల్ ఉత్పత్తి 0.7 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉంది. గిరాకీ మాత్రం 4.0 మిలియన్ టన్నులుగా ఉండటం గమనార్హం.

27,867కు నిఫ్టీ!

- వచ్చే 12 నెలల్లో చేరొచ్చు
- అంతర్జాతీయ బ్రోకరేజీ పీఎల్ క్యాపిటల్ అంచనా



దిల్లీ: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) ప్రామాణిక సూచీ అయిన నిఫ్టీ-50 వచ్చే 12 నెలల్లో 27,867 పాయింట్ల స్థాయికి చేరొచ్చని అంతర్జాతీయ బ్రోకరేజీ సంస్థ పీఎల్ క్యాపిటల్ ఎల్ఎల్‌సీ పేర్కొంది. దేశీయంగా బలమైన మూలాలు.. అంతర్జాతీయంగా అనిశ్చితుల నేపథ్యంలో, అటు ఆశావహ దృక్పథం – ఇటు అప్రమత్తత కనిపించనున్నాయని పేర్కొంది. ప్రస్తుతం నిఫ్టీ 25,000 స్థాయిలో కదలాడుతోంది. ‘ఫెస్టివ్ ఆప్టిమిజమ్ అమిడ్స్ జియోపొలిటికల్ అన్‌సర్టనిటీ’ అనే నివేదికలోని ఇతర అంచనాలు ఇలా..

వచ్చే 12 నెలల్లో నిఫ్టీ-50కి లక్ష్యాలు

అంశం	అంతక్రితం లక్ష్యం	తాజా లక్ష్యం
సాధారణ పరిస్థితుల్లో	26,820	27,867
బుల్ రన్ ఉంటే	28,564	29,260
బేర్ పట్టు కనిపిస్తే	24,407	25,080

ఈ రంగాలను పరిశీలించొచ్చు..

❖ యంత్రపరికరాలు ❖ నౌకాశ్రయాలు ❖ మౌలిక ❖ ఆసుపత్రులు ❖ పర్యాటకం ❖ కొత్త ఇంధనం ❖ ఇ-కామర్స్ ❖ టెలికాం

(షేర్లు సహేతుక ధరల వద్ద ఉన్నందున)

సెప్టెంబరు త్రైమాసికంలో రాణించే రంగాలు


❖ ఆసుపత్రులు; ❖ ఔషధాలు
❖ యంత్రపరికరాలు; ❖ రసాయనాలు
(బలమైన ఎబిటా నమోదుకావొచ్చు)
❖ వాహన; ❖ బ్యాంకులు
❖ మన్నికైన వినియోగదారు వస్తువులు
(రెండంకెల వృద్ధికి అవకాశం)

ఈ రంగాల్లో ప్రజల ఖర్చులు కొనసాగుతాయ్

❖ ప్రయాణాలు ❖ గృహ కొనుగోళ్లు ❖ ఆభరణాలు ❖ ద్విచక్ర వాహనాలు

వీటికి సవాళ్లు: ప్రయాణికుల వాహనాలు(పీవీ) ❖ క్విక్ సర్వీస్ రెస్టారెంట్లు ❖ దుస్తులు ❖ పాదరక్షలు ❖ నిర్మాణ సామగ్రి

25,000 పాయింట్ల దిగువకు నిఫ్టీ



ఎఫ్ఐఐల విక్రయాలు: రూ.3,435.94 కోట్లు

డీఐఐల కొనుగోళ్లు: రూ.2,256.29 కోట్లు

సెన్సెక్స్ ▼ 319 **81501**

నిఫ్టీ ▼ 86 **24971**

ఐటీ, వాహన షేర్లలో విక్రయాలతో బుధవారం సూచీలు నష్టపోయాయి. విదేశీ మదుపర్ల అమ్మకాలు కొనసాగడం, అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన ధోరణులు ప్రభావం చూపాయి. దీంతో సెన్సెక్స్ 319 పాయింట్లు, నిఫ్టీ 86 పాయింట్లు కోల్పోయాయి. బ్యారెల్ ముడి చమురు 0.08% పెరిగి 74.32 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 2 పైసలు పెరిగి 84.02 వద్ద ముగిసింది. ఆసియా మార్కెట్లలో సియోల్, టోక్యో, హాంకాంగ్ నష్టపోగా, షాంఘై లాభపడింది. ఐరోపా మార్కెట్లు ప్రతికూలంగా కదలాడాయి.

సెన్సెక్స్ ఉదయం 81,646.60 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,820.12 పాయింట్లు) నష్టాల్లో ప్రారంభమైంది. తర్వాత స్వల్పంగా లాభపడి 81,932.15 పాయింట్లకు చేరింది. మళ్లీ అమ్మకాల ఒత్తిడితో ఒకదశలో 81,358.26 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడింది. చివరకు 318.76 పాయింట్ల నష్టంతో 81,501.36 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 86.05 పాయింట్లు తగ్గి 24,971.30 పాయింట్ల వద్ద స్థిరపడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 22 నష్టపోయాయి. ఎం అండ్ ఎం 2.87%, ఇన్ఫోసిస్ 2%, అదానీ పోర్ట్స్ 1.20%, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 1.13%, టాటా మోటార్స్ 1.13%, టైటన్ 1.11%, కోటక్ బ్యాంక్ 1.10%, ఐటీసీ 1.07%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 1.03%, ఐసీఐసీఐ బ్యాంక్ 0.99%, టెక్ మహీంద్రా 0.95%, నెస్లే ఇండియా 0.91%, బజాజ్ ఫైనాన్స్ 0.80%, పవర్‌గ్రిడ్ 0.77% మేర పడ్డాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.92%, భారతీ ఎయిర్‌టెల్ 0.91%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.75% చొప్పున రాణించాయి.

✦ సెప్టెంబరు త్రైమాసికంలో నికర లాభం 18% పెరగడంతో **సౌత్ ఇండియన్ బ్యాంక్** షేరు బీఎస్ఈలో 6.51% లాభపడి రూ.25.51 వద్ద ముగిసింది.

✦ అమెరికా ఎన్నికల తర్వాత, **అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్** 1.2 బిలియన్ డాలర్ల (సుమారు రూ.10,000 కోట్ల) బాండ్లను జారీ చేయాలని నిర్ణయించింది. ప్రస్తుత బలహీన మార్కెట్ పరిస్థితుల నేపథ్యంలో, ఈ బాండ్ల జారీ ప్రక్రియను వాయిదా వేసినట్లు పేర్కొంది.

✦ **రతన్ టాటా మరణంపై ఆర్‌బీఐ బోర్డు సంతాపం:** పారిశ్రామిక దిగ్గజం, మానవతామూర్తి రతన్ టాటా అస్తమయంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కేంద్ర డైరెక్టర్ల బోర్డు బుధవారం నిర్వహించిన 611వ సమావేశంలో సంతాప తీర్మానాన్ని ఆమోదించింది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను సమీక్షించినట్లు బోర్డు తెలిపింది.

✦ **వారీ ఎనర్జీస్ ఐపీఓ ధరల శ్రేణి రూ.1,427–1,503:** సోలార్ ప్యానెల్ తయారీ సంస్థ వారీ ఎనర్జీస్ రూ.4,321.44 కోట్ల తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు ధరల శ్రేణిని రూ.1,427-1,503గా నిర్ణయించారు. ఈ ఐపీఓ ఈ నెల 21-23 తేదీల్లో రానుంది. యాంకర్ మదుపర్లు ఈనెల 18న బిడ్లు దాఖలు చేసుకోవచ్చు. ఈ ఇష్యూలో రూ.3,600 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనున్నారు. రూ.721.44 కోట్ల విలువైన 48 లక్షల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో ప్రమోటర్, ప్రస్తుత వాటాదార్లు విక్రయించనున్నారు. రూ.65 కోట్ల విలువైన షేర్లను ఉద్యోగులకు రిజర్వ్ చేశారు.

నేటి బోర్డు సమావేశాలు: ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, విప్రో, నెస్లే ఇండియా, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ, హావెల్స్, ఐఓబీ, జిందాల్ స్టెయిన్‌లెస్, టాటా కమ్యూనికేషన్స్, సెంట్రల్ బ్యాంక్, టాటా కెమికల్స్, కరూర్ వైశ్యా బ్యాంక్, సియెట్, తాన్లా ప్లాట్‌ఫామ్స్, జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ధనలక్ష్మి బ్యాంక్

✦ **రిలయన్స్ బోనస్ షేర్ల జారీకి రికార్డు తేదీ అక్టోబరు 28:** ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) బోర్డు 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్ల జారీకి ఈ నెల 28ని రికార్డు తేదీగా ప్రకటించింది.

ఈనాడు సినిమా

ఓజీ షురూ


పవన్ కల్యాణ్

అగ్ర కథానాయకుడు పవన్‌కల్యాణ్ సినిమాలు ఒకదానివెంట మరొకటి వరుసగా పునః ప్రారంభం అవుతున్నాయి. 'హరి హర వీరమల్లు' చిత్రీకరణ ఇప్పటికే ఊపందుకుంది. విజయవాడలో కీలక సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నారు. త్వరలోనే 'ఓజీ' సెట్‌లోకీ అడుగు పెట్టనున్నారు పవన్‌కల్యాణ్. సుజీత్ దర్శకత్వం వహిస్తున్న 'ఓజీ' చిత్రీకరణని పునః ప్రారంభించినట్టు నిర్మాణ సంస్థ ప్రకటించింది. రామోజీ ఫిల్మ్‌సిటీలో కథానాయకుడు లేని కొన్ని కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. 'హరిహర వీర మల్లు' పూర్తయిన తర్వాత, పవన్‌కల్యాణ్ 'ఓజీ' సెట్లోకి అడుగు పెట్టనున్నారు. ఈ రెండు సినిమాలు వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. ఎన్నికల కారణంగా గతేడాది వీటి చిత్రీకరణ నిలిచిపోయిన విషయం తెలిసిందే. వీటితోపాటు 'ఉస్తాద్ భగత్‌సింగ్' కూడా పూర్తి చేయాల్సి ఉంది పవన్. ఆయన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే, మధ్యలో సినిమాలకి సమయం కేటాయిస్తున్నారు.

అనుపమ 'డ్రాగన్'



ఈ ఏడాది 'టిల్లు స్క్వేర్'తో కుర్రకారుని ఉర్రూతలూగించింది అందాల తార అనుపమ పరమేశ్వరన్. ప్రస్తుతం కథల ఎంపికలో జోరు ప్రదర్శిస్తున్న ఈ భామ.. ఇప్పుడు మరో కొత్త కథతో సినీప్రియుల్ని మెప్పించడానికి ముస్తాబవుతోంది. ఆమె, తమిళ కథానాయకుడు ప్రదీప్ రంగనాథన్ జంటగా నటిస్తున్న చిత్రం 'డ్రాగన్'. 'ఓ మై కడవులే' ఫేమ్ అశ్వత్ మారిముత్తు దీన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమాను అధికారికంగా ప్రకటిస్తూ.. ఫస్ట్‌లుక్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది అనుపమ. ఇందులో కీర్తి పాత్రలో కనిపించనుందామె. రొమాంటిక్ కామెడీ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కల్పతి ఎస్. సురేశ్, కల్పతి ఎస్.గణేశ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. త్వరలో విడుదల తేదీని ప్రకటించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 'పరదా', 'బైసన్', 'లాక్‌డౌన్' లాంటి చిత్రాలతో బిజీగా ఉంది అనుపమ.

అఖండ తాండవం


రామ్ ఆచంట, నారా బ్రాహ్మణి, బోయపాటి శ్రీను, బాలకృష్ణ, ఎం.తేజస్విని, గోపీ ఆచంట


'ఉగ్రభూతాలు ఊరిమీద పడితే చూస్తూ ఊరుకోవడానికి ఈ నేల అసురుడిది కాదురా.. ఈశ్వరుడిది... పరమేశ్వరుడిది! కాదని దాన్ని తాకితే జరిగేది తాండవం... అఖండ తాండవం' అంటూ కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టారు నందమూరి బాలకృష్ణ. ఆయన కథానాయకుడిగా నటించిన 'అఖండ'కి కొనసాగింపుగా 'అఖండ 2 తాండవం' పేరుతో రూపొందుతున్న చిత్రమిది. బోయపాటి శ్రీను దర్శకత్వం వహిస్తున్నారు. 'సింహా', 'లెజెండ్', 'అఖండ' చిత్రాలతో వరుసగా సంచలన విజయాల్ని సొంతం చేసుకున్న బాలకృష్ణ - బోయపాటి శ్రీను కలయికలో రూపొందుతున్న నాలుగో చిత్రమిది. ప్రగ్యా జైస్వాల్ కథానాయికగా నటిస్తోంది. 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీఆచంట నిర్మిస్తున్నారు. ఎం.తేజస్విని నందమూరి సమర్పకులు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి బాలకృష్ణ కుమార్తెలు నారా బ్రాహ్మణి క్లాప్‌నివ్వగా, ఎం.తేజస్విని నందమూరి కెమెరా స్విచ్చాన్ చేశారు. కథలో ఆధ్యాత్మిక అంశాల్ని తెలిపే టైటిల్ థీమ్‌ని నందమూరి రామకృష్ణ ఆవిష్కరించారు. తొలి సన్నివేశంలో భాగంగా బాలకృష్ణ 'తాండవం.. అఖండ తాండవం' అంటూ ముగిసే శక్తిమంతమైన సంభాషణని చెప్పారు. "మరోసారి నందమూరి బాలకృష్ణని బలమైన పాత్రలో చూపించడం కోసం లార్జర్ దేన్ లైఫ్ తరహా కథ, పాత్రలతో స్క్రిప్ట్‌ని సిద్ధం చేశారు బోయపాటి శ్రీను. ఈ కలయికలో రూపొందుతున్న అత్యంత భారీ చిత్రమిది. త్వరలోనే రెగ్యులర్ చిత్రీకరణని ప్రారంభిస్తామ"ని సినీ వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి సంగీతం: తమన్, ఛాయాగ్రహణం: సి.రాంప్రసాద్, సంతోశ్ డి. డెటాకే, కళ: ఎ.ఎస్.ప్రకాశ్, కూర్పు: తమ్మిరాజు.

త్రిముఖ వ్యూహం


సాయి దుర్గా తేజ్, యోగేశ్

యోగేశ్, ఆకృతి అగర్వాల్ జంటగా రాజేశ్ నాయుడు దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'త్రిముఖ'. నాజర్, సన్నీలియోని ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా మోషన్ పోస్టర్‌ని యువ కథానాయకుడు సాయిదుర్గా తేజ్ ఆవిష్కరించారు. మలుపులున్న ఈ కథలో ప్రధాన పాత్రల వ్యూహాలు ఆసక్తిని రేకెత్తిస్తాయన్నారు దర్శకుడు. "ఉత్కంఠ భరితంగా సాగే కథ, కథనాలతో రూపొందుతున్న చిత్రమిది. తొలి సినిమాలోనే నటనకి ప్రాధాన్యమున్న పాత్రని పోషించడం, త్రిముఖ మోషన్ పోస్టర్ సాయి దుర్గా తేజ్ చేతులమీదుగా విడుదల కావడం ఆనందంగా ఉంది" అన్నారు కథానాయకుడు. అషురెడ్డి, శ్రీవాస్తవ, యోగేశ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ప్రభాకర్ రెడ్డి, సంగీతం: వినోద్ యాజమాన్య.

దెయ్యం పెంచి పోషించిన కమాండో


పృథ్వీరాజ్ సుకుమారన్

దర్శకుడిగా, నటుడిగా శక్తిమంతమైన కథలతో ప్రయాణం చేస్తున్నారు కథానాయకుడు పృథ్వీరాజ్ సుకుమారన్. ఇటీవలే 'ఆడు జీవితం' అనే సర్వైవల్ థ్రిల్లర్‌లో తనదైన నటనతో అందరి దృష్టినీ ఆకర్షించారాయన. ప్రస్తుతం నటుడిగా పలు చిత్రాలతో తీరిక లేకుండా గడుపుతున్న పృథ్వీరాజ్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఎల్2:ఎంపురాన్'. అగ్రకథానాయకుడు మోహన్‌లాల్ ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రమిది. బుధవారం పృథ్వీరాజ్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఇందులో ఆయన పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది చిత్రబృందం. "దేవుడు వదిలిపెట్టినా.. దెయ్యం మాత్రం ఆయన్ను పెంచి పోషించింది. అతనే అంతిమ యుద్ధానికి సిద్ధమైన.. జాయెద్ మసూద్ చక్రవర్తి జనరల్" అని వ్యాఖ్యల్ని జోడించింది. ఇందులో చేతిలో తుపాకీ పట్టుకుని ధైర్యసాహసాలున్న కమాండోగా కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు పృథ్వీరాజ్. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో టొవినో థామస్, మంజు వారియర్ తదితరులు నటిస్తున్నారు.

శర్వానంద్ 38 సన్నాహాలు


శర్వానంద్

'శర్వానంద్ 38'వ చిత్రానికి సంపత్ నంది దర్శకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. కేకే రాధామోహన్ నిర్మాత. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణను మొదలు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా బుధవారం సెట్ వర్క్‌ను ప్రారంభించినట్లు తెలిపింది చిత్రబృందం. ఇందులో భాగంగా ఆర్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ మన్నె ఆధ్వర్యంలో హైదరాబాద్ సమీపంలో 15 ఎకరాల్లో ఓ భారీ సెట్‌ను సిద్ధం చేస్తున్నారు. 60ల కాలం నాటి నేపథ్యంలో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో శర్వా మునుపెన్నడూ పోషించని పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది.

మ్యూజిక్ మ్యాజిక్


గౌతమ్ తిన్ననూరి

హిందీలో 'జెర్సీ' తీశాక, విజయ్ దేవరకొండతో సినిమాని పట్టాలెక్కించడానికి ముందు దొరికిన విరామంలోనే కొత్త తరంతో ఓ సినిమాని తెరకెక్కించారు దర్శకుడు గౌతమ్ తిన్ననూరి. అదే... 'మ్యాజిక్'. ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ రూపొందిస్తున్న ఈ సినిమాని డిసెంబరు 21న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య ఓ ప్రకటనలో తెలిపారు. మ్యూజికల్ డ్రామాగా రూపొందిన చిత్రమిది. ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ స్వరాలు సమకూరుస్తున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగానే సినిమా విడుదల తేదీని ప్రకటించారు. "కల నెరవేరాలంటే ముందు ప్రయత్నం చేయాలి. అలాంటి ప్రయత్నాన్ని ఓ అందమైన ప్రయాణంలా చూపించేదే ఈ సినిమా. కళాశాలలో జరుగుతున్న ఉత్సవం కోసం సొంతంగా ఒక పాటని స్వరపరచడానికి నలుగురు చేసిన ప్రయత్నం చుట్టూ తిరిగే ఈ కథలో యువతరాన్ని ఆకట్టుకునే అంశాలెన్నో ఉన్నాయి. ఓ సరికొత్త అనుభూతిని పంచుతూ, పేరుకి తగ్గట్టే ఈ చిత్రం థియేటర్లలో ప్రేక్షకుల్ని మాయ చేస్తుంద"ని సినీ వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: గిరీశ్ గంగాధరన్, కూర్పు: నవీన్ నూలి.

గ్రామీణ నేపథ్యంలో సాగే 'పొట్టేల్' కథకి... ప్రయోగాత్మకంగా పాశ్చాత్య పోకడలతో కూడిన సంగీతం అందించే ప్రయత్నం చేశానన్నారు సంగీత దర్శకుడు శేఖర్‌చంద్ర. మనసుల్ని హత్తుకునే ఈ సినిమాలో భావోద్వేగాలే కీలకమని, అవి మరింత బలంగా పండేలా సంగీతం ప్రభావం చూపిస్తుందన్నారు. ఆయన స్వరాలతో... యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల ప్రధాన పాత్రధారులుగా సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో రూపొందిన 'పొట్టేల్' ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు శేఖర్‌చంద్ర బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

కొత్త స్వరాలకి అవే స్ఫూర్తి


శేఖర్ చంద్ర

"ఈ మధ్య నేను చేసిన 'అంబాజీపేట మ్యారేజీబ్యాండ్' తర్వాత మరో గ్రామీణ కథా చిత్రమిదే. అయితే ఈ కథ నేపథ్యం కాస్త భిన్నం. చాలా సహజంగా, సన్నివేశం నుంచే పుట్టినట్టుగా సంగీతం ఉంటుంది. ఈ కథకి ఎలాంటి సౌండింగ్ చేయాలో ప్రత్యేకంగా పరిశోధన చేయాల్సి వచ్చింది. దర్శకుడు సాహిత్‌తో ఇదివరకు 'సవారి' చేశా. తను 'పొట్టేల్' కథ చెప్పినప్పుడు నాకు కన్నీళ్లొచ్చాయి. పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు ఎన్ని ఇబ్బందులైనా పడాల్సిందే అని చెప్పే కథ ఇది".

- "నిజాయతీతో కూడిన ఓ మంచి ప్రయత్నమిది. ఇప్పటికే పాటలకు మంచి స్పందన లభించింది. కాసర్ల శ్యామ్ పాటలన్నీ రాశారు. ప్రతి పాట కథతో ముడిపడి ఉంటుంది. ఓ మంచి ప్రేమ పాట, పల్లెటూరి పాట, చదువు పాట ఇలా మొత్తం నాలుగు పాటలున్నాయి".

- "నా పాటల్ని శ్రోతలు సొంతం చేసుకుని పాడుకుంటున్నప్పుడు, అవి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నప్పుడు ఓ సంగీత దర్శకుడిగా నాలో మరింత ఉత్తేజం కలుగుతుంది. కొత్త బాణీలకి ఆ ఉత్సాహమే స్ఫూర్తి. అగ్ర తారల సినిమాలు చేయాలనే కోరిక బలంగా ఉంది. కొన్ని సినిమాల్ని థియేటర్లో చూస్తున్నప్పుడు ఇలాంటివి నేను చేస్తే బాగుండేదే అనిపిస్తుంటుంది. ప్రపంచ సినిమా చూస్తూ ఎలాంటి పాటలొస్తున్నాయో, ఎలాంటి ట్రెండ్ నడుస్తోందో గమనిస్తూ నన్ను నేను అప్‌డేట్ చేసుకుంటుంటా. ప్రస్తుతం రాజ్‌తరుణ్, నవీన్‌చంద్ర, వరలక్ష్మీ శరత్‌కుమార్ చిత్రాలతో పాటు, తెలుగు - కన్నడ భాషల్లో ఓ సినిమా చేస్తున్నా".

ఇద్దరూ ఇద్దరే


సోనీ చరిష్ఠ

అర్జున్, జె.డి. చక్రవర్తి కథానాయకులుగా ఎస్.ఎస్.సమీర్ తెరకెక్కించిన చిత్రం 'ఇద్దరు'. రాధిక కుమారస్వామి, సోనీ చరిష్ఠ కథానాయికలు. మహమ్మద్ ఫర్హీన్ ఫాతిమ నిర్మాత. డి.ఎస్.రెడ్డి సమర్పకులు. ఈ చిత్రం ఈ నెల 18న రానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం బుధవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించింది. టి.ప్రసన్నకుమార్, ప్రతాని రామకృష్ణ గౌడ్, జె.వి.ఆర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దర్శకుడు మాట్లాడుతూ "యాక్షన్, డ్రామా ప్రధానంగా సాగే కథ ఇది. అర్జున్, జె.డి.చక్రవర్తి ఇద్దరూ ఇద్దరే అన్నట్టుగా పోటా పోటీగా నటించారు. ప్రముఖ దర్శకులు కె.విశ్వనాథ్ ఎంతో ఇష్టంగా చేసిన సినిమా ఇది. ఓ పాటలో ఆయన స్టెప్స్ కూడా వేశారు. ఆమిర్‌ఖాన్ తమ్ముడు ఫైజల్ ఖాన్ ఇందులో ఓ కీలక పాత్ర చేశారు" అన్నారు.

కొత్త రకమైన కాన్సెప్ట్‌తో వినోదం


కశ్వి, రామ్ కార్తీక్

అందరూ మెచ్చే ఓ మంచి థ్రిల్లర్ చిత్రం మా 'వీక్షణం' అన్నారు మనోజ్ పల్లేటి. ఆయన దర్శకత్వంలో రామ్ కార్తీక్, కశ్వి జంటగా రూపొందిన చిత్రమిది. పి.పద్మనాభ రెడ్డి, అశోక్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా చిత్రబృందం హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించింది. రామ్‌కార్తీక్ మాట్లాడుతూ "అందమైన స్క్రిప్ట్‌తో.. బలమైన సాంకేతికాంశాలతో రూపొందించిన చిత్రమిది. ఇందులోని ప్రతి పాత్ర ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "కొత్త రకమైన కాన్సెప్ట్‌తో తెరకెక్కించిన చిత్రమిది. కామెడీ, థ్రిల్... తదితర అంశాల మేళవింపుగా రూపొందించాం. థియేటర్‌కి వెళ్లిన ప్రేక్షకుల్ని నిరుత్సాహపరచకుండా వినోదం పంచుతుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో నటులు బిందు, శ్రీనివాస్, షైనింగ్ ఫణి, సంగీత దర్శకుడు సమర్థ్ గొల్లపూడి, ఛాయాగ్రాహకుడు సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

'డియర్ స్టూడెంట్స్'... టీచర్ వచ్చేశారు!


నయనతార

ఇటీవలే 'డియర్ స్టూడెంట్స్'.. అందాల భామ నయనతారకు స్వాగతం పలికిన సంగతి తెలిసిందే. కాలేజీ పిల్లల చుట్టూ తిరిగే ఈ వినోదాత్మక చిత్రాన్ని సందీప్ కుమార్, జార్జ్ ఫిలిప్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. నివిన్ పౌలీ కీలక పాత్ర పోషిస్తున్నారు. 'లవ్ యాక్షన్ డ్రామా' చిత్రం తర్వాత నివిన్, నయన జంటగా నటిస్తున్న చిత్రమిది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమా సెట్లోకి అడుగుపెట్టినట్లు తెలుపుతూ సామాజిక మాధ్యమాల వేదికగా ఓ ఫొటోను పంచుకుంది నయన. ఇందులో ఆమె విద్యా రుద్రన్ అనే టీచర్‌గా కనిపించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నయన జాబితాలో 'అమ్మోరు 2', 'టెస్ట్' తదితర చిత్రాలు ఉన్నాయి.

ఆల్ వి ఇమేజిన్ యాజ్ లైట్‌కు ఐదు నామినేషన్లు



కేన్స్ చిత్రోత్సవాల్లో గ్రాండ్ ప్రిక్స్ పురస్కారాన్ని సొంత చేసుకున్న మొదటి భారతీయ చిత్రంగా చరిత్ర సృష్టించింది 'ఆల్ వి ఇమేజిన్ యాజ్ లైట్'. ఇప్పుడు మరో ప్రతిష్ఠాత్మక పురస్కారాల బరిలో నిలిచిందీ చిత్రం. 17వ ఆసియా పసిఫిక్ స్క్రీన్ పురస్కారాలు నవంబరు 30న ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో జరగనున్నాయి. ఇందులో 23 దేశాలకు చెందిన 31 చిత్రాలు నామినేషన్లు దక్కించుకున్నాయి. ఇందులో పాయల్ కపాడియా రూపొందించిన 'ఆల్ వి ఇమేజిన్ యాజ్ లైట్' ఐదు నామినేషన్లు దక్కించుకుంది. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకురాలు, ఉత్తమ స్క్రీన్ ప్లే, ఉత్తమ ఛాయాగ్రాహకుడు, ఉత్తమ నటన.. ఇలా ఐదు విభాగాల్లో నామినేషన్లను సొంతం చేసుకున్నట్లు తెలిపింది చిత్రబృందం. ముంబయి నర్సింగ్ హోమ్‌లో పని చేసే ఇద్దరు నర్సుల కథ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం ఇప్పటికే పలు చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై విమర్శకుల ప్రశంసలు అందుకుంది.

గగనాన్ని దాటి ప్రయాణం


విజయ్ ఆంటోనీ

'బిచ్చగాడు'తో ప్రేక్షకులకు దగ్గరైన తమిళ కథానాయకుడు విజయ్ ఆంటోనీ. ఇప్పుడాయన మరో సస్పెన్స్ థ్రిల్లర్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. డిటెక్టివ్ నేపథ్యంలో సాగే మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్ చిత్రమిది. ఇటీవలే ఈ సినిమాకు 'గగన మార్గన్' అనే పేరు ఖరారు చేసింది చిత్రబృందం. 'గగనాన్ని దాటుకుని ప్రయాణించే వ్యక్తి' అని వాఖ్యల్ని జోడించింది. ఎడిటర్‌గా ప్రేక్షకుల్లో తనదైన ముద్ర వేసుకున్న లియో జాన్ పాల్ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. మీరా విజయ్ ఆంటోనీ నిర్మాత. తాజాగా ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. ఇందులో గాయాలతో ఉన్న వ్యక్తిగా కనిపించారు విజయ్. ఇందులో సముద్ర ఖని, మహానది శంకర్, వినోద్ సాగర్, అజయ్ దిశాన్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం త్వరలో విడుదల కానున్నట్లు తెలిపింది చిత్రబృందం.

మా చిరునామా: మకరందం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512

దైవిక శక్తులు నిండిన పూర్ణిమ



ఆశ్వయుజ పూర్ణిమ చాలా ప్రత్యేకమైంది. దైవిక శక్తులు నిండి ఉన్న ఈ రోజున అమ్మవారి ఆలయాల్లో ఆరాధనలు వైభవంగా నిర్వహిస్తారు. ఆశ్వయుజ పూర్ణిమ లక్ష్మీ దేవి జన్మ తిథి అని పురాణాలు చెబుతున్నాయి. అంటే సాగర మథనంలో లక్ష్మీదేవి ఆవిర్భవించింది, ఆ దేవి భూలోకంలో అడుగుపెట్టి,

నేడు ఆశ్వయుజ పూర్ణిమ

మానవాళిని అనుగ్రహించింది ఆశ్వయుజ పూర్ణిమనాడే అన్నది పురాణవచనం. తక్కిన మాసాల్లో వచ్చే పూర్ణిమ కంటే ఈ రోజున చంద్రుడు వెన్నెల రూపంలో మరింత అమృతాన్ని కురిపిస్తాడని పెద్దలు చెబుతారు. అందుకే ఈ రోజు పాలను కొంతసేపు వెన్నెలలో ఉంచి ఆనక సేవిస్తారు.

ఆశ్వయుజ పూర్ణిమనాడు లక్ష్మీదేవిని పూజిస్తే ఐశ్వర్యం ప్రాప్తిస్తుంది. విష్ణువును పూజించటం కూడా శ్రేష్ఠం. ఈ రోజున బ్రహ్మముహూర్తంలో నిద్రలేచి, అవకాశం ఉంటే ప్రవహించే నీటిలో లేదంటే ఇంట్లోనైనా గంగాదేవి మంత్రాన్ని జపిస్తూ స్నానం చేయాలి. సూర్యుడికి అర్ఘ్యం ఇవ్వాలి. పౌర్ణమినాడు నువ్వులు సమర్పించడం ఎంతో మంచిది. ముఖ్యంగా ఈరోజు పారే నీటిలో నువ్వులను అర్ఘ్యమివ్వడం చాలా మంచిది. తర్వాత విష్ణుమూర్తికి షోడశోపచార పూజ చేయాలి. విష్ణు సహస్రనామాలు పఠించి, పూలూ పండ్లతో పాటు ఆ స్వామికి ఇష్టమైన పసుపురంగు వస్త్రాలు సమర్పించాలి. – నూతి శివానందం

మీరా హృదయం.. మాధవ నిలయం!

ఈ రోజు భక్త మీరాబాయి జయంతి

శ్రీకృష్ణుడే సఖుడు, సర్వస్వం అని భావించి, ఆయన కోసమే తపించి తరించిన మహాభక్తురాలు మీరాబాయి. ఆ కృష్ణప్రేమిక ప్రత్యక్షంగా, పరోక్షంగా మన సనాతన ధర్మంలోని నవవిధ భక్తి మార్గాలను అనుసరించింది. నల్లనయ్యకు ఆంతరంగిక భక్తురాలై, అశేష ఆస్తిక జనావళికి ఆదర్శమూర్తిగా నిలిచింది.

మీరా తొలుత సాధువుల ద్వారా ఆ నవనీత చోరుడి లీలల్ని శ్రవణం చేసింది. ఆయన మాహాత్మ్యాన్ని అనుభూతి చెందాక తనూ ఆశువుగా గీతాలు రచించి కీర్తించింది. ప్రాపంచిక బంధాల్లో తామరాకుపై నీటిబొట్టులా ఉంటూ ఆ పరమపురుషుడి స్మరణలో కాలం గడిపింది. శ్యామసుందరుణ్ణి సాక్షాత్కరించుకున్నాక.. ఆయన పాదసేవనం, అర్చనల్లోనే తన్మయురాలవుతూ గీతాలాపనతో నిత్యం వందనాలు అర్పించింది. జీవితమంతా దామోదరుడికి దాస్యం చేసింది. ఆధ్యాత్మిక ఉన్నతిని సాధించిన స్థితిలో ఆయనతో సఖ్యతను పెంచుకుంది. తుట్టతుదకు ఆత్మ నివేదనం చేసుకొని ఆయనలోనే ఐక్యమైపోయింది. అలా శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం.. అనే తొమ్మిది భక్తి తోవల్లో పుండరీకాక్షున్ని ప్రసన్నం చేసుకుంది. తన హృదయాన్ని తాండవకృష్ణుడి నివాసంగా మార్చుకుంది. మురళీమోహనుడి భక్తి సామ్రాజ్యంలో మహారాణిగా వెలిగింది. అందుకే ఎందరో ఆధ్యాత్మిక సాధకులు మీరాబాయిని అపర రాధాదేవిగా ఆరాధిస్తారు.

తల్లి మాటలతో తన్మయురాలై..

నాలుగేళ్ల వయసులో తల్లితో కలసి ఓ పెళ్లికి వెళ్లిన మీరా వధూవరులను చూసి తన వరుడెవరని అనడిగింది. తల్లి నవ్వుతూ కృష్ణుడి విగ్రహం చూపింది. అది మీరా పసి మనసులో ముద్రించుకుపోయింది. శ్రీకృష్ణుడే తన భర్తని నమ్మింది. అలాంటి మరో సంఘటనే మీరాను ఆ మురారికి చేరువ చేసింది. ఒకరోజు ఓ సాధువు వద్దనున్న కృష్ణుని కంచు విగ్రహం చూసి ఆకర్షితురాలై అది కావాలంది. రోజూ నియమంగా పూజిస్తానంటేనే ఇస్తానన్నాడు. సరేనని ప్రతిమను తీసుకొని పరవశించిపోయింది. నాటి నుంచి మాధవుని ఆ మూర్తే ఆమె లోకమైంది.

శ్యామసుందరుడి ప్రేమే శాశ్వతమని..

'హరీ మైతో ప్రేమ్ దినానీ..' అని పాడుకునేది మీరా. లోకంలో ప్రతి ప్రేమకూ ఓ పరిమితి ఉంటుంది కానీ ఆ పరమాత్మ ప్రేమకు మేర లేదనేది మీరా. భగవంతుణ్ణి అంతరంగంలో ఆసీనుణ్ణి చేసుకున్న ఆమె, మహారాణి స్థానాన్ని కూడా తృణప్రాయంగా తోసిపుచ్చింది. ఎవరిని ప్రేమిస్తే.. మరెవరినీ ప్రేమించాల్సిన అవసరం లేదో, ఎవరి ప్రేమను పొందితే ఇంకెవరి ప్రేమనూ పొందాల్సిన పనిలేదో ఆయనే పరమాత్మ అని నిరూపించింది. ప్రాపంచిక ప్రేమ కన్నా పారలౌకిక ప్రేమలోని శాశ్వతత్వాన్ని లోకానికి చాటింది. ఓ గీతంలో 'బినా ప్రేమ్ నహీ మిలే నందలాలా' అంటూ ప్రేమతోనే ఆ గిరిధరుడు మన సొంతమవుతాడని ప్రకటించింది. మేరే నయనమే బసో నందలాలా.. నా కళ్లలోనే ఉండి పోమంటూ ప్రార్థించింది.

మిహిరాబాయి మీరాబాయిగా మారి..

15వ శతాబ్దానికి చెందిన మీరా రాజస్థాన్‌లో ఓ రాజకుటుంబంలో జన్మించింది. తల్లిదండ్రులు పెట్టిన పేరు మిహిరాబాయి. సూర్యముఖి అని ఆ పేరుకు అర్థం. చిన్నతనంలోనే కన్నవారు దూరమయ్యారు. తాతయ్య రావ్ దూదాజీ వద్ద పెరిగిన మిహిరా ఏకసంథాగ్రాహి. ఆయన నుంచే సంగీత సాహిత్య అభిరుచుల్ని అలవరచుకుంది. బాలికగా ఉన్నప్పుడే ఆమె మనోక్షేత్రంలో భక్తిబీజాలు అంకురించాయి. అందుకే ఇతర రాజకుటుంబాల్లోని బాలికల్లా రాజసికంగా కాకుండా సాత్వికంగా ఎదిగింది. మిహిరా మీరాగా మారింది.



బాధ్యతలు మరవని భక్తురాలు

యుక్తవయసు రాగానే కుమార భోజరాజుతో మీరాకి పెళ్లిచేశారు. భగవంతుణ్ణి భర్తగా భావించినా మీరా ఎన్నడూ కుటుంబ బాధ్యతల్ని విస్మరించలేదు. దాంపత్య జీవితాన్ని గడపక పోయినా అర్ధాంగిగా అణకువతోనే నడచుకునేది. గృహిణి ధర్మాణ్ని పాటిస్తూ భర్త, అత్తమామలకు సపర్యలు చేసేది. పనులన్నీ పూర్తయ్యాక మందిరంలోకి వెళ్లి కృష్ణ ధ్యానంలో, ఆయన నామ గానంలో లీనమైపోయేది. శ్రీమంతురాలైనా మీరా సామాన్య స్త్రీగానే జీవనాన్ని కొనసాగించింది. సఖులు, సేవకులను ఆదరిస్తూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకునేది. దానధర్మాలతో దయామయిగా పేరుతెచ్చుకుంది. వివాహమైన కొన్నాళ్లకే వైధవ్యం ప్రాప్తించింది. అది కూడా వేణుగోపాలుడి లీలగానే భావించి, ఆపై పూర్తిగా ఆధ్యాత్మిక చింతనలో మునిగి పోయింది.

శరణాగతి, ఆత్మనివేదనల సంగమం

మీరా తన భజనల్లో శరణాగతికి, ఆత్మనివేదనకు ఎంతో ప్రాధాన్యాన్నిచ్చింది. ఆమె భాష సరళం, సంగీతాత్మకం. ఆమె పదాల్లో భక్తి, శాంతరసాలు పొంగి పొరలుతాయి. రాజస్థానీ, గుజరాతీ, వ్రజ, హిందీ భాషల్లో దాదాపు 2500 వరకు రచించిన ఆమె గీతాలన్నీ సంగీత సాహిత్యాల కలబోత. మధురభక్తి, కృష్ణప్రేమల కలనేత. ఆ భజనలన్నీ 'గిరిధర గోపాల..' అనే మకుటంతో ముగుస్తాయి.

ద్వారక నుంచే దామోదరుడి చెంతకు..

ఆనాటి ఛాందస భావాలను ధిక్కరించిన ధీశాలి మీరా. పరపురుషులను కన్నెత్తయినా చూడకూడదని.. స్త్రీలను తెరల చాటున ఉంచే రోజుల్లో ఆమె ధైర్యంగా ఆధ్యాత్మిక గురువుల వద్దకు వెళ్లి తన సంశయాలను నివృత్తి చేసుకునేది. వారితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేది. తులసీదాస్, రవిదాస్, జీవగోస్వామి వంటి సాధకులతో నిర్మొహమాటంగా శాస్త్ర చర్చలు జరిపేది. భక్తి పారవశ్యంలో నృత్యం చేసేది.

శ్రీకృష్ణుడి లీలాక్షేత్రాలైన ద్వారక, బృందావన ప్రాంతాల్ని ఒంటరిగా సందర్శించింది మీరాబాయి. తన జీవన సంధ్యా సమయంలో రాధారమణుడి ధ్యానంలోనే గడిపి, అక్కడే ద్వారక క్షేత్రంలోనే తుదిశ్వాస విడిచి దామోదరుడిలో ఐక్యమైపోయింది.

సిక్కు మతస్థులు కూడా మీరాబాయికి సమున్నత స్థానాన్ని కల్పించారు. తమ చారిత్రాత్మక భక్తి సాధువుల్లో ఆమెని ఒకరిగా గుర్తించారు. మీరాను తమ పారమార్థిక గురువుగా భావిస్తారు. ఆమె తాత్విక గీతాలు ఛాందసులను ఆలోచింపజేసి మతసామరస్యాన్ని పెంపొందించాయి.

భక్తమీరా కృష్ణప్రతిమతో 'భారతకోకిల'


భారతకోకిల లతామంగేష్కర్ ఒకసారి రాజస్థాన్‌లోని ఉదయపూర్ వెళ్లారు. అప్పుడే ఆ భారతరత్న ఆలపించిన మీరా భజనలు జనప్రియంగా వ్యాప్తి చెందాయి. మీరాబాయి వంశ పరంపరకు చెందిన రాణా ఉదయసింగ్ లతను తమ నివాసానికి ఆహ్వానించి.. 'ఇది మీరాబాయి పూజించిన కృష్ణ విగ్రహం. ఈ విగ్రహాన్ని ఎత్తుకునే మీరా ఆలపించేది' అంటూ ఆమె చేతికిచ్చాడు. అది తలచుకుంటూ లత 'ఆ కృష్ణ ప్రతిమను స్పృశించగానే మేను పులకించింది. కళ్లు చెమ్మగిల్లాయి. ఆ దివ్యానుభూతిని మర్చిపోలేను' అని ఓ ముఖాముఖిలో ఉద్విగ్నతకు లోనయ్యారు.

ఈ ఏడాది మీరాబాయి జయంతి శరత్‌పూర్ణిమ నాడు రావటం విశేషం. కృష్ణభక్తులకు ఇది మరింత ప్రత్యేకం. ఆ భక్తశిఖామణి గీతాలతో తరించే మహద్భాగ్యం.

– బి.సైదులు

మితభాషి.. అయితేనేం..


గోరఖ్ పొరుగింట్లో ఉండే వ్యక్తి పెద్దగా మాట్లాడడు. ఆ సంగతి ప్రస్తావించి 'బాబా! అతడెందుకు అలా ముక్తసరిగా ఉంటాడు?' అనడిగాడు. 'భావాలు పంచుకోవటానికి మాటలు ముఖ్యమైన సాధనం. నిజమే కానీ కొందరు తక్కువ మాట్లాడతారు. ఇందుకు చాలా కారణాలు ఉండవచ్చు. దాన్ని లోపంగా ఎందుకనుకుంటావు? తక్కువ మాట్లాడే వ్యక్తులు లోతుగా ఆలోచిస్తారు. వాళ్లు ప్రతిసారీ ఆచితూచి జాగ్రత్తగా మాట్లాడతారు. తామేదైనా చెప్పే ముందు ఇతరుల అభిప్రాయాలను శ్రద్ధగా వింటారు. అంతా గ్రహించి తదనుగుణంగా ప్రతిస్పందిస్తారు. ఎవరి పట్లా వ్యతిరేకత చూపరు, ఎవరికీ హాని చేయరు. తక్కువ మాట్లాడే వ్యక్తులు ఎక్కువసేపు ఏకాంతంగా గడిపేందుకు ఇష్టపడతారు. అదే వారికి సంతోషాన్నిస్తుంది. సమయాన్ని మరింత సద్వినియోగం చేసుకోగలుగుతారు. ఆలోచించి నిర్ణయం తీసుకోగలుగుతారు. ఏకాంతం ప్రశాంతతను ఇస్తుంది. మితంగా మాట్లాడే వారి మాటకు అమిత విలువ ఉంటుంది. వాళ్లు ఎదుటివారిని ప్రభావితం చేయగలరు' అంటూ వివరించారు సాయి.



– లక్ష్మి

ప్రభువు ఎలా రక్షిస్తాడంటే..

క్రీస్తువాణి



మనందరికీ ఎప్పుడో ఒకప్పుడు శారీరక బాధలో, మానసిక వ్యథలో ఎదురవుతుంటాయి. ఏ ఇబ్బందులూ లేకుండా జీవితం పూలబాటలా ఏ ఒక్కరికీ సాగదు. ఈ నేపథ్యంలో వాటి నుంచి బయటపడటానికి బంధుమిత్రులు ఎవరో ఒకరిపై ఆశలు పెట్టుకోవడం మానవ బలహీనత. కానీ ఎవరి దుఃఖాలు వారికుంటాయి, వేరొకరిని ఆదుకునేంత తీరిక, ఓపిక ఉండవు. కొందరు తప్పించుకుంటే, ఇంకొందరు సాయం చేస్తామంటూ నటిస్తారు. కానీ దేవుడలా కాదు.. ఎవరైనా సమస్యల్లో చిక్కుకుంటే చోద్యం చూడడు. 'ఆపత్కాలమున నువ్వు మొరపెట్టుకుంటే.. నేను విడిపిస్తాను' అన్నాడు ఏసు. కనుక మనం బాధపడుతుంటే ఆయన ఉపేక్షించడు. మరి కనిపించని, వినిపించని ప్రభువు ఎలా వస్తాడు అంటే.. ఆయన స్వయంగా రాడు. తన ప్రతినిధుల్ని పంపిస్తాడు. సజ్జనుల ద్వారా రక్షిస్తాడు. అందుకే ప్రభువు 'నీ వలెనే నీ పొరుగువారిని ప్రేమించు' అంటూ ఆజ్ఞాపించాడు.

– డా.ఆర్వీ దేవదాసు

బిడియం ఒక ఆభరణం

ఇస్లాం సందేశం



చూపులను కిందికి వాల్చి ఉంచే వారిని ఏ శక్తీ అపమార్గం పట్టించలేదు. ఎలాంటి ప్రలోభాలూ లొంగదీసుకోవు అనడానికి నిదర్శనం ఈ సంఘటన.. ఇస్లామిక్ పండితుడు ఉమర్ బిన్ హబీబ్ రోమ్‌లో బానిసగా పట్టుబడ్డారు. అతడి అందచందాలు చూసి ముగ్ధుడైన రోమ్ సర్దారు ఆ యువకుణ్ణి లొంగదీసుకోవాలనుకున్నాడు. ఒక మహలులో బంధించి ఖరీదైన మద్యాన్ని, రుచికరమైన మాంసాహారాన్ని, అందమైన యువతిని ఉంచాడు. ఆమె ఎంత రెచ్చగొట్టినా హబీబ్ తల ఎత్తలేదు. 'మూడు రోజులుగా తిండి తినలేదు. తలెత్తి కూడా చూడలేదు. ఎందుకింత మొండివైఖరి? అసలు నువ్వెవరు? ఇంత మంచి అవకాశాన్ని ఎందుకు జారవిడుచుకుంటున్నావు?' అందామె. ఆ మాటకు 'దేవుడు నన్ను ప్రతీక్షణం చూస్తున్నాడు. తప్పు చేయటం సిగ్గుచేటు. మూడు కాదు ముప్పై రోజులైనా నేనిలాంటి పని చేయలేను. నా యవ్వనం అల్లాహ్ అప్పగింత. దానిపై మచ్చ రానివ్వను. నిగ్రహం కోల్పోను. బిడియం అనేది విలువైన ఆభరణం' అంటూ బదులిచ్చాడు. యువతి విస్తుపోయి 'నీలాంటి వ్యక్తి చనిపోకూడదు' అని, ఆ రాత్రి అతన్ని అక్కణ్ణించి తప్పించింది. ఇదీ వ్యక్తిత్వమంటే. ప్రవక్త (సఅసం) ఒక సందర్భంలో 'పరిస్థితులు ఎంత ప్రలోభపెట్టినా పక్కదారి పట్టరాదు. ప్రళయ దినాన అల్లాహ్ అడిగే 5 ప్రశ్నల్లో 'యవ్వనాన్ని ఎలా గడిపావు?' అన్నది ఒకటి. కనుక నైతికత చాలా ముఖ్యం. లజ్జ, సిగ్గు, బిడియం ఇవన్నీ ఆభరణాలు. ఇస్లాంధర్మం అనే వృక్షానికి 60కి పైగా కొమ్మలున్నాయి. వాటిలో బిడియం ఒకటి' అన్నారు. బిడియంగా ఉండే వ్యక్తిపై అతని సోదరుడు మండిపడేవాడు. అది గమనించిన దైవప్రవక్త (స) 'అలా కోపగించుకోకు. బిడియం ప్రశంసనీయమైన లక్షణం. అది చెడుకు దూరంగా ఉంచుతుంది, దానివల్ల మేలే కలుగుతుంది' అని ప్రబోధించారు. సిగ్గు, బిడియం లేకుంటే విశృంఖలత్వం చెలరేగుతుంది. నిజమైన స్వేచ్ఛకు నైతికతే పునాది- అంటారు ఉలమాలు. – అస్రా ముహ్సినా

వందే విష్ణుం!

వృషకర్మా

విష్ణుసహస్రనామావళిలో 112వది. వృషకర్మాలో 'వృష' అంటే ధర్మం. 'వృషకర్మణే నమః' అంటే ధర్మనిర్వహణే పనిగా కలిగిన స్వామికి నమస్కరిస్తున్నానని అర్థం. శ్రేయోదాయకమైన ధర్మం అనే కర్మను ఆచరిస్తున్నవాడని అంతరార్థం. ఈ నామాన్ని మంత్రంగా జపిస్తే శుభకర్మలు జరుగుతాయని పండితులు వివరిస్తున్నారు. ఆయన ధర్మపరిరక్షణ, లోకహితం కోసం నిత్యం పని చేస్తుంటాడు. 'ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' అని భగవద్గీతలో చెప్పిన దానికి ఇది సరిపోలుతుంది. – వై.తన్వి



ఇచ్చుటలో ఉన్న హాయి

ఎడారి ప్రాంతంలో వెళ్తున్న ఒక స్త్రీకి ఇసుకలో అమూల్యమైన రాయి దొరికింది. సంతోషంగా దాన్ని సంచిలో వేసుకుంది. కొంతసేపటికి ఒయాసిస్సు వద్ద ఓ బాటసారి కలిశాడు. అతను ఆకలిగా ఉందని చెప్పటంతో- సంచి తీసి.. తనవద్దనున్న రొట్టెలను అందించింది. వాటిని అందుకుంటూ ఆమె సంచిలోని మెరిసే రాయిని చూసిన బాటసారి దాన్ని తనకు ఇవ్వమని అడిగాడు.

ఆమె క్షణమైనా ఆలోచించకుండా దాన్ని ఇచ్చేసింది. అదృష్టం వరించి జీవితకాలానికి సరిపోయే సంపద సొంతమైంది, ఇక తన దరిద్రం తీరిందని మురిసిపోతూ ఆ బాటసారి వెళ్లిపోయాడు. మర్నాడతను ఆమెని వెతుక్కుంటూ వచ్చి 'ఈ రాయి నువ్వే తీసుకో' అన్నాడు. ఆమె ఆశ్చర్యంగా చూస్తుంటే 'ఈ రాయి ఎంత అమూల్యమైందో నాకు తెలుసు. దీంతో ఆర్థిక బాధలు తొలగిపోతాయేమో అనుకున్నాను. కానీ ఏదో అశాంతిగా అనిపించింది. ఇంత విలువైన దాన్ని ఎలా వదులుకున్నావో అంతు పట్టలేదు. దీన్ని తృణప్రాయంగా భావించావంటే.. నువ్వు సామాన్యురాలివి కాదు. దీనికంటే విలువైన మహాశక్తి నీలో ఉంది. అది మరీమరీ అమూల్యమైంది. దయచేసి ఆ శక్తిని నాకు ఇవ్వు' అంటూ కన్నీటితో అడిగాడు. ఆమె నవ్వి 'ఆ శక్తేంటో నాకు తెలీదు కానీ ఇవ్వటంలో ఉండే సంతోషాన్ని అనుభవిస్తేనే అర్థమవుతుంది' అని జవాబిచ్చింది.



చాలా సందర్భాల్లో ఇవ్వటానికి మనవద్ద ఏముంది- అనుకుంటాం. నిజానికి ఇవ్వాలనే మనసు ఉండాలే గానీ.. వస్తువులు, ధనమే కాదు ఒక మంచిమాట, చిరునవ్వు, మన సమయం, మన జ్ఞానం, మన శ్రమ ఏదైనా ఇవ్వొచ్చు. ఏదీ ఆశించకుండా ఇవ్వటంలో గొప్ప ఆనందముంటుంది.


– తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి

మాస్టర్‌ను బెదిరించిన దొంగ

జెన్ కథ

షిచిరి కోజున్ అనే జెన్ మాస్టర్ ఒకరోజు సాయంత్రం వేళ ధర్మగ్రంథాన్ని పారాయణ చేస్తూ కూర్చున్నాడు. ఇంతలో ఓ దొంగ లోపలికి వచ్చి కత్తి చూపి బెదిరిస్తూ 'డబ్బంతా చేతిలో పెడతావా లేదా ప్రాణాలు పోగొట్టుకుంటావా?' అన్నాడు. గురువు పక్కకు తిరిగైనా చూడకుండా 'నా ఏకాగ్రతను పోగొట్టకు. ఆ సొరుగు తెరిచి చూడు.. నీకు డబ్బు దొరుకుతుంది' అన్నాడు. ఆ మాట చెప్పేసి.. తన మానాన గ్రంథ పఠనం కొనసాగించాడు. దొంగ ఏవేవో తీస్తుంటే.. 'ఇదిగో.. ఆ కాగితాల జోలికి వెళ్లకు. అవన్నీ అవసరమైనవి. రేపటికి పన్ను చెల్లించాల్సి ఉంది' అన్నాడు. దొంగ దొరికిన డబ్బంతా తీసుకుని బయల్దేరాడు. 'ఈ బహుమతిని స్వీకరించిన వ్యక్తికి కృతజ్ఞతలు' అన్నాడు షిచిరి అతని ముఖమైనా చూడకుండానే. దొంగ ధన్యవాదాలు తెలియజేసి వెళ్లిపోయాడు. షిచిరి ఇంట్లోనే కాకుండా అనేకమంది ఇళ్లల్లో చౌర్యం చేసిన ఆ దొంగను పట్టుకున్నారు. చాలామందితోపాటు షిచిరి కోజున్‌ను పిలిపించారు రక్షకభటులు. సాక్ష్యం చెప్పమని అడిగినప్పుడు 'ఇతను దొంగ కాదు. ఆ డబ్బు నేనే ఇచ్చాను, అతను నాకు కృతజ్ఞతలు కూడా తెలియజేశాడు' అన్నాడు. షిచిరి ఎంత మంచిగా చెప్పినప్పటికీ ఇతరులు ఫిర్యాదు చేయడం వల్ల, అతని నేరం రుజువవ్వటం వల్ల ఆ వ్యక్తికి శిక్ష పడింది. జైలు నుంచి విడుదల అయ్యాక ఆ దొంగలో పరివర్తన రావడమే కాదు షిచిరికి శిష్యుడిగా మారాడు.

– నాగరత్న



స్వామి సేవలో పరమోన్నతులు

మనం చేసే పనుల్లో ఏవో అవరోధాలు ఎదురవుతుంటాయి. అలాంటప్పుడు కృషి, పట్టుదలతో సాగితే.. దైవానుగ్రహం లభిస్తుంది, విజయం సాధ్యమవుతుంది. ఆంజనేయుడు, స్వామి వివేకానంద జీవితాలే అందుకు నిదర్శనం. హనుమంతుడు సీతాన్వేషణ చేస్తూ సముద్రాన్నే లంఘించాడు. మనదేశ ఔన్నత్యాన్ని, ధర్మ విశిష్టతను తెలియజేసేందుకు విదేశాలకు వెళ్లిన వివేకానందుడు అనేక అవరోధాలను ఎదుర్కొన్నాడు. స్వామి కార్యంలో ఎదురైన కష్టాలను ఈ ఇద్దరు మహాత్ములు ఓర్పు, నేర్పు, ధైర్య సాహసాలతో ఎదుర్కొన్నారు. అత్యంత క్లిష్టసమయాల్లోనూ భగవంతుడిపై విశ్వాసం కోల్పోకుండా ప్రయత్నాన్ని కొనసాగించారు. అందువల్లనే స్వామి కార్యాన్ని సాధించగలిగారు.




ఆంజనేయ నామాన్ని స్మరించినా, వివేకానందుడి సందేశాన్ని మననం చేసుకున్నా మనలోని భయాలు, బలహీనతలు తొలగిపోతాయి. ధైర్యం, స్థైర్యం, క్షమ, ఉత్సాహం వృద్ధి చెందుతాయి. పరమాత్ముడి సేవలో తరించి పునీతులైన వీరిద్దరూ శివాంశసంభూతులే.

రామకార్యార్థం అవతరించిన ఆ హనుమంతుడే రామకృష్ణ సందేశ వ్యాప్తికి ఆవిర్భవించిన ఈ వివేకానందుడు. ఇద్దరూ తమ ప్రయత్నంలో సఫలీకృతులై ఆదర్శంగా నిలిచారు.

ఆంజనేయుడు పరమ శివుడి అవతారమంటారు. దేవీ భాగవతాన్ని అనుసరించి- రావణాసురుణ్ణి అంత మొందించే ఉపాయాన్ని తెలియజేయమని త్రిమూర్తులు దేవిని ప్రార్థించారు. అప్పుడా తల్లి రావణ సంహారంలో సహాయం చేసేందుకు పరమేశ్వరుడే ఆంజనేయుడిగా అవతరిస్తాడని అభయమిచ్చింది. ప్రచారంలో ఉన్న కథను అనుసరించి- స్వామి వివేకానందుడి తల్లి భువనేశ్వరీదేవి పుత్రుడి కోసం శివుణ్ణి ప్రార్థించగా.. ధ్యాన స్థితిలో ఉన్న స్వామి ఆమెలో ప్రవేశించాడు. అలా ఈశ్వరుడే వివేకానందుడిగా ఆవిర్భవించాడు. కనుక హనుమంతుణ్ణి, వివేకానందుణ్ణి స్మరించడం వల్ల మన జన్మ సార్థకమవుతుంది. – శ్రీమయి

“ మన ప్రార్థన, ఉపాసనలు కులమతాలకు అతీతంగా ఉండాలన్నాడు గౌతముడు. అంటే ప్రార్థనను విశ్వవ్యాప్తరూపంగా పరిగణించాడు. అశాంతి అనేది ప్రత్యేకించి ఉనికిలో లేదు.. దాన్ని మనమే సృష్టించుకుంటున్నాం. మానసిక సంఘర్షణను పక్కన పెడితే శాంతి అనేది మనలోనే ఉన్నట్టు తెలుసుకోగలం. సహృదయతే శాంతికి మూలం. - గౌతమబుద్ధుడు



ప్రాక్టీస్ బిట్స్

జీఎస్ - పర్యావరణ అంశాలు

1. జీవవైవిధ్య చట్టం - 2002 ప్రకారం కిందివాటిలో వేటిని ఏర్పాటు చేశారు?
ఎ) నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ (ఎన్‌బీఏ)
బి) రాష్ట్ర జీవవైవిధ్య బోర్డులు (ఎస్‌బీబీఎస్)
సి) బయోడైవర్సిటీ మేనేజ్‌మెంట్ కమిటీలు (బీఎంసీ)
1) ఎ, బి 2) బి, సి 3) ఎ, బి, సి 4) ఎ, సి

2. కింది అంశాల్లో సరైనవి?
ఎ) భారత జీవవైవిధ్య అవార్డును 2012లో ఐక్యరాజ్య సమితి జీవవైవిధ్య సదస్సు సందర్భంగా ఏర్పాటు చేశారు.
బి) కేంద్ర పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ, ఐక్యరాజ్య సమితి కలిసి భారత జీవవైవిధ్య అవార్డును ఏర్పాటు చేశాయి.
సి) భారత జీవవైవిధ్య అవార్డును రెండేళ్లకోసారి 10 రంగాల్లో ఇస్తారు.
1) ఎ, సి 2) బి, సి 3) ఎ, బి, సి 4) ఎ, బి

3. అమృతాదేవి బిష్ణోయ్ జాతీయ అవార్డు దేనికి సంబంధించింది?
1) వన్యప్రాణి సంరక్షణార్థం ఇచ్చే అవార్డు
2) శాస్త్ర, సాంకేతిక పురస్కారం
3) అంతర్జాతీయ శాంతి, అభివృద్ధి, నూతన ఆర్థిక విధానాలు
4) పర్యావరణ నాయకులను గుర్తించేందుకు

జవాబులు: 1-3; 2-4; 3-1.

ప్రిపరేషన్ టెక్నిక్

తెలుగు, ఇంగ్లిష్ లేదా ఇతర భాషలకు సంబంధించిన సబ్జెక్టులను తరచూ చదవాలి. దాని వల్ల గ్రహణశక్తి, పదజాలం, వ్యాకరణం మెరుగుపడతాయి. వ్యాసాలు, సంక్షిప్తీకరణలను ప్రాక్టీస్ చేస్తే, రాత నైపుణ్యాలు వృద్ధి చెందుతాయి.

TENTH Biology



Dissolve metabolic wastes

1 Mark — **Life Process**

1) Define Photolysis.
A: Splitting of water molecule into H^+ and OH^- by the light activated chlorophyll molecule is known as Photolysis. This is also known as Hill's Reaction.

2) Name the enzyme presents in saliva that helps in the digestion of starch.
A: The enzyme presents in saliva that helps in the digestion of starch is amylase (Ptyalin).

3) In which chambers of heart is oxygenated blood found?
A: Oxygenated blood is found in left auricle and left ventricle.

4) What makes red blood corpuscles red?
A: Haemoglobin is filled in red blood corpuscles to make it red.

5) What will happen if platelets were absent in the blood?
A: If platelets were absent in the blood, the process of blood clotting will be affected.

6) What is the main function of kidneys in human beings?
A: Kidneys excrete excess water and dissolve metabolic wastes. e.g.: Urea and other dissolved solids like uric acid, creatinine and inorganic salts.

Some More Important Questions

2 Marks
1) What is the role of acid in the stomach?
2) How is small intestine designed to absorb digested food?
3) How are water and minerals transported in plants?

For answers

- MSN Murthy

మూడు రకాలుగా.. ఏడు ప్రాంతాల్లో!

జనరల్ స్టడీస్ ఇండియన్ జాగ్రఫీ

దేశ సహజ వనరుల్లో ప్రధానమైనది ఖనిజ సంపద. ఆర్థిక, పారిశ్రామిక పురోగతికి, ఉపాధి సృష్టికి అది చోదకశక్తిగా పనిచేస్తుంది. విశాలమైన భూభాగం, పొడవైన సముద్ర తీరం, భిన్న భౌగోళిక వైవిధ్యాలు ఉన్న భారతదేశం ఖనిజాలకు సుసంపన్న నిలయం. లోహ, అలోహ, ఇంధన ఖనిజాలన్నీ ఇక్కడ విరివిగా లభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలో ఖనిజాల అన్వేషణకు ఉన్న ప్రభుత్వ విభాగాలు, దేశవ్యాప్తంగా గుర్తించిన ఖనిజాలు, వాటి లభ్యత, రాష్ట్రాల వారీగా ఉన్న గనులు, ఉత్పత్తి తీరుతెన్నులపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. దేశంలో విస్తారంగా ఉన్న ఇనుప ఖనిజ నిల్వలు, నాణ్యత ఆధారంగా విస్తరణ, లభ్యమయ్యే ప్రాంతాల గురించి తెలుసుకోవాలి.





ఖనిజాలు - లభ్యత

భూమి లోపల అనేక రకాల మూలకాలు రసాయనికంగా సంయోగం చెంది సహజసిద్ధంగా ఏర్పడే కర్బన, అకర్బన సమ్మేళనాలనే ఖనిజాలు అంటారు. స్థూలంగా వీటిని లోహ, అలోహ, ఇంధన ఖనిజాలు అని మూడు రకాలుగా విభజించవచ్చు. బొగ్గు, పెట్రోలియం, సహజ వాయువు మొదలైనవి ఇంధన ఖనిజాలు. * యుద్ధ వ్యూహరీత్యా ఖనిజాలను క్లిష్ట, కీలక, సామాన్య ఖనిజాలుగా కూడా విభజించవచ్చు. దేశంలో ఖనిజాల ఉపయోగం ఎన్నో వేల సంవత్సరాలుగా ఉందని చెప్పడానికే చరిత్రను రాతియుగం, రాగి యుగం, ఇనుప యుగంగా పేర్కొంటారు.

అందుబాటు ఆధారంగా ఖనిజాలు మూడు రకాలుగా ఉన్నాయి. 1) అవసరాల కన్నా ఎక్కువగా లభ్యమవుతూ, ఎగుమతికి అనుకూలమైనవి. **ఉదా:** ఇనుము, మాంగనీసు, మాగ్నసైట్, టిటానియం, థోరియం, బాక్సైట్, అభ్రకం, క్యనైట్, సిలిమైట్. 2) అవసరానికి తగినంత మాత్రమే లభ్యమయ్యేవి. **ఉదా:** బొగ్గు, ఫెల్‌స్పార్, ఫ్లోరైడ్, సున్నపురాయి, డోలమైట్, జిప్సం, యురేనియం, విలువైన రాళ్లు.. 3) అవసరానికన్నా తక్కువగా లభ్యమవుతూ, దిగుమతి చేసుకునేవి. **ఉదా:** రాగి, సీసం, జింకు, టిన్, పాదరసం, వెండి, బంగారం.

ఖనిజాల లభ్యత ఆధారంగా భారత్‌ను ఏడు ప్రాంతాలుగా విభజించారు.

1) దామోదర్ లోయ ప్రాంతం: ఇది పశ్చిమ బెంగాల్, బిహార్, ఒడిశా రాష్ట్రాల మధ్యలో ఉంటుంది. ఇక్కడ బొగ్గు, ఇలిమైట్, డోలమైట్, చైనా క్లే, క్రోమైట్, ఫాస్ఫేట్, బాక్సైట్, రాగి, ఇనుము, మాంగనీసు, సున్నపురాయి లభిస్తాయి.

2) మధ్య భారతం/చోటానాగ్‌పుర్ పీఠభూమి: దేశంలోని ఖనిజ నిల్వలు ఎక్కువగా చోటానాగ్‌పుర్ పీఠభూమి ప్రాంతంలో విస్తరించి ఉన్నాయి. అందుకే చోటానాగ్‌పుర్ పీఠభూమిని 'రూర్ ఆఫ్ ఇండియా' అంటారు. మాంగనీసు, సున్నపురాయి, బాక్సైట్, బొగ్గు ఎక్కువగా లభిస్తాయి. మధ్యప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. ఈ రాష్ట్రాల్లో రత్నాలు, ఇనుము, సున్నపురాయి, రాగి, బంగారం, అభ్రకం, డోలమైట్, గ్రాఫైట్, సీసం మొదలైనవి లభిస్తాయి.

3) కర్ణాటక-తమిళనాడు: ఇందులో కర్ణాటక, తమిళనాడుతోపాటు ఏపీలోని కొంత ప్రాంతం ఉంది. బంగారం, ఇనుము, పింగాణి, క్రోమైట్, బాక్సైట్, మాంగనీస్, డోలమైట్, క్వార్ట్జ్, సిలికా, సున్నపురాయి, మాగ్నటైట్, మైకా, ఇలిమైట్, జిప్సం, మాగ్నసైట్ వంటి ఖనిజాలు లభిస్తాయి.

4) కేరళ: ఇక్కడ క్విలాన్, కల్లేయమ్, ఎర్నాకులం, కన్ననూర్, త్రివేండ్రం, ఇద్దిహి, కులాపురం జిల్లాల్లో గార్నెట్, బాక్సైట్, బంకమట్టి, ఇనుము, గ్రాఫైట్, అభ్రకం, బంగారం, సున్నపురాయి, సబ్బురాయి, రుటైల్ మోనోజైట్ ఖనిజాలు లభిస్తాయి.

5) మధ్య రాజస్థాన్-గుజరాత్ ప్రాంతం: నిక్షిప్త ఖనిజాలకు ప్రసిద్ధి చెందిన ప్రాంతం. రాగి, సీసం, జింక్, వెండి, యురేనియం, బంగారం, బెరీలియం, అభ్రకం, మాంగనీసు, స్టియటైట్, మార్బుల్, గ్రానైట్, ఖనిజనూనె, సహజ వాయువు, బాక్సైట్, లిగ్నైట్, కాపర్, జిప్సం డోలమైట్ లభిస్తాయి.

6) హిమాలయ ప్రాంతం: ఇక్కడ రాగి, సీసం, జింకు, బిస్మత్, యాంటిమోనీ, నికెల్, కోబాల్ట్, టంగ్‌స్టన్, బంగారం, వెండి, రంగురాళ్లు లభిస్తాయి. పశ్చిమ బెంగాల్‌లో డార్జిలింగ్, అరుణాచల్‌ప్రదేశ్‌లోని రంజిత్ లోయ, జమ్ము-కశ్మీర్‌లోని కలహల్, యెట్కా, మహగోళాల్లో బొగ్గు లభిస్తుంది. సహజ వాయువు, సున్నపురాయి, డోలమైట్, జిప్సం లభిస్తాయి.

7) హిందూ మహాసముద్ర ప్రాంతం: అపారమైన చమురు, సహజ వాయువు నిల్వలు, మోనోజైట్, టైటానియం ఖనిజాలకు ప్రసిద్ధి.

ప్రణాళికా సంఘం నియమించిన హుడా కమిటీ సిఫార్సుల ప్రకారం ప్రభుత్వం 2008లో నూతన జాతీయ ఖనిజ విధానాన్ని తీసుకొచ్చింది. దేశంలో ఖనిజాల సర్వే, అన్వేషణ వ్యవహారాలను కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ చూస్తుంది. దీని ఆధ్వర్యంలో జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (1851లో కోల్‌కతాలో స్థాపించారు), ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ (1948లో నాగ్‌పుర్‌లో ఏర్పడింది) సంస్థలు పనిచేస్తాయి. వీటి కింద అనేక ఉపసంస్థలు పనిచేస్తాయి. హైదరాబాద్ కేంద్రంగా అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ (1949లో ఏర్పడింది), నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (1958లో స్థాపన) సంస్థలు పని చేస్తున్నాయి.

- దేశంలో ఖనిజ సంపద కొన్ని ప్రదేశాలకే పరిమితమైంది. బిహార్, ఝార్ఖండ్, ఒడిశాలో ఆర్కియన్ శిల ప్రాంతాలు ఖనిజ సంపదకు ప్రసిద్ధి. గంగా, సింధూ మైదాన ప్రాంతాల్లోని ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో ఖనిజాల లభ్యత చాలా తక్కువ, దాదాపు లేవనే చెప్పాలి.
- దేశంలోని బొగ్గు క్షేత్రాలన్నీ ఎక్కువగా దామోదర్ లోయ, సోన్, మహానది, గోదావరి నదీ లోయ ప్రాంతాల్లోనే విస్తరించి ఉన్నాయి.

ఇనుప ఖనిజం: మనదేశం ఇనుప ఖనిజ నిల్వలకు ప్రసిద్ధి. ఇనుము ప్రాథమిక ఖనిజం, మొదటి ఇనుప ఖనిజ గనిని 1904లో ఝార్ఖండ్‌లోని సింగ్‌బమ్‌లో కనుక్కున్నారు. ప్రపంచ ఇనుము ఉత్పత్తిలో భారత్ నాలుగో స్థానంలో ఉంది. మొదటి మూడు స్థానాలు ఆస్ట్రేలియా, చైనా, బ్రెజిల్ (2023-24 లెక్కల ప్రకారం). భారత్ నుంచి ముడిఇనుము ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్న దేశం జపాన్. దేశంలో ఇనుప నిల్వలు ఝార్ఖండ్‌లో ఎక్కువగా ఉన్నప్పటికీ ఉత్పత్తిపరంగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. దేశంలో అతి పెద్ద ఇనుప ఖనిజ గని ఛత్తీస్‌గఢ్‌లోని బైలడిల్లా. ముడి ఖనిజంలో ఇనుము శాతం ఆధారంగా నాలుగు రకాలుగా విభజించవచ్చు.

1) **మాగ్నటైట్:** దీనిలో 70-80% ఇనుము ఉంటుంది. నలుపు, గోధుమ రంగులో ఉంటుంది. ఈ రకం ఎక్కువగా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, కేరళల్లో లభిస్తుంది. దీన్ని 'లాండ్‌స్టోన్' అని కూడా అంటారు.

2) **హెమటైట్:** దీనిలో 60-70% ఇనుము ఉంటుంది. ఎరుపు, బూడిద రంగుల్లో లభిస్తుంది. ఇది నాణ్యమైన రకం. ప్రధానంగా పరిశ్రమల్లో ఉపయోగించే ఈ రకం ఒడిశా, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్‌ల్లో ఎక్కువగా లభిస్తుంది.

3) **లిమోనైట్:** దీనిలో 40-60% ఇనుము ఉంటుంది. ఇది ముదురు గోధుమ, పసుపు రంగులో ఉంటుంది. దీన్ని హైడ్రేటెడ్ ఐరన్ ఆక్సైడ్ అంటారు. ఇది రాణిగంజ్ (దాముడా), ఉత్తరాఖండ్ (ఘర్వాల్), ఉత్తర్‌ప్రదేశ్ (మీర్జాపుర్), హిమాచల్ ప్రదేశ్ (కంగ్రావ్యాలీ)లో లభిస్తుంది. ఇది చవకైన రకం, తక్కువ నాణ్యతతో ఉంటుంది.

4) **సెడెరైట్:** దీనిలో 30-40% ఇనుము ఉంటుంది. దీన్ని ఐరన్ కార్బొనేట్ అంటారు. గోధుమ రంగులో ఉంటుంది. ఇది వాణిజ్యపరంగా లాభదాయకం కాదు. ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌ల్లో లభిస్తుంది.

ప్రధాన ఇనుము ఉత్పత్తి మేఖలలు (బెల్ట్‌లు): * ఒడిశా-ఝార్ఖండ్ బెల్ట్ * దుర్గ్-బస్తర్-చంద్రపుర్ బెల్ట్ * బళ్లారి-చిత్రదుర్గ-చిక్‌మగళూరు-తుమకూర్ బెల్ట్ * మహారాష్ట్ర-గోవా బెల్ట్. ఇవేకాకుండా ఒడిశాలోని బడంపహార్, ఛత్తీస్‌గఢ్‌లోని బైలడిల్లా, కర్ణాటకలో కుద్రేముఖ్, కెమ్మంగుడి, చిక్‌మగళూరు, బాబాబుడాన్ కొండలు, షిమోగా, చిత్రదుర్గ; ఆంధ్రప్రదేశ్‌లో ఓబులాపురం, కడప, కర్నూల్, కృష్ణా, అనంతపురం జిల్లాలు; తెలంగాణలో ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఇనుప ఖనిజం ఉంది.



రచయిత: గోపగోని ఆనంద్

మహిళా విద్య ప్రోత్సాహానికి నిజుత్ మొయినా!

భారత ఆర్థిక వ్యవస్థ మరో అయిదేళ్ల నాటికి రెట్టింపు అవుతుందని నీతిఆయోగ్ అంచనా వేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో జమ్ము-కశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ గెలవగా, హరియాణాలో భాజపా హ్యాట్రిక్ కొట్టింది. వ్యవసాయానికి సంబంధించిన జాతీయ పథకాలన్నింటినీ సంఘటితం చేయాలని కేంద్రం నిర్ణయించింది. ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ బిహార్‌లో సొంత పార్టీ ప్రారంభించి ప్రత్యక్ష రాజకీయాల్లోకి దిగారు. ఇలాంటి జాతీయ స్థాయి వర్తమాన వ్యవహారాలు, అంతర్జాతీయ పరిణామాల్లోని వార్తాంశాలను పోటీ పరీక్షార్థులు తెలుసుకుంటూ ఉండాలి. ఇటీవల వెల్లడైన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల గణాంకాలు, ఈ ఏడాది నోబెల్ విజేతలు, సినీ రంగ అవార్డులు, విదేశీ వ్యవహారాలు, ప్రభుత్వం చేసే నియామకాలు, కంపెనీలు కొత్తగా ఎంచుకున్న ప్రచార కర్తలు, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రారంభించిన కొత్త పథకాలు, వాటి ఉద్దేశాలపై అవగాహనతో ఉండాలి.



బంజారా విరాసత్ మ్యూజియాన్ని ప్రారంభిస్తున్న మోదీ

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు

1. సౌర విద్యుత్తు ఉత్పత్తి కోసం ఏ దేశ ప్రభుత్వం రైల్వేట్రాక్‌పై తొలిసారి రిమూవబుల్ సోలార్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది?
1) రష్యా 2) కెనడా
3) స్విట్జర్లాండ్ 4) అమెరికా

2. ఇటీవల భారత్‌లో పర్యటించిన మాల్దీవుల అధ్యక్షుడు?
1) మహ్మద్ ముయిజ్జు
2) ఇబ్రహీం మహమ్మద్ సోలిహ్
3) అబ్దుల్లా యమీన్ 4) మహమ్మద్ నషీద్

3. కిందివాటిలో సరైంది?
ఎ) ఇటీవల వెల్లడైన హరియాణా ఎన్నికల ఫలితాల్లో బీజేపీ 48 సీట్లు నెగ్గింది.
బి) హరియాణాలో మొత్తం అసెంబ్లీ స్థానాలు 90.
సి) ఇటీవల ఎన్నికలు జరిగిన జమ్ము-కశ్మీర్ అసెంబ్లీ స్థానాలు 90.
డి) జమ్ము-కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 49 సీట్లు నెగ్గింది.
నోట్: జమ్ము-కశ్మీర్ ఎన్నికల్లో బీజేపీ 29 సీట్లు నెగ్గింది.
1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి
3) ఎ, బి, సి 4) ఎ, సి, డి

4. ఇటీవల జమ్ము-కశ్మీర్ ఎన్నికల్లో నెగ్గిన నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) పార్టీ ఎన్నికల గుర్తు ఏమిటి?
1) పుస్తకం 2) నాగలి 3) ఏనుగు 4) పులి

5. కిందివాటిలో సరైంది?
ఎ) ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ అవార్డ్స్ 24వ ఎడిషన్‌లో ఉత్తమ చిత్రం - యానిమల్
బి) ఉత్తమ దర్శకులు - విధు వినోద్ చోప్రా (12th ఫెయిల్)
సి) ఉత్తమ నటుడు - షారుక్ ఖాన్ (జవాన్)
డి) ఉత్తమ నటి - రాణి ముఖర్జీ (మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే)
1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి
3) బి, సి, డి 4) ఎ, సి, డి

6. గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్ - 2024లో భారతదేశం ర్యాంకు ఎంత?
1) 40 2) 39 3) 64 4) 42
నోట్: తొలిస్థానాలు-స్విట్జర్లాండ్, స్వీడన్, యునైటెడ్ స్టేట్స్.

7. ఏ సంవత్సరం నాటికి భారత ఆర్థిక వ్యవస్థ రెట్టింపు అవుతుందని నీతిఆయోగ్ సీఈఓ బి.వి.ఆర్. సుబ్రహ్మణ్యం తెలిపారు?
1) 2040 2) 2035 3) 2030 4) 2050

8. 'షాహెద్ - 136బి డ్రోన్' ఏ దేశానికి చెందింది?
1) ఇరాన్ 2) ఖతర్
3) సౌదీ అరేబియా 4) యూఏఈ

9. వెనెజువెలాలో ప్రజాస్వామ్యాన్ని కాపాడటం కోసం చేస్తున్న కృషికి గాను ఎవరికి యూరోపియన్ మానవ హక్కుల అవార్డు వచ్చింది?
1) జునా గ్వైడో 2) నికోలస్ మదురో
3) హ్యూగో చావెజ్ 4) మరియా కొరినామచడో

10. 2025లో ప్రపంచ తొలి ఖోఖో వరల్డ్ కప్ ఏ దేశంలో జరుగుతుంది?
1) చైనా 2) జపాన్ 3) ఇండియా 4) కెనడా

11. బ్యాంక్ ఆఫ్ బరోడా తన గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎవరిని నియమించింది?
1) సచిన్ తెందూల్కర్ 2) ధోని
3) కోహ్లీ 4) రోహిత్ శర్మ

12. ఇటీవల రిటైర్మెంట్ ప్రకటించిన దీపా కర్మాకర్ (త్రిపుర) ఏ క్రీడకు చెందినవారు?
1) గోల్ఫ్ 2) జిమ్నాస్ట్
3) బాక్సింగ్ 4) రెజ్లింగ్

13. కిందివారిలో ఎవరికి రసాయన శాస్త్రంలో 2024లో నోబెల్ పురస్కారం రాలేదు?
1) జాన్.జె.హాప్‌ఫీల్డ్ 2) డేమిస్ హసాబిస్
3) జాన్ ఎం.జంపర్ 4) డేవిడ్ బెకర్

14. కిందివారిలో ఎవరికి వైద్య విభాగంలో 2024లో నోబెల్ వచ్చింది?
1) జాన్.జె.హాప్‌ఫీల్డ్ 2) జెఫిరీఈ హింటన్
3) జాన్ ఎం.జంపర్ 4) విక్టర్ అంబ్రోస్

15. బంజారా విరాసత్ మ్యూజియాన్ని మోదీ ఇటీవల ఏ రాష్ట్రంలో ప్రారంభించారు?
1) గుజరాత్ 2) రాజస్థాన్
3) మహారాష్ట్ర 4) గోవా

16. కిందివాటిలో సరైంది?
ఎ) డ్రగ్స్ ముప్పును ఎదుర్కోవడానికి హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు ఇటీవల 'సంకల్ప్ కార్యక్రమం' ప్రారంభించారు.
బి) ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌సాయి వాటర్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పన కోసం 'జల్-జాగర్ మహోత్సవ్' కార్యక్రమం ప్రారంభించారు.
సి) అటవీ ప్రాంతాన్ని సంరక్షించడం కోసం 'గ్రీన్ మేఘాలయ ప్లస్' పథకాన్ని మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా ఇటీవల ప్రారంభించారు.
డి) డిగ్రీ చదివే అమ్మాయిలకు నెలకు రూ. 1250, పీజీ అమ్మాయిలకు నెలకు రూ. 2500, 11-12 తరగతులు చదువుతున్న బాలికలకు నెలకు రూ. 1000 ఇచ్చే 'నిజుత్ మొయినా' పథకాన్ని ఇటీవల అస్సాం రాష్ట్రం ప్రారంభించింది. (మహిళా విద్యకు ప్రోత్సాహం, బాల్యవివాహాలను అరికట్టడం కోసం)
1) ఎ, బి, సి 2) ఎ, బి, డి
3) ఎ, బి, సి, డి 4) సి, డి

17. మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చే 'కిశోర్ కుమార్ సమ్మాన్ - 2023' అవార్డు ఎవరికి వచ్చింది?
1) చిరంజీవి 2) షారుక్ ఖాన్
3) రాజ్‌కుమార్ హిరానీ 4) రాజమౌళి

18. ఇటీవల జీఐ ట్యాగ్ పొందిన 'మయిబ్రా జౌ బిడ్వీ' ఏ రాష్ట్ర ఉత్పత్తి?
1) మణిపుర్ 2) మేఘాలయ
3) అస్సాం 4) త్రిపుర
నోట్: ఇటీవల అస్సాం రాష్ట్రానికి చెందిన ఎనిమిది ఉత్పత్తులకు జీఐ ట్యాగ్ వచ్చింది.

19. ఇటీవల బిహార్‌లో జన్ సురాజ్ పార్టీ (జేఎస్‌పీ)ని ఎవరు ఏర్పాటు చేశారు?
1) నీతీష్ కుమార్ 2) ప్రశాంత్ కిశోర్
3) జితన్ రామ్ మాంఝీ
4) లాలూప్రసాద్ యాదవ్

20. బీసీసీఐ యాంటీ కరప్షన్ యూనిట్ చీఫ్‌గా ఎవరు నియమితులయ్యారు?
1) శరద్ కుమార్ 2) రంజిత్ కుమార్
3) అరవింద్ కుమార్ 4) నళిన్ కుమార్

21. ఏటా 'వరల్డ్ కాటన్ డే'ని ఎప్పుడు నిర్వహిస్తారు?
1) అక్టోబరు 8 2) అక్టోబరు 7
3) అక్టోబరు 4 4) అక్టోబరు 10
(2024 థీమ్ - కాటన్ ఫర్ గుడ్)

22. కిందివాటిలో సరైంది?
ఎ) జర్మనీలో భారత రాయబారిగా అజిత్ వినాయక్ గుప్తే నియమితులయ్యారు.
బి) ఫ్రాన్స్‌లో భారత రాయబారిగా సంజీవ్ కుమార్ సింగ్లా నియమితులయ్యారు.
సి) నాబార్డు తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్‌గా బి.ఉదయ భాస్కర్ నియమితులయ్యారు.
డి) ఆర్‌బీఐ కొత్త ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అవిరాల్ జైన్ నియమితులయ్యారు.
ఇ) ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ రాజేశ్వరరావు పదవీ కాలాన్ని కేంద్ర ప్రభుత్వం ఏడాది పొడిగించింది.
1) ఎ, బి, సి 2) ఎ, బి, సి, ఇ
3) ఎ, బి, సి, డి 4) ఎ, బి, సి, డి, ఇ

23. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) ప్రభుత్వ అధినేతల సమావేశం అక్టోబరు 15, 16 తేదీల్లో ఎక్కడ జరిగింది?
1) ఇరాన్ 2) బెలారస్ 3) చైనా 4) పాకిస్థాన్

24. చాగోస్ దీవుల సార్వభౌమత్వాన్ని మారిషస్‌కు బదిలీ చేయడానికి ఇటీవల అంగీకరించిన దేశం?
1) అమెరికా 2) ఫ్రాన్స్
3) జపాన్ 4) యునైటెడ్ కింగ్‌డమ్

25. వరల్డ్ టాలెంట్ ర్యాంకింగ్ 2024లో ఇండియా ర్యాంకు ఎంత?
1) 89 2) 48 3) 68 4) 58
నోట్: మొదటి రెండు ర్యాంకులు వరుసగా స్విట్జర్లాండ్, సింగపూర్ దక్కించుకున్నాయి.

26. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ 92వ వార్షికోత్సవం సందర్భంగా మెగా ఎయిర్ షో ఇటీవల ఎక్కడ జరిగింది?
1) కాకినాడ బీచ్, ఏపీ 2) విశాఖ బీచ్, ఏపీ
3) మెరీనా బీచ్ (చెన్నై), తమిళనాడు
4) పూరీ బీచ్, ఒడిశా

27. వ్యవసాయ రంగంలోని అన్ని కేంద్ర పథకాలను ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, క్రిషోన్నతి యోజన అనే రెండు పథకాల్లో విలీనం చేయాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. అయితే ఈ రెండు పథకాలు వరుసగా ఏయే సంవత్సరాల్లో ప్రారంభమయ్యాయి?
1) 2007-08, 2005 2) 2008-09, 2008
3) 2006-07, 2004 4) 2008-09, 2010

28. 26 మందితో కలిపి కేంద్రం నియమించిన ఆర్థికవేత్త బిశ్వనాథ్ నేతృత్వంలోని కమిటీ ఇటీవల జీడీపీ గణాంకాలకు సంబంధించి ప్రస్తుతం ఉన్న ఆధార సంవత్సరం 2011-12 బదులుగా ఏ ఏడాదిని తీసుకోవాలని ప్రతిపాదించింది?
1) 2020-21 2) 2022-23
3) 2023-24 4) 2019-20
నోట్: 2022-23 ఆధార సంవత్సరం ధరలతో తొలి గణాంకాలు 2026, ఫిబ్రవరిలో వెలువడతాయి.

29. బాబా అటామిక్ రిసెర్చ్ సెంటర్, ఈసీఐఎల్, ఇతర పారిశ్రామిక సంస్థల సాయంతో ఆసియాలోనే అతి పెద్దదైన గామా-రే ఇమేజింగ్ టెలిస్కోపును 4,300 మీటర్ల ఎత్తులో ఉన్న హన్లే అనే ప్రాంతంలో ఏర్పాటు చేశారు. ఇది ఎక్కడ ఉంది?
1) జమ్ము-కశ్మీర్ 2) లద్దాఖ్
3) పుదుచ్చేరి 4) అండమాన్ నికోబార్ దీవులు

30. 'ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన' కింద ఎప్పటి వరకు ఉచిత పోర్టిఫైడ్ బియ్యం సరఫరా చేయాలని కేంద్రం నిర్ణయించింది?
1) 2025, డిసెంబరు 2) 2024, డిసెంబరు
3) 2028, డిసెంబరు 4) 2030, డిసెంబరు

31. అణ్వాయుధాల రహిత ప్రపంచం కోసం కృషికి గుర్తింపుగా 2024కి నోబెల్ శాంతి బహుమతి పొందిన నిహన్ హిడాంక్యో ఏ దేశానికి చెందిన సంస్థ?
1) అమెరికా 2) దక్షిణ కొరియా 3) జపాన్ 4) రష్యా


32. ఇటీవల మరణించిన రతన్ టాటాకు ఏ సంవత్సరంలో పద్మవిభూషణ్ వచ్చింది?
1) 2009 2) 2008 3) 2000 4) 2011

33. దక్షిణ కొరియా రచయిత అయిన ఎవరికి ఇటీవల 2024 నోబెల్ సాహిత్య బహుమతి వచ్చింది?
1) చో యున్ 2) చోయ్ ఇన్ - హూ
3) షిన్ క్యుంగ్ - సూక్ 4) హాన్‌కాంగ్

34. ఇటీవల ఏషియన్, ఇండియా 21వ సమావేశం ఎక్కడ జరిగింది?
1) వియంటియాన్ (లావోస్)
2) జకార్త (ఇండొనేసియా)
3) బందర్ సెరీభగవాన (బ్రూనై)
4) నాంపెన్ (కంబోడియా)

35. మహిళల్లో రొమ్ముక్యాన్సర్‌ని తక్కువ ఖర్చుతో ముందస్తుగా గుర్తించే సాధనాన్ని ఇటీవల ఏ ఐఐటీ అభివృద్ధి చేసింది?
1) ఐఐటీ ఖరగ్‌పూర్ 2) ఐఐటీ ఇందౌర్
3) ఐఐటీ మద్రాస్ 4) ఐఐటీ బొంబాయి

36. ఇటీవల వార్తల్లో నిలిచిన "టవర్ ఆఫ్ సైలెన్స్" అంటే..
1) నూతన యుద్ధ విమానం
2) పార్సీల అంత్యక్రియల పద్ధతి
3) నూతన సూపర్ కంప్యూటర్
4) ఏఐతో నడిచే కారు



రచయిత: బి. ధన్‌మోహన్ రెడ్డి

సమాధానాలు

1-3, 2-1, 3-3, 4-2, 5-1, 6-2, 7-3, 8-1, 9-4, 10-3, 11-1, 12-2, 13-1, 14-4, 15-3, 16-3, 17-3, 18-3, 19-2, 20-1, 21-2, 22-4, 23-4, 24-4, 25-4, 26-3, 27-1, 28-2, 29-2, 30-3, 31-3, 32-2, 33-4, 34-1, 35-2, 36-2.

భారతదేశంలో జనాభా గణాంకాలు

జనాభా గణన అనేది ఒక క్రమబద్ధమైన ప్రక్రియ. దేశ గణాంక వ్యవస్థలో ఇది కీలక భాగం. ఒక దేశ జనాభాకి సంబంధించిన సమాచారాన్ని సేకరించడం, విశ్లేషించడం లాంటి చర్యలు ఇందులో ఉంటాయి. ఇది ముఖ్యంగా దేశ జనాభా పరిమాణం, పంపిణీ, లక్షణాలు తదితర వివరాలను అందిస్తుంది. వీటి ఆధారంగానే ప్రభుత్వ ప్రయోజనాలు ప్రజలకు చేరువవుతాయి.



ప్రయోజనాలు చేరువ కావాలంటే..

జనాభా గణాంకాలే ఆధారం!

ఏపీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ ఎకానమీ

ప్రపంచ విస్తీర్ణంలో భారతదేశ వాటా 2.4 శాతం. 2011 జనాభా లెక్కల ప్రకారం మన దేశ జనాభా ప్రపంచ జనాభాలో 17.5 శాతం వాటా కలిగి ఉంది.

- యూఎన్‌పీఎఫ్ - స్టేట్ ఆఫ్ ది వరల్డ్ పాపులేషన్ నివేదిక 2024 ప్రకారం 2024 నాటికి మొత్తం భారతదేశ జనాభా 144.17 కోట్లకు చేరిందని అంచనా. ప్రస్తుతం జనాభాపరంగా భారతదేశం ప్రపంచవ్యాప్తంగా మొదటి స్థానంలో ఉండగా, చైనా (142.52 కోట్లు) రెండో స్థానంలో నిలిచింది.

జనాభా పెరుగుదల దశలు

భారతదేశంలో జనాభా పెరుగుదలను నాలుగు దశల్లో పేర్కొంటారు. **అవి:**

మొదటి దశ (1891–1921): ఈ దశలో జనాభా పెరుగుదలలో పెద్దగా మార్పు కనిపించలేదు. దీన్ని స్తబ్దతతో కూడిన జనాభా వృద్ధిగా పిలుస్తారు.

- 1891-1921 మధ్య కాలంలో జనాభా పెరుగుదల 1.5 కోట్లుగా ఉంది. ఈ సమయంలో జనాభా వార్షిక పెరుగుదల రేటు 0.19% మాత్రమే.

రెండో దశ (1921–51): దీన్ని క్రమవృద్ధి దశగా పేర్కొంటారు. 1921-51 మధ్య కాలంలో జనాభా 11 మిలియన్లు పెరిగింది. సగటు జనాభా పెరుగుదల రేటు 1.22 శాతంగా ఉంది. దీనికి కారణం మరణాలు తగ్గడం.

- రెండో దశలో భారతదేశ జనాభా పరిణామ దశలోకి ప్రవేశించింది. 1921వ సంవత్సరాన్ని "గొప్ప విభజన సంవత్సరం" (Year of the Great Divide) అంటారు.

మూడో దశ (1951–81): ఈ దశలో జనాభా వేగంగా పెరిగింది. అందుకే దీన్ని 'సత్వర అధికవృద్ధి' దశ అని కూడా అంటారు.

- 1951-81 కాలంలో జనాభా 32.22 మిలియన్లు పెరిగింది. అంటే సగటున ఏడాదికి 2.14 శాతం చొప్పున జనాభా అధికమైంది.
- మూడో దశలో 'జనాభా విస్ఫోటనం' ఏర్పడింది. ఈ కాలంలో జననాల రేటు అధికమై, మరణాల రేటు బాగా తగ్గింది.
- 1951 నుంచి ప్రతి దశాబ్దంలో జనాభా పెరుగుదల రేటు 20% పైన నమోదైంది. దీంతో 1951ను 'చిన్న విభజన సంవత్సరం' (Year of Small Divide) అంటారు.

నాలుగో దశ (1981–2011): ఈ దశలో జనాభా 52.8 కోట్లు పెరిగింది. జనాభా వృద్ధి రేటు 1.8 శాతంగా నమోదైంది.

- 1981-91 మధ్య జనాభా 16 కోట్లు పెరగ్గా, జనాభా వృద్ధి రేటు 2.11 శాతంగా నమోదైంది.
- 1991-2001 మధ్య జనాభా 18.3 కోట్లు పెరిగి, జనాభా వృద్ధి రేటు 1.9 శాతంగా నమోదైంది.
- 2001-11 మధ్య జనాభా 18.1 కోట్లు పెరిగి, జనాభా వృద్ధి రేటు 1.64%గా నమోదైంది.
- నాలుగో దశలో జనాభా పెరుగుదల ఉన్నప్పటికీ జనాభా పెరుగుదల రేటు తగ్గింది. అందుకే ఈ దశను "తగ్గుతుందనే సంకేతాలతో కూడిన అధిక వృద్ధి" అంటారు.

భారతదేశ జనాభా గణాంకాలు

సంవత్సరం	మొత్తం జనాభా (కోట్లలో)	సగటు జనాభా వార్షిక వృద్ధి రేటు (శాతాల్లో)
1891	23.6	-
1901	23.6	0.30
1911	25.2	0.50
1921	25.1	(-)0.03
1931	27.9	1.06
1941	31.9	1.34
1951	36.10	1.25
1961	43.92	1.96
1971	54.81	2.22
1981	68.33	2.20
1991	84.64	2.14
2001	102.87	1.95
2011	121.08	1.63
2016	129.10	1.28
2021	136.3	1.08
2022	141.2	-
2023	142.9	-
2024	144.17	-
2026	142.59 (అంచనా)	0.90
2031	147.87 (అంచనా)	0.73
2036	152.22 (అంచనా)	0.58

ఆధారం: నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ (ఎన్ఎస్ఓ) నివేదిక-2023, యూఎన్‌పీఎఫ్ - స్టేట్ ఆఫ్ ది వరల్డ్ పాపులేషన్ నివేదిక 2024

భారత్‌లో జనాభా తీరుతెన్నులు

- 1921 కంటే ముందు మన దేశంలో జనాభా పెరుగుదల చాలా స్వల్పంగా ఉంది.
- కరవులు, అంటువ్యాధుల కారణంగా 1911-21 దశాబ్దంలో జనాభా అంతగా వృద్ధి చెందలేదు.
- 1901-51 కాలంలో దేశ జనాభా 12 కోట్లు మాత్రమే పెరిగింది. అయితే తర్వాతి 30 ఏళ్లలో (1951-81 మధ్య) 32.5 కోట్లు పెరిగింది.
- 1981-91, 1991-2001 కాలంలో జనాభా పెరుగుదలలో తిరోగమనం నమోదైంది.
- దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 1951లో తొలిసారిగా జనాభా లెక్కల సేకరణ జరిగింది. అప్పుడు భారతదేశ జనాభా 36.10 కోట్లు.
- 2011లో 121.08 కోట్లు, 2024లో 144.17 కోట్లకు పెరిగింది. ఎన్ఎస్ఓ - ఉమెన్ అండ్ మెన్ ఇండియా 2024 నివేదిక ప్రకారం 2026లో దేశం మొత్తం జనాభా 142.87 కోట్లకు, 2036 నాటికి 152.22 కోట్లకు పెరుగుతుందని అంచనా.

భారతదేశంలో పురుషులు, స్త్రీ జనాభా

సంవత్సరం	పురుషులు (కోట్లలో)	స్త్రీలు (కోట్లలో)	సగటు వార్షిక జనాభా వృద్ధి రేటు	
			పురుషులు (శాతం)	స్త్రీలు (శాతం)
1951	18.55	17.55	1.24	1.26
1961	22.62	21.29	1.98	1.93
1971	28.40	26.41	2.27	2.15
1981	35.33	32.99	2.18	2.23
1991	43.93	40.70	2.18	2.10
2001	53.22	49.65	1.92	1.99
2011	62.32	58.75	1.58	1.69
2016	66.41	62.68	1.27	1.30
2021	70.06	66.23	1.07	1.10
2026	73.20	69.38	0.88	0.93
2031	75.81	72.06	0.70	0.76
2036	77.97	74.25	0.56	0.60

ఆధారం: ఎన్ఎస్ఓ - ఉమెన్ అండ్ మెన్ ఇండియా - 2024 నివేదిక

భారతదేశంలో లింగ నిష్పత్తి

- లింగ నిష్పత్తి అంటే ప్రతి 1000 మంది పురుషులకు ఎంతమంది స్త్రీలు ఉన్నారో తెలిపేది.
- 1951లో ప్రతి 1000 మంది పురుషులకు 946 మంది స్త్రీలు ఉన్నారు. ఈ సంఖ్య 1961లో 941, 1971లో 930, 1981లో 934, 1991లో 926, 2001లో 933, 2011లో 943, 2016లో 944 (అంచనా), 2021లో 945 (అంచనా), 2026లో 948 (అంచనా), 2031లో 951 (అంచనా), 2036లో 952 (అంచనా)గా ఉంది.
- **ఆధారం:** ఎన్ఎస్ఓ - ఉమెన్ అండ్ మెన్ ఇండియా - 2024 నివేదిక

శ్రామిక వయసు జనాభా

- 15-59 వయసు మధ్య జనాభాను శ్రామిక శక్తిగా పేర్కొంటారు.
- 2011లో మొత్తం జనాభా 121.09 కోట్లు ఉండగా, అందులో శ్రామికుల సంఖ్య 7.35 కోట్లుగా ఉంది.
- 2016లో 129.11 కోట్ల జనాభా ఉండగా, వారిలో పని చేసేవారి సంఖ్య 8.10 కోట్లు.
- 2021లో జనాభా 136.90 కోట్లు కాగా, శ్రామికుల సంఖ్య 8.75 కోట్లు.
- 2026లో జనాభా 142.59 కోట్లు (అంచనా), శ్రామికులు 9.23 కోట్లు (అంచనా)
- 2031లో జనాభా 147.88 కోట్లు (అంచనా), పనిచేసేవారి సంఖ్య 9.62 కోట్లు (అంచనా).
- 2036లో జనాభా 152.23 కోట్లు (అంచనా), శ్రామికుల సంఖ్య 9.88 కోట్లు (అంచనా).
- **ఆధారం:** ఎన్ఎస్ఓ - ఉమెన్ అండ్ మెన్ ఇండియా - 2024 నివేదిక

2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో అధిక/ తక్కువ జనాభా కలిగిన ప్రాంతాలు

అధిక జనాభా రాష్ట్రాలు:

1. ఉత్తర్ ప్రదేశ్: 19.98 కోట్లు (16.49%)
2. మహారాష్ట్ర: 11.24 కోట్లు (9.29%)
3. బిహార్: 10.41 కోట్లు (8.58%)
4. పశ్చిమ్ బెంగాల్: 9.13 కోట్లు (7.55%)
5. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్: 8.46 కోట్లు (7%)

తక్కువ జనాభా కలిగిన రాష్ట్రాలు:

1. సిక్కిం: 6.11 లక్షలు
2. మిజోరాం: 10.97 లక్షలు
3. అరుణాచల్ ప్రదేశ్: 13.83 లక్షలు
4. గోవా: 14.58 లక్షలు
5. నాగాలాండ్: 19.78 లక్షలు

జనాభా వృద్ధిరేటు

ఒక నిర్దిష్ట ప్రదేశంలో రెండు కాలాల్లో (దశాబ్దం, వార్షిక) పెరిగే జనాభాను జనాభా వృద్ధి అంటారు.

సంవత్సరం	దశాబ్ద జనాభా వృద్ధి రేటు (%)	వార్షిక జనాభా వృద్ధి రేటు (%)
1911	5.75	0.56
1921	(-)0.31	(-)0.03
1931	11	1.04
1941	14.22	1.33
1951	13.31	1.26
1961	21.64	1.96
1971	24.80	2.25
1981	24.60	2.22
1991	23.87	2.16
2001	21.54	1.97
2011	17.72	1.64

అధిక జనాభా గల కేంద్రపాలిత ప్రాంతాలు:

1. దిల్లీ: 1.68 కోట్లు
2. పాండిచ్చేరి: 12.47 లక్షలు
3. చండీగఢ్: 10.55 లక్షలు
4. అండమాన్: 3.80 లక్షలు

తక్కువ జనాభా ఉన్న కేంద్రపాలిత ప్రాంతాలు:

1. లక్షదీవులు: 64,473
2. డామన్ డయ్యూ: 2.43 లక్షలు
3. దాద్రానగర్ హవేలి: 3.43 లక్షలు

- 2011లో అధిక జనాభా గల జిల్లా మహారాష్ట్రలోని థానే (1.10 కోట్లు)
- తక్కువ జనాభా ఉన్న జిల్లా అరుణాచల్ ప్రదేశ్‌లోని ది బాంగ్ వ్యాలీ (7,900).



రచయిత
బండారి ధనుంజయ
విషయ నిపుణులు

442 Word of the Day

Pernicious

Telugu meaning: హానికర, ప్రమాదకర

English meaning: The word 'pernicious' is an adjective that describes something that is harmful in a gradual or subtle way.

Synonyms: Harmful, Destructive

Antonyms: Beneficial, Harmless

Usage: 1. The pernicious effects of smoking often go unnoticed until serious health issues arise.

2. False rumours can have a pernicious influence on a person's reputation over time.

Latest Updates

Junior Executive Posts

National Thermal Power Corporation Limited (NTPC) invites applications for filling up the 50 Junior Executive (Biomass) on a fixed term basis. The application fee is Rs.300. Eligible candidates can apply online before 28 October 2024.

Executive Posts

India Post Payments Bank Limited (IPPB) requires 344 Gramin Dak Sevaks on engagement from DoP to perform direct sales and related activities at various offices of the Bank as per the requirements of the Bank. The application fee is Rs.750. The last date for online application is 31 October 2024.

Medical Posts

Ex-Servicemen Contributory Health Scheme Station (ECHS), Secunderabad invites applications for filling up Medical, Paramedical and Non-Medical posts on a contractual basis. The total number of posts is 102. Eligible candidates can apply online before 20 October 2024.

Faculty Posts

Employees State Insurance Corporation (ESIC) Hospital in Alwar, Rajasthan is conducting interviews to recruit faculty posts on a contractual basis. The total number of posts is 104. The application fee is Rs.225. Eligible candidates can appear in the interview on 21 October 2024.

Did You Apply..?


Today (October 17) is the last date for the following Posts/ Apprentice

Indian Army - 141th Technical Graduate Course. ***Qualification:*** Engineering Degree.

38 Apprentice posts in Indian Rare Earths Limited (IREL-India), Tamil Nadu. ***Qualification:*** ITI, Diploma, B.Sc Degree (Chemistry), BE/BTech.

For more information and other notifications - scan QR code

ఈ-బుక్ (ఇండియన్ పాలిటీ)



లోక్‌సభను దిగువ సభ, ప్రజాప్రతినిధుల సభ, అనిశ్చిత సభగా పేర్కొంటారు. మన దేశం పార్లమెంటరీ విధానాన్ని అనుసరిస్తుంది. పార్లమెంట్‌లో భాగమైన లోక్‌సభలో మెజారిటీ సాధించిన వారు కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారు.

☛ లోక్‌సభ - రాజ్యాంగ వివరణ, డీలిమిటేషన్ కమిటీ, ఎస్సీ-ఎస్టీ వర్గాల రిజర్వేషన్లు, ప్రస్తుతం లోక్‌సభలో వివిధ రాష్ట్రాలకు కేటాయించిన స్థానాలు, లోక్‌సభ పదవీకాలం మొదలైన అంశాల విశ్లేషణ, మాదిరి ప్రశ్నలు ఈ-బుక్‌లో ఉన్నాయి.

చదవడం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Current Affairs



James Daron Simon

The 2024 Nobel Economics Prize was awarded to Daron Acemoglu, Simon Johnson and James A. Robinson for research into differences in prosperity between nations on 14 October 2024. The three economists "have demonstrated the importance of societal institutions for a country's prosperity," the Nobel committee of the Royal Swedish Academy of Sciences said.

☛ The economics prize is formally known as the Bank of Sweden Prize in Economic Sciences in Memory of Alfred Nobel.



Noel Naval Tata (67) was unanimously appointed as Chairman of Tata Trusts and all trusts covered under it on 11 October 2024. He succeded Ratan Tata. Tata Trusts has a 66 percent stake in Tata Sons, the parent company of the $165-billion salt-to-software conglomerate.

India was ranked 105th in the Global Hunger Index (GHI) 2024 with a score of 27.3. GHI score places India in 'serious' hunger category. A total of 127 countries are present in this index. The index is published by Concern Worldwide, an Irish humanitarian organisation, and Welthungerhilfe, a German aid agency.

The International Day for the Eradication of Poverty is observed every year on October 17.

☛ ***2024 theme:*** "Decent Work and Social Protection: Putting dignity in practice for all"

For more Current Affairs: Scan QR code

Bank Exams English

Rearrangement of Phrases

Directions (Qs.1 - 9): *Rearrange the following phrases of a sentence in the correct order.*

1. 1. offering innovative and automated solutions
2. AI has rapidly advanced in the last decade,
3. transforming various industries,
4. to address complex real-world problems
5. and improving efficiency on a large scale.

A) 21435 B) 12534 C) 23145 D) 13425 E) 24135

2. 1. global trade agreements can help in
2. fostering strong economic ties
3. between nations by reducing tariffs
4. while encouraging cross-border cooperation
5. and boosting mutual economic growth.

A) 12345 B) 31425 C) 23145 D) 14235 E) 12534

3. 1. have become essential in modern times
2. personalized marketing strategies which are widely used
3. for targeting specific customer segments
4. with data-driven content to increase engagement
5. and building long-term brand loyalty online.


A) 12435 B) 51234 C) 21345 D) 23145 E) 14523

4. 1. play a pivotal role in creating sustainable energy solutions
2. to reduce global dependence on non-renewable resources
3. solar and wind power generation technologies
4. while lowering carbon emissions significantly
5. and ensuring a greener future for the planet.

A) 12435 B) 34125 C) 54312 D) 13245 E) 31425

5. 1. access to vaccines and health initiatives worldwide
2. is crucial for combating the spread of diseases
3. especially in underdeveloped regions
4. where public health infrastructure is lacking
5. and ensuring better health outcomes globally.

A) 23145 B) 12345 C) 21435 D) 45123 E) 12435



6. 1. allowing workers to manage tasks from home
2. for employees around the globe
3. due to advancements in digital communication technologies
4. remote work has emerged as a flexible option
5. while maintaining a healthy work-life balance.

A) 42315 B) 12435 C) 34125 D) 51234 E) 43125

7. 1. rapid urbanization has significantly contributed
2. and leading to a higher demand for housing
3. causing increased pressure on public infrastructure
4. to the population growth of major cities
5. especially in developing economies.

A) 13245 B) 14235 C) 31425 D) 51234 E) 24135

8. 1. new technologies have enabled significant advancements
2. in our understanding of deep space exploration
3. providing insights into distant galaxies
4. and helping to uncover mysteries of the universe
5. far beyond our solar system.


A) 24135 B) 13425 C) 21345 D) 31245 E) 45123

9. 1. where environmental degradation is rampant.
2. are needed urgently to prevent deforestation
3. and conserve natural resources in critical areas
4. especially in biodiversity hotspots across the world
5. stronger environmental policies and regulations

A) 35241 B) 45321 C) 25431 D) 52341 E) 53421

Scan the QR code for the Key

Writer: *P. Manoj Kumar, Subject Expert*



ఇంటర్మీడియట్ తర్వాత ఉన్న కెరియర్ మార్గాల్లో విదేశీ భాషలనూ పరిశీలించవచ్చు. ఎన్నో విశ్వవిద్యాలయాలు యూజీలో భాగంగా అందిస్తున్నాయి. ఇంటర్ ఏ గ్రూపు విద్యార్థులైనా చేరవచ్చు. ఈ భాషల కోసమే ప్రత్యేక సంస్థలూ జాతీయ స్థాయిలో వెలిశాయి. ఏదైనా విదేశీ భాషలో పట్టు సాధించినవారు మేటి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చు. బహుళజాతి సంస్థల విస్తరణతో వీరికి గిరాకీ పెరిగింది.

ఇంటర్ తర్వాత?

విదేశీ భాషలకు వేదికలు ఎన్నో!

నేరుగా విశ్వవిద్యాలయాల ప్రాంగణాల్లోనే యూజీలో భాగంగా విదేశీ భాషలు చదువుకునే సౌకర్యం ఉంది. పలు సంస్థలు ఆనర్స్ విధానంలో బీఏ ఫారిన్ లాంగ్వేజ్ కోర్సులు అందిస్తున్నాయి. ఇంటర్ తర్వాత కొన్ని సంస్థలు అందించే సర్టిఫికెట్ కోర్సుల్లో చేరి అనంతరం డిప్లొమా, ఆ తర్వాత అడ్వాన్స్‌డ్ డిప్లొమా పూర్తిచేసుకోవచ్చు లేదా డిగ్రీలోని మూడు ఐచ్ఛిక సబ్జెక్టుల్లో ఒకటిగా నచ్చిన విదేశీ భాషనూ ఎంచుకోవచ్చు. అలాగే యూజీలో రెండో భాషగానూ తీసుకోవచ్చు. ఇలా కోరుకున్న విధానంలో వీటిని నేర్చుకోవచ్చు. విశ్వవిద్యాలయాల్లో బీఏ ఆనర్స్ కోర్సులో చేరినవాళ్లు మూడేళ్లపాటు సంబంధిత భాషకు చెందిన అంశాలు నేర్చుకుంటారు. వీరు విదేశీ భాష నుంచి ఆంగ్లంలోకి అనువాదం, ఆ భాష వ్యాకరణం, రచనలు మొదలైనవి తెలుసుకుంటారు. ఆ భాష చరిత్ర, సాహిత్యాలను అధ్యయనం చేస్తారు.

ముందుగా చేరిన భాషలో వినడం, చదవడం, మాట్లాడటం, రాయటం నేర్పుతారు. ఆ భాషకు చెందిన దేశ సంస్కృతి, ఆచార వ్యవహారాలపైనా అవగాహన కల్పిస్తారు. యూజీ తర్వాత పీజీ, అనంతరం పీహెచ్‌డీనీ చేయొచ్చు. ఎక్కువ విశ్వవిద్యాలయాలు పీజీ, పీహెచ్‌డీ కోర్సులు అందిస్తున్నాయి. సీయూఈటీతో యూజీ ఆనర్స్ కోర్సుల్లో ప్రవేశాలుంటాయి. ఇందులో జీకే, ఇంగ్లిష్, ఆ భాషకు సంబంధించిన ప్రాథమికాంశాలపై ప్రశ్నలు వస్తాయి.

ఎంచుకోవడమెలా?

ఏ భాషలో ఆసక్తి ఉంది? ఏ దేశంలో ఉన్నత విద్య అభ్యసించాలనుకుంటున్నారు? ఏ విభాగం/దేశంలో సేవలు ఆశిస్తున్నారు? ఏ భాషకు భారత్ లేదా ఇతర దేశాల్లో ఎక్కువ డిమాండ్ ఉంది? అందుబాటులోని విద్యా సంస్థల్లో ఏ భాష నేర్పుతున్నారు? ఇవన్నీ ఆలోచించి మీకు సరిపోయేది ఎంచుకోవచ్చు. ఉన్నత విద్య నిమిత్తం జర్మనీ వెళ్లాలనుకున్నవారు జర్మన్ భాషను నేర్చుకోవడం వల్ల ఆ దేశంలో భాషాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవచ్చు. జపాన్‌లో ఉద్యోగం లక్ష్యమైతే జాపనీస్‌కి ప్రాధాన్యమివ్వడం మెరుగు.

పట్టు చిక్కాలంటే?

మనదేశంలో ఇంగ్లిష్ ఆధారంగా విదేశీ భాషలను నేర్పుతున్నారు. అందువల్ల ముందుగా ఆంగ్లంలో నైపుణ్యం పొందాలి. భాష నేర్చుకోవడంలో పుస్తకాల పాత్ర పరిమితమే. వీలైనప్పుడల్లా ఆ భాషలో మాట్లాడటానికి ప్రయత్నించాలి. కుదిరితే ఆ భాషపై పట్టున్న స్థానికులతో సంభాషించాలి. ఆ భాషలో వీలైనన్ని ఉపన్యాసాలు, వార్తలు వినాలి. సినిమాలు చూడాలి. ఇందుకు యూట్యూబ్, ఓటీటీలు, టీవీ ఛానెళ్లు వేదికగా మలచుకోవచ్చు. కొంత ప్రావీణ్యం పొందిన తర్వాత ఆ భాష వార్తా పత్రికలు, మ్యాగజీన్లు, నవలలు బాగా చదవాలి. భాష ఏదైనప్పటికీ అందులో ప్రావీణ్యానికి.. వినడం, మాట్లాడటం, చదవడం, రాయడం.. ఈ నాలుగూ ఎంతో ముఖ్యం.



ఎక్కడ నేర్చుకోవాలి?

ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ, హైదరాబాద్: విదేశీ భాషల్లో నైపుణ్యం పెంచడానికే ఈ విశ్వవిద్యాలయం నెలకొల్పారు. ఇక్కడ యూజీ, పీజీ, పీహెచ్‌డీ స్థాయిలో కోర్సులు అందిస్తున్నారు. ఈ సంస్థకు లఖ్‌నవూ, షిల్లాంగ్‌ల్లోనూ క్యాంపస్‌లు ఉన్నాయి. హైదరాబాద్ క్యాంపస్‌లో బీఏ (ఆనర్స్)లో భాగంగా.. అరబిక్, ఫ్రెంచ్, జర్మన్, జాపనీస్, రష్యన్, స్పానిష్ కోర్సులను అందిస్తున్నారు. సీయూఈటీ స్కోరుతో సీటు కేటాయిస్తారు. పార్ట్‌టైమ్ విధానంలో అరబిక్, ఫ్రెంచ్, ఇటాలియన్, కొరియన్, జాపనీస్, పర్షియన్, స్పానిష్ భాషలను సర్టిఫికెట్, డిప్లొమా స్థాయిలో ఇక్కడ అందిస్తున్నారు.

ఉస్మానియా యూనివర్సిటీ: ఇంటర్ విద్యార్హతతో ఫ్రెంచ్, జర్మన్, రష్యన్ భాషల్లో ఏడాది వ్యవధితో జూనియర్ డిప్లొమా కోర్సులను ఓయూ అందిస్తోంది. ఇవే భాషల్లో ఏడాది వ్యవధితో సీనియర్ డిప్లొమా కోర్సులూ నడుపుతోంది. అడ్వాన్స్‌డ్ డిప్లొమా కోర్సులనూ ఏడాది వ్యవధితో ఇక్కడ పూర్తిచేసుకోవచ్చు.

జేఎన్‌యూ, న్యూదిల్లీ: బీఏలో.. జాపనీస్, కొరియన్, చైనీస్, ఫ్రెంచ్, జర్మన్, రష్యన్, స్పానిష్, అరబిక్, పర్షియన్ భాషలను అందిస్తోంది.

జామియా మిల్లియా ఇస్లామియా, న్యూదిల్లీ: ఈ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఆనర్స్ విధానంలో బీఏ కొరియన్ లాంగ్వేజెస్, అరబిక్, ఇస్లామిక్ స్టడీ, పర్షియన్ భాషలు చదువుకోవచ్చు.

దిల్లీ యూనివర్సిటీ: ఫ్రెంచ్, జర్మన్, ఇటాలియన్, అరబిక్, పర్షియన్, స్పానిష్ భాషలను బీఏ ఆనర్స్‌లో అందిస్తోంది.

ఆంధ్రా యూనివర్సిటీ: ఫ్రెంచ్‌లో డిప్లొమా, సీనియర్ డిప్లొమా కోర్సులు ఇక్కడ నేర్చుకోవచ్చు.

మణిపాల్ యూనివర్సిటీ: ఇక్కడి బీఏ ఫారిన్ లాంగ్వేజెస్ అండ్ ఇంటర్ కల్చరల్ స్టడీస్ కోర్సులో చేరినవారు ఫ్రెంచ్ లేదా జర్మన్ స్పెషలైజేషన్‌గా తీసుకోవచ్చు. అలాగే స్పానిష్, ఇటాలియన్, జాపనీస్‌లో ఏదో ఒకటి రెండో లాంగ్వేజ్‌గా ఎంచుకోవచ్చు.

ఇగ్నో: అరబిక్, ఫ్రెంచ్, రష్యన్, కొరియన్, స్పానిష్, జర్మన్‌లో సర్టిఫికెట్ కోర్సులను అందిస్తోంది.

అమిటీ యూనివర్సిటీ: ఆనర్స్ విధానంలో బీఏ ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్ కోర్సులు బోధిస్తోంది.

కొన్ని కేంద్రీయ విశ్వవిద్యాలయాలు సీయూఈటీతో బీఏ చైనీస్, జర్మన్ స్టడీస్, కొరియన్ భాషల్లో చేరడానికి అవకాశం కల్పిస్తున్నాయి.



"మాతృభాష కాకుండా ఇంకొక భాష నేర్చుకున్నామంటే ఆ భాష మాట్లాడేవాళ్ల హృదయంలో స్థానం సంపాదించుకున్నట్లే! విదేశీ భాష నేర్చుకునే విషయంలో కూడా ఇదే జరుగుతుంది. ఫ్రెంచ్, స్పానిష్ భాషలు ముఖ్యంగా ప్రపంచంలో చాలా దేశాల్లో మాట్లాడతారు. దానికి ముఖ్య కారణం.. వలసవాదం. ప్రపంచీకరణ నేపథ్యంలో విదేశీభాషలు నేర్చుకోవడం వల్ల బహుళజాతి సంస్థల్లో, ఇంటర్నేషనల్ స్కూల్స్‌లో పని చేయవచ్చు. భాషపై పట్టు ఉంటే అనువాదకులుగా, ఇంటర్‌ప్రెటర్స్‌గా కూడా మంచి అవకాశాలు ఉన్నాయి. ఇప్పుడు ఎక్కువ మందికి ఆంగ్లంలో పరిజ్ఞానం ఉండటంతో విదేశీ భాషలను సులువుగానే నేర్చుకోగలుగుతున్నారు"

– **ప్రొ. హరిబండి లక్ష్మి,** వైస్ ఛాన్సలర్ (ఇన్-ఛార్జ్), ది ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ

ప్రైవేటుగానూ విదేశీ భాషను నేర్చుకోవచ్చు. పలు సంస్థలు ఈ తరహా శిక్షణ ఇస్తున్నాయి. రామకృష్ణ మఠం, హైదరాబాద్‌లో తక్కువ రుసుముతో.. జర్మన్, ఫ్రెంచ్, జాపనీస్, స్పానిష్ భాషలను ప్రాథమిక స్థాయి నుంచి చివరి దశ వరకు నేర్చుకోవచ్చు. భాషల వారీ పేరొందిన సంస్థలూ ఎన్నో ఉన్నాయి. వాటిలో ఎవరైనా చేరవచ్చు.

ఉద్యోగాలెక్కడ?

విదేశీ విద్యలో నైపుణ్యం పొందడమంటే విద్యార్హతలు పెంచుకోవడమే కాదు కెరియర్ పరంగానూ ఒక అడుగు ముందుకెళ్లినట్లే. వ్యాపారం ఎల్లలు దాటి విస్తరించడంతో బహు భాషా నిపుణులకు గిరాకీ ఏర్పడింది. అంతర్జాతీయ వర్తకంలోనే కాదు సాంకేతిక, వినోద రంగాల్లోనూ వీరికి విస్తృత అవకాశాలున్నాయి. ప్రభుత్వ రాయబార కార్యాలయాలు, అంతర్జాతీయ విమానయాన సంస్థలు, విమానాశ్రయాలు, ఆతిథ్య, పర్యాటక రంగాలు, ప్రజా సంబంధ విభాగాల్లో వీరికి ఉద్యోగాలు లభిస్తాయి. బహుళ జాతి కంపెనీలు విస్తరించడంతో అన్ని వర్తక విభాగాల్లోనూ విదేశీ భాషలతో అవసరం ఏర్పడింది. అందువల్ల ఆసక్తి ఉన్నవారు ఏదో ఒక భాషలో నైపుణ్యం పెంచుకుని సుస్థిర కొలువును సొంతం చేసుకోవచ్చు. ప్రావీణ్యం పొందితే ఆన్‌లైన్ వేదికగా ఇంట్లో ఉంటూనే ఉపాధి పొందవచ్చు. ఏదైనా ఫారిన్ లాంగ్వేజ్‌లో పట్టున్నవారు విదేశాల నుంచి వచ్చే అతిథులకు గైడ్‌గా వ్యవహరించవచ్చు. ప్రభుత్వాలకు చెందిన విదేశీ కేంద్రాలు, రాయబార కార్యాలయాలు, విదేశీ మంత్రిత్వ శాఖలు, ఐక్యరాజ్య సమితి విభాగాలు, వివిధ సంస్థల కేంద్రాలు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నాయి. స్థానిక భాషపై పట్టున్నవారికి వీటిలో అవకాశాలుంటాయి.

పేరొందిన పుస్తకాలు, యూజర్ మాన్యువళ్లు, కీలక సమాచారం.. వీటిని మరో భాషలోకి అనువాదం చేసేవారు పెద్దమొత్తంలో సంపాదిస్తున్నారు. హైస్కూల్ స్థాయిలో పలు ప్రైవేటు పాఠశాలల్లో సిలబస్‌తో సంబంధం లేకుండా ఏదో ఒక విదేశీ భాషను విద్యార్థులకు నేర్పుతున్నారు. అలాగే ఫారిన్ లాంగ్వేజ్‌లు నేర్పే శిక్షణ సంస్థలూ పెరుగుతున్నాయి. ప్రముఖ విశ్వవిద్యాలయాలన్నింట్లోనూ ఏదో ఒక విదేశీ భాష అందుబాటులో ఉంది. పలు డిగ్రీ కళాశాలలు ఫారిన్ లాంగ్వేజ్‌లను అందిస్తున్నాయి. ఈ సంస్థల్లో బోధకులుగా అవకాశాలు లభిస్తాయి. ఇంటర్‌ప్రిటర్లుగా వ్యవహరించీ డబ్బు సంపాదించుకోవచ్చు.

హోదాలు?

టూర్ గైడ్, ఫ్లయిట్ అటెండెంట్, బ్లాగర్, ట్రావెల్ అడ్వైజర్, ట్రాన్స్‌లేటర్, కస్టమర్ సర్వీస్ రిప్రజెంటేటివ్, హ్యూమన్ రిసోర్సెస్ స్పెషలిస్ట్, రెస్టరెంట్/హోటల్ మేనేజర్, లాంగ్వేజ్ స్పెషలిస్ట్, సేల్స్ రిప్రజెంటేటివ్, ట్రావెల్ కోఆర్డినేటర్.. తదితర హోదాలతో వీరు సేవలందించవచ్చు.

ఏ భాషతో ఎక్కడ?

ఫ్రెంచ్: ఇంటర్నేషనల్ రిలేషన్స్, లగ్జరీ గూడ్స్, హాస్పిటాలిటీ విభాగాల్లో రాణించగలరు.

జర్మన్: ఇంజినీరింగ్, ఆటోమోటివ్, ఫైనాన్స్ రంగాల్లో ఎక్కువ అవకాశాలు.

స్పానిష్: ఇంటర్నేషనల్ బిజినెస్, హెల్త్ కేర్, ఎడ్యుకేషన్, లాటిన్ అమెరికాలో ఎక్కువ ఉద్యోగాలు ఉంటాయి.

జాపనీస్: టెక్నాలజీ, ఆటోమోటివ్, ఎంటర్‌టైన్‌మెంట్, ఇన్నోవేటివ్ రంగాల్లో అవకాశాలు.

కొరియన్: ఎంటర్‌టైన్‌మెంట్, టెక్నాలజీ, ఇంటర్నేషనల్ ట్రేడ్ బిజినెస్‌లో కొలువులు.



ఇంజినీర్ ట్రెయినీగా చేరతారా?

న్యూదిల్లీలోని నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఎన్‌హెచ్‌ఎల్ఎంఎల్) 28 గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రెయినీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. కాంట్రాక్టు ప్రాతిపదికన ఐదేళ్ల కాలానికి ఉద్యోగంలోకి తీసుకుంటారు.

మొత్తం ఉద్యోగాల్లో.. అన్‌రిజర్వ్‌డ్‌కు 16, ఎస్సీలకు 3, ఎస్టీలకు 1, ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు 6, ఈడబ్ల్యూఎస్‌లకు 2 కేటాయించారు.

గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రెయినీ (సివిల్)-22, గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రెయినీ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)-2, గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రెయినీ (మెకానికల్)-4 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు: మెకానికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్ 65 శాతం మార్కులతో పూర్తిచేయాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ (ఎన్‌సీఎల్), దివ్యాంగులకు 55 శాతం సరిపోతుంది.

◆ అక్టోబరు 1, 2024 నాటికి అభ్యర్థుల వయసు 30 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు మూడేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక: గేట్ స్కోరు ఆధారంగా అభ్యర్థులను ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. 2022/2023/2024 గేట్ స్కోరులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. 2022కు ముందు గేట్ అర్హత సాధించినవాళ్లు దరఖాస్తుకు అనర్హులు.

◆ పర్సనల్ ఇంటర్వ్యూ సమయంలో ధ్రువపత్రాలను పరిశీలిస్తారు.

◆ గేట్ మార్కులకు 90 శాతం, ఇంటర్వ్యూకు 10 శాతం వెయిటేజీ ఇస్తారు.

◆ పర్సనల్ ఇంటర్వ్యూలో అర్హత సాధించినవారికి వైద్య పరీక్షలు నిర్వహించి.. కేటగిరీలవారీగా తుది ఎంపిక చేస్తారు.

గమనించాల్సినవి

◆ ఎంపికైనవారిని దేశంలో ఎక్కడైనా నియమించే అవకాశం ఉంటుంది.

◆ వీరు ఏడాదిపాటు ప్రొబేషనరీ పీరియడ్‌లో పనిచేయాలి.

◆ సంవత్సరం తర్వాత స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. దీంట్లో విఫలమైతే ప్రొబేషనరీ పీరియడ్‌ను ఆరు నెలలు పెంచుతారు.


◆ ప్రొబేషన్‌ను విజయవంతంగా పూర్తిచేసినవారిని డిప్యూటీ మేనేజర్‌గా ఉద్యోగంలోకి తీసుకుంటారు. వేతనశ్రేణి రూ.40,000 నుంచి 1,40,000 వరకూ ఉంటుంది.

◆ ముందుగా ఐదేళ్ల కాంట్రాక్టు కాలానికి ఉద్యోగంలోకి తీసుకుంటారు. సంస్థ అవసరాలూ, అభ్యర్థి పనితీరును బట్టి పొడిగించే అవకాశం ఉంటుంది.

దరఖాస్తుకు చివరి తేదీ: 08.11.2024

వెబ్‌సైట్: www.nhlml.org

గేట్‌కు ఏ పుస్తకాలు?



బీటెక్ (కంప్యూటర్ సైన్స్) చదువుతున్నాను. గేట్‌కు సన్నద్ధం కావాలనుకుంటున్నాను. ఏ పుస్తకాలు చదివితే ప్రయోజనకరం? - రవి

■ కంప్యూటర్ సైన్స్‌లో గేట్ పరీక్ష రాయడానికి ప్రామాణిక పుస్తకాలను చదవాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంజినీరింగ్ చదువుతున్నవారిలో చాలామంది పాఠ్యపుస్తకాలు కొనడం లేదు. కొన్నా పూర్తిగా చదవడం లేదు. పరీక్షల కోసం టెస్ట్ పేపర్ గైడ్స్, ఆల్ ఇన్ వన్, అధ్యాపకులు ఇచ్చిన నోట్స్ మాత్రమే చదివి డిగ్రీలు పొందుతున్నారు. ఈ క్రమంలో బీటెక్ డిగ్రీ చేతికి వస్తుంది కానీ విషయ పరిజ్ఞానం పొందలేక పోవడం వల్ల గేట్, ఈఎస్ఈ లాంటి పోటీ పరీక్షల్లో విజయం సాధించలేకపోతున్నారు. కాబట్టి మీరు గేట్ లాంటి పోటీ పరీక్షల కోసం కింద సూచించిన పుస్తకాలను చదివే ప్రయత్నం చేయండి.

- **డిస్క్రీట్ మేథమెటిక్స్:** కెన్నెత్ హెచ్ రోసెన్
- **ఇంజినీరింగ్ మేథమెటిక్స్:** బి.ఎస్. గ్రేవాల్
- **డేటా స్ట్రక్చర్స్ అండ్ అల్గారిథమ్స్:** రీమా థరేజా, రాబర్ట్ సెడ్జెవిక్
- **ఆపరేటింగ్ సిస్టమ్స్:** ఆండ్రూ ఎస్ తనేబామ్
- **కంప్యుటేషన్:** మైఖేల్ సిప్సర్
- **కంప్యూటర్ నెట్ వర్కింగ్:** విలియం స్టాలింగ్స్
- **కంప్యూటర్ ఆర్గనైజేషన్:** మనో ఎం మోరిస్
- **డేటా బేసెస్:** ఎల్మశ్రీ రమేజ్
- **ప్రోగ్రామింగ్:** మార్క్ అల్లెన్ విస్
- **కంపైలర్ డిజైన్:** అహో ఆల్‌ఫ్రెడ్ వి
- **సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్:** రోజర్ ఎస్ ప్రెస్మన్
- **డిజిటల్ లాజిక్ డిజైన్:** మోరిస్ మనో
- **ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్:** స్టువర్ట్ జె రస్సెల్

ఇలాంటి పుస్తకాలను చదువుతూ సొంతంగా నోట్స్ తయారు చేసుకోండి. గేట్‌లో విజయం సాధించాలంటే ముందుగా సిలబస్, పరీక్ష సరళి, పాత ప్రశ్నపత్రాల స్థాయి గురించి పూర్తి అవగాహన అవసరం. తరువాత సన్నద్ధత ప్రణాళికను తయారు చేసుకోవాలి. ప్రాథమిక అంశాలపై గట్టి పట్టు సాధించాలి. పాత ప్రశ్నపత్రాల్లోని ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకొంటూ, వీలున్నన్ని మాక్ పరీక్షలు రాయాలి. ఇంజినీరింగ్ మ్యాథ్స్, ఆప్టిట్యూడ్‌లపై ప్రత్యేక శ్రద్ధ ముఖ్యం. ఎన్‌పీటెల్ లాంటి ఆన్‌లైన్ వనరుల్ని కూడా ఉపయోగించుకోవచ్చు. పుస్తకాలు చదవడం, చదివిన విషయాల్ని అర్థం చేసుకోవడం, అవకాశం ఉన్నప్పుడల్లా పునశ్చరణ, సమయ నిర్వహణపై దృష్టి పెడితే గేట్‌లో మెరుగైన ర్యాంకు సాధ్యమే.

– **ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్,** కెరియర్ కౌన్సెలర్

నేషనల్ టెక్నికల్ రిసెర్చ్ ఆర్గనైజేషన్‌లో సైంటిస్టులు

దిల్లీలోని నేషనల్ టెక్నికల్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ 75 సైంటిస్ట్ 'బి' పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

మొత్తం 75 పోస్టుల్లో.. అన్‌రిజర్వ్‌డ్‌కు 25, ఎస్సీలకు 17, ఎస్టీలకు 9, ఓబీసీలకు 18, ఈడబ్ల్యూఎస్‌లకు 6 కేటాయించారు.

1. **ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్–35:** ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ సైన్స్/ అప్లైడ్ ఎలక్ట్రానిక్స్/ రేడియో ఫిజిక్స్-ఎలక్ట్రానిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ మొదటి శ్రేణి ఉత్తీర్ణత. లేదా ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్‌లో ఇంజినీరింగ్/ టెక్నాలజీ డిగ్రీ ఫస్ట్‌క్లాస్‌లో పాసవ్వాలి.
2. **కంప్యూటర్ సైన్స్–30:** కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఇన్ఫర్మేషన్ ఇంజినీరింగ్/ ఐటీలో ఇంజినీరింగ్/ టెక్నాలజీ డిగ్రీ మొదటి శ్రేణి ఉత్తీర్ణత.
3. **జియో–ఇన్ఫర్మేటిక్స్ అండ్ రిమోట్ సెన్సింగ్–5:** జియో-ఇన్ఫర్మేటిక్స్/ రిమోట్ సెన్సింగ్ అండ్ జియో-ఇన్ఫర్మేటిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ ఫస్ట్‌క్లాస్‌లో పాసవ్వాలి.
4. **మ్యాథమెటిక్స్–5:** మ్యాథమెటిక్స్/ అప్లైడ్ మ్యాథమెటిక్స్/ మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్/ మ్యాథమెటికల్ సైన్సెస్‌లో మాస్టర్స్ డిగ్రీ మొదటి శ్రేణి ఉత్తీర్ణత. లేదా మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్‌లో ఇంజినీరింగ్/టెక్నాలజీ డిగ్రీ ఫస్ట్‌క్లాస్‌లో పాసవ్వాలి. అన్ని పోస్టులకూ గేట్ స్కోరు 2022/2023/2024 తప్పనిసరి.

వయసు: 30 సంవత్సరాలు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, మాజీ సైనికోద్యోగులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: రూ.250. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు ఫీజు లేదు.

ఎంపిక: గేట్ స్కోరు, రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు. అభ్యర్థుల ఎంపిక రెండు దశల్లో జరుగుతుంది. గేట్ స్కోరు ఆధారంగా 1: 25 నిష్పత్తిలో అభ్యర్థులను మొదటి దశకు ఎంపిక చేస్తారు. ఈ దశలో జరిగే కంప్యూటర్ ఆధారిత రాత పరీక్షలో.. ఆబ్జెక్టివ్/ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. రెండో దశలో ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

● రాత పరీక్షలో ప్రతిభ చూపిన అభ్యర్థులను 1:4 నిష్పత్తిలో ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. దీనికి 50 మార్కులు. ఇంటర్వ్యూను న్యూదిల్లీలో మాత్రమే నిర్వహిస్తారు.

● గేట్ స్కోరుకు 50 శాతం, సీబీటీకి 30 శాతం, ఇంటర్వ్యూకు 20 శాతం వెయిటేజీ ఇస్తారు.

సీబీటీ పరీక్ష కేంద్రాలు: గువాహటి, న్యూదిల్లీ, బెంగళూరు, ముంబయి, లక్నో, కోల్‌కత.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 08.11.2024

వెబ్‌సైట్: https://ntro.gov.in

నోటీస్ బోర్డు — ఉద్యోగాలు

ఎన్‌టీపీసీలో జూనియర్ ఎగ్జిక్యూటివ్‌లు

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌టీపీసీ).. ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన 50 జూనియర్ ఎగ్జిక్యూటివ్ (బయోమాస్) పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది. **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ డిగ్రీ (అగ్రికల్చరల్ సైన్స్)తో పాటు పని అనుభవం.

వయసు: 27 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ/ ఎక్స్-సర్వీస్‌మెన్‌లకు గరిష్ఠ పరిమితిలో పదేళ్ల సడలింపు ఉంటుంది.

వేతనం: నెలకు రూ.40,000.

దరఖాస్తు ఫీజు: రూ.300; ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూబీడీ/ ఎక్స్ సర్వీస్‌మెన్/ మహిళలకు ఫీజు మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 28-10-2024. **వెబ్‌సైట్:** https://ntpc.co.in/

తాజా ఇంటర్న్‌షిప్‌లు

వర్క్‌ఫ్రమ్‌హోమ్

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: గో ఎలెవెంత్ మైల్ టెక్నాలజీస్ ప్రై.లి.
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, క్రియేటివ్ సూట్, ఇలస్ట్రేటర్, ఇన్‌డిజైన్, ఫొటోషూట్, ఫొటోషాప్ లైట్‌రూమ్ సీసీ, ప్రీమియర్ ప్రో, వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ.3,000-8,000
☛ internshala.com/i/c3b6f7

హైదరాబాద్‌లో

బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)

సంస్థ: ఎఫ్ఎస్ఎం బడ్డీ - ఫర్టాడోస్ స్కూల్ ఆఫ్ మ్యూజిక్
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, సేల్స్ స్టైపెండ్: రూ.10,000
☛ internshala.com/i/56f14b

హ్యూమన్ రిసోర్సెస్ (హెచ్ఆర్)

సంస్థ: ఐడియల్ డిజైన్స్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, ఎంఎస్-వర్డ్
స్టైపెండ్: రూ.9,500
☛ internshala.com/i/21a5c4

గుంటూరులో

ఫీల్డ్ సేల్స్

సంస్థ: స్విగ్గీ
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, నెగోషియేషన్ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్, సేల్స్, సేల్స్ పిచ్
స్టైపెండ్: రూ.15,000
☛ internshala.com/i/b348c2

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: నవంబరు 6

సికింద్రాబాద్, హైదరాబాద్‌ల్లో

ఆపరేషన్స్

సంస్థ: బ్యాక్ టు బేసిక్స్ లెర్నింగ్ సొల్యూషన్స్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం
స్టైపెండ్: రూ.30,000-40,000
దరఖాస్తు గడువు: నవంబరు 4
☛ internshala.com/i/00db3d

వీడియో కంటెంట్ క్రియేషన్

సంస్థ: జీగ్లర్ ఎయిరోస్పేస్
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.10,000
☛ internshala.com/i/2a3ccf

జీడబ్ల్యూఆర్ సర్వీసెస్‌లో

1. ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్

నైపుణ్యాలు: బిజినెస్ రిసెర్చ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, మార్కెట్ అనాలిసిస్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.5,000
☛ internshala.com/i/7d800b

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: నవంబరు 3

2. సేల్స్ అండ్ మార్కెట్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్

నైపుణ్యం: సేల్స్, మార్కెట్ డెవలప్‌మెంట్ స్టైపెండ్: రూ.3,000
☛ internshala.com/i/00d253

అడ్మిన్

సంస్థ: టెక్‌డోమ్ సొల్యూషన్స్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఎంఎస్-ఆఫీస్, ప్రాబ్లమ్ సాల్వింగ్
స్టైపెండ్: రూ.10,000-12,000
☛ internshala.com/i/4601e6

సోషల్ మీడియా మార్కెటింగ్

సంస్థ: ట్రేడబుల్స్ టెక్నాలజీస్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, సోషల్ మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.5,000
☛ internshala.com/i/bbcd06

సోషియంలో

1. ఇన్‌సైడ్ సేల్స్

నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఈమెయిల్ మార్కెటింగ్, లీడ్ జనరేషన్ స్టైపెండ్: రూ.8,000
☛ internshala.com/i/5fdffe

2. ఈ–కామర్స్

నైపుణ్యాలు: డిజిటల్ మార్కెటింగ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్
స్టైపెండ్: రూ.10,000
☛ internshala.com/i/49db39

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: అక్టోబరు 31

3. గ్రాఫిక్ డిజైన్

నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, క్రియేటివ్ సూట్, ఇలస్ట్రేటర్, ఇన్‌డిజైన్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్, వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ.9,000
☛ internshala.com/i/294c01

సోషల్ మీడియా మార్కెటింగ్

సంస్థ: యాడ్స్‌గోట్
నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, డిజిటల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సెర్చ్ ఇంజిన్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్
స్టైపెండ్: రూ.10,000-13,000
☛ internshala.com/i/d2b752

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: నవంబరు 2

విశాఖపట్నంలో

డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: జేపీ కంఫర్ట్స్
నైపుణ్యాలు: అడోబ్ ఫొటోషాప్, డిజిటల్, ఈమెయిల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సెర్చ్ ఇంజిన్, సోషల్ మీడియా మార్కెటింగ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం
స్టైపెండ్: రూ.8,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 28
☛ internshala.com/i/c385c3

విశాఖపట్నం, అనకాపల్లిల్లో

బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)


సంస్థ: ఇన్‌స్ట్రుమెంటేషన్ యాన్ ఆటోమేషన్ సొల్యూషన్స్
నైపుణ్యాలు: డిజిటల్, ఈమెయిల్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్
స్టైపెండ్: రూ.5,000-10,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 25
☛ internshala.com/i/4eec00

చదువు — కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలున్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా: **చదువు,** ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512 edc@eenadu.in

జల సంక్షోభంతో ఆర్థిక వ్యవస్థలు కుదేలు

- పలు దేశాల జీడీపీలో 8-15 శాతం నష్టం వాటిల్లే ప్రమాదం
- నీటి యాజమాన్యం సమర్థంగా లేకపోవడమే కారణం
- అంతర్జాతీయ కమిషన్ అధ్యయనంలో వెల్లడి
- నీటికి ధర నిర్ణయిస్తేనే పరిస్థితిలో మార్పు వస్తుందని సూచన



ఈనాడు హైదరాబాద్: ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న, ముమ్ముందు ఎదుర్కోబోతున్న జల సంక్షోభం పలు దేశాల ఆర్థిక వ్యవస్థల్లో కల్లోలం సృష్టించనుందా? ఆహారోత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపనుందా? అంటే అవుననే అంటోంది ఆర్థిక, పర్యావరణవేత్తలతో కూడిన బృందం చేసిన అధ్యయనం. నీటి సంక్షోభం కారణంగా 2050 నాటికి స్థూల జాతీయోత్పత్తిలో(జీడీపీ)లో ప్రపంచంలో సరాసరిన ఎనిమిది శాతం నష్టం వాటిల్లుతుందని, తక్కువ ఆదాయం గల దేశాల్లో నష్టం సరాసరిన 15 శాతంగా ఉంటుందని ఆ అధ్యయనం అంచనా వేసింది. భారీ ఆర్థిక వ్యవస్థలను కలిగిన దేశాలపైనా ఈ ప్రభావం గణనీయంగానే ఉంటుందని, 50 శాతానికిపైగా ఆహారోత్పత్తి ప్రమాదంలో పడనుందని తేల్చింది. 'నీటి సంక్షోభం, ఆర్థిక పరిస్థితిపై ప్రభావం' అనే అంశంపై గ్లోబల్ కమిషన్ ఆన్ ఎకనామిక్స్ ఆఫ్ వాటర్ చేసిన అధ్యయనం ఈ వివరాలను వెల్లడించింది. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్ ప్రొఫెసర్, యూసీఎల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇన్నొవేషన్ అండ్ పబ్లిక్ పర్పస్ వ్యవస్థాపక డైరెక్టర్ మరియన మజోకటో, వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్(డబ్ల్యుటీవో) డైరెక్టర్ జనరల్ గోజి ఒకొంజో ఐవీల, ఇన్‌స్టిట్యూట్ ఫర్ క్లైమేట్ ఇంపాక్ట్ రీసెర్చ్ డైరెక్టర్ జోహన్ రాక్‌స్ట్రామ్, సింగపూర్ అధ్యక్షుడు షణ్ముగ రత్నంలతో కూడిన బృందం రూపొందించిన నివేదికను కమిషన్ బుధవారం విడుదల చేసింది. 'ఆర్థిక వ్యవస్థలు బలహీనంగా ఉండటం, భూ వినియోగంలో లోపాలు, నీటి యాజమాన్యం సమర్థంగా లేకపోవడానికి తోడు వాతావరణ మార్పులు సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. నీటి సమస్య అంతర్జాతీయంగా ఊహించనంత సంక్షోభాన్ని ఎదుర్కొనే పరిస్థితి కల్పిస్తోంది. ప్రపంచంలో సుమారు 300 కోట్ల మంది ప్రజలపైన, ప్రపంచ ఆహారోత్పత్తిలో సగంపైన ఆ ప్రభావం ఉంటుంది' అని ఆ నివేదిక వెల్లడించింది. భూగర్భ జలమట్టం పడిపోవడం, నీటి వనరుల విస్తీర్ణం తగ్గిపోయిన కారణంగా అనేక నగరాలు కుచించుకుపోతున్నాయనీ విశ్లేషించింది.

అనుసరిస్తున్న విధానాలతో..

ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలే నీటి సంక్షోభానికి కారణమని నివేదిక కుండబద్దలు కొట్టింది. నీటిని ఎక్కువగా వినియోగించే పంటలు వేయడం, పారిశ్రామిక అవసరాలకు అధికంగా వాడటం, ప్రత్యేకించి బొగ్గు ఆధారిత విద్యుత్తు కేంద్రాల వల్ల నీటి సంక్షోభం ఎదురయ్యే పరిస్థితులు తలెత్తాయని వెల్లడించింది. నీటిని మరింత సమర్థంగా వినియోగించుకోవడానికి వీలుగా తగిన ధర నిర్ణయించడం, రాయితీలు సరిగా వినియోగించుకుంటూ అందరికీ సమానంగా నీరు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించింది. అంతర్జాతీయంగా నీటి సంక్షోభం విషాదకర పరిణామం అయినప్పటికీ, ఆర్థికంగా ప్రయోజనానికీ అవకాశం ఉందని విశ్లేషించింది. నీటికి ధర నిర్ణయించాలన్న అంశాన్ని కమిషన్ ముందుకు తెచ్చింది. ధరను నిర్ణయించడం వల్ల వినియోగంలో అనేక మార్పులు వస్తాయని డబ్ల్యుటీవో డైరెక్టర్ జనరల్ గోజి ఒకొంజో ఐవీల నొక్కిచెప్పారు.

5 సిఫార్సులు

జల సంక్షోభంపై అధ్యయనం చేసిన కమిషన్ ఐదు రకాల సిఫార్సులు చేసింది. ఆహార వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తేవాలని ప్రధానంగా సూచించింది.




1 సేద్యంలో మార్పులు

వ్యవసాయంలో సూక్ష్మసేద్యాన్ని అమలుచేయాలి. నీటితో ఉత్పాదకత పెంచడం ద్వారా నత్రజని ఆధారిత ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి. ప్రజలు మొక్కల ఆధారిత ఆహారం వైపు మళ్లాలి.



2 ప్రకృతిని పరిరక్షించాలి

ప్రకృతి సంపదను పరిరక్షించాలి. 30 శాతం అడవులను పునరుద్ధరించాలి. 2030 నాటికి దెబ్బతిన్న పర్యావరణ వ్యవస్థలో కనీసం 30 శాతాన్ని యథాస్థితికి తేవాలి. తద్వారా నీటి లభ్యతలో మార్పు తీసుకురావాలి.



3 జల ఆధారిత ఆదాయం

నీటి ఆధారిత ఆదాయ వనరులను సృష్టించాలి. ప్రతి చుక్క వృథా నీటిని తిరిగి వినియోగంలోకి తేవాలి. సరఫరా లోపాలను అరికట్టాలి.



4 పునరుత్పాదక విద్యుత్తు

నీటిని తక్కువగా వినియోగించే పునరుత్పాదక విద్యుదుత్పత్తిపై దృష్టి సారించాలి.



5 సురక్షిత జలం

ప్రస్తుతం సురక్షిత నీరు అందక రోజుకు వెయ్యిమంది పిల్లలు మరణిస్తున్నారు. 2030 నాటికి సురక్షిత నీరు లభించని కారణంగా ఒక్క శిశువూ మరణించకూడదనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. నీటిని శుద్ధిచేయడంతోపాటు పారిశుద్ధ్య వ్యవస్థలను వికేంద్రీకరించేందుకు అవసరమైన పెట్టుబడులు పెంపొందించుకోవాలి.

ఏపీ సీఎం సహాయనిధికి విరాళాలిచ్చిన దాతల వివరాలు

వ్యక్తి/సంస్థ	సాయం (రూ.లల్లో)
• భానోదయ హైస్కూల్, జీడీ నెల్లూరు	లక్ష
• కలధర్ ట్రావెల్స్	లక్ష
• చెరుకూరి సీతారామయ్య	లక్ష
• సాలూరు డాక్టర్ల బృందం తరఫున మంత్రి సంధ్యారాణి	లక్ష
• కంతేటి నిర్మల	లక్ష
• వాదాడ గణేశ్వరరావు	లక్ష
• శుభం డెవలపర్స్	లక్ష
• గుజ్జర్లపూడి రాజ్యలక్ష్మి	లక్ష
• గుజ్జర్లపూడి వేంకటేశ్వరరావు	లక్ష
• బిల్లా రాజారావు	71 వేలు
• కావూరి దాసు	50 వేలు
• దీప్తి ఎడ్యుకేషనల్ సొసైటీ	40 వేలు
• గూడూరి పెద్ద ఆంజనేయులు	25 వేలు
• రామకృష్ణప్రసాద్ పాలేటి	10 వేలు
• జె.శేఖర్	5 వేలు

ఫోరెన్సిక్ అటాప్సీ ఎస్‌వోపీ రూపకల్పనకు కమిటీ

ఈనాడు, అమరావతి: మెడికో లీగల్ కేసుల్లో పోస్టుమార్టం (ఫోరెన్సిక్ అటాప్సీ) నిర్వహణకు అనుసరించాల్సిన ప్రామాణిక నిర్వహణ పద్ధతులు (ఎస్‌వోపీ), చెక్‌లిస్టుల రూపకల్పన కోసం ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ నేతృత్వంలో మొత్తం 10 మంది సభ్యులను దీనిలో నియమించింది. సీఐడీ డైరెక్టర్ జనరల్, మెడికల్ అండ్ హెల్త్ డైరెక్టర్, రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి ఎం.ఆర్.శ్రవణ్‌కుమార్, వైద్య నిపుణులు డా.టీటీకే రెడ్డి, డా.ఉమామహేశ్వరరావుతో పాటు డా.అపర్ణ. డా.కె.మరియకుమార్, బి.ఫణిభూషణ్, జె.సత్యరాజు కమిటీలో సభ్యులుగా ఉండనున్నారు.

హెచ్‌ఎల్‌సీ, హంద్రీ-నీవా పనులు పూర్తి చేయాలి: సీపీఐ

ఈనాడు, అమరావతి: తుంగభద్ర హైలెవల్ కాల్వ లైనింగ్ పనులు(హెచ్‌ఎల్‌సీ) పూర్తి చేయడంతో పాటు హంద్రీ-నీవా కాల్వ సామర్థ్యాన్ని రెండింతలకు పెంచి పూర్తిస్థాయిలో నీరు అందించాలని కోరుతూ మంత్రి నిమ్మల రామానాయుడికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వినతిపత్రం సమర్పించారు. "తుంగభద్ర ప్రాజెక్టులో సమృద్ధిగా నీళ్లున్నాయి. దీని ద్వారా అనంతపురం, కర్నూలు జిల్లాల్లోని కరవు ప్రాంతాలకు నీరు అందించాలి. ఇప్పటివరకు 32 టీఎంసీల నీళ్లు రావాల్సి ఉండగా.. 13 టీఎంసీలు మాత్రమే విడుదలయ్యాయి. తుంగభద్ర బోర్డు అధికారులు నీటి విడుదలకు సిద్ధంగా ఉన్నా హైలెవల్ కెనాల్ లైనింగ్ పనులు పూర్తి కాకపోవడంతో నీరు వచ్చే పరిస్థితి లేదు. శ్రీశైలం ప్రాజెక్టు నిండుకుండలా ఉన్నా కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల్లోని కరవు ప్రాంతాలకు హంద్రీ-నీవా కాల్వ ద్వారా పూర్తిస్థాయిలో నీళ్లు అందించలేకపోతున్నారు. ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయించి, పనులు జరిగేలా చూడాలి" అని రామకృష్ణ కోరారు.

పోలీసుశాఖలో ఖాళీల భర్తీకి ఏం చేశారు?

అఫిడవిట్ వేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: పోలీసుశాఖలో ఖాళీల భర్తీకి ఎలాంటి చర్యలు తీసుకున్నారో వివరిస్తూ అఫిడవిట్ వేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. పోలీసులు, సాయుధ దళాలపై పని ఒత్తిడిని తగ్గించేందుకు ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేస్తుండాలని, ఆ ప్రక్రియను పర్యవేక్షిస్తుండాలని హైకోర్టులకు సుప్రీంకోర్టు సూచించిందని పేర్కొంది. ఆ ఆదేశాలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొంటూ విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. పోలీసుశాఖలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులను భర్తీ చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ హెల్ప్ ది పీపుల్ ఛారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ కీతినీడి అఖిల్ శ్రీగురుతేజ ఈ పిల్ వేశారు.

లెక్కలు చెప్పాల్సిన సమయం వచ్చింది జగన్


- మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి : గత ప్రభుత్వ హయాంలో తన సుఖాల కోసం మాజీ ముఖ్యమంత్రి జగన్ ఖర్చు చేసిన ప్రజాధనానికి లెక్కలు చెప్పాల్సిన సమయం వచ్చిందని మంత్రి నారా లోకేశ్ హెచ్చరించారు. తాడేపల్లి ప్యాలెస్ చుట్టూ రూ.12.85 కోట్లతో 30 అడుగుల ఎత్తు ఇనుప కంచె ఏర్పాటు చేయించారని, దీనికి రాష్ట్ర ఖజానా నుంచే చెల్లింపులు చేశారని బుధవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఈ సొమ్మును పేదల గృహ నిర్మాణం కోసం వాడితే బాగుండేదని హితవు పలికారు. జగన్ ఇంటి చుట్టూ ఇనుప కంచె నిర్మాణం కోసం గత ప్రభుత్వం ఇచ్చిన జీఓను ఎక్స్‌లో పోస్టు చేశారు.

ఎస్‌సీఈఆర్టీలో డిప్యుటేషన్ పోస్టులకు ప్రకటన

ఈనాడు, అమరావతి: రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్టీ)లో డిప్యుటేషన్‌పై పని చేసేందుకు బోధన సిబ్బంది నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ బుధవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రొఫెసర్లు 9, లెక్చరర్లు 20తో పాటు కోఆర్డినేటర్లు ఐదు పోస్టులకు దరఖాస్తులను ఈనెల 25లోపు సమర్పించాలని సూచించారు. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా వచ్చినవాటిని 28వ తేదీ నుంచి 30 వరకు పరిశీలిస్తారు. నవంబరు 4, 5వ తేదీల్లో సిబ్బందికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఈ ఏడాది సెప్టెంబరు 28నాటికి 15 ఏళ్ల బోధన అనుభవం ఉండాలి. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నవారికి, ఎంఫిల్, పీహెచ్‌డీ వారికి ప్రాధాన్యమిస్తారు.

సిద్దిపేటలో కుంకుమ పువ్వు సాగు



అత్యంత ఖరీదైన సుగంధ ద్రవ్యాల్లో కుంకుమ పువ్వు ఒకటి. దీని పేరు వినగానే కశ్మీర్ గుర్తొస్తుంది. 'క్రోకస్ సాటివస్' అనే మొక్క పూలలోని కేసరాలే కుంకుమ పువ్వు. కిలో ధర రూ.లక్షల్లో పలుకుతుంది. సహజంగా చలి ప్రదేశాలైన జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలోనే అది సాగవుతుంది. అయితే, వర్షాధార పంటలకు నెలవైన సిద్దిపేటలోనూ కుంకుమపువ్వు ఉత్పత్తి మొదలైంది. తెలంగాణలోని సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లిలోని డీఎక్స్ఎన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ వారు ఏరోపోనిక్ విధానంలో గత జులైలో ప్రయోగాత్మకంగా పెంపకం చేపట్టారు. "600 అడుగుల చదరపు విస్తీర్ణంలో ఉన్న కోల్డ్ స్టోరేజ్‌రూంలో ఉష్ణోగ్రత కనిష్ఠంగా 3 డిగ్రీలు, గరిష్ఠంగా 18 డిగ్రీలు ఉండేలా ఏర్పాటు చేశాం. కశ్మీర్ నుంచి కిలో రూ.800 చొప్పున 900 కిలోల మొక్కలను తెప్పించి, 10 ర్యాకుల్లో అమర్చాం. ఒక్కో మొక్క 3-4 అంగుళాల ఎత్తు పెరుగుతుంది. ఏడేళ్ల వరకు మొక్కను బతికించుకోవచ్చు. ప్రతి చలికాలంలో ఒక మొక్కకు 3-4 పూలు వస్తాయి. ఇప్పటివరకు 200 గ్రాముల కుంకుమ పువ్వు చేతికొచ్చింది. ఈ నెలాఖరుకు మరో 400 గ్రాములు రావచ్చు. త్వరలోనే విపణిలోకి తెస్తాం" అని ప్రాజెక్టు సమన్వయకర్త డా.పవన్ దేశ్‌పాండే వివరించారు.

– న్యూస్‌టుడే, సిద్దిపేట



మోషేన్ రాజును సన్మానిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, నరసింహాచార్యులు

తెలంగాణ శాసనమండలిని సందర్శించిన ఏపీ మండలి ఛైర్మన్

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు బుధవారం హైదరాబాద్‌లో తెలంగాణ శాసనమండలిని సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ కార్యదర్శి నరసింహాచార్యులు తదితరులు ఆయన్ని సాదరంగా ఆహ్వానించారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సన్మానించారు. ఇరువురి భేటీలో రెండు రాష్ట్రాల తాజా రాజకీయ పరిణామాలపై చర్చ జరిగింది.

ఉగ్రవాదుల్లా ఇంటిచుట్టూ ఇనుప కంచె అవసరమా?

మాజీ సీఎం జగన్‌పై వర్ల రామయ్య ధ్వజం

ఈనాడు, అమరావతి : కరుడుగట్టిన ఉగ్రవాదుల్లా ఇంటి చుట్టూ ఇనుప కంచె కట్టుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందంటూ మాజీ సీఎం జగన్‌ను తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ప్రశ్నించారు. గతంలో ఏ ముఖ్యమంత్రీ ఈ స్థాయిలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయలేదని మండిపడ్డారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "రూ.12.85 కోట్ల ఖర్చుతో ఇనుప కంచె నిర్మించడానికి ఎవరు అనుమతిచ్చారు? ఏ అధికారి నివేదిక ఆధారంగా ఇలా చేశారు? అనేది తేల్చాలి. అసలు ఏ ఉగ్రవాద సంస్థల నుంచి జగన్‌కు ముప్పు ఉంది?" అని వర్ల రామయ్య నిలదీశారు. గత ఐదేళ్లలో వైకాపా నాయకులు తిన్నదంతా కక్కిస్తామని హెచ్చరించారు.

గవర్నమెంట్ టు బిజినెస్ సేవలకు పాన్ తప్పనిసరి

ఈనాడు, అమరావతి: సింగిల్ డెస్కు పోర్టల్ (ఏపీఎస్‌డీపీ) ద్వారా గవర్నమెంట్ టు బిజినెస్ (జీ2బీ) సేవలలో భాగంగా అన్ని వ్యాపార లావాదేవీలకు తప్పనిసరిగా పాన్‌ను నమోదు చేయాలని ఆయా శాఖలను ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ శాఖ, ఇతర సంబంధిత శాఖలు ఫైల్ అప్రూవల్‌కు తప్పని సరిగా పాన్ క్యాప్చర్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఎయిడెడ్‌లో కారుణ్య నియామకాలు చేపట్టాలి: టీచర్స్ గిల్డ్

ఈనాడు, అమరావతి: ఎయిడెడ్ బోధన, బోధనేతర సిబ్బంది కుటుంబసభ్యులకు కారుణ్య నియామకాలు కల్పించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిట్టిబాబు, ఎల్కే చిన్నప్ప కోరారు. ప్రస్తుతం ఎయిడెడ్ బడుల్లో పనిచేస్తున్న 3,005 మందికి ఆరోగ్యకార్డులు ఇవ్వాలని, ప్రభుత్వంలో విలీనమైన సిబ్బందికి పదోన్నతుల సర్వీస్ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంస్కృతం, తెలుగు, హిందీ, పీఈటీ ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలని, విద్యార్థులు లేని బడుల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ప్రభుత్వ పాఠశాలల్లో శాశ్వతంగా సర్దుబాటు చేయాలని కోరారు.

పురపాలక ఉపాధ్యాయులకు అవకాశం ఇవ్వాలి: యూటీఎఫ్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ మండలిలో డిప్యుటేషన్‌పై పని చేసేందుకు పురపాలక ఉపాధ్యాయులకు సైతం అవకాశం కల్పించాలని ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ప్రసాద్ కోరారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్తు వారు మాత్రమే అర్హులని చెప్పడం సరికాదని, పురపాలక ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు.

ప్రత్యేక సీఎస్ నేతృత్వంలో కమిటీని వేశాం

- నివేదిక ఇవ్వాల్సి ఉంది
- ఏపీపీఎస్సీ ఛైర్మన్, సభ్యుల నియామక విధానంపై హైకోర్టుకు తెలిపిన ఎస్‌జీపీ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఛైర్మన్, సభ్యుల నియామకం విషయంలో అనుసరించాల్సిన విధానంపై ప్రత్యేక సీఎస్ నేతృత్వంలో పది మంది సభ్యులతో రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసిందని, ఆ కమిటీ ఇచ్చే నివేదిక కోసం వేచి చూస్తున్నామని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) విష్ణుతేజ హైకోర్టుకు తెలిపారు. ఆ నివేదిక అందాక పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేస్తామన్నారు. కొంత సమయం కావాలని కోరారు. ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. అప్పటి అధికార పార్టీ వైకాపా ఏపీపీఎస్సీని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చిందని ఛైర్మన్, సభ్యుల నియామకాలను రద్దు చేయాలని కోరుతూ న్యాయవాది తాండవ యోగేశ్ 2022లో హైకోర్టులో పిల్ వేశారు. సామర్థ్యం, యోగ్యత, విద్యార్హతలు లేనివారిని ఏపీపీఎస్సీ ఛైర్మన్, సభ్యులుగా నియమించారన్నారు. బుధవారం ఈ వ్యాజ్యం హైకోర్టులో విచారణకు వచ్చింది. న్యాయవాది యోగేష్ వాదనలు వినిపించారు. న్యాయస్థానం ఆదేశించినా ఇప్పటి వరకు ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయలేదని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు.



ఎన్ఎస్‌జీ రైజింగ్ డే సందర్భంగా ఎన్ఎస్‌జీ సెక్యూరిటీ సిబ్బందితో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఎన్ఎస్‌జీ కమాండోల నిబద్ధతకు సెల్యూట్: చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ఫోర్స్ 40వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నేషనల్ సెక్యూరిటీ గార్డు(ఎన్ఎస్‌జీ) పురుష, మహిళా కమాండోలకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. వారి ధైర్యం, తిరుగులేని స్ఫూర్తి, దేశాన్ని కాపాడటంలో వారి నిబద్ధతకు సెల్యూట్ చేస్తున్నట్లు బుధవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

59 ఆసుపత్రుల్లో రోగులకు అందని ఆహారం

- తక్కువ మందికి వంట చేసేందుకు ముందుకురాని గుత్తేదారులు
- ప్రత్యామ్నాయాలపై అధికారుల సమాలోచనలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని 59 ప్రభుత్వాసుపత్రుల్లో ఇన్ పేషంట్లుగా చేరుతున్న రోగులకు ఆహారం అందడం లేదు. వీటిల్లో 57 సామాజిక, రెండు ప్రాంతీయ ఆసుపత్రులు ఉన్నాయి. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లోని సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. ఆసుపత్రుల్లో చేరిన రోగులకు ప్రభుత్వం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రిపూట భోజనాన్ని ఉచితంగా అందిస్తోంది. కొన్నిచోట్ల రోగులు తక్కువగా ఉండటంతో వారికి ఆహారం వండి, వడ్డించేందుకు ఏజెన్సీలు ముందుకు రావటం లేదు. సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో 30 లేదా 50 పడకలు ఉంటాయి. వీటిలో ఇన్‌పేషంట్లు తక్కువగా ఉండడం.. ఆయా ఆసుపత్రులు మారుమూల ప్రాంతాల్లో ఉండటంతో తమకు గిట్టుబాటు కావడం లేదని ఏజెన్సీల వారు చెబుతున్నారు. జిల్లాల్లో జాయింట్ కలెక్టర్ల పర్యవేక్షణలో రోగులకు భోజన సౌకర్యం కల్పిస్తారు. వీరు ప్రత్యేకంగా దృష్టి పెట్టినచోట్ల కొన్ని సమస్యలున్నా.. అల్పాహారం, భోజనం అందుతున్నాయి. ప్రస్తుతం అనంతపురం-15, కర్నూలు-15, గుంటూరు-14, వైఎస్సార్-8, చిత్తూరు-7, పశ్చిమగోదావరి జిల్లాలో 4, ఇతరచోట్ల కలిపి మొత్తంగా 64 ఆసుపత్రుల్లో 'డైట్' ఏజెన్సీలు లేవు. అనంతపురం జిల్లాలో రెండు ఏరియా ఆసుపత్రుల్లోనూ డైట్ కాంట్రాక్టర్లు లేకపోవడం గమనార్హం. కొన్నిచోట్ల తాత్కాలిక సర్దుబాట్లలో భాగంగా హోటళ్ల నుంచి ఆహారం తెప్పించేందుకు చేస్తున్న ప్రయత్నాలు పూర్తిస్థాయిలో సత్ఫలితాలు ఇవ్వడం లేదు. నాణ్యత సమస్య తలెత్తుతోంది.

హాస్టళ్ల నిర్వాహకుల సహకారం తీసుకునేందుకు..

ఆసుపత్రుల్లోని రోగులకు ఆహారం సరఫరాకు గుత్తేదార్లు ముందుకు రానిచోట్ల స్వయం సహాయ సంఘాలు, సేవా సంస్థల సహకారం తీసుకునే విషయాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. గిరిజన, ఇతర హాస్టళ్లలో విద్యార్థులకు ఆహారం వండే నిర్వాహకుల సహకారం తీసుకునే విషయమై సమాలోచనలు చేస్తున్నారు. ఇన్‌పేషంట్ రోగులు తక్కువగా ఉంటున్న ఆసుపత్రుల్లో ఆహారం సరఫరాకు డైట్ ఏజెన్సీలు ముందుకు రాని నేపథ్యంలో టెండర్ల విధానంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. ఆసుపత్రుల స్థాయి.. ఇన్‌పేషంట్లు సగటున రోజుకు ఎంతమంది ఉంటున్నారు..? ఆయా ప్రాంతాల్లోని వసతులను పరిశీలన చేసి, నిబంధనలను సరళీకృతం చేయాలి. డైట్ కాంట్రాక్టర్లకు సకాలంలో చెల్లింపులు చేస్తే, ఏజెన్సీలు నిలకడగా కొనసాగే అవకాశం ఉంది. లేకుంటే వారితో పని చేయించడం కష్టమని ఆసుపత్రుల సూపరింటెండెంట్లు పేర్కొంటున్నారు. మరోవైపు ఆసుపత్రుల్లో చేరిన చాలామంది రోగులకు ఉచితంగా ఆహారం అందిస్తారన్న విషయమే తెలియదు. దీనిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

ఉచిత ఇసుకకు తూట్లు పొడిస్తే అధికారులపై కఠిన చర్యలు

- ప్రభుత్వం స్పష్టీకరణ

ఈనాడు, అమరావతి: ఉచిత ఇసుక విధానానికి తూట్లు పొడిచేలా ఏ అధికారి వ్యవహరించినా చూస్తూ ఊరుకునేది లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. క్షేత్రస్థాయిలో ఇసుకను తీసుకెళ్లే వాహనాలపై కేసులు నమోదు చేస్తుండడంపై సీరియస్ అయింది. ఈ నేపథ్యంలో కలెక్టర్లు, ఎస్పీలకు హెచ్చరిస్తూ స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ఇసుక విధానానికి లోబడి తీసుకెళుతున్న ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారన్న ఫిర్యాదులు అందుతున్నాయని, ఇలా చేయడం ఉచిత ఇసుక విధానం ఉల్లంఘన కిందికే వస్తుందని ఆదేశాల్లో పేర్కొంది. ఉచిత ఇసుక స్ఫూర్తికి విరుద్ధంగా ఏ అధికారి వ్యవహరించినా కఠినమైన చర్యలు తీసుకుంటామని, ఎలాంటి మినహాయింపులు ఉండవని హెచ్చరించింది.

ఆయుర్వేద, హోమియో పీజీ సీట్ల భర్తీకి దరఖాస్తులు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ఆయుర్వేద, హోమియో కళాశాలల్లో అందుబాటులో ఉన్న పీజీ సీట్ల భర్తీకి విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ మేరకు బుధవారం ప్రకటన జారీ చేసింది. ఈ నెల 17వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 22వ తేదీ రాత్రి 6 గంటల వరకు దరఖాస్తులను పంపొచ్చని సూచించింది.

పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా టి.దామోదర్‌నాయుడు

ఈనాడు డిజిటల్, అమరావతి: పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా డాక్టర్ టి.దామోదర్‌నాయుడిని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆ స్థానంలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ ఆర్.అమరేంద్రకుమార్‌కు ఏపీ గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య ఎండీగా బాధ్యతలిచ్చింది. గత ప్రభుత్వ హయాంలో అమరేంద్రకుమార్ వైకాపాతో అంటకాగినట్లు ఆరోపణలున్నాయి. పశుసంవర్ధక శాఖలో అవసరం లేకున్నా అధిక ధరలకు ఫ్రిజ్‌లు కొనుగోలు చేశారని ఆయనపై ఫిర్యాదులొచ్చాయి. అధికారం లేకున్నా ఇష్టారీతిన బదిలీలు చేస్తున్నారని కొందరు అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

గాలిలో కలిసిన ఏడు నిండు ప్రాణాలు



ప్రమాదంలో మృతిచెందిన దనావత్ శివరామ్, దుర్గి, శాంతి, మమత, అనిత, హిందు, శ్రావణి

శివ్వంపేట, తూప్రాన్, వెల్దుర్తి – న్యూస్‌టుడే: భార్యాభర్తలు, వారి ఇద్దరు కుమార్తెలు, పెద్ద అల్లుడు, ముగ్గురు మనవలు.. మొత్తం ఎనిమిది మంది కారులో ఒక శుభకార్యానికి వెళ్లారు. మర్నాడు విందు అనంతరం తిరిగి వస్తుండగా.. సొంతూరికి చేరకముందే మృత్యువు వారిని కబళించింది. అతివేగం కారణంగా కారు అదుపుతప్పి వాగులోకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా.. డ్రైవర్ తీవ్రగాయాలతో బయటపడ్డాడు. తెలంగాణలోని మెదక్ జిల్లా శివ్వంపేట మండలం ఉసిరికపల్లి గ్రామ శివారులో బుధవారం సాయంత్రం ఈ దుర్ఘటన జరిగింది. తూప్రాన్ ఎస్సై మహిపాల్ రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శివ్వంపేట మండలం తాళ్లపల్లి తండాకు చెందిన దనావత్ శివరామ్ (56), దుర్గి (50) దంపతులు, వారి పెద్ద కుమార్తె గుగ్లోత్ శాంతి (38), ఆమె భర్త నామ్‌సింగ్, కుమార్తె మమత (16), సీతారం తండా గ్రామపంచాయతీ పరిధి జగ్య తండాలో నివసిస్తున్న శివరామ్ మూడో కుమార్తె మాలోత్ అనిత (35), ఆమె ఇద్దరు కుమార్తెలు హిందు (12), శ్రావణి (10)లు కారులో మంగళవారం రాత్రి సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం సీతారంపల్లి తండాకు చెందిన బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. కారు నామ్‌సింగ్‌ది కాగా.. అతడే నడిపాడు. బుధవారం మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత 8 మంది కారులో తిరిగి స్వగ్రామానికి ప్రయాణమయ్యారు. తూప్రాన్ మీదుగా వస్తుండగా ఉసిరికపల్లి చౌరస్తా వద్ద మలుపు తిరిగిన వెంటనే అతి వేగంతో అదుపు తప్పిన కారు కల్వర్టు దిమ్మెలను ఢీకొట్టడంతో గాలిలోకి ఎగిరి చెట్టుకు తగిలి.. వాగులో పడింది. నీటిలో బోల్తాపడటంతో డ్రైవర్ నామ్‌సింగ్ మినహా మిగిలిన ఏడుగురూ ఊపిరాడక అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. ప్రమాదం ధాటికి ఎగిరి బయట పడిన నామ్‌సింగ్‌కు తీవ్రగాయాలు కావడంతో నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి పరిశీలించారు. కారు మితిమీరిన వేగంతో వెళ్లడంతో ప్రమాదం సంభవించిందని పోలీసులు భావిస్తున్నారు. ఈ విషయమై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.